

ఆదివారం 7-5-2023

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00
సంపుటి: 16 సంచిక: 45


'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

వైరల్



ఆ అయిదు రోజులు... అయితే ఏంటీ!

మెనుస్ట్రుయేషన్‌కు సంబంధించిన విషయాలు బహిరంగంగా మాట్లాడడానికి సంకోచించే రోజుల్లో, శానిటరీ యాడ్స్‌లో నటించడానికి నటీమణులు ససేమిరా అనే రోజుల్లో కెరీర్ తొలి అడుగుల్లో శానిటరీ ప్యాడ్ యాడ్ లో నటించింది స్మృతి ఇరానీ.

అది తన తొలి యాడ్.

'అది ఫ్యాన్సీ యాడ్ కాదు. వదిలేయ్'

'ఈ యాడ్ చేస్తే తక్కువ చేసి చూస్తారు. నటిగా అవకాశాలు రావు' అని అందరూ భయపెట్టారు.

కానీ వాటిని పట్టించుకోకుండా ఆ యాడ్‌లో నటించింది స్మృతి.

25 సంవత్సరాల క్రితం నాటి ఆ వీడియోను స్మృతి ఇరానీ(ప్రస్తుతం కేంద్రమంత్రి) ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తే వైరల్ అయింది.

ఆ వీడియోలో...

పీరియెడ్స్, వాటిపై ఉండే అపోహలు... మొదలైన వాటి గురించి స్మృతి ఇరానీ మాట్లాడింది.

'ఆ అయిదు రోజులు. అయితే ఏంటీ? పీరియెడ్స్ అంటే వ్యాధి కాదు. ప్రతి మహిళకు ఉండే సహజ లక్షణం.

నేను, మా అమ్మ, మీరు... లక్షలాది మంది భారతీయ మహిళల కోసం శానిటరీ ప్యాడ్‌లు ఉన్నాయి...' అంటూ సాగే స్మృతి మాటలకు ఆ రోజుల్లో ఎలాంటి స్పందన వచ్చిందో తెలియదుగానీ ఇప్పుడు మాత్రం వైరల్ అవుతోంది.

'ఇది తప్పనిసరిగా గుర్తుచేసుకోదగిన జ్ఞాపకం' అని తన వీడియో గురించి కాప్షన్ రాసింది స్మృతి ఇరానీ.

'ఈరోజుల్లో శానిటరీ ప్యాడ్ యాడ్‌లు చేయడానికి నటీమణులు సంకోచించడం లేదు. కాని ఆరోజుల పరిస్థితి వేరు. ఆ రోజులు నాకు ఇంకా బాగా గుర్తు ఉన్నాయి. పీరియెడ్స్ గురించి మాట్లాడడానికి ఇబ్బంది పడే రోజుల్లో ధైర్యంగా స్మృతి ఆ యాడ్ చేయడం అభినందనీయం' అంటూ ఒక యూజర్ కామెంట్ సెక్షన్‌లో స్పందించారు.

70 ప్లస్... తగ్గేదేల్యా!

గోవాలో గ్రామీణ బామ్మలు సర్ఫ్‌బోర్డులతో సర్ఫింగ్‌కు వెళితే? అనే ఊహను ఏఐ సాంకేతికతతో నిజం చేసిన ఫొటో వైరల్ అవుతోంది. ఆశిష్ జోస్ అనే యూజర్ ఈ ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. 'నానీస్ ఎట్ ది బీచ్' అని క్యాప్షన్ ఇచ్చిన ఈ ఫోటోపై యూజర్స్ నుంచి రకరకాల కామెంట్స్ వచ్చాయి.

'ఫొటో కాదు. బామ్మలు నిజంగానే సర్ఫింగ్ చేస్తే ఎంత బాగుండేదో' అని ఒకరు కామెంట్ రాస్తే, మరొకరు 'వెండి వొరెల్ వీడియో చూడండి చాలు' అని సలహా ఇచ్చారు.

టెక్సాస్‌కు చెందిన వెండి వొరెల్ వయసు 70 సంవత్సరాల పైమాటే. ఈ వయసులోనూ సర్ఫింగ్ చేస్తూ 'ఉమెన్ ఆఫ్ ది వేవ్'గా పేరు తెచ్చుకొని ఎంతోమందిలో స్ఫూర్తి నింపుతోంది.



ముగ్గురు ఆడపిల్లల మురిపాల తండ్రి



ముగ్గురు ఆడపిల్లల మురిపాల తండ్రి మెటా సీయివో మార్క్ జుకర్ బర్గ్. మాగ్జిమా (7), ఆగస్ట్(5)లకు తోడుగా గత మార్చి నెలలో ఈ లోకంలోకి వచ్చింది ఔరేలియ. 'వెల్ కమ్ టూ ది వరల్డ్' అంటూ ఆ చిట్టి ఫోటోను పోస్ట్ చేసి స్వాగతం పలికాడు జుకర్‌బర్గ్.



తాజా విషయానికి వస్తే...

పెద్దమ్మాయి, రెండో అమ్మాయిల కోసం తానే స్వయంగా త్రీడీ ప్రింటింగ్ డ్రెస్‌లను డిజైన్ చేయడంతో పాటు కుట్టుపని కూడా నేర్చుకున్నాడు జుకర్‌బర్గ్.

తాను డిజైన్ చేసిన గౌన్‌ను పిల్లలు ధరించారు. ఆ ఫొటోను తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు జుకర్‌బర్గ్. ఈ ఫొటో బాగా వైరల్ అయింది.

'జుకర్ బర్గ్... మీరు ఎన్ని గొప్ప విజయాలు సాధించినా సరే, పిల్లల డ్రెస్ కోసం కేటాయించిన సమయం అత్యంత విలువైనది. భవిష్యత్‌లో మీ పిల్లలకు ఎప్పుడూ గుర్తుండిపోయే విలువైన సందర్భం ఇది' అంటూ నెటిజనులు స్పందించారు.



ఒక్క నిమిషం.. 9 భాషలు... 13 పాటలు!

'ఎన్ని పాటలు పాడగలరు?' అని అడిగితే 'ఎన్నయినా సరే' అంటారు పాటలను ప్రేమించే గాయకులు.

'ఒకే ఒక్క నిమిషంలో ఎన్ని పాడగలరు?' అని అడిగితే మాత్రం– 'మీరెవరండీ బాబూ' అంటారు. అయితే సౌత్ కొరియాకు చెందిన ఒక యువ జంట ఇండోనేషియా నుంచి ఇండియా (బాలీవుడ్ సినిమా సుఖూన్‌లోని దిల్ కో ఖరార్ ఆయా...పాట) వరకు తొమ్మిది భాషలలో 13 పాటలు పాడారు. ఈ వీడియో 2.1 మిలియన్‌ల వ్యూస్ సొంతం చేసుకొని దూసుకుపోతోంది.

'ఇది సరేగానీ... ఒక్క నిమిషంలో 13 పాటలు ఎలా సాధ్యం?' అనే సందేహం అందరికీ వస్తుంది. 13 పాటలలోని ఒక్కో చరణాన్ని తీసుకొని ఒకే పాటలా చాలా స్పీడ్‌గా పాడారు.

సెల్ఫ్ ఎంపవర్‌మెంట్



కోల్‌కతాకు చెందిన దీప్తి ఘోష్ ఇంజనీరింగ్ చదువుకుంది. తండ్రి చనిపోవడంతో కుటుంబ బరువు బాధ్యతలు తనపై పడ్డాయి. ఉద్యోగాల వేటలో పడింది. అయితే వచ్చిన ఒకటీ రెండు ఉద్యోగాలు 'ఔట్ ఆఫ్ కోల్‌కతా' వచ్చాయి.

తల్లి, చెల్లిని విడిచి దూరంగా ఉండలేని పరిస్థితి.

సిటీలో ఉద్యోగం ఎప్పుడు దొరుకుతుందో ఏమో అనుకునే పరిస్థితుల్లో ఖాళీగా ఉండడం ఎందుకని క్యాబ్ డ్రైవర్‌గా మారింది. మంచి ఆదాయాన్ని ఆర్జిస్తూ కుటుంబానికి అన్నిరకాలుగా అండగా నిలుస్తోంది. దీప్తి క్యాబ్‌లో ప్రయాణించిన దిల్లీకి చెందిన పరమ్ కల్యాణ్‌సింగ్ ఆమె స్టోరీని పోస్ట్ చేస్తే సోషల్ మీడియాలో వైరల్ అయింది.

'సెల్ఫ్ ఎంపవర్‌మెంట్ అంటే ఇదే'

'చదువుకు తగ్గ ఉద్యోగం దొరకడం లేదని బాధపడుతూ కూర్చోవడం కంటే ఇది ఎంత గొప్ప పని!'

'దీప్తి తన వృత్తిని గౌరవిస్తుంది. శ్రమజీవుల లక్షణం ఇది. స్త్రీ సాధికారతకు తిరుగులేని ఉదాహరణ దీప్తి'... ఇలాంటి కామెంట్స్ ఎన్నో నెటిజనుల నుంచి వచ్చాయి.

దెయ్యం కాదు మడిసే



ఎదురుగా ఉన్నది దెయ్యమో మనిషో తేల్చుకోవడానికి కాళ్లు వెనక్కు తిరిగి ఉండటాన్ని ప్రామాణికంగా తీసుకుంటారు జానపదులు.

ఇక్కడ ఉన్న కెల్సీ గ్రబ్ దెయ్యమేమో అని అనుమానం వస్తే తప్పులేదు.

ఎందుకంటే ఏకంగా ఆమె తన పాదం మొత్తాన్ని వెనక్కు తిప్పి గిన్నెస్ రికార్డును బద్దలు కొట్టింది.

మే 2న ఈ రికార్డు నమోదైంది.

ప్రస్తుతం ఈమె కాళ్ల వైపే లోకం అబ్బురంగా చూస్తోంది.

'పిల్లలకు గిన్నెస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అంటే క్రేజ్ ఉంటుంది. చిన్నప్పటి నుంచి నాక్కూడా ఉండేది. కాని నేను కూడా ఆ రికార్డ్ సాధిస్తాననుకోలేదు' అని సంబరపడుతోంది కెల్సీ గ్రబ్.

అమెరికాలోని న్యూ మెక్సికోలో ఆల్బకర్కీ అనే ఊరికి చెందిన 32 ఏళ్ల కెల్సీ తన కాలిని171.4 డిగ్రీలు వెనక్కు తిప్పడం ద్వారా గిన్నెస్ రికార్డు స్థాపించింది. 'గత సంవత్సరం ఏదో షాపులో గిన్నెస్ రికార్డ్-2021 పుస్తకం తిరగేశాను. అందులో కాలు వెనక్కు తిప్పే వ్యక్తి ఫొటో ఉంది. అతని కంటే ఎక్కువగా వెనక్కు ఎందుకు తిప్పకూడదు అనిపించింది' అంది కెల్సీ.

ఐస్ స్కేటింగ్‌ను తరచూ సాధన చేసే కెల్సీ స్కేటింగ్‌లో పాదాలు చురుగ్గా ఉండాలి కనుక తను సాధన చేస్తే కాలిని వెనక్కు తిప్పగలదు అనుకుంది. 'నేను పెద్దగా కష్టపడలేదు. అప్పుడప్పుడు పాదాన్ని వెనక్కు తిప్పుతూ ఉండేదాన్ని. కొన్నిసార్లు మోకాల్లో నొప్పి అనిపించేది. అప్పుడు మాత్రం కొంచెం మెల్లగా తిప్పేదాన్ని' అని తెలిపింది కెల్సీ.

ఆమె ఇప్పుడు ఎంత సాధన చేసిందంటే 'జనం వెనక్కు తిరిగిన పాదాన్ని కాకుండా అంత సులభంగా పాదాన్ని తిప్పినందుకే ఎక్కువ ఆశ్చర్యపోతుంటారు' అని నవ్వింది.

స్నేహితులు ఆమె విన్యాసాన్ని



పూర్తిగా గమనించాక గిన్నెస్ రికార్డ్స్ వారికి మెయిల్ పెట్టింది కెల్సీ. 'ఇదేదో రికార్డు స్థాయి ఫీట్ లాగానే ఉంది. వచ్చి పరీక్షించండి అని మెయిల్ పెట్టాను. చిన్నపిల్లల్లాగే ఉత్సాహంగా ఎదురు చూశాను. రికార్డు కన్ఫర్మ్ అయ్యాక చాలా సంబరపడ్డాను' అందామె.

సాధారణ జనంలో చాలా మంది కాలిని 90 డిగ్రీల వరకూ వెనక్కు తిప్పగలరు. కాని కెల్సీ దాదాపు 180 డిగ్రీలు వెనక్కు తిప్పడంతో ఈ వార్త వైరల్‌గా మారింది.

హెల్త్

మే 10 వరల్డ్ లూపస్ డే

తోడేలు వ్యాధిగా పిలిచే 'లూపస్'!

లూపస్ అంటే తోడేలు అని అర్థం. ఈ వ్యాధి ఉన్నవారిలో ముక్కుకు ఇరువైపులా ముఖం మీద రెక్కలు విప్పుకున్న సీతాకోకచిలుక ఆకృతిలో ర్యాషెస్ ఏర్పడతాయి. దాంతో చూడడానికి ముఖం తోడేలు మారిది కనిపించడంతో ఈ వ్యాధికి ఆ పేరొచ్చింది. దీన్నే సిస్టమిక్ లూపస్ ఎరిథెమటోసస్ (సంక్షిప్తంగా ఎస్ఎల్ఈ) లేదా లూపస్ అంటారు. నిజానికి ఇది దేహంలోని ఏ భాగాన్నైనా తేలిగ్గా దెబ్బతీయగలదు. కాబట్టి దీన్ని ప్రమాదకరమైన వ్యాధిగానే పరిగణించాలి. తమ సొంత వ్యాధి నిరోధక వ్యవస్థకు సంబంధించిన కణాలు సొంత అవయవాలపైనే దాడి చేయడం వల్ల దీన్ని 'ఆటో ఇమ్యూన్ వ్యాధి'గా పేర్కొనవచ్చు. ఈ నెల 10న వరల్డ్ లూపస్ డే సందర్భంగా ఈ వ్యాధిపై అవగాహన కోసం ఈ కథనం.





శరీరంలోని దాదాపు ఏ అవయవాన్నైనా దెబ్బతీయగల వ్యాధి కావడం వల్ల ఇది సోకిన వారిలో ప్రభావితమైన అవయవం పనితీరు అస్తవ్యస్తమవుతుంది. దాంతో అనేక వైకల్యాలు ఏర్పడవచ్చు. గతంలో దీని ఉనికి పెద్దగా కనిపించకపోయినప్పటికీ ఇటీవల దీని ప్రభావం ఎక్కువగా కనిపిస్తుండం వల్ల దీన్ని తెలుసుకోవాల్సిన అవసరం ఏర్పడింది.

■ ఎస్ఎల్ఈ తీవ్రత ఇలా...

లూపస్ తీవ్రత అందరిలోనూ ఒకేలా ఉండదు. వ్యక్తి నుంచి వ్యక్తికి మారుతుంది. ముందే కనుగొని చికిత్స అందించకపోతే తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉంది. ఇన్ఫెక్షన్లు సోకడం వల్ల లేక గుండె సంబంధిత సమస్యలతో ఇది కొన్నిసార్లు ప్రాణాంతకం అయ్యే ప్రమాదమూ ఉంది. అందుకే ముందుగానే గుర్తించి తగిన చికిత్స తీసుకోవడం మేలు. అయితే దీనికి పూర్తిగా నయం చేసే చికిత్స అందుబాటులో లేదు. ఈ వ్యాధి తాలూకు లక్షణాలు తీవ్రరూపం దాల్చి కనిపిస్తున్నప్పుడు వాటిని 'ఫ్లేర్స్'గా పిలుస్తారు. ఈ ఫ్లేరప్ ఎక్కువగా ఉన్నప్పుడు ఇది ప్రాణాలకూ ముప్పు తెచ్చిపెట్టవచ్చని గ్రహించి, ఆ పరిస్థితికి వెళ్లకుండా డాక్టర్లు చెప్పిన మందులు తీసుకుంటూ, వారి సూచనలను జాగ్రత్తగా పాటిస్తూ ఉండాలి.

■ ముప్పు ఎవరెవరిలో...

ఈ వ్యాధి పెద్దలు పిల్లలు అని తేడా లేకుండా ప్రతి ఒక్కరిలోనూ కనిపించవచ్చు. అయితే 15 నుంచి 44 ఏళ్ల మధ్యవారిలోనూ, గర్భధారణకు అవకాశమున్న మహిళల్లోనూ ఇది ఎక్కువ. పురుషుల్లో కంటే మహిళల్లో మరికాస్త ఎక్కువ. నిష్పత్తిని పరిశీలిస్తే ఒక పురుషుడికి 12 మంది స్త్రీలు ఈ వ్యాధికి గురయ్యే అవకాశముంది.

■ ప్రభావితమయ్యే అవయవాలివే...

మన వ్యాధి నిరోధక శక్తి ఏ అవయవంలోని ఆరోగ్యకరమైన కణజాలాన్ని (టిష్యూలను) దెబ్బతీస్తే ఆ అవయవం ప్రభావితమవుతుంది. ఇలా కళ్లూ, కీళ్లు, చర్మం, కిడ్నీలు, రక్తకణాలు, గుండె, ఊపిరితిత్తులు... ఈ వ్యాధి తాలూకు ప్రభావంతో దెబ్బతినే అవకాశాలుంటాయి.

కారణాలు

లూపస్ వ్యాధికి నిర్దిష్టమైన కారణాలంటూ ఏవీ లేవు.

- ఎస్ఎల్ఈ వంశపారంపర్యమని చెప్పడానికి అవకాశం లేదుగానీ... కుటుంబంలో ఎవరికైనా ఈ వ్యాధి ఉన్నప్పుడు అదే కుటుంబాలకు చెందినవారిలో కొంతమందికి ఇది కనిపించడం మామూలే.
- ఏవైనా వ్యాధుల బారిన పడ్డ తర్వాత అంటే వైరల్ ఇన్ఫెక్షన్స్ సోకిన తర్వాత లేదా కొన్ని మందుల దుష్ప్రభావాల కారణంగా కూడా ఇది కనిపించవచ్చు.
- తీవ్రమైన ఒత్తిడికి లోనవ్వడం కూడా ఈ వ్యాధికి ఒక కారణం.

■ లక్షణాలు...

లూపస్ తాలూకు లక్షణాలన్నీ ఒక్కొక్కరిలో ఒక్కోలా కనిపిస్తాయి. ప్రభావితమైన అవయవాన్ని బట్టి లక్షణాలూ మారవచ్చు. అందువల్లనే ఈ వ్యాధి నిర్ధారణ ఒక్కోసారి జటిలంగా మారుతుంది. కొన్నిసార్లు ఇన్ఫెక్షన్‌గానూ, ఆర్థరైటిస్‌గానూ పొరబడి, తప్పుగా నిర్ధారణ జరిగే అవకాశాలూ లేకపోలేదు.

● నీరసం, కీళ్ల నొప్పులు, కీళ్ల వాపు వంటి ఆర్థరైటిస్ లక్షణాలతో ఇది వ్యక్తమయ్యే అవకాశాలు ఎక్కువ. అందుకే దీన్ని ఆర్థరైటిస్‌గానూ, కండరాల నొప్పులతో కూడిన ఫైబ్రోమయాల్జియాగానూ, తీవ్రమైన నిస్సత్తువ, అలసట వంటి లక్షణాలతో వ్యక్తమైనప్పుడు క్రానిక్ ఫెటీగ్‌గానూ, కొన్ని సందర్భాల్లో మానసిక సమస్యగా నిర్ధారణ చేయడానికి అవకాశాలు ఎక్కువ. అందుకే దీన్ని చాలా నిశితంగా పరిశీలించాల్సి ఉంటుంది. ● తీవ్రతను బట్టి తేలికపాటివి, ఓ మోస్తరు నుంచి తీవ్రమైన లక్షణాలు కనిపించవచ్చు. ● జ్వరం, ఆకలి లేకపోవడం, అన్నం సయించకపోవడం, బరువు తగ్గడం వంటి లక్షణాలూ సాధారణం. ● ఒళ్లంతా మంటలుగా అనిపించవచ్చు. ● లూపస్‌ను గుర్తించడానికి తోడ్పడే కీలకమైన లక్షణాల్లో ముఖ్యమైనది చర్మం, మ్యూకస్ పొరలు ప్రభావితం కావడం. ఇందువల్ల ఎండ తీవ్రతను ఏమాత్రమూ భరించలేదు. ముఖ్యమైన లక్షణం ఏమిటంటే ముఖం చర్మం మీద ముక్కుకు ఇరువైపులా సీతాకోకచిలుక ఆకృతిలో ర్యాష్ వస్తుంది. నోరు, ముక్కుపొరల్లో పూత కనిపిస్తుంది. ఈ లక్షణాల్ని బట్టి దీన్ని కనుగొనడానికి ఆస్కారం ఎక్కువ. ● దీని బాధితుల్లో 50 శాతం కంటే ఎక్కువ మంది రక్తహీనతతో బాధపడుతుంటారు. ● కొందరిలో తీవ్రమైన తలనొప్పి, తెల్లరక్తకణాల సంఖ్య తగ్గడం, ప్లేట్‌లెట్ల సంఖ్యలోనూ తగ్గుదల వంటి లక్షణాలూ కనిపిస్తాయి. ● ఎస్ఎల్ఈ వల్ల కిడ్నీలు ప్రభావితమైనవారిలో రక్తపోటు, మూత్రంలో రక్తం, ప్రోటీన్ పోవడం, క్రియాటినిన్‌లో పెరుగుదల కనిపిస్తాయి. దీంతో లూపస్ నెఫ్రైటిస్‌ను అనుమానించి, ఆ దిశగా వ్యాధి నిర్ధారణ చేసేందుకు బయాప్సీ వంటి పరీక్షలూ చేయాలి. ● ఊపిరితిత్తులు ప్రభావితమైనప్పుడు ఊపిరాడకపోవడం, ఛాతీలో నొప్పి, ఊపిరితిత్తుల్లో ద్రవాలు పేరుకోవడం, దగ్గినప్పుడు రక్తం పడటం కనిపించవచ్చు. ● గుండె ప్రభావితమైనప్పుడు చిన్నవయసులోనే గుండెపోటు రావచ్చు. ● ఎస్ఎల్ఈ బాధితుల్లో ఆందోళన, డిప్రెషన్ లేదా రెండూ, సైకోసిస్, ఉన్మాదంగా ప్రవర్తించడం వంటి మానసిక సమస్యలతో పాటు నిద్రలేమి, చిరాకు వంటి లక్షణాలూ కనిపిస్తాయి. ● కళ్లు ప్రభావితమైనప్పుడు కంట్లో శుక్లం, మాక్యులోపతి, గ్లకోమా, చూపు తగ్గడం, ఒక్కోసారి చూపు కోల్పోవడమూ జరగవచ్చు. ● జీర్ణవ్యవస్థలో పేగులు మొదలుకొని ఇలా దేహంలో ఏ భాగం ప్రభావితమవుతుందో, వాటి తాలూకు లక్షణాలు కనిపించవచ్చు. ● ఇది ఉన్న మహిళల్లో గర్భస్రావాలు సాధారణం. వీళ్లు గర్భం దాల్చి బిడ్డను కనేందుకు తమ ప్రెగ్నెన్సీని జాగ్రత్తగా ప్లాన్ చేసుకోవాలి.

నివారణ

వ్యాధి నివారణ కోసం ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం. పొగతాగడం – మద్యం అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండటం. సన్‌స్క్రీన్ వాడుతూ ఎండ నుంచి రక్షించుకోవడం. బయటికి వెళ్లాల్సి వచ్చినప్పుడు లేత రంగు దుస్తులను ధరించడం వంటి జాగ్రత్తలను పాటించాలి.

■ నిర్ధారణ : యాంటీ న్యూక్లియర్ యాంటీ బాడీ టెస్ట్ అనే వైద్యపరీక్ష సహాయంతో దీన్ని నిర్ధారణ చేస్తారు. అయితే కొంతమంది ఆరోగ్యవంతుల్లోనూ ఈ పరీక్ష పాజిటివ్‌గా వస్తుంది కాబట్టి ఈ విషయంలో అనేక శారీరక, మానసిక లక్షణాలను పరిగణనలోకి తీసుకుని రుమటాలజిస్టులు చాలా జాగ్రత్తగా వ్యాధి నిర్ధారణ చేయాల్సి ఉంటుంది.

■ చికిత్స : ఇది ఓ ఆటోఇమ్యూన్ వ్యాధి కాబట్టి దీనికి చికిత్స కష్టమవుతుంది. ఏ అవయవాన్ని దెబ్బతీస్తుందో దాన్ని బట్టి కూడా చికిత్స మారుతుంది. చికిత్సలో భాగంగా యాంటీ ఇన్‌ఫ్లమేటరీ మందులు, ఇబుప్రొఫెన్, న్యాప్రోక్సెన్ సోడియం వంటివి వాడుతారు. లక్షణాలను బట్టి మందులిస్తూ, తీవ్రత (ఫ్లేర్స్‌ను) తగ్గించడానికి ఒక్కోసారి స్టెరాయిడ్స్ ఇస్తూ, చర్మంపై దద్దుర్లు తగ్గించడం కోసం స్టెరాయిడ్ క్రీమ్స్‌తోనూ చికిత్స చేయాల్సి ఉంటుంది. క్లిష్టమైన కేసుల్లో ఇమ్యూనోసప్రెసివ్ డ్రగ్స్ అనే రోగనిరోధక వ్యవస్థ తీవ్రతను తగ్గించే మందుల్ని వాడతారు.



డాక్టర్ విజయ ప్రసన్న పరిమి
సీనియర్ రుమటాలజిస్ట్

బాలింతకు పాలు బాగా పడాలంటే..?

చాలా సందర్భాల్లో ప్రసవం అయిన వెంటనే తల్లికి తగినంతగా పాలు పడక, బిడ్డకు సరిపోయినన్ని పాలు స్రవించని సందర్భాల్లో వెంటనే పోతపాలకు అలవాటు చేస్తుంటారు. మామూలు తల్లిపాలతో పోలిస్తే కాస్త రుచిగా ఉండి, బాటిల్‌తో సులువుగా తాగగలిగిన పోత పాలకు బిడ్డ తేలిగ్గా అలవాటు పడడం సహజం. దాంతో చిన్నారులకు పోతపాలు బాగా నచ్చుతాయి. ఆ తర్వాత తల్లి దగ్గర పాలు తాగడానికి పెద్దగా ఇష్టపడరు. అందుకే ముందుగా బిడ్డకు తల్లి పాలను అలవాటు చేయడమే మంచిది.



కొంతమంది మహిళల్లో ప్రసవం తర్వాత బిడ్డకు సరిపోయినంతగా పాలు పడకపోవచ్చు. అలాంటివారిలో నేచురల్‌గానే పాలు బాగా పడటానికి చేయాల్సి పనులివి...

ఇందుకోసం... ● బాలింత తన ఆహారంలో పాలు, పెరుగు, కూరగాయలు, ఆకుకూరలు, పప్పుధాన్యాలు బాగా తీసుకుంటూ ఉండాలి. ● నీళ్లు కూడా ఎక్కువగా తాగుతూ ఉండటం అవసరం. ●అంతేకాదు... ఆహారంలో నువ్వులు, వెల్లుల్లి, పాలు, కోడిగుడ్లు, కొబ్బరి, కొబ్బరి నీళ్లు, మంచినీళ్లు ఎక్కువగా తీసుకోవడం వల్ల తల్లికి స్వాభావికంగానే బాగా పాలు పడే అవకాశం ఉంటుంది.

సిజేరియన్ తర్వాత బిడ్డ పుట్టాక చాలామంది తల్లులు తమకు సర్జరీ అయిన ప్రాంతంలో కుట్లు చీము పడతాయని పప్పుధాన్యాలను తీసుకోరు. ఒంటికి నీరు పడుతుందనే అపోహతో ద్రవపదార్థాలనూ, బిడ్డకు జలుబు చేస్తుందంటూ తమకు ఆరోగ్యాన్ని, పోషకాలను ఇచ్చే పండ్లను తీసుకోరు. అందువల్ల తల్లికి పాలు సరిగ్గా పడకపోవడం, అజీర్తి, మలబద్ధకం వంటి సమస్యలు వస్తాయి.

అందుకే ఇలాంటి అపోహల జోలికి పోకుండా బాలింతకు మంచి పోషకాహారంతో పాటు, ద్రవాహారాలు, నీళ్లు, పండ్లు ఇస్తూ ఉండటం అవసరం.

మరికొంత మంది తల్లులు తమ బిడ్డకు పాలు సరిపోవడం లేదనే అపోహతో పోతపాలు పడుతుంటారు. నిజానికి... బిడ్డ పాలు తాగిన తర్వాత రెండు నుంచి మూడు గంటల సేపు హాయిగా నిద్రపోవడంతో పాటు... రోజు మొత్తంలో ఆరుసార్ల కంటే ఎక్కువగా మూత్రం పోస్తున్నా, వయసుకు తగినట్లు బరువు పెరుగుతున్నా తల్లి పాలు బిడ్డకు సరిపోతున్నట్లుగా గుర్తించాలి.

పైన పేర్కొన్న సూచనలు పాటించాక కూడా ఇంకా పాలు సరిపోనట్లయితే డాక్టర్ సలహా మేరకు ట్యాబ్లెట్లు, పాలలో కలిపే పొడులు వాడాల్సి రావచ్చు. అలాంటి సందర్భాల్లో డాక్టర్‌ను సంప్రదించాలి.

హెర్నియా సర్జరీ తర్వాత వ్యాయామం చేయవచ్చా?

పొత్తికడుపు కండరాలు బలహీనంగా ఉన్నవారికి హెర్నియా సమస్య వస్తుంది. మలబద్ధకం కారణంగా మలవిసర్జన సమయంలో బాగా ముక్కాల్సిన పరిస్థితి ఉన్నవారిలోనూ, వారు దగ్గినప్పుడు, ఏవైనా బరువులెత్తినప్పుడు ఈ సమస్య మరింత పెరుగుతుంది. ఈ సమస్యకు సర్జరీయే పరిష్కారం. అయితే హెర్నియా సర్జరీ తర్వాత ఎక్సర్‌సైజ్ మొదలుపెట్టవచ్చా లేదా అనే సందేహం చాలామందిలో ఉంటుంది. హెర్నియా సర్జరీ తర్వాత కూడా వ్యాయామం మొదలుపెట్టవచ్చు. అయితే ఎక్సర్‌సైజ్‌లు మొదలుపెట్టడానికి ముందుగా ఒకసారి సర్జన్‌ను సంప్రదించి తగిన సూచనలు తీసుకోవడం అవసరం. హెర్నియా సర్జరీ అయిన వారు తమ గాయం బాగా తగ్గాక... రోజూ ఉదయం సాయంత్రం 20 నిమిషాల చొప్పున రెండుసార్లు వాకింగ్ లాంటి తేలికపాటి వ్యాయామాలు చేయవచ్చు. వాకింగ్ సమయంలో వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలివి... ● బలంగా గాలి పీల్చుతూ చేసే బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్‌లు చేయకూడదు. ● కడుపుపై ఒత్తిడి పెంచే ఆసనాల జోలికి పోకూడదు. ● బరువులు ఎత్తే వ్యాయామాలకూ దూరంగా ఉండాలి. ఎందుకంటే అవి కడుపుపై ఒత్తిడిని పెంచుతాయి. అలాగే హెవీ వెయిట్ లిఫ్టింగ్, రన్నింగ్, తీవ్రమైన జిమ్ వ్యాయామాలకు కనీసం ఆర్నెల్ల పాటు దూరంగా ఉండాలి.

ఈ జాగ్రత్తలు తీసుకుంటూ కడుపుమీదగాని, ఆపరేషన్ చేసిన చోటగాని ఎలాంటి వాపు లేకపోతే ఇతర వ్యాయామాలు కూడా చేస్తూ, వాటి వ్యవధినీ, రిపిటీషన్లను క్రమంగా పెంచుకుంటూ పోవచ్చు.




'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే,
ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా!
లేక తప్పుకోవడమా!'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 16 సంచిక: 45

SUNDAY Special | ఆదివారం 7-5-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



చెన్నై ఘన విజయం

సొంతగడ్డపై శనివారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ 6 వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. మరో మ్యాచ్‌లో బెంగళూరుపై 7 వికెట్లతో ఢిల్లీ విజయం సాధించింది.

- 12లో



బైడెన్ ప్రభుత్వంలో మరో ఇండియన్

జో బైడెన్ ఇండియన్ అమెరికన్‌కు మరోసారి తన ప్రభుత్వంలో కీలక బాధ్యతలు అప్పగించారు. భారత సంతతికి చెందిన నీరా టాండన్‌ను సలహాదారుగా నియమించారు.

- 6లో



'గరీబీ హఠావో' ఓ కుంభకోణం

కాంగ్రెస్ హామీలపై అప్రమత్తంగా ఉండాలని, 50 ఏళ్ల క్రితం ఆ పార్టీ ఇచ్చిన గరీబీ హఠావో హామీ ఓ కుంభకోణమని ప్రధాని ఆరోపించారు.

- వివరాలు 6లో



ఖర్గే హత్యకు కుట్ర?

మల్లికార్జున ఖర్గేను హత్య చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తోందంటూ కాంగ్రెస్ విడుదల చేసిన ఒక ఆడియో క్లిప్పు సంచలనం సృష్టించింది.

- వివరాలు 6లో



ఇంఫాల్ లోయ ప్రశాంతం

మణిపూర్‌లో ప్రశాంతత నెలకొంటోంది. శనివారం ఉదయం ఇంఫాల్ లోయలో దుకాణాలు, మార్కెట్లు తిరిగి తెరుచుకున్నాయి.

- వివరాలు 6లో



ఫలించిన 80 ఏళ్ల పోరాటం

బ్రిటన్ పాలకుల నాటి ఒక ఆస్తి వివాదంలో బాధిత కుటుంబం 80 ఏళ్లపాటు చేసిన పోరాటం బాంబే హైకోర్టులో పరిష్కారమైంది.

- వివరాలు 6లో

రోడ్లకు వాన దెబ్బ

రెండేళ్లుగా భారీ వర్షాలతో దెబ్బతిన్న రహదారులు

ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టని ప్రభుత్వం

మళ్లీ వానలు కురిసే వేళ పనులకు శ్రీకారం



ఇది వికారాబాద్ నుంచి నవాబ్‌పేట మీదుగా శంకర్‌పల్లికి వెళ్లే రోడ్డు దుస్థితి. రోడ్డు వానలకు కొట్టుకుపోయింది. చిన్నవాన కురిసినా అంతా బురదే. వాహనాలు ముందుకు కదలడం కష్టమే. ద్విచక్ర వాహనదారులు బురదలో జారి పడిపోతున్న ఘటనలు నిత్యం కనిపిస్తున్నాయి.

6,617 కిలోమీటర్ల మేర పునరుద్ధరణకు నిర్ణయం

రూ.2,852 కోట్లతో పనులకు గ్రీన్ సిగ్నల్

- ఇప్పటివరకు పూర్తయిన పనులు 20 శాతమే..
- గత నెల రోజులుగా కురుస్తున్న వానలు
- మరో నెల రోజుల్లో వానాకాలం షురూ..
- గోతుల రోడ్లపై వరద పోటెత్తితే పూర్తిగా ధ్వంసమయ్యే అవకాశం
- ప్రమాదాలు జరుగుతాయనే ఆందోళన

సాక్షి, హైదరాబాద్: గత రెండు మూడేళ్లుగా రాష్ట్రంలో రికార్డు స్థాయిలో వర్షాలు కురుస్తున్నాయి. భారీ, అతి భారీ వానలతో వరద పోటెత్తడంతో చాలా ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. తీవ్రంగా దెబ్బతిన్న చోట పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నా ప్రభుత్వం అందుకు తగ్గ ఏర్పాట్లు చేయలేదు. పలుచోట్ల నామ్‌కేవాస్తేగా పైపైన సాధారణ మరమ్మతులు చేసినా.. ఇటీవలి వర్షాలకు మరింతగా పాడయ్యాయి. చాలా చోట్ల గతుకులు, గుంతలు పడ్డాయి. కొన్నిచోట్ల పైన తారు కొట్టుకుపోయి.. మట్టిరోడ్లలా మారిపోయాయి. దీనితో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా కనిపిస్తోంది. మరో నెల రోజుల్లో వానాకాలం ముంచుకొస్తుండగా.. ఇప్పటికీ రోడ్ల మరమ్మతు అంశం కొలిక్కి రాలేదు. రోడ్ల పీరియాడికల్ రెన్యువల్స్‌కు సంబంధించి నిర్ధారించుకున్న నిడివిలో కేవలం 20 శాతమే పూర్తయింది. వానాకాలం మొదలైతే పనులు ఆపేయాల్సిన పరిస్థితి ఏర్పడనుంది.

భారీ వర్షాలు పడితే ఇబ్బందే..

గత రెండు వానాకాలాల్లో కలిపి దాదాపు రూ.2 వేల కోట్ల మేర రోడ్లకు నష్టం జరిగినట్టు అంచనా. ఎప్పటికప్పుడే రోడ్లను మెరుగుపరిస్తే.. తదుపరి వరదకు అంతగా నష్టం ఉండదు. అదే మరమ్మతులు చేయని పక్షంలో.. మళ్లీ వరద పోటెత్తితే ఆ రోడ్లు పూర్తిగా కొట్టుకుపోయే అవకాశం ఉంటుంది. అప్పుడు రోడ్లను పూర్తిగా పునరుద్ధరించాల్సిన పరిస్థితి వస్తుంది. ఖర్చు భారీగా పెరుగుతుంది. రాష్ట్రంలో గత రెండేళ్లుగా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. గుంతలు, దెబ్బతిన్న రోడ్ల కారణంగా ప్రమాదాలు

మిగతా 3వ పేజీలో ▶

రోడ్ల పీరియాడికల్ రెన్యువల్స్ తీరు ఇదీ..

మొత్తం ఎంపిక చేసిన రోడ్ల నిడివి	6,617 కి.మీ.	ఇంకా పనులు జరుగుతున్న రోడ్లు	1,350 కి.మీ.
ఇందుకు మంజూరు చేసిన నిధులు	రూ.2,852 కోట్లు	పనులు ప్రారంభం కావాల్సిన నిడివి	2,263 కి.మీ.
ఇప్పటివరకు పూర్తయిన రెన్యువల్	1,400 కి.మీ.	టెండర్లు కూడా ఖరారు కాని రోడ్లు	1,190 కి.మీ.

న్యూస్‌రీల్

నేడు యూజీ నీట్-2023 అర్హత పరీక్ష



వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు ఆదివారం జరగనున్న నీట్-2023 అర్హత పరీక్షకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఏర్పాట్లు పూర్తి చేసింది. దేశవ్యాప్తంగా 499 నగరాల్లో, తెలుగుతో పాటు 13 భాషల్లో ఈ పరీక్ష జరగనుంది.

- వివరాలు 14లో

నేడు బీఎస్‌పీ 'తెలంగాణ భరోసా సభ'



రాష్ట్రంలో మరో బలమైన రాజకీయశక్తిగా ఎదగాలని బీఎస్‌పీ భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ భరోసా సభ పేరుతో బహిరంగ సభ నిర్వహిస్తోంది. ఈ సభకు మాయావతి హాజరవుతున్నారు.

- వివరాలు 11లో

అర్చిబిషప్ ఆఫ్ కాంటర్‌బరీ సమక్షంలో వెస్ట్ మినిస్టర్ అబేలో పట్టాభిషిక్తుడవుతున్న చార్లెస్ 3



అంగరంగ వైభవంగా.. చార్లెస్ పట్టాభిషేకం

40వ రాజుగా ప్రమాణ స్వీకారం

- 2,200 మందికి పైగా ప్రముఖుల సమక్షంలో కార్యక్రమం
- భారత్ నుంచి హాజరైన ఉపరాష్ట్రపతి దంపతులు
- కార్యక్రమంలో హిందూ, ముస్లిం మత ప్రతినిధులు కూడా..

2లో

రవి అస్తమించినా అలనాటి రాజ వైభవానికి, అట్టహాసాలకు, ఆడంబరానికి మాత్రం ఏ లోటు లేని రీతిలో బ్రిటన్ రాజ సింహాసనంపై చార్లెస్ 3 కొలువుదీరారు. వెయ్యేళ్లకు పైగా కొనసాగుతున్న సంస్కృతీ సంప్రదాయాల ప్రకారం బ్రిటన్ 40వ రాజుగా పట్టాభిషిక్తుడయ్యారు.

రాష్ట్ర ఐటీ ఎగుమతులు రూ. 2.20 లక్షల కోట్లు!



గత ఏడాదితో పోలిస్తే 20 శాతానికిపైగా పెరుగుదల అంటున్న ఐటీ వర్గాలు

- ఏడాదిలో 2 లక్షల కొత్త ఉద్యోగాలు వచ్చినట్టు అంచనా.. 2026 నాటికి ఎగుమతుల లక్ష్యం రూ.3 లక్షల కోట్లు
- 2022–23 ఆర్థిక సంవత్సర నివేదికపై ఐటీ శాఖ కసరత్తు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఐటీ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ఎగుమతులు 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.2.2 లక్షల కోట్లు దాటుతున్నట్టు ప్రభుత్వం అంచనా వేసింది. గత ఏడాది రాష్ట్రం నుంచి రూ.1.83 లక్షల కోట్ల మేర ఐటీ ఎగుమతులు జరగగా.. 2022–23లో ఇది 20 శాతానికిపైగా వృద్ధిరేటు సాధించినట్టు ఐటీశాఖ వర్గాలు లెక్కలు వేస్తున్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణలో ఐటీ రంగం పురోగతికి సంబంధించిన నివేదికను ఆ శాఖ అధికారులు సిద్ధం చేస్తున్నారు. అన్ని అంశాలను క్రోడీకరించి జూన్ మొదటి వారంలో నివేదికను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఐటీ, ఐటీ ఆధారిత సేవల ఎగుమతుల్లో వృద్ధితోపాటు ఉద్యోగాల కల్పనలోనూ మంచి పురోగతి సాధించామని అధికార వర్గాలు చెప్తున్నాయి. గత ఏడాది

మిగతా 2వ పేజీలో ▶



◀ దివిటిపల్లిలో జరిగిన సభలో మాట్లాడుతున్న కేటీఆర్

నాడు మైగ్రేషన్.. నేడు ఇరిగేషన్

కృష్ణా, గోదావరి జలాలతో పాలమూరు జిల్లాకు జీవం పోశాం

- కుల, మత పిచ్చోళ్లను పట్టించుకోవద్దు: మంత్రి కేటీఆర్
- మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలసి మహబూబ్‌నగర్‌లో ఐటీ టవర్ ప్రారంభం
- అమరరాజా గిగా కారిడార్‌కు శంకుస్థాపన

3లో

గోదావరి, కృష్ణా జలాలతో పాలమూరుకు జీవం పోశాం... పాలమూరు పచ్చబడి పంటలు పండుతుంటే కొందరికి కళ్లు మండుతున్నాయి.

– విపక్షాలను ఉద్దేశించి మంత్రి కేటీఆర్

మరోసారి రాష్ట్రానికి మోదీ!

త్వరలో వరంగల్ టెక్స్‌టైల్ పార్కు ప్రారంభానికి రానున్న ప్రధాని

9న కర్ణాటకకు ఆనుకుని ఉన్న తెలంగాణ ప్రాంతాల్లో అమిత్ షా లేదా నడ్డా సభ ఉండొచ్చనే ప్రచారం

- కన్నడ నాట ఓట్లు పొందే ఏ అవకాశాన్నీ వదులుకోరాదనే వ్యూహం
- జహీరాబాద్, నారాయణపేట్ లేదా మరోచోట కోడ్ అడ్డురాకుండా సభ?
- కర్ణాటకలో ఎన్నికల 'పని' ముగుస్తుండటంతో తెలంగాణపై ఫోకస్
- ఈ నెలలోనే రెండు ఎంపీ సీట్ల పరిధిలో జేపీ నడ్డా పర్యటన.. మరోసారి అమిత్‌షా సభ ఉంటుందంటున్న పార్టీ నేతలు



సాక్షి, హైదరాబాద్: 'మిషన్ తెలంగాణ'లో భాగంగా రాష్ట్రంలో మరోవిడత వరుస పర్యటనలు, కార్యక్రమాలకు బీజేపీ అధినాయకత్వం సిద్ధమవుతోంది. ఇప్పటిదాకా కర్ణాటక ఎన్నికల్లో బిజీగా ఉన్న ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా, జాతీయ అధ్యక్షుడు జేపీనడ్డా, ఇతర ముఖ్యనేతలు.. ఇక తెలంగాణపై ఫోకస్ చేయనున్నారు. సోమవారం కర్ణాటకలో ఎన్నికల ప్రచారం ముగుస్తుండటంతో.. ఆ మరుసటి రోజున (ఈ నెల 9న) కర్ణాటక సరిహద్దులో ఉన్న తెలంగాణ ప్రాంతాల్లో అమిత్ షా లేదా జేపీ నడ్డాతో సభ నిర్వహించే అవకాశం ఉందని బీజేపీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దక్షిణాదిలో పార్టీ విస్తరణకు కర్ణాటకలో గెలుపు కీలకమని.. అక్కడ ఓట్లు

మిగతా 11వ పేజీలో ▶

అన్నీ ఉన్నా.. వలస తప్పక!

అభివృద్ధికి దూరంగా 'కల్యాణ కర్ణాటక'

- రాజ్యాంగ సవరణలు అమల్లోకి రావు.. ప్రాంతీయ అభివృద్ధి బోర్డులూ పనికిరావు
- ఉద్యోగాలన్నీ ఇతర ప్రాంతాల వారికే.. స్థానిక యువత వలస బాట
- ఎన్నికల వేళ చర్చనీయాంశమైన స్థానిక రిజర్వేషన్లు

14లో

గ్రూప్-4 దరఖాస్తుల సవరణకు అవకాశం

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–4 ఉద్యోగ దరఖాస్తులో పొరపాట్ల సవరణకు తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అవకాశం కల్పించింది. ఈనెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు అభ్యర్థులు ఓటీఆర్ ద్వారా లాగిన్ అయ్యాక పొరపాట్లను గుర్తించి సరిచేసుకోవాలి. ఒక అభ్యర్థి ఒకసారి మాత్రమే సవరణ చేసుకునే అవకాశం ఉంటుందని టీఎస్‌పీఎస్సీ స్పష్టం చేసింది. ఈ క్రమంలో అభ్యర్థులు దరఖాస్తు ప్రతిని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత పొరపాట్లను గుర్తించి సవరించుకోవాలని సూచించింది. సవరణ తర్వాత సమర్పించే దరఖాస్తు ఆఖరని స్పష్టం చేసింది. మరిన్ని వివరాలకు కమిషన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరింది.

అంగరంగ వైభవంగా..

చార్లెస్ పట్టాభిషేకం

40వ రాజుగా ప్రమాణస్వీకారం





పట్టాభిషేకానికి బంగారు రథంపై వెళ్తున్న రాచ దంపతులు. (ఇన్‌సెట్‌లో) బంగారు రథం

లండన్: రవి అస్తమించినా అలనాటి రాజ వైభవానికి, అట్టహాసాలకు, ఆడంబరానికి మాత్రం ఏ లోటు లేని రీతిలో బ్రిటన్ రాజ సింహాసనంపై చార్లెస్ 3 కొలువుదీరారు. వెయ్యేళ్లకు పైగా కొనసాగుతున్న సంస్కృతీ సంప్రదాయాల ప్రకారం బ్రిటన్ 40వ రాజుగా పట్టాభిషిక్తుడయ్యారు. పలువురు దేశాధినేతలు, ముఖ్య నేతలు తదితరుల సమక్షంలో లాంఛనంగా కిరీటధారణ చేశారు. దాంతో బ్రిటన్‌కు లాంఛనప్రాయ అధినేతగా చార్లెస్ అధికారికంగా పూర్తిస్థాయిలో పగ్గాలు చేపట్టినట్టయింది. లండన్ వీధుల గుండా భార్యాసమేతంగా బంగారు రథంలో ఊరేగుతూ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన పట్టాభిషేకానంతరం దారి పొడవునా ప్రజలు, అభిమానుల అభినందనలు స్వీకరిస్తూ బకింగ్‌హాం రాజప్రాసాదానికి చేరుకున్నారు. అనంతరం చారిత్రక బాల్కనీ నుంచి రాజ దంపతులు మరోసారి అందరికీ అభివాదం చేయడంతో కార్యక్రమం ముగిసింది. అత్యంత లేటు వయసులో బ్రిటన్ సింహాసనాన్ని అధిష్టించిన రికార్డును కూడా 74 ఏళ్ల చార్లెస్ సొంతం చేసుకున్నారు! ఆయనతో పాటు భార్య కెమిల్లా (75)కు కూడా రాణిగా పట్టాభిషేకం జరిగింది. 2022 సెప్టెంబర్‌లో తన తల్లి, బ్రిటన్ రాణి ఎలిజబెత్–2 మరణానంతరం బ్రిటన్ రాజుగా చార్లెస్ బాధ్యతలు స్వీకరించడం తెలిసిందే.

70 ఏళ్ల తర్వాత...

అప్పుడెప్పుడో 70 ఏళ్ల కిందట, అంటే 1953లో బ్రిటన్ రాణిగా ఎలిజబెత్–2కు పట్టాభిషేకం జరిగింది. తర్వాత మళ్లీ ఇంతకాలానికి జరిగిన పట్టాభిషేక క్రతువు అందరినీ ఎంతగానో ఆకర్షించింది. అప్పట్లాగే శనివారం కూడా కార్యక్రమం ఆసాంతం వాన పడటం విశేషం. దేశ విదేశాల్లో లక్షలాది మంది కార్యక్రమాన్ని అత్యంత ఆసక్తిగా వీక్షించారు. మరోవైపు ఈ ప్రజాస్వామిక యుగంలోనూ ఇంకా ఈ కాలం చెల్లిన రాచరికపు పోకడలు ఏమిటంటూ జోరుగా విమర్శలు కూడా వచ్చాయి. వందలాది నిరసనకారులు రాజ దంపతుల ఊరేగింపు మార్గంలో బారులు తీరి నినాదాలకు దిగారు. ముందుజాగ్రత్తగా వారందరినీ అదుపులోకి తీసుకున్నారు.

సునాక్ బైబిల్ పఠనం

- ఆర్చిబిషప్ ఆఫ్ కాంటర్‌బరీ సమక్షంలో మొదలైన కార్యక్రమం రాజుగా చార్లెస్‌ను గుర్తించడం, ప్రమాణం, ప్రకటన, కిరీటధారణ, పట్టాభిషేకం ... ఇలా ఐదు దశల్లో 2 గంటలపాటు సాగింది.
- ముందుగా చార్లెస్‌ను సభికులందరికీ ఆర్చిబిషప్ పరిచయం చేశారు. చార్లెస్ అందరికీ కన్పించేలా నాలుగు దిక్కులకూ తిరిగారు.
- తర్వాత చట్టాన్ని కాపాడుతూ న్యాయంగా, దయతో పాలిస్తానని, ఇంగ్లండ్ చర్చికి విధేయుడైన క్రైస్తవునిగా ఉంటానని చార్లెస్ రెండు ప్రమాణాలు చేశారు.
- ఈ సందర్భంగా సంప్రదాయం ప్రకారం కెమిల్లాకు చార్లెస్ ఉంగరం తొడిగారు. తద్వారా రాజ దంపతులు లాంఛనంగా మళ్లీ పెళ్లాడారు.
- అనంతరం బ్రిటన్ తొలి హిందూ ప్రధాని రిషి సునాక్ ప్రభుత్వ సారథి హోదాలో బైబిల్ పంక్తులు చదివి వినిపించారు!
- హిందూ, ముస్లిం, సిక్కు, బౌద్ధ, యూదుమత ప్రతినిధులను కూడా తొలిసారిగా కార్యక్రమానికి ఆహ్వానించారు. హిందూ ప్రతినిధి రాజ చిహ్నాన్ని చార్లెస్‌కు అందజేశారు.
- అనంతరం బంగారు అంగవస్త్రం ధరించి దాదాపు 800 ఏళ్ల నాటి సింహాసనాన్ని అధిష్టించారు. దాని కింది అరలో స్కాట్లాండ్ నుంచి తెప్పించిన పవిత్ర శిలనుంచారు.
- చార్లెస్‌పై తెరచాటుగా ఛాతి, చేతులు, ముఖంపై జెరూసలేం నుంచి ప్రత్యేకంగా తెప్పించిన పవిత్ర తైలం చిలకరించారు.
- చార్లెస్‌కు తెరచాటు కోసం ఉపయోగించిన వస్త్రంపై 56 కామన్వెల్త్ దేశాలకు ప్రతీకగా 56 ఆకులతో కూడిన చెట్టును చిత్రించారు.
- తర్వాత శిలువతో కూడిన గోళాకారపు బంగారు రాజముద్ర, రాజదండాన్ని ఆర్చిబిషప్ చేతుల మీదుగా చార్లెస్ అందుకున్నారు.
- వేలికి రాజముద్ర తొడిగాక చివరగా అతి ప్రధాన ఘట్టంలో 360 ఏళ్ల నాటి సెయింట్ ఎడ్వర్డ్ స్వర్ణ కిరీటాన్ని చార్లెస్ ధరించారు. దీన్ని ఆయన మరింకెప్పుడూ ధరించబోరు.
- ఆ వెంటనే గాడ్ సేవ్ ద కింగ్ గీతాలాపనతో, గంటల మోతతో వెస్ట్ మినిస్టర్ అబే మారుమోగింది.
- అనంతరం చార్లెస్ రాజఖడ్గం చేబూని 1937లో క్వీన్ ఎలిజబెత్ దంపతులు పట్టాభిషేకానికి వాడిన సింహాసనంపై ఆసీనులయ్యారు.
- ఆర్చిబిషప్‌తో పాటు చార్లెస్ పెద్ద కుమారుడు ప్రిన్స్ విలియం మోకాళ్లపై కూర్చుని ఆయన కుడిచేతిని ముద్దాడారు.
- తర్వాత నిరాడంబరంగా కెమిల్లాకు రాణి కిరీటధారణ జరిగింది. ఆహూతుల కళ్లెదుట రాణిపై పవిత్ర తైలం చిలకరించారు. తర్వాత 1911లో క్వీన్ మేరీ ధరించిన 2,200 వజ్రాలు పొదిగిన కిరీటాన్ని ఆమె ధరించారు. కోహినూర్ సహా మూడు పెద్ద వజ్రాలతో ఈ కిరీటం మెరిసిపోయేది. వివాదాలకు తావు లేకుండా ఇటీవల కోహినూర్‌ను కిరీటం నుంచి తొలగించారు.
- అనంతరం ఎడ్వర్డ్ కిరీటాన్ని తీసేసి అధికారిక రాజ కిరీటాన్ని చార్లెస్ ధరించారు. రాణితో కలిసి దారి పొడవునా ప్రజలకు అభివాదం చేస్తూ బంగారు రథంలో బకింగ్‌హాం ప్యాలెస్‌కు తిరిగి వెళ్లారు.
- ప్యాలెస్ బాల్కనీ నుంచి పెద్ద కుమారుడు ప్రిన్స్ విలియం దంపతులతో కలిసి చార్లెస్ దంపతులు ప్రజలకు దర్శనమివ్వడంతో పట్టాభిషేక కార్యక్రమానికి తెరపడింది.
- చివరగా రాయల్ ఎయిర్‌ఫోర్స్ విమానాలు విన్యాసాలతో అలరించాయి.
- వర్షం కారణంగా చాలా కార్యక్రమాలను కుదించి త్వరగా ముగించారు.

2,200కు పైగా ప్రముఖుల సమక్షంలో కార్యక్రమం

- భారత్ నుంచి హాజరైన ఉపరాష్ట్రపతి దంపతులు
- కార్యక్రమంలో హిందూ, ముస్లిం మత ప్రతినిధులు

బంగారు ఆకుల డిజైన్లలో బైబిల్

చార్లెస్ ప్రమాణస్వీకారం కోసం వాడిన బైబిల్‌ను ఆక్స్‌ఫర్డ్ ప్రెస్‌లో ప్రత్యేకంగా తయారు చేయించారు. బంగారు ఆకులు తదితర డిజైన్లతో తీర్చిదిద్దారు. అందులో దాదాపు 350 అచ్చు తప్పులను సరిచేసి మరీ కార్యక్రమం కోసం సిద్ధం చేశారు. అచ్చం 1611 నాటి కింగ్ జేమ్స్ బైబిల్‌లా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు.



చార్లెస్‌–3తో ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ దంపతులు



పట్టాభిషేకాన్ని టీవీలో వీక్షిస్తున్న ప్రజలు



బకింగ్‌హాం ప్యాలెస్ వద్ద వేలాదిగా ప్రజలు



పట్టాభిషేకం అనంతరం ప్యాలెస్ బాల్కనీ నుంచి రాచ దంపతుల అభివాదం



కుటుంబ సమేతంగా వేడుకకు హాజరైన ప్రిన్స్ విలియం

రాజు వెడలె...

లండన్‌లోని వెస్ట్ మినిస్టర్స్ అబేలో శనివారం చార్లెస్ 3 పట్టాభిషేక కార్యక్రమం కన్నులపండువగా జరిగింది. 1066లో విలియం ద కాంకరర్‌కి ఇక్కడే పట్టాభిషేకం జరిగింది. నాటి నుంచీ ఈ కార్యక్రమం ఇక్కడే జరుగుతోంది.

- చార్లెస్, కెమిల్లా దంపతులు ఉదయం 11 గంటలకు బకింగ్‌హాం ప్యాలెస్ నుంచి ప్రత్యేక బంగారు రథంలో ఊరేగింపుగా వెస్ట్ మినిస్టర్స్ అబేకు తరలి వెళ్లారు. ఈ రథాన్ని 1831 నుంచి ప్రతి పట్టాభిషేక వేడుకకూ ప్రత్యేకంగా వాడుతున్నారు.
- సైనిక సిబ్బంది గుర్రాలపై, కాలి నడకన రథాన్ని అనుసరించారు.
- వేలాదిగా ప్రజలు సెంట్రల్ లండన్ వీధుల నిండా బారులు తీరి రాజ దంపతులకు చేతులూపుతూ కన్పించారు.
- దేశ విదేశాల నుంచి వచ్చిన 2,200 మందిపై చిలుకు ఆహూతులు అబే వద్ద రాజ దంపతులకు స్వాగతం పలికారు.
- భారత్ తరఫున ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ దంపతులు పాల్గొన్నారు. వారు కామన్వెల్త్ దేశాధినేతల వరుసలో కూర్చున్నారు.

దూరదూరంగా హారీ




రాచరికాన్ని వదులుకుని రాజ కుటుంబానికి దూరమైన చార్లెస్ రెండో కుమారుడు హారీ పట్టాభిషేక కార్యక్రమంలో అంటీ ముట్టనట్టుగా పాల్గొన్నారు. 10 వరుసల ఆవల మౌనంగా కూర్చుని కార్యక్రమాన్ని వీక్షించారు. ఆయన భార్య మెగన్ మార్కెల్, ఇద్దరు పిల్లలు కార్యక్రమానికి రాకుండా అమెరికాలోనే ఉండిపోయారు. శనివారమే నాలుగో పుట్టినరోజు జరుపుకున్న కుమారుడు ఆర్చీ కోసం కార్యక్రమం ముగియగానే హారీ అమెరికా పయనమయ్యారు. రాజ దంపతులు, అన్న విలియం తనను ఎన్నడూ సరిగా చూడలేదంటూ ఇటీవలి ఆత్మకథలో ఆయన తూర్పారబట్టడం తెలిసిందే.

చార్లెస్ తమ్ముడు కూడా...

రాచరిక హోదాను కోల్పోయిన చార్లెస్ తమ్ముడు ఆండ్రూ కూడా దూరంగా కూర్చుని కార్యక్రమాన్ని వీక్షించడానికే పరిమితమయ్యారు. లైంగిక వేధింపుల కేసు తదితరాల్లో చిక్కడంతో ఆండ్రూ రాచరికపు హోదాలను తల్లి ఎలిజబెత్ తొలగించారు.

మధ్యవర్తిత్వానికి ఈ విచారణ అడ్డంకి కాదు

- తెలంగాణ, ఏపీ విద్యుత్ బకాయిల వివాదంపై హైకోర్టు
- రూ.6,757 కోట్లపై ఏపీకి అనుకూలంగా గతంలో కేంద్రం ఆదేశాలు
- దీనిపై హైకోర్టును ఆశ్రయించిన తెలంగాణ సర్కార్
- నోట్ ఫైల్ సమర్పించాలని తాజాగా కేంద్రానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవిభజన తర్వాత(2014–2017) తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య నెలకొన్న విద్యుత్ బకాయిల వివాదాన్ని మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునేందుకు ఈ విచారణ ఎలాంటి అడ్డంకికాదని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. తెలంగాణకు కేంద్రం ఆదేశాలు జారీచేసే ముందు పరిశీలించిన రికార్డుల(నోట్ షీట్)ను న్యాయస్థానానికి సమర్పించాలని కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన స్టాండింగ్ కౌన్సిల్ కేఎల్ఎన్ రాఘవేంద్రారెడ్డిని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ నాటికి నోట్‌షీట్‌ను అందజేయాలంది. విచారణను జూన్ 9వ తేదీకి వాయిదావేసింది. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ, ఏపీ మధ్య 'విద్యుత్'పంచాయితీ నడుస్తోంది. తెలంగాణ తమకు విద్యుత్ చార్జీలు బకాయి పడిందంటూ ఏపీ ఫిర్యాదు చేయడంతో కేంద్రం గతేడాది ఆగస్టులో కీలక ఉత్తర్వులిచ్చింది. ఏపీ వాదనతో ఏకీభవించిన కేంద్రం అసలు(రూ.3,442 కోట్లు), లేట్ పేమెంట్ సర్‌చార్జి కింద(రూ.3,315 కోట్లు) కలిపి మొత్తం రూ.6,757 కోట్లను ఏపీకి చెల్లించాలని తెలంగాణను ఆదేశించింది. 30 రోజుల్లోగా చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఏపీకి తక్షణమే బకాయిలు చెల్లించాలన్న కేంద్రం ఆదేశాలను సవాల్ చేస్తూ తెలంగాణ సర్కార్ హైకోర్టును ఆశ్రయించింది. కేంద్రం ఆదేశాలపై సీజే ధర్మాసనం స్టే విధించడం తెలిసిందే. అయితే ఈ పిటిషన్‌పై సీజే ధర్మాసనం ఇటీవల మళ్లీ విచారణ చేపట్టింది. ఏపీ తరఫున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ ఏపీ విద్యుత్ సంస్థలు ఆర్థికసాయం పొంది, విద్యుత్తును ఉత్పత్తి చేసి, తెలంగాణకు సరఫరా చేశాయన్నారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం విభజన సందర్భంగా ఏర్పడిన వివాదాస్పద సమస్యలకు మాత్రమే వర్తిస్తుందని, ఈ విద్యుత్ బకాయిలకు దానితో సంబంధం లేదన్నారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని నిబంధనల ప్రకారం బకాయిల వసూలుకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నుంచి మాత్రమే ఆదేశాలు రావాలని, విద్యుత్ శాఖ కార్యదర్శికి ఆ అధికారంలేదని గతంలో తెలంగాణ వాదించింది. అయితే తెలంగాణ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ వాదనలు వినిపించాల్సి ఉండటంతో ధర్మాసనం విచారణను జూన్ 9కి వాయిదా వేసింది.

పాలక మండలి నిర్ణయాలు చెల్లవు

తెలంగాణ వర్సిటీ వీసీ రవీందర్ గుప్తా




మీడియాతో మాట్లాడుతున్న తె.యూ వీసీ రవీందర్ గుప్తా, నిర్మలా దేవి

సుభాష్‌నగర్ /ఖలీల్‌వాడి: చైర్మన్, వైస్ చాన్స్‌లర్‌గా తాను లేకుండా వర్సిటీ పాలకమండలి తీసుకున్న నిర్ణయాలు చెల్లవని తెలంగాణ యూనివర్సిటీ వీసీ రవీందర్ గుప్తా స్పష్టం చేశారు. నిజామాబాద్ జిల్లాలోని తెలంగాణ యూనివర్సిటీలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. అన్ని వర్సిటీల్లో వీసీలకు సర్వాధికారాలుంటే.. తె.యూ విషయంలో మాత్రం నవీన్ మిట్టల్ భిన్నంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. యూనివర్సిటీ అభివృద్ధికి రూసా నిధులు రూ. 20 కోట్లు రాకుండా అడ్డుపడుతున్నారని ఆరోపించారు. తనను వారానికోసారి ఈసీ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారని, తనను సంప్రదించకుండానే ప్రొఫెసర్ యాదగిరిని రిజిస్ట్రార్‌గా నియమించారని మండిపడ్డారు. ఆ నిర్ణయాలేవీ చెల్లవని స్పష్టం చేశారు. సమావేశాల గురించి తనకు సమాచారమే ఉండటం లేదని, ఈ నెల 12న మళ్లీ ఈసీ జరగనున్నట్లు తెలిసిందని, ఆ సమావేశానికీ తనకు ఆహ్వానం అందలేదని తెలిపారు. ఆహ్వానిస్తే వెళ్తానని చెప్పారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఈసీకి తన అనుమతి లేకుండా హాజరైన ప్రొఫెసర్లు నసీమా, హారతి, అసోసియేట్ ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు వీసీ తెలిపారు. నోటీసులకు సరైన సమాధానం ఇవ్వని పక్షంలో సస్పెండ్ చేస్తామన్నారు. 2023 ఫిబ్రవరి 28 తోనే మూడేళ్ల ఈసీ గడువు ముగిసిందని, కొత్త కమిటీ ఏర్పాటుకోసం ప్రతిపాదనలు పంపించామని వీసీ తెలిపారు.

నా నియామకం చెల్లుతుంది..

యూనివర్సిటీకి రిజిస్ట్రార్‌ను నియమించే అధికారం వీసీకి ఉంటుందని, కానీ 90 రోజుల్లో పాలక మండలి అప్రూవ్ చేయాల్సి ఉంటుందని వీసీ నియమించిన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నిర్మలాదేవి తెలిపారు. తన నియామకం చెల్లుతుందని, తానే రిజిస్ట్రార్‌గా కొనసాగుతానని ఆమె స్పష్టం చేశారు. ఓయూ నుంచి రిలీవ్ ఆర్డర్ రావడంతోనే తాను ఇక్కడ చార్జి తీసుకున్నానని, రిలీవ్ ఆర్డర్ క్యాన్సిల్‌పై తనకు ఎలాంటి సమాచారం రాలేదని ఆమె చెప్పారు.

రాష్ట్ర ఐటీ ఎగుమతులు రూ.2.20 లక్షల కోట్లు!



▶ మొదటి పేజీ తరువాయి

ఐటీ రంగంలో 1.53 లక్షల ఉద్యోగాల కల్పన జరగగా.. ఈసారి ఆ సంఖ్య రెండు లక్షలకు చేరి ఉంటుందని పేర్కొంటున్నాయి. గత ఏడాది ఐటీ రంగంలో దేశవ్యాప్తంగా 4.5లక్షల ఉద్యోగాల కల్పన జరగ్గా.. అందులో మూడో వంతు హైదరాబాద్ నుంచే ఉందని, ఉద్యోగాల కల్పనలో బెంగళూరు, పుణె, ముంబై, చెన్నై, ఢిల్లీ వంటి ప్రధాన నగరాలను హైదరాబాద్ అధిగమించిందని అంటున్నాయి.

ఐటీ రంగ కార్యకలాపాల విస్తరణ వల్లే..

కోవిడ్ నేపథ్యంలో పెరిగిన డిజిటలైజేషన్, తద్వారా వచ్చిన కొత్త అవకాశాలను అందుకోవడంలో హైదరాబాద్‌లో ముందు వరుసలో ఉందని.. అందువల్లే శరవేగంగా వృద్ధి సాధ్యమవుతోందని ఐటీశాఖ వర్గాలు చెప్తున్నాయి. 1,500కుపైగా ఐటీ, ఐటీ ఆధారిత సేవా రంగాల కంపెనీలతో హైదరాబాద్ ఐటీ హబ్‌గా మారిందని అంటున్నాయి. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ద్వితీయ శ్రేణి పట్టణాలకు ఐటీని విస్తరించడంలో భాగంగా.. ఇప్పటికే వరంగల్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్‌లలో ఐటీ హబ్‌లను ప్రారంభించిందని గుర్తుచేస్తున్నాయి. హైదరాబాద్‌లోని ఇతర ప్రాంతాలకు ఐటీ రంగాన్ని విస్తరించే లక్ష్యంతో రూపొందించిన గ్రిడ్ పాలసీ ఫలితాలు ఇప్పుడిప్పుడే అందుతున్నాయని అంటున్నాయి. టీహబ్‌తోపాటు పలు ప్రైవేటు ఇంక్యుబేషన్ సెంటర్ల కార్యకలాపాలు ఊపందుకోవడంతో.. ఐటీ ఎగుమతులు, ఉద్యోగాల కల్పనలో హైదరాబాద్ వృద్ధి ఇదే వేగంతో కొనసాగుతుందని అంచనా వేస్తున్నారు.

రాష్ట్ర ఏర్పాటు నుంచి వేగంగా..

- రాష్ట్ర ఆవిర్భావ సమయంలో రూ.57,258 కోట్లుగా ఉన్న ఐటీ ఎగుమతులు.. 2021–22 నాటికి రూ.1.83 లక్షల కోట్లకు చేరాయి. అప్పట్లో 3.23 లక్షలుగా ఉన్న ఐటీ ఉద్యోగుల సంఖ్య 2021–22 నాటికి 7.78లక్షలకు చేరింది. అంటే ఎనిమిదేళ్లలో కొత్తగా 4.54 లక్షల ఉద్యోగాల కల్పన జరిగింది.
- ఉమ్మడి ఏపీలో ఐటీ ఎగుమతులు 2035 నాటికి రూ.2.09లక్షల కోట్లకు చేరుతాయని గతంలో నిపుణులు అంచనా వేశారు. అయితే ప్రస్తుతం తెలంగాణ ఒక్కటే, 2022–23 నాటికే ఈ అంచనాలను దాటుతుండటం గమనార్హమని ఐటీ వర్గాలు చెప్తున్నాయి.
- తెలంగాణలో 2026 నాటికి ఐటీ, ఐటీ ఆధారిత ఉత్పత్తుల ఎగుమతులను రూ.3 లక్షల కోట్లకు చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం గతంలో లక్ష్యంగా నిర్దేశించుకుంది. అయితే అంతకన్నా ముందే ఆ లక్ష్యాన్ని చేరుకుంటామని ఐటీ శాఖ వర్గాలు చెప్తున్నాయి.



రానున్న రెండ్రోజులు పలుచోట్ల మోస్తరు వర్షాలు

సాక్షి, హైదరాబాద్: రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మోస్తరు నుంచి భారీవర్షాలు సైతం నమోదయ్యే అవకాశం ఉందని సూచించింది. శనివారం ఉదయం ఆగ్నేయ బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాలలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో ఈ నెల 8న అల్పపీడన ప్రదేశం ఏర్పడే అవకాశం ఉంది. ఇది ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈ నెల 9న వాయుగుండంగా కేంద్రీకృతమయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించింది. ఆ తర్వాత దాదాపు ఉత్తరందిశగా పయనిస్తూ మధ్య బంగాళాఖాతం వైపు కదులుతూ తీవ్రతరమై తుపానుగా బలపడే అవకాశం ఉంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశంఉంది. శనివారం నల్లగొండలో 38.0 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఈ నెల 9వ తేదీ నుంచి రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతాయని వాతావరణ శాఖ సూచించింది.

తెలంగాణలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
నల్లగొండ	38.0	23.0
ఆదిలాబాద్	37.3	25.2
భద్రాచలం	37.0	26.0
నిజామాబాద్	36.9	25.2
ఖమ్మం	36.6	26.2
రామగుండం	36.4	25.4
హనుమకొండ	35.5	23.5
మహబూబ్‌నగర్	35.5	25.0
మెదక్	34.8	22.3
హకీంపేట్	34.0	22.0
దుండిగల్	34.0	22.4
హైదరాబాద్	34.0	23.7

క్లుప్తంగా...

తొలగించిన ఆర్టిజన్లపై 15న నిర్ణయం!

సమ్మెకు దిగిన 200 మంది ఆర్టిజన్ల తొలగింపుపై కార్మికశాఖ సమక్షంలో చర్చలు



సాక్షి, హైదరాబాద్: చట్టవిరుద్ధంగా సమ్మెకి దిగారన్న ఆరోపణలతో తొలగించిన 200 మంది ఆర్టిజన్లను మళ్లీ ఉద్యోగాల్లో చేర్చుకునే విషయంలో ఈ నెల 15న విద్యుత్ సంస్థల యాజమాన్యాలు ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వేతన సవరణ, విద్యుత్ బోర్డు సర్వీసు రూల్స్ వర్తింపు తదితర డిమాండ్లతో గత నెల 25న తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల యూనియన్(హెచ్ 82), ఇతెహాద్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్లు సమ్మెబాట పట్టగా, అదేరోజు 200 మంది ఆర్టిజన్లను ఉద్యోగాల నుంచి తొలగించినట్లు ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు ప్రకటించారు. గత నెల 26న రెండు యూనియన్ల నాయకులు విద్యుత్‌సౌధలో ఆయన్ను కలిసి సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో ఉద్యోగాల నుంచి తొలగించిన ఆర్టిజన్లను 10 రోజుల్లోగా మళ్లీ ఉద్యోగాల్లో చేర్చుకుంటామని ప్రభాకర్‌రావు వారికి హామీ ఇచ్చినట్లు యూనియన్ల నేతలు వెల్లడించారు. అయితే వీరిని ఉద్యోగాల్లో తీసుకునే అంశంపై ఈ నెల 15న రాష్ట్ర కార్మికశాఖ కమిషనర్..విద్యుత్ సంస్థల యాజమాన్యాలు, రెండు యూనియన్లతో ఉమ్మడిగా సమావేశం నిర్వహించనున్నారు. భవిష్యత్తులో సమ్మెకు దిగకుండా కార్మికశాఖ సమక్షంలో ఒప్పందం చేసుకోవాలని యాజమాన్యాలు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

15లోగా ఇళ్ల పట్టాల పంపిణీ

కలెక్టర్లకు సీఎస్ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకి సంబంధించిన జీవో 58, 59ల కింద పట్టాలు, కన్వీనియన్స్ డీడ్‌ల పంపిణీని వెంటనే చేపట్టి, ఈ నెల 15లోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో శనివారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి.. టీఎస్‌పీఎస్సీ ద్వారా పరీక్షల నిర్వహణ, ఎరువుల సరఫరా తదితర అంశాలపై సమీక్షించారు. ధాన్యం సేకరణకు అన్ని కొనుగోలు కేంద్రాలు పూర్తి స్థాయిలో పని చేయాలని, రైతులకు సకాలంలో చెల్లింపులు చేయాలని ఆదేశించారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన అకాల వర్షాలతో జరిగిన పంట నష్టాన్ని సత్వరంగా అంచనా వేసి నివేదించాలని సూచించారు. రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగుకు వినూత్న పద్ధతులను అన్వేషించాలని, నలభై రోజుల్లో ప్లాంటేషన్ ప్రారంభం కానున్నందున, ఈ ప్రక్రియపై జిల్లా స్థాయిలో సమీక్షించాలని కలెక్టర్లకు తెలిపారు. మొక్కలు అందుబాటులో ఉన్నందున ఈ ఏడాది లక్ష్యాన్ని సులభంగా అధిగమించవచ్చని సీఎస్ వెల్లడించారు. జిల్లాలో డీఏపీ, యూరియా సహా అన్ని రకాల ఎరువుల స్టాక్‌ను పరిశీలించి, రీటైల్ గోడౌన్లకు బదిలీ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు.



ఐటీ కారిడార్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న కేటీఆర్



సభకు హాజరైన ప్రజలు

నాడు మైగ్రేషన్.. నేడు ఇరిగేషన్

కృష్ణా, గోదావరి జలాలతో పాలమూరు జిల్లాకు జీవం పోశాం

- కుల, మత పిచ్చోళ్లను పట్టించుకోవద్దు: మంత్రి కేటీఆర్
- మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలసి మహబూబ్‌నగర్‌లో ఐటీ టవర్ ప్రారంభం
- అమరరాజా గిగా కారిడార్‌కు శంకుస్థాపన

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: 'కుల, మత పిచ్చోళ్లను పట్టించుకోవద్దు.. అభివృద్ధే మన కులం. సంక్షేమమే మన మతం.. జనహితమే మన అభిమతం'అని మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. పేదవాడు ఏ కులమైనా, ఏ మతమైనా కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నామన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లి వద్ద ఐటీ, మల్టిపర్పస్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ. 40 కోట్ల వ్యయంతో నిర్మించిన ఐటీ టవర్‌ను రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలసి శనివారం ఆయన ప్రారంభించారు. దేశంలో అతిపెద్ద, తెలంగాణలో మొట్టమొదటిదైన అమరరాజా గిగా కారిడార్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా శిల్పారామం, కేసీఆర్ అర్బన్ ఎకో పార్కులో జంగల్ సఫారీ తోపాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జూనియర్ కాలేజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

ఇది కాదా అభివృద్ధి?

ఆనాడు పాలమూరు అంటే మైగ్రేషన్ అని.. తెలంగాణ వచ్చాక ఇరిగేషన్ అనేది స్పష్టంగా తెలుస్తోందన్నారు. గోదావరి, కృష్ణా జలాలతో పాలమూరుకు జీవం పోశామని.. పాలమూరు పచ్చబడి పంటలు పడుతుంటే కొందరికి కళ్లు మండుతున్నాయని విపక్షాలను ఉద్దేశించి విమర్శలు గుప్పించారు. వలసలు పోయే పాలమూరుకే వేరే రాష్ట్రాల కూలీలు వచ్చి పని చేస్తున్నారని.. ఇది కాదా అభివృద్ధి అని బీజేపీ, కాంగ్రెస్ నేతలను ప్రశ్నించారు. ఏ రాష్ట్రంలోనైనా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో పరిశ్రమల స్థాపన ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. అమరరాజా గిగా కారిడార్‌తో ప్రత్యక్షంగా 10 వేల మంది ఉద్యోగులకు, పరోక్షంగా చుట్టుపక్కల ఉన్న వేలాది కుటుంబాలకు ఉపాధి అవకాశాలు రెట్టింపు అవుతాయని చెప్పారు. విద్యుత్ వాహనాల్లో ఉపయోగించే లిథియం అయాన్ బ్యాటరీలు ఈ కంపెనీలో తయారవుతాయని..



అమరరాజా బ్యాటరీ కంపెనీ శంకుస్థాపన కార్యక్రమంలో కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్, గల్లా అరుణకుమారి, గల్లా జయదేవ్

సంప్రదాయ లెడ్ ఆక్సైడ్ బ్యాటరీలు కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. అందువల్ల ఈ బ్యాటరీల తయారీ వల్ల ఒక్క చుక్క కాలుష్యం కూడా ఉండదన్నారు. అనవసరంగా చిల్లర మాటలు మాట్లాడేవారు మనసు మార్చుకొని నిర్మాణాత్మకంగా వ్యవహరించాలన్నారు. ఈ ఫ్యాక్టరీ నిర్మాణం సాగుతుండగానే స్థానికుల అర్హతకు తగ్గట్లు నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగాలు కల్పిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు.

ఆలోచించి ఓటేయండి..

టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పాలమూరులో సభపెట్టి ఒక్క చాన్స్ ఇవ్వాలని అడిగాడని... 55 ఏళ్లలో 11 చాన్స్‌లు ఇస్తే ఏం చేయనోళ్లను మళ్లీ ప్రజలు ఎలా నమ్మాలని కేటీఆర్ ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రధాని మోదీని దేవుడిగా అభివర్ణించడాన్ని కేటీఆర్ తప్పుబట్టారు. నోట్ల రద్దు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ సిలిండర్ ధరల పెంపు వంటి చర్యలతో సామాన్యులపై ఆర్థిక భారం మోపిన వ్యక్తి దేవుడెలా అవుతాడని ప్రశ్నించారు. దిక్కుమాలిన పార్టీలకు అవకాశం ఇస్తే పాత రోజులు వస్తాయని.. అందువల్ల ప్రజలు అన్నీ ఆలోచించి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా, దివిటిపల్లి వద్ద ఐటీ టవర్ ప్రారంభం మరచిపోలేని రోజని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఎవరు వచ్చినా.. వారిని కడుపులో పెట్టి దాచుకుంటామన్నారు.

మైనారిటీ కమిషన్ చైర్మన్‌గా అన్సారీ



అన్సారీకి అభినందనలు తెలుపుతున్న మంత్రి హరీశ్‌రావు, బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి తదితరులు


సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్‌గా తారిక్ అన్సారీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు అప్పగించిన పదవిని బాధ్యతాయుతంగా నిర్వహిస్తానని చెప్పారు. మైనారిటీలైన ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులు, జైన్‌లు, పార్సీల సంక్షేమంతో పాటు వారికి రావలసిన హక్కుల కోసం పని చేస్తానని స్పష్టం చేశారు. వచ్చే వారం నుంచి అర్జీలను పరిశీలిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు, హోం మంత్రి మహమూద్ అలీ, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

31న బ్రాహ్మణ సదనం ప్రారంభం



బ్రాహ్మణ సదనం భవనం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లోని గోపన్‌పల్లిలో 6 ఎకరాల స్థలంలో రూ. 13 కోట్లతో నిర్మించిన విప్రహిత బ్రాహ్మణ సదన భవనం ఈ నెల 31న సీఎం కేసీఆర్ చేతులమీదుగా ప్రారంభానికి సిద్ధమైంది. ఈ కార్యక్రమానికి శృంగేరి, పుష్పగిరి, హంపి సహా మరో ఆరుగురు పీఠాధిపతులను ఆహ్వానించే అవకాశం ఉంది. ఈ సదనంలో ఆధ్యాత్మిక, దైవిక కార్యక్రమాలతోపాటు శుభకార్యాల నిర్వహణ, పీఠాధిపతులు, ఇతర అతిథులకు బస, భోజన వసతి సహా అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ఇందులో 600 సీటింగ్ సామర్థ్యంతో కల్యాణ మండపం కూడా ఉంది.



శ్రీశైలం ఘాట్‌లో టూరిస్టు బస్సు బోల్తా

నలుగురికి తీవ్ర, 22 మందికి స్వల్పగాయాలు

పెద్దదోర్నాల/చంద్రుగొండ: వేగంగా వెళ్తున్న టూరిస్టు బస్సు బ్రేకులు ఫెయిలై అదుపు తప్పి లోయ పక్కనే రోడ్డుపై బోల్తాపడింది. ఈ ఘటన శనివారం శ్రీశైలం ఘాట్‌రోడ్డులోని దెయ్యాల మలుపు ప్రాంతంలో చోటుచేసుకుంది. పెద్దదోర్నాల ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం మద్దుకూరు గ్రామానికి చెందిన 80 మంది ప్రయాణికులు దైవ దర్శనం నిమిత్తం రెండు బస్సుల్లో శ్రీశైలం బయలుదేరారు. ఘాట్‌రోడ్డులోని ప్రమాదకరమైన దయ్యాల మలుపు వద్దకు రాగానే ఓ బస్సు బ్రేకులు ఫెయిలయ్యాయి. దీంతో వేగాన్ని నియంత్రించుకోలేని బస్సు మూలమలుపులో బోల్తాపడింది. బ్రేకులు ఫెయిలైన బస్సు వేగంగా వెళ్లి రక్షణ గోడను ఢీకొని లోయలో పడి ఉంటే భారీగా ప్రాణనష్టం జరిగేది. డ్రైవర్ షేక్ సయ్యద్ చాకచక్యంగా వ్యవహరించడంతో బస్సు లోయవైపు దూసుకెళ్లి రక్షణ గోడను తాకక ముందే పక్కకు ఒరిగిపడింది. బస్సులో 42 మంది ఉండగా, డ్రైవర్, ప్రయాణికులు నాగలక్ష్మి, సంధ్యారాణి, జస్వితకు తీవ్రగాయాలయ్యాయి. మరో 22 మంది స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో శ్రీశైలం దేవస్థానం వైద్యశాలకు, శ్రీశైలం ప్రాజెక్టు కాలనీ ప్రభుత్వ వైద్యశాలలకు తరలించారు. ఘటనపై ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వర రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన అక్కడి అధికారులు, శ్రీశైలం పాలకమండలి బాధ్యులకు ఫోన్‌చేసి క్షతగాత్రులకు మంచి వైద్యం అందించాలని కోరారు.



ఘాట్ రోడ్డులో బోల్తా పడ్డ టూరిస్టు బస్సు

జూలై 31 నాటికి ప్రారంభిస్తాం

పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుపై మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



'పాలమూరు–రంగారెడ్డి' టన్నెల్ పనులను పరిశీలిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, స్మితా సబర్వాల్

సాక్షి, నాగర్‌కర్నూల్: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనులు పూర్తిచేసి జూలై చివరినాటికే ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు సాగు, తాగునీరు అందిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే దక్షిణ తెలంగాణవాసుల దశాబ్దాల కల నెరవేరుతుందన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి స్మితా సబర్వాల్, ప్రతినిధుల బృందంతో కలసి పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన నార్లాపూర్, ఏదుల, వట్టెం రిజర్వాయర్లతో పాటు టన్నెల్, మిషన్ భగీరథ కాల్వల పనులను శనివారం పరిశీలించారు. ప్రాజెక్టు పురోగతిపై నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్షించారు. జూలై చివరినాటికి ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్ పనులన్నీ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం.. మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సొంత నిధులతో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టిందని వెల్లడించారు.

రోడ్లకు వాన దెబ్బ

▶ మొదటి పేజీ తరువాయి

జరుగుతాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పనులు మొదలుపెట్టినా..

2021 వానాకాలంలో భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు దాదాపు రూ.800 కోట్లు అవసరమని అంచనా వేశారు. గతేడాది భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్లకు రూ.1,200 కోట్లు అవసరమని నిర్ధారించారు. 2021లో దెబ్బతిన్న రోడ్లను సకాలంలో బాగు చేయకపోవటంతో.. వాటి పటుత్వం తగ్గి 2022లో మరింతగా దెబ్బతిన్నాయి. అయినా సకాలంలో పునరుద్ధరణ చేపట్టలేదు. గతేడాది చివరలో రోడ్ల పీరియాడికల్ రెన్యువల్స్ చేపట్టాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం.. రూ.2,852 కోట్లను మంజూరు చేసింది. టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించేసరికి ఫిబ్రవరి వచ్చేసింది. ఏప్రిల్ రెండో వారం నాటికి 20 శాతం పనులు పూర్తి చేశారు. కానీ అప్పటి నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో పనులు నిలిచిపోయాయి.

పదేళ్ల తర్వాత రెన్యువల్స్..

ఇండియన్ రోడ్ కాంగ్రెస్ నిబంధనల ప్రకారం.. ప్రతి ఐదేళ్లకోసారి రోడ్లకు రెన్యువల్స్ జరగాలి. అంటే పైన దెబ్బతిన్న తారు పూతను పూర్తిగా తొలగించి కొత్తగా వేయాలి. దీనికి భారీగా వ్యయం అవనున్నందున.. ఐదేళ్లకు బదులు కనీసం ఏడేళ్లకోసారి కొత్తగా వేసినా సరిపోతుందని నిపుణులు పేర్కొంటున్నారు. కానీ తెలంగాణ ఏర్పడ్డాక అసలు పీరియాడికల్ రెన్యువల్స్ చేపట్టలేదు. దాదాపు పదేళ్ల తర్వాత తొలిసారి ఇప్పుడు పనులకు శ్రీకారం చుట్టారు. 6,617 కిలోమీటర్ల మేర రోడ్లను పునరుద్ధరించాలని నిర్ణయించి.. వరదలతో దెబ్బతిన్న రోడ్లను ఇందులో చేర్చి పనులు ప్రారంభించారు. కానీ అనుమతులు, నిధుల విడుదలలో జాప్యంతో పనులు ఆలస్యంగా చేపట్టారు. మరో నెలలో వానాకాలం మొదలవుతుండటంతో.. రోడ్లు మరింతగా పాడైపోయే పరిస్థితి నెలకొందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.



ఇది జడ్చర్ల–వనపర్తి మధ్య బిజినేపల్లి ప్రాంతంలో రోడ్డు దుస్థితి. కనీస మరమ్మతులు కూడా లేక వానలకు దెబ్బతిని ఇలా గోతులమయంగా మారింది. ఈ మార్గంలో పెద్ద సంఖ్యలో టిప్పర్లు తిరుగుతుండటంతో గోతులు మరింత పెరిగి వాహన దారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. గతంలో బిజినేపల్లి–జడ్చర్ల మధ్య ప్రయాణ సమయం అరగంట అయితే... ఇప్పుడు గోతుల వల్ల గంటకుపైగా పడుతోంది.



ఇది నల్లగొండ జిల్లా యాద్గార్‌పల్లి– కేశవాపురం మధ్య ఉన్న స్టేట్ రోడ్డు. ఈ సింగిల్ రోడ్డు కాస్తా భారీ వర్షాలకు ఇలా ధ్వంసమైంది. వరదలతో దెబ్బతిన్న రోడ్లను బాగుచేసే క్రమంలో ఇలా పునరుద్ధరించారు. ఇప్పుడు ప్రయాణాలు సాఫీగా సాగుతున్నాయి.



ఇది బిజినేపల్లి సమీపంలోని నల్లవాగుపై నిర్మిస్తున్న వంతెన వద్ద దుస్థితి. ఈ రోడ్డుమీద రెండు చిన్న వంతెనల నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. పక్కన నిర్మించిన తాత్కాలిక రోడ్డు వానలకు పాడైపోయింది. ఇటీవల ఈ రోడ్డుమీద అదుపుతప్పిన ఓ టిప్పర్ కరెంటు స్తంభాన్ని ఢీకొంది. తెగిన కరెంటు వైరు ఆ పక్కగా వస్తున్న ఆర్టీసీ బస్సుపై పడింది. అదృష్టవశాత్తూ ఆ సమయంలో విద్యుత్ సరఫరాను నిలిపివేసి ఉండటంతో.. బస్సులో ఉన్న 70 మంది పెను ప్రమాదం నుంచి బయటపడ్డారు.



తన యందు భయభక్తులు గల వారికి ఆయన కోర్కెలు నెరవేర్చును. వారి మొర ఆలకించి వారిని రక్షించును.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** బ.విదియ రా.8.55 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** అనూరాధ రా.9.11 వరకు, తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** రా.2.34 నుండి 4.06 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.34 నుండి 5.25 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.55 నుండి 11.44 వరకు.

సూర్యోదయం : 5.35
సూర్యాస్తమయం : 6.17
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

జో బైడెన్ (అమెరికా అధ్యక్షుడు)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

పిల్లలెవరైనా పనివేళల్లో ఆఫీస్ డెస్కుల మధ్య కనిపిస్తే వర్క్ కల్చర్‌లోని రాక్షసత్వం తటాలున పాత ఫైళ్ల బీరువాల వెనక్కు అదృశ్యమై పోతుంది ఆ కొద్దిసేపూ! టేబుల్ పైకెక్కి కూర్చున్న ప్రెసిడెంట్ ఆఫ్ అమెరికా బూట్ల పాదాలైనా సరే చటుక్కున సొరుగు కిందికి దిగిపోవాల్సిందే.

ఆ రోజు 'టేక్ యువర్ చైల్డ్ టు వర్క్' డే అన్న సంగతే నాకు గుర్తు లేదు! వైట్ హౌస్‌లో పనిచేసే వారి పిల్లలంతా గలగలమంటూ లోపలికి వచ్చేశారు.

"మిస్టర్ బైడెన్ ఇప్పుడు మమ్మల్ని ప్రశ్నలు అడుగుతారా..?"

"లేదు. మీరే మిస్టర్ బైడెన్‌ని ప్రశ్నలు అడుగుతారు!"... ప్రెస్ సెక్రెటరీ కెరీన్ జీన్ పియరీ ఆ పిల్లలకు చెబుతున్నారు.

పియరీ దట్టమైన బాయ్‌కట్ జుట్టుండే అమ్మాయి. ఆమె జీవిత భాగస్వామి సుజాన్ కురులైతే... అవి జలపాతాలే! సమయానుకూలతల్ని బట్టి వాళ్లిద్దరూ ఒకరు భర్త, ఒకరు భార్య అవుతుంటారు. వాళ్ల కూతురు సోలెయిల్. దత్తపుత్రిక.



"తనని తీసుకురాలేదా మిస్ పియరీ?" అని అడిగాను.

"లేదు. పెద్దదైపోయింది.." అన్నారు మిస్ పియరీ నవ్వుతూ.

"ఏడేళ్లకేనా!!" అని పెద్దగా నవ్వాను.

పిల్లలు పెద్దవాళ్లైపోతుంటే... వైట్ హౌస్ అయినా సరే.. అక్కడ నాన్న పని చేస్తున్నాడనో, అమ్మ పని చేస్తోందనో పిల్లల్లో ఆసక్తి ఏమీ జనరేట్ అవదనుకుంటాను.

"మిస్టర్ ప్రెసిడెంట్! మీరు చివరిసారిగా పర్యటించిన దేశం ఏది?"... చిన్నారి ఎవరో పెద్ద పరీక్షే పెట్టింది నాకు!

ఆలోచిస్తున్నాను. గుర్తుకు రావడం లేదు.

"చూడు బంగారం! ఇప్పటిదాకా నేను 89 దేశాల్లో పర్యటించాను. కానీ వాటిలో ఆఖర్న వెళ్లొచ్చిన దేశం ఏదో ఇప్పటికిప్పుడైతే వెంటనే చెప్పలేకపోతున్నాను.." అన్నాను.

"దట్ ఈజ్.. ఐర్లండ్"... పిల్లల్లోనే ఒకరు చెప్పారు.

"ఎస్.. ఐర్లండ్! యు ఆర్ కరెక్ట్. ఇప్పుడు గుర్తొచ్చింది.." అన్నాను.

ఒక్కసారిగా పిల్లల కేరింతలు. టీచర్ లేని క్లాస్‌రూమ్‌గా మారిపోయింది వైట్ హౌస్.

"నాదొక ప్రశ్న మిస్టర్ ప్రెసిడెంట్"... చిట్టి చెయ్యి ఒకటి పైకి లేచింది.

"వాట్ మీ.. బంగారం!"

"మిస్టర్ ప్రెసిడెంట్! మీకు ఎంతమంది గ్రాండ్‌సన్స్? ఎంతమంది గ్రాండ్‌డాటర్స్?"

జర్నలిస్టులు ఎవరూ ఎందుకని ఇంత మంచి ప్రశ్నలు వేయరు? వాళ్లెప్పుడూ ఎందుకని పుతిన్ గురించి, చైనా గురించి మాత్రమే అడుగుతుంటారు? లేదంటే అమెరికా గురించి!

"హనీ! నేను నా గ్రాండ్‌సన్స్, గ్రాండ్ డాటర్స్ పేర్లు చెబుతాను. మరి నువ్వు త్వరత్వరగా కౌంట్ చేసుకుంటావా?" అని, టకటకా పేర్లన్నీ చెప్పేశాను.

"కానీ మిస్టర్ ప్రెసిడెంట్.. మీరు ఐదు పేర్లు మాత్రమే చెప్పారు. ఆరో పేరు చెప్పలేదు..." గుంపులోంచి ఒక బుడతడు!

జర్నలిస్టులే నయం అనిపించింది! పాపం వాళ్లు చికాకు తెప్పించే ప్రశ్నలు మాత్రమే వేస్తారు... జ్ఞాపకశక్తిని గిల్లి, గిచ్చే ఇలాంటి ప్రశ్నలైతే అడగరు.

పిల్లలంతా వెళ్లిపోయాక లాంగ్ బెల్ కొట్టిన స్కూల్లా మిగిలిపోయింది వైట్ హౌస్. ఒక జ్ఞాపకంలా వచ్చి ఒక మరుపుగా వెళ్లిపోయారు!

ఇటీవల దక్షిణ కొరియా అధ్యక్షుడు వచ్చినప్పుడు వైట్ హౌస్ రోజ్ గార్డెన్‌లో జరిగిన ప్రెస్ మీట్‌లో హూ ఓల్డ్ యామ్ ఐ అన్నది కూడా కూడా నేను చెప్పలేకపోయాను!

బైడెన్‌కు ఇప్పుడు 80 ఏళ్లు అని, ఇంకో టెర్మ్ కూడా ఉంటే, అప్పటికి ఆయనకు 86 ఏళ్లు వస్తాయని 'వాషింగ్టన్ పోస్ట్', 'న్యూయార్క్ టైమ్స్'... రోజూ రాస్తున్నాయి కనుక నా వయసెంతో గుర్తు పెట్టుకోవలసిన అవసరమైతే నాకు ఇప్పట్లో ఉండకపోవచ్చు.

ఈ బెదిరింపుల వెనుక...!



జనతంత్రం

వర్ధెల్లి మురళి



''అక్కరకు రాని చుట్టము, మ్రొక్కిన వరమీని వేల్పు, మోహరమున దానెక్కిన బారని గుర్రము, గ్రక్కున విడువంగ వలయు గదరా సుమతీ'' అన్నాడు శతకకారుడైన బద్దెన. అవసరానికి ఉపయోగపడని చుట్టాన్నీ, పూజించినా కోర్కెలు తీర్చని దేవుడినీ, యుద్ధంలో తానెక్కినప్పుడు పరుగెత్తని గుర్రాన్నీ వెంటనే వదిలేయాలని దాని అర్థం. అటువంటి అక్కరకు రాని ఒక చుట్టాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజలు నాలుగేళ్ల కింద వదిలించుకున్నారు. అలా వదిలించుకోవడం ఆయనకు బొత్తిగా నచ్చలేదు. కోపం తన్నుకొస్తున్నది. ఉక్రోషం లావాలా ఉప్పొంగుతున్నది. కళ్లెర్రబారుతున్నాయి. తనను వదిలించుకున్న ప్రజలకు శాపనార్థాలు పెడుతున్నారు. తనను ఓడించిన నాయకుడిపై బెదిరింపులకు దిగుతున్నారు. మధ్యేమధ్యే శోకం సమర్పయామి... వెక్కివెక్కి ఏడుస్తున్నారు.

ఓదార్పు కోసం పొరుగు రాష్ట్రాల నుంచి సెలబ్రిటీలను బతిమాలి పిలిపించుకుంటున్నారు. 'యే దిల్ మాంగే సింపతీ' అంటూ ఊరేగుతున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గతంలో ఓదార్పు యాత్ర చేశారు. బాధలో ఉన్న వారిని ఓదార్చడానికి ఆయన ఈ యాత్రను చేపట్టారు. ఈ నాయకుడు మాత్రం తనను ఓదార్చండని యాత్రలు చేస్తున్నారు. ఇదీ ఇద్దరు నాయకుల ఫిలాసఫీల్లో ఉన్న మౌలికమైన తేడా!

'నూరు గొడ్లను తిన్న రాబందు ఒక్క గాలివానకే గోవిందా' అంటారు. అలాగైంది ఆయన పరిస్థితి ఇప్పుడు. ఆయన మాత్రం భిన్నంగా ఆలోచిస్తున్నారు. కష్టాలన్నీ కట్టగట్టుకొని తన మీద దాడి చేస్తున్నాయని జనం నమ్మి తనను ఓదార్చాలి. తాను అధికారంలో ఉండగా చేసిన అవినీతి, అక్రమాలకు రాజ్యాంగ బద్ధమైన ఇమ్యూనిటీ ఉండాలని ఆయన గట్టిగా నమ్ముతారు. కర్ణుని కవచ కుండలాలెంత సహజమో, బాబుకు అవినీతి ఇమ్యూనిటీ అంత సహజమనీ మూడు దశాబ్దాలుగా యెల్లో మీడియా ప్రచారం చేసిపెట్టింది. ఈ ముప్పయ్యేళ్లలో ఎన్ని ఆరోపణలు కోర్టు మెట్లెక్కినా, బదిలీ లేని 'స్టే'షన్ మాస్టర్‌లా తాను పాతుకొనిపోలేదా? విచారణ జరగకుండా ఇరవైకి పైగా స్టేలు విజయవంతంగా తెచ్చుకోలేదా? ఇప్పుడేమైంది. తాను నగ్నంగా దొరికిపోయే కేసులో సుప్రీంకోర్టు స్టేను తొలగించడమేమిటి? కలికాలం కాకపోతే!... ఇదీ బాబు అండ్ కో భావజాలం.

రాష్ట్ర విభజన వెంటనే జరిగిన ఎన్నికల్లో మోదీ గాలి ఆసరాగా యెల్లో తెరచాప ఎత్తిపట్టి బాబు అధికారంలోకి వచ్చారు. ఫార్టీ ఇయర్స్ అనుభవజ్ఞుడు కనుక క్లిష్ట పరిస్థితుల్లో ఉపయోగపడతాడేమోనని కూడా కొందరు వయోధిక ఓటర్లు ఆలోచించి ఉండవచ్చు. నిజానికి అప్పుడు చంద్రబాబుకు లభించిన అవకాశం ఓ అద్భుతం. నవ్యాంధ్రను తీర్చిదిద్దడానికి లభించిన దివ్యమైన అవకాశం. సద్బుద్ధితో ఆలోచించి ఉంటే పాత పాపాలను కడిగేసుకోగలిగేవారు. ఆయన చంద్రబాబు కనుక అలా జరగలేదు! ''ఎలుక తోలు తెచ్చి యేడాది ఉతికినా, నలుపు నలుపే గాని తెలుపు గాదు, కొయ్యబొమ్మ తెచ్చి కొట్టిన పలుకునా, విశ్వదాభిరామ వినురవేమ!'' అన్నారు. స్వభావం మారకపోగా విశ్వరూపం దాల్చింది.

సంక్షోభాలను అవకాశాలుగా మలుచుకోవాలనే మేనేజ్‌మెంట్ పాఠాన్ని బాబు పదేపదే వల్లెవేసేవారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని సొంత అవకాశంగా మలుచుకునేటందుకు ఒక అవినీతి క్రతువును ఆరంభించారు. అప్పటి ప్రతిపక్షం ఆ క్రతువు ఖరీదు ఆరు లక్షల కోట్లు ఉండవచ్చని ఉజ్జాయింపు అంచనా వేసింది. గ్రామస్థాయిల్లోనూ జన్మభూమి కమిటీల పేరుతో అవినీతి పిండారీ ముఠాలను ఎగదోశారు. ఆ అయిదేళ్లలో అవినీతి సెగ తగలని మనిషే లేడంటే అతిశయోక్తి కాదు. జనం కీలెరిగి వాతపెట్టారు. ఎన్నికల సమయానికి ఉప్పెనలా విరుచుకుపడి అక్కరకు రాని చుట్టాన్ని తరిమికొట్టారు.

ప్రజాభిప్రాయానికి అనుగుణంగా కొత్త ప్రభుత్వం బాబు అవినీతి పురాణంపై ఓ కేబినెట్ సబ్‌కమిటీని వేసింది. ఆ సబ్ కమిటీ అవినీతి తాలూకు నివ్వెరపోయే నిజాలను రూఢి పరుస్తూ ఒక నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. నివేదిక ఆధారంగా ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. బాబు ప్రభుత్వం అవినీతి విశ్వరూపానికి సంబంధించిన అనేక ఆధారాలను 'సిట్' సంపాదించగలిగింది. బ్రహ్మరాక్షసి లాంటి అవినీతిని తవ్వి తీయాలంటే కేంద్ర దర్యాప్తు సంస్థలు కూడా రంగంలోకి దిగాలని ప్రభుత్వానికి 'సిట్' సూచించింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. ఈలోగా చంద్రబాబు రంగంలోకి దిగిపోయారు. నాటి ప్రభుత్వంలో భాగస్వాములు కాని ఇద్దరు వ్యక్తుల చేత హైకోర్టులో పిటిషన్ వేయించారు. ఈ పిటిషన్

'నూరు గొడ్లను తిన్న రాబందు ఒక్క గాలివానకే గోవిందా' అంటారు. అలాగైంది ఆయన పరిస్థితి ఇప్పుడు. ఆయన మాత్రం భిన్నంగా ఆలోచిస్తున్నారు. కష్టాలన్నీ కట్టగట్టుకొని తన మీద దాడి చేస్తున్నాయని జనం నమ్మి తనను ఓదార్చాలి. తాను అధికారంలో ఉండగా చేసిన అవినీతి, అక్రమాలకు రాజ్యాంగబద్ధమైన ఇమ్యూనిటీ ఉండాలని ఆయన గట్టిగా నమ్ముతారు. కర్ణునికి కవచ కుండలాలెంత సహజమో, బాబుకు అవినీతి ఇమ్యూనిటీ అంత సహజమనీ మూడు దశాబ్దాలుగా యెల్లో మీడియా ప్రచారం చేసిపెట్టింది. ఈ ముప్పయ్యేళ్లలో ఎన్ని ఆరోపణలు కోర్టు మెట్లెక్కినా, బదిలీ లేని స్టేషన్ మాస్టర్‌లా తాను పాతుకొనిపోలేదా? విచారణ జరగకుండా ఇరవైకి పైగా స్టేలు విజయవంతంగా తెచ్చుకోలేదా? ఇప్పుడేమైంది. తాను నగ్నంగా దొరికిపోయే కేసులో సుప్రీంకోర్టు స్టేను తొలగించడమేమిటి? కలికాలం కాకపోతే!... ఇదీ బాబు అండ్ కో భావజాలం.

రాష్ట్ర విభజన వెంటనే జరిగిన ఎన్నికల్లో మోదీ గాలి ఆసరాగా యెల్లో తెరచాప ఎత్తిపట్టి బాబు అధికారంలోకి వచ్చారు. ఫార్టీ ఇయర్స్ అనుభవజ్ఞుడు కనుక క్లిష్ట పరిస్థితుల్లో ఉపయోగపడతాడేమోనని కూడా కొందరు వయోధిక ఓటర్లు ఆలోచించి ఉండవచ్చు. నిజానికి అప్పుడు చంద్రబాబుకు లభించిన అవకాశం ఓ అద్భుతం. నవ్యాంధ్రను తీర్చిదిద్దడానికి లభించిన దివ్యమైన అవకాశం. సద్బుద్ధితో ఆలోచించి ఉంటే పాత పాపాలను కడిగేసుకోగలిగేవారు. ఆయన చంద్రబాబు కనుక అలా జరగలేదు!

వేయడానికి వారికి ఎటువంటి అర్హత (లోకస్ స్టాండై) లేదనే న్యాయ నిపుణులు భావించారు. అయినప్పటికీ హైకోర్టులో 'సిట్' దర్యాప్తుపై స్టే మంజూరైంది. అదీ చంద్రబాబు ప్రత్యేకత.

దుర్యోధనుడికి జలస్తంభన విద్య వచ్చట. ఆ విద్య వలన ఆయన నీటిలో ఎంతసేపైనా మునిగి ఉండగలడు. కురుక్షేత్ర యుద్ధంలో కౌరవులందరూ చనిపోయిన తర్వాత మిగిలిన ఒక్క దుర్యోధనుడు ఓ మడుగులో దూరి దాక్కుంటాడు. రణశేషం ఉండకూడదు కనుక పాండవులు మడుగు వద్దకు చేరుకొని తిట్ల దండకం అందుకుంటారు. అభిమానధనుడైన దుర్యోధనుడు ఆ తిట్లు భరించలేక బయటకొచ్చి యుద్ధం చేస్తాడు. ఆ జలస్తంభన విద్య లాంటి న్యాయస్తంభన (స్టే ఆర్డర్) విద్య చంద్రబాబుకు తెలుసునని అభిజ్ఞవర్గాలు బలంగా నమ్ముతాయి. ఈ విద్య తెలిసినందున ఆయన దాని మాటున ఎంతకాలమైనా దాక్కోగలరు. దుర్యోధనుడి మాదిరిగా అభిమానధనం, గోంగూర ధనం వంటి సెంటిమెంట్లేవీ ఆయనకు లేవు. అందువల్ల కేసును ఎదుర్కోవాలని ఎవరెంత కవ్వించినా ఆయన చలించరు. 'స్టే'షన్ మాస్టర్‌గానే ఉండిపోతారు. ఈవిధంగా ఇప్పటికి ఇరవై రెండు పర్యాయాలు ఆయనలాగే ఉండిపోయారు.

కానీ ఇన్నాళ్లకు ఇన్నేళ్లకు ఇప్పుడేదో తేడా కొట్టడంతో బాబు కలవరపడిపోతున్నారు. 'సిట్' దర్యాప్తుపై హైకోర్టు విధించిన స్టేను సుప్రీంకోర్టు ఎత్తివేయడమేమిటి? దర్యాప్తు జరిగితే..? కేంద్ర సంస్థలు కూడా రంగంలోకి దిగితే ఏం చేయాలి? ఇప్పుడెవరికి చెప్పుకోవాలి? మార్గదర్శి లాంటి తన గురువు పరిస్థితే బాగాలేదు. ఆయన మంచం దిగనంటున్నారు. ఆపన్న హస్తం కోసం ఆయనే ఎదురుచూస్తున్నారు. కృష్ణపరమాత్ముడు పరమపదించారన్న వార్త విన్నప్పటి అర్జునుడి పరిస్థితి బాబుగారిది. ''మన సారథి, మన సచివుడు, మన వియ్యము, మన సఖుండు, మన బాంధవుడున్, మన విభుడు, గురుడు, దేవర, మనలను దిగనాడి చనియె మనుజాధీశా!'' అని ధర్మరాజు ముందు అర్జునుడు మొరపెట్టుకున్నాడట! ఇప్పుడు తానెవరి ముందు మొరపెట్టుకోవాలి? అకాల వర్షాలు ఆయన కంటికి ఒక సంక్షోభంలా కనిపించాయి. అవకాశాలు వెతుక్కోవడానికి గోదావరి జిల్లాలకు బయల్దేరారు.

సుప్రీంకోర్టు స్టే తొలగించిన రోజు. మీడియా ముందు ఆయన మొరపెట్టుకున్నారు. దాంతోపాటు గర్జనలకూ, గాండ్రింపులకూ, బెదిరింపులకూ కూడా పాల్పడ్డారు. ఆయన ఆవేశానికి ఎదురుగా వున్నవారు మ్రాన్పడిపోయారు. గత ఎన్నికల్లో పవన్ కల్యాణ్ ప్రచారానికి సంబంధించి బాగా వైరలైన ఒక వీడియో చాలామందికి గుర్తుండే ఉంటుంది. అందులో పవన్ ఉన్నట్టుండి వీరావేశంతో చేసిన ఆంగిక వాచికాభినయాలకు పక్కనున్న కాకినాడ అభ్యర్థి జడుసుకుంటాడు. బిత్తరచూపులతో సదరు అభ్యర్థి ప్రదర్శించిన మూకాభినయం చార్లీ చాప్లిన్‌ను గుర్తుకు తెస్తుంది. మొన్నటి సమావేశంలో చంద్రబాబు ఎదురుగా ఉన్నవాళ్లలో కూడా పదిమందైనా చాప్లిన్లు ఉండి ఉంటారు.

ప్రజాస్వామ్య సంప్రదాయాలకు తిలోదకాలిస్తూ చంద్రబాబు బెదిరింపులకు దిగారు. బహుశా ఏ రాజకీయ నాయకుడూ తన ప్రత్యర్థిని ఉద్దేశించి ఇలాంటి బెదిరింపులు చేసి ఉండరు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని పరోక్షంగా ప్రస్తావిస్తూ ''అతనికి మిజరబుల్ ట్రీట్‌మెంట్ ఉంటుంది. చరిత్రలో ఏ నాయకుడికీ జరగని ట్రీట్‌మెంట్ ఇతనికి ఉంటుంది. అతిగా ప్రవర్తించే వారికి ఇలాంటి ఎండింగే ఉంటుంది. దానికి అతను సిద్ధంగా ఉండాలి. అతనే కాదు. అతని పార్టీ వాళ్లు కూడా ఇలాంటి ట్రీట్‌మెంట్‌కు రెడీ కావాలి'' – ఇదీ ఆయన బెదిరింపు. దీని తాత్పర్యమేమిటో ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ఆయనపై ఉన్నది. మిజరబుల్ ట్రీట్‌మెంట్ అంటే? ఏం చేస్తారు? నిస్పృహతో విసిరిన ఆఖరి బాణమా? ఏమైనా కుట్రనా? ఇది కోడ్ లాంగ్వేజా?... ఆయనే విడమర్చి చెప్పాలి.

ఈ పర్యటనలో బాబు ఉపయోగిస్తున్న అన్‌పార్లమెంటరీ భాషను ఇక్కడ ప్రస్తావించడం లేదు. జనం నవ్వుకునేలా గొప్పలు చెప్పుకోవడం గురించి కూడా ఒకే ఒక అంశాన్ని ప్రస్తావించుకుందాము. 'తమ్ముళ్లూ! నేనే గనుక అధికారంలో ఉంటే మీ ధాన్యం తడిసే ఉండేదా?' అని ప్రశ్నించారు. వెంటనే జనంలో ఓ గొంతు 'మీరుంటే అసలు వర్షం పడితేగా?' అని వినిపించింది. తనకు నచ్చని కామెంట్లను ఆయన పట్టించుకోరు. తన ధోరణి తనదే! 'సముద్ర తీరంలో నిలబడి తుపాన్లను కంట్రోల్ చేస్తున్నాను, తుపాకులతో వర్షం కురిపించాను'... వగైరా వ్యాఖ్యానాలు చేసిన మానసిక స్థితిలోంచే.. 'నేనుంటే మీ ధాన్యం తడిసేది కాద'న్న వ్యాఖ్యానం వెలువడి ఉంటుంది. జనానికి కొంత కాలక్షేపం.

ప్రజాస్వామ్య సంప్రదాయాలకు తిలోదకాలిస్తూ చంద్రబాబు బెదిరింపులకు దిగారు. బహుశా ఏ రాజకీయ నాయకుడూ తన ప్రత్యర్థిని ఉద్దేశించి ఇలాంటి బెదిరింపులు చేసి ఉండరు. ముఖ్యమంత్రి జగన్‌ని పరోక్షంగా ప్రస్తావిస్తూ "అతనికి మిజరబుల్ ట్రీట్‌మెంట్ ఉంటుంది. చరిత్రలో ఏ నాయకుడికీ జరగని ట్రీట్‌మెంట్ ఇతనికి ఉంటుంది. అతిగా ప్రవర్తించే వారికి ఇలాంటి ఎండింగే ఉంటుంది. దానికి అతను సిద్ధంగా ఉండాలి. అతనే కాదు. అతని పార్టీ వాళ్లు కూడా ఇలాంటి ట్రీట్ మెంట్‌కు రెడీ కావాలి" – ఇదీ ఆయన బెదిరింపు. దీని తాత్పర్యమేమిటో ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ఆయనపై ఉన్నది. మిజరబుల్ ట్రీట్‌మెంట్ అంటే? ఏం చేస్తారు? నిస్పృహతో విసిరిన ఆఖరి బాణమా? ఏమైనా కుట్రనా? ఇది కోడ్ లాంగ్వేజా? ఆయనే విడమర్చి చెప్పాలి.

ఈ పర్యటనలో బాబు ఉపయోగిస్తున్న అన్ పార్లమెంటరీ భాషను ఇక్కడ ప్రస్తావించడం లేదు. జనం నవ్వుకునేలా గొప్పలు చెప్పుకోవడం గురించి కూడా ఒకే ఒక అంశాన్ని ప్రస్తావించుకుందాము. 'తమ్ముళ్లూ! నేనే గనుక అధికారంలో ఉంటే మీ ధాన్యం తడిసే ఉండేదా?' అని ప్రశ్నించారు. వెంటనే జనంలో ఓ గొంతు 'మీరుంటే అసలు వర్షం పడితేగా?' అని వినిపించింది. తనకు నచ్చని కామెంట్లను ఆయన పట్టించుకోరు. తన ధోరణి తనదే!

బాబు అవినీతి దర్యాప్తుపై ఉన్న స్టేను సుప్రీంకోర్టు తొలగించిన తర్వాత ఆయన కూటమికి మరో పిడుగు లాంటి వార్త. రాజధాని ప్రాంతంలో కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన యాభైవేల మంది పేద ప్రజలకు సెంటు భూమి చొప్పున ఇళ్ల స్థలాల కోసం ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయానికి హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నిర్ణయాన్ని అడ్డుకోవడానికి రెండేళ్లుగా బాబు కూటమి చేయని ప్రయత్నం లేదు. పేదలకు అక్కడ ఇళ్ల స్థలాలిస్తే 'సామాజిక సమతౌల్యత' దెబ్బతింటుందని కోర్టుకు వెళ్లారు. అదొక గంభీరమైన పదం మాత్రమే! ఆ ముసుగు పదాన్ని తొలగిస్తే పేద ప్రజల పట్ల అదొక భయంకరమైన అస్పృశ్య భావన. తమ పక్కన పేదవారు నివసిస్తే మైలపడిపోతామనే పెత్తందారీతనపు కొవ్వెక్కిన అహంకారం. ఈ మనోవికారానికి ముసుగు కప్పి సాంకేతిక కారణాలు జోడిస్తూ చేసిన అభ్యంతరాలను ప్రభుత్వ న్యాయవాది బలంగా తిప్పికొట్టారు.

ఈ తీర్పు వచ్చిన రోజు కూడా చంద్రబాబువి ఆగ్రహావేశాలే! కొంత తటస్థంగా ఉండే మీడియాను కూడా ఈసారి బెదిరించారు. తాను కోరుకున్నట్లు ప్రసారాలు చేయని రెండు చానల్స్‌ను నిషేధిస్తానని బ్లాక్‌మెయిలింగ్‌కు దిగజారారు. ఆ రెండు చానల్స్‌ను పేరుపెట్టి మరీ హెచ్చరించారు. 'సాక్షి' సంగతి సరేసరి. దాన్ని ముందే నిషేధిస్తారట! మీడియా మొత్తం ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఏబీఎన్, టీవీ–5 మాదిరిగా ఉండాలి. లేదంటే తన ఆగ్రహానికి గురికాక తప్పదనే సందేశాన్ని ఆయన బహిరంగంగా పంపిస్తున్నారు. రాజకీయంగా చిట్టచివరి జారుడు మెట్టు మీదకు చేరుకోవడంతో ఆయన నిస్పృహ మాటల్లో స్పష్టంగా బయటపడుతున్నది.

పేదలకు ఇళ్లస్థలాలు రాజధానిలో ఇవ్వకూడదనీ, పేదలకు ఇళ్లు కట్టించి ఇస్తే ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందనీ, పేద పిల్లలకు ఇంగ్లిషు చదువులొద్దనీ, అవి తమ పిల్లలకు మాత్రమే పరిమితం కావాలనీ హుంకరిస్తున్న పెత్తందారీతనంపై సాధారణ ప్రజలు మండిపడుతున్నారు. తమ పిల్లలు కూడా పెద్దవారితో సమానంగా నాణ్యమైన చదువులు చదవాలనీ, వైద్యరంగం అభివృద్ధితో పెరుగుతున్న ఆయుఃప్రమాణాలు తమకూ వర్తించాలనీ, తమ శ్రమకు లాభదాయకమైన విలువ, గౌరవం లభించాలనీ పేద ప్రజలు కోరుకుంటున్నారు. బలహీనవర్గాలు, మహిళలు సాధికారతను కోరుకుంటున్నారు. సామాజిక, రాజకీయ రంగాల్లో తగిన వాటానూ, గౌరవప్రదమైన స్థానాన్నీ అభిలషిస్తున్నారు. ఇవన్నీ న్యాయమైన కోర్కెలు. రాజ్యాంగం ఇచ్చిన హామీలే. కానీ ఇన్నాళ్లు ఈ సామాజిక న్యాయం తమకు దక్కకుండా చేసిన పెత్తందారి తోడేళ్లెవరో జనం గుర్తించగలుగుతున్నారు. తమకు అండగా నిలబడుతున్నవాళ్లెవరో ప్రజలకు తేటతెల్లమవుతున్నది. రాజధానిలో పేద ప్రజలకు ఇళ్ల పట్టాల సమస్యే ఒక లిట్మస్ టెస్ట్. ఈ అంశాన్ని వ్యతిరేకిస్తున్న వాళ్లంతా పెత్తందారీ తొత్తులే! వాడు ఎర్రజెండా ముసుగేసుకున్నా సరే! ఎవరేమిటనే సంగతి జనానికి స్పష్టంగా తెలిసిపోయిందన్న ఉక్రోషమే 'బాబు అండ్ కో'లో బుసకొడుతున్నది. వచ్చే ఎన్నికల్లో పాత ఫలితాలే పునరావృతమయ్యే పరిస్థితి విస్పష్టంగా కనిపిస్తున్నది. అందుకే ఈ నిస్పృహ. అందుకే ఈ బెదిరింపులు.

vardhelli1959@gmail.com

ఇవా పెరోన్ బాటలో ఏపీ

దాతృత్వం పేదల నుంచి సంపన్నులను ఎడంగా ఉంచుతుంది. సహాయం పేద లను సంపన్నులతో సమస్థాయికి పెంచు తుంది.

– ఇవా పెరోన్, అర్జెంటీనా దివంగత ప్రథమ మహిళ

మే 7 ఇవా పెరోన్ జయంతి. తన జన్మభూమిలోనే కాక, ప్రపంచంలో ఆకలి, పేదరికం, అనారోగ్యం మానవాళిని పట్టి పీడిస్తున్న ప్రతి మూలలోనూ ఈనాటికీ ఆమె భావాలు ఆమెను కారణజన్మురాలిని చేస్తూనే ఉన్నాయి. జీవితపు కనీసావసరాలకు పరిష్కారం చూపే నాయకులు లేనప్పుడు భారీస్థాయిలో ఆర్థిక అసమానతలు ఏర్పడతాయని నమ్మినవారు ఇవా పెరోన్.

శ్రామిక వర్గాల గౌరవాన్ని పొందిన 'అర్జెంటీనా ఆధ్యాత్మిక నాయకురాలు'గా ఆమె ప్రసిద్ధి చెందారు. మానవీయమైన ఆర్థిక సమానత్వ సాధనకు అంకిత భావంతో పని చేసినందుకే ఆమెకు ఆ పేరు వచ్చి ఉంటుందని నా భావన. ఎందుకంటే అవసరంలో ఉన్న వారి తక్షణ కష్టాలను అర్థం చేసుకోడానికి మనలో ఆధ్యాత్మికమైన బాధ్యత ఉండాలి. అదొక రోజువారీ పనిలానో, వేషధారణలానో ఉండకూడదు. ఇవా దీనిని అర్థం చేసుకున్నారు. ఆచరణలో పెట్టారు.

భవిష్యత్ సంరక్షణ అనే ముసుగులో నాయకులుగా చలామణీ అవుతున్నవారు.. ఆసరాతో ఆర్థిక అసమానతలను తగ్గించేందుకు పాటుపడుతున్న నిజమైన నాయకులపై దుష్ప్రచారానికి ఒడిగట్టడం పేదల స్థితిగతులు ఏ మాత్రం మెరుగుపడకుండా అడ్డుకుంటుంది. అర్జెంటీనా అధ్యక్షుడు జువాన్ పెరోన్ సతీమణిగా ఇవా ఆ దేశంలోని ఉన్నత వర్గాలకు ప్రభుత్వ రాయితీలను తగ్గించడంలో కీలక పాత్ర పోషించారు. ఆమె తన సొంత 'ఇవా ఫౌండేషన్'తో వాలంటీర్ వ్యవస్థను ఏర్పరిచారు. వ్యాపార వర్గాలు సమకూర్చిన నిధులు, నేషనల్ లాటరీ, ఇతర నిధులలో గణనీయమైన కోతలతో మిగిలిన వనరులతో అర్జెంటీనా అంతటా ఆమె ఈ వాలంటీర్ వ్యవస్థతో వేలాది ఆసుపత్రులు, పాఠశాలలు; అనాథ, వృద్ధాశ్రమాలు, స్వచ్ఛంద సంస్థలను ప్రారంభించి ప్రజాసంక్షేమానికి తోడ్పడ్డారు. ఆ దేశంలో మహిళలకు ఓటు హక్కు చట్టం రూపుదాల్చడం ఇవా కృషి ఫలితమే. 1949లో ఆమె పెరొనిస్టా ఫెమినిస్టు పార్టీని స్థాపించారు.



ఇవా పెరోన్ : అర్జెంటీనాలో ఇవా స్మారకస్థలి వద్ద వ్యాస రచయిత్రి

ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే – ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, సహాయ పథకాలపై వినిపిస్తున్న కొన్ని ప్రతికూల అభిప్రాయాలు నా చెవిని సోకాయి. కానీ నిశితంగా పరిశీలించిన మీదట రాష్ట్రంలోని అట్టడుగు వర్గాల కోసం ఏపీ ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక తోడ్పాటు ఆదర్శవంతమైనదని నేను గ్రహించాను. ఆ సంకల్పబలం ఇవా పెరోన్‌ను తప్పక గుర్తు చేస్తుంది. రెండు ముఖ్యమైన పరిశీలనలతో నేనీ మాట అంటున్నాను. ఒకటి : ఏపీలో ప్రతి ఒక్క పేద వర్గం గత నాలుగేళ్లలో ఆర్థికంగా మెరుగు పడింది. రెండు: వ్యవస్థీకృత నిర్మాణం, ప్రక్రియల ద్వారా ఆర్థిక సహాయం పంపిణీ అవుతోంది. అది కూడా చాలా గౌరవప్రదంగా, అతి తక్కువ సమస్యలతో అత్యంత ప్రభావవంతంగా!

మరి అలాంటప్పుడు ఆర్థిక సహాయ పథకాలపై ఎందుకీ సణుగుడంతా?! ఎందుకంటే రాజకీయ ప్రయోజనాల కోసం విషయాన్ని వివాదాస్పదం చేయడానికే! ఎవరైనా నేలకు ఒక చెవిని ఆన్చితే రెండు స్పష్టమైన కథనాలు వినిపిస్తాయి. మొదటి కథనం.. సంతృప్తి చెందిన లబ్ధిదారుల గురించి, వారికి సరళంగా అందుతున్న సహాయం గురించి ఉంటుంది. రెండో కథనం మొదటి కథనానికి విరుద్ధంగా, నిందాపూర్వకంగా ఉంటుంది. హామీలను అమలు చేయడం కోసం ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించడాన్ని ప్రత్యర్థులు ఆర్థిక వ్యవస్థకు జరుగుతున్న చేటుగా ప్రచారం చేస్తున్నారు.

ఇటాంటి ప్రచారాలు ఏవీ కూడా... నిబద్ధత కలిగి, పేదల సంక్షేమానికి కట్టుబడి నిశ్చయంతో ముందుకు సాగుతూ ఉన్న నాయకుడిని ఏమీ చేయలేవు. పూర్వం తమ పాలనలో, తమ విధానాలతో పరిశ్రమలను తెచ్చామనీ, నేటి మౌలిక సదుపాయాలన్నీ ఆనాటి తమ చొరవ వల్లే రూపుదిద్దుకున్నాయనీ, అవన్నీ దీర్ఘకాలికమైన ప్రయోజనాలిచ్చేవనీ చెప్పుకునే నాయకులు ఇవాళ్టి గురించి పట్టించుకోరా? ఆకలితో ఉన్న పిల్లవాడికి ఆహారం ఇవ్వడానికి తల్లి ఈ రోజు పడుతున్న క్షోభను; వృద్ధులు, అశక్తులకు ఈరోజు అవసరమైన ఆసరాను, విద్యార్థి జీవితానికి విద్య ద్వారా ఈ రోజు ఏర్పరచవలసిన ధీమాను కేవలం భవిష్యత్ అవసరాల పెట్టుబడుల గురించి ఆలోచించే మనస్తత్వాలు గుర్తించలేవు. వర్తమానానికి, భవిష్యత్తుకు సమతుల్యత అవసరం. అదిప్పుడు కచ్చితంగా ఏపీలో ఉంది.

ఆర్థికాభివృద్ధి పథంలో జరుగుతున్న సహాయ పథకాలపై అబద్ధాలను ప్రచారం చేస్తూ, మంచిని తిరస్కరిస్తున్న ప్రత్యర్థి రాజనీతిజ్ఞులు పునరాలోచన చేయాలి. ఇవా పెరోన్ మాదిరిగా ప్రపంచంలో చిరస్మరణీయం అయేందుకు నిబద్ధతతో కూడిన నిజాయితీ, పట్టుదల అవసరం. ఇవా పెరోన్ తన 33వ ఏట మరణించారు. ఆమె జీవిత కాలం బహు స్వల్పమే అయినప్పటికీ ఆమె ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నిజమైన నాయకులకు ప్రేరణగా పనిచేస్తూనే ఉంటుంది.

– రాణీ రెడ్డి

పేరాశ దుఃఖహేతువు

పూర్వం ఒక ఊరిలో కామయ్య అని ఒక పిసినిగొట్టు ఉండేవాడు. ఒకసారి అతడి భార్యకు జబ్బు చేసింది. నీరసంతో మంచం పట్టిన ఆమెకు మందులతోపాటు బలం కోసం కొబ్బరిబోండాం నీళ్ళు తాగించాల్సి వచ్చింది. దగ్గరలో ఉన్న దుకాణానికి వెళ్ళి ధర అడిగాడు. రెండు అణాలన్నాడు దుకాణదారు. 'అబ్బో, రెండు అణాలా! అణాకు రాదా?' అని అడిగాడు కామయ్య. 'వస్తుంది, కానీ ఇక్కడ కాదు. పొరుగూరిలో' అని చెప్పాడు. 'సరే' అని పొరుగూరికి వెళ్ళాడు అక్కడి దుకాణంలో కొబ్బరిబోండాం 'వెల ఎంత?' అని అడిగాడు కామయ్య. 'అణాకి ఒకటి' చెప్పాడు దుకాణం మనిషి. 'అబ్బో, అణానే! అర్ధణాకు రాదా?' అడిగాడు కామయ్య. 'అర్ధణా ఎందుకు? ఊరికినే కూడా వస్తుంది. ఊరి పొలిమేరలో చెట్లున్నాయి. కావలసినన్ని కోసుకో' అని సమాధానం చెప్పాడు దుకాణం మనిషి.

జ్యోతిర్మయం

కామయ్యకు మహదానందం కలిగింది. గబగబా చెట్టెక్కాడు. చెట్టు మొవ్వలో గెలకున్న కాయలను లాగి కింద పడేసే క్రమంలో పట్టు తప్పి కింద పడ్డాడు. నడుముకు దెబ్బ తగిలింది. అలా పడివున్న కామయ్యను చుట్టుపక్కల పొలాల్లోని వాళ్ళు చూసి, సాయంపట్టి అటుగా వెళుతున్న ఎడ్లబండిలో పడుకోబెట్టి అతని ఊరు పంపించారు. అలా నడుముకు దెబ్బ తగిలించుకొని వచ్చి, జరిగిన విషయాన్ని భార్యకు చెప్పాడు 'ఇప్పుడు ఒకరికి ఇద్దరం మంచాల పాలయ్యాం. దిక్కెవరు దేవుడా!' అంటూ విలపించిందామె.

ఆ సమయంలో భిక్షాటనకు వచ్చిన ఓ సాధువు సంగతి తెలుసుకొని 'డబ్బు ఆదా చెయ్యాలని ఆశించడంలో తప్పు లేదు. ఆశ పేరాశగా మారితేనే ప్రమాదం. చెట్టు మీద నుంచి పడినా ఇంకా జీవించి ఉన్నందుకు దేవునికి కృతజ్ఞతలు చెప్పుకో' అంటూ హితోపదేశం చేశాడు కామయ్యకు.

– వెంకట్ భట్టు

పుల్వామా వాస్తవం బహిర్గతం చేయాలి

- బీజేపీ రాజకీయాలకు సైనికులు బలి: హరీశ్‌రావు



సిద్దిపేటజోన్: పుల్వామా ఘటన గుర్చి ఇంటి లిజెన్స్ ముందే హెచ్చరికలు చేసిందని, హెలికాప్టర్ ఇవ్వాలని నాటి జమ్మూ కశ్మీర్ రాష్ట్ర గవర్నర్ సత్యపాల్ మాలిక్ ముందస్తుగా ప్రధాని, కేంద్ర హోంమంత్రికి సూచనలు చేసినా, కేంద్రం విస్మరించడం వల్లే జవాన్లపై దాడి జరిగిందనే వాస్తవాలు ఒక్కొక్కటిగా బహిర్గతం అవుతున్నాయని మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. శనివారం రాత్రి సిద్దిపేట జిల్లా కేంద్రంలోని నియోజకవర్గ బీఆర్ఎస్ విద్యార్థి, ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పుల్వామా ఘటన మీద స్పందించవద్దని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా బీజేపీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ నోరు మెదపకుండా చేసిన చర్యల గురించి ప్రజలకు తెలపాల్సిన బాధ్యత విద్యార్థి నేతలు, కార్యకర్తలపైనే ఉందన్నారు. దేశభక్తి, ఆధ్యాత్మికం పేరిట బీజేపీ నేతలు అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, రాజకీయంగా సైనికులను బలి తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదానీపై విచారణ చేయాలని కోరితే స్పందన లేదన్నారు. కర్ణాటకలో బీజేపీ అత్యంత దయనీయస్థితిలో ఉందని, బజరంగ్ బలీ అంటూ ఓటు వేయాలని చెబుతూ మత ఘర్షణలకు రెచ్చగొడుతున్నారని ఆ పార్టీ తీరుపై మండిపడ్డారు.

పన్ను ఎగవేతపై ఉక్కుపాదం: వాణిజ్య పన్నుల శాఖ ఆదాయాన్ని పెంచుకునేందుకు పన్ను ఎగవేతదారులపై ఉక్కుపాదం మోపాలని ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆదేశించారు. వాణిజ్య పన్నుల శాఖ ఆదాయ వనరుల పెంపుపై హైదరాబాద్‌లోని గోల్కొండ రిసార్ట్‌లో శనివారం మేధోమథనం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ మాట్లాడుతూ గత ఏడాది లక్ష్యంగా పెట్టుకున్న రూ.72,564 కోట్ల పన్ను ఆదాయాన్ని వసూలు చేయడం ద్వారా రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ చరిత్ర సృష్టించిందని చెప్పారు. ఈసారి కూడా రూ.85,413 వసూళ్ల లక్ష్యాన్ని చేరుకోవాలని ఆయన కోరారు. గత ఏడాదిలో లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేసిన అధికారులను హరీశ్ అభినందించారు. సమావేశంలో సీఎస్ శాంతికుమారి, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ నీతూప్రసాద్ పాల్గొన్నారు.

రుణాలు చెల్లించలేదని రైతుల ఆస్తులు జప్తు

- ట్రాక్టర్లు, టీవీలు, బైక్‌లు సీజ్



ఓ రైతు ఇంట్లోంచి టీవీని తీసుకెళ్తున్న పీఏసీఎస్ సిబ్బంది

ధారూరు: రుణాలు చెల్లించడం లేదని పీఏసీఎస్ అధికారులు రైతుల ఇళ్లకు వెళ్లి ట్రాక్టర్లు, టీవీలు, బైక్‌లను సీజ్ చేశారు. వికారాబాద్ జిల్లా ధారూరు మండలం గురుదోట్ల గ్రామంలో ఓ రైతు ట్రాక్టర్, బైక్, నాగ్‌సాన్‌పల్లిలో ట్రాక్టర్, అంపల్లిలో రెండు టీవీలను అధికారులు సీజ్ చేసి పీఏసీఎస్ కార్యాలయానికి తరలించారు. మొండి బకాయిలు వసూలు చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి ఉన్నందున.. ఇలా చేయాల్సి వస్తోందని అధికారులు తెలిపారు. పంటలు పండక, అధిక వర్షాలకు పంటలు దెబ్బతినడంతో రుణాలు సకాలంలో కట్టలేకపోయామని రైతులు వాపోయారు. ఇంకాస్త గడువు ఇమ్మని కోరినా అధికారులు తమ వస్తువులు పట్టుకుపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

చెల్లిస్తారా? చావమంటారా?

- పెట్రోల్ సీసాలతో సర్పంచుల నిరసన



పెట్రోల్‌తో నిరసన తెలుపుతున్న సర్పంచులు

జగిత్యాల క్రైం: గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టి ఏళ్లు గడుస్తున్నా బిల్లులు మంజూరు చేయనందుకు నిరసనగా జగిత్యాల మండలానికి చెందిన పలువురు సర్పంచులు శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి పెట్రోల్ సీసాలతో హాజరయ్యారు. బిల్లులు మంజూరు చేస్తారా, లేక పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకోమంటారా.. అని ఆందోళన చేపట్టడంతో కాసేపు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కొందరు ఎంపీటీసీలు జోక్యం చేసుకుని సర్పంచులను సముదాయించారు. ఇన్‌చార్జి ఎంపీపీ తమను దూషించారని సర్పంచులు ఆందోళన తీవ్రతరం చేశారు. ఇన్‌చార్జి ఎంపీపీ క్షమాపణ చెప్పడంతో సర్పంచులు శాంతించారు.

15మంది సర్పంచ్‌లకు మావోయిస్టుల హెచ్చరిక

- అగ్రనేత గణపతి సొంత జిల్లాలో లేఖల కలకలం

సారంగాపూర్(జగిత్యాల): మావోయిస్టు పార్టీ అగ్రనేత ముప్పాల లక్ష్మణ్‌రావు ఉరఫ్ గణపతి సొంత జిల్లాలో ఒకేసారి 15మంది సర్పంచ్‌లకు ఆ పార్టీ పేరిట లేఖలు విడుదల కావడం కలకలం రేపింది. శుక్ర, శనివారాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు ఈ లేఖలు అందినట్లు తెలుస్తోంది. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని 15 గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో పాటు, ఎంపీపీ, తహసీల్దార్, ఎంపీడీవోలు, నర్సింహులపల్లె గ్రామంలోని మరో 12 మందికి మావోయిస్టు గోదావరి బెల్ట్ ఏరియా కమిటీ కార్యదర్శి మల్లికార్జున్ పేరిట లేఖలు అందాయి. అటవీ భూములు ఆక్రమిస్తూ, అక్రమంగా పట్టాలు జారీచేస్తున్నారని, ఇందుకోసం రూ.కోట్లు దండుకున్నారని లేఖల్లో ఆరోపించింది. గ్రామాల్లో నిర్వహించాల్సిన పంచాయితీలను పోలీసుస్టేషన్ల దాకా తీసుకెళ్తున్నారని ధ్వజమెత్తారు. నర్సింహులపల్లెలో అక్రమంగా నిర్మించిన ఓ దుకాణాన్ని కూల్చివేయాలని హెచ్చరించారు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న వారు తమ పద్ధతులు మార్చుకోకుంటే ప్రజాకోర్టులో శిక్షించాల్సి వస్తుందన్నారు. అయితే, ఒకేరోజు 15మంది సర్పంచ్‌లు, అధికారులు, గ్రామస్తులకు లేఖలు పోస్టు ద్వారా పంపించడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇవి మావోయిస్టులు జారీచేసినవా లేక, కావాలనే కొందరిలా చేశారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, బాధితులు ఎస్పీతోపాటు సీఐ, ఎస్సైలను ఆశ్రయించి తమ గోడు వెళ్లబోసుకున్నట్లు తెలిసింది. ఈ లేఖల విషయాన్ని ఎస్పీ భాస్కర్ తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఈవిషయంపై బీర్‌పూర్ ఎస్సై అజయ్‌ను వివరణ కోరగా పోలీస్ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో విచారణ జరుగుతోందని చెప్పారు.

వరంగల్ మావోయిస్టు నేతలపై కుట్రకేసు

- ఎఫ్ఐఆర్ దాఖలు చేసిన ఎన్ఐఏ అధికారులు
- గాజర్ల రవి, మోడెం బాలకృష్ణల వివరాలపై ఆరా

సాక్షిప్రతినిధి, వరంగల్: నిషేధిత సీపీఐ (మావోయిస్టు) పార్టీ అగ్రనేతలు గాజర్ల రవి అలియాస్ గణేశ్, మోడెం బాలకృష్ణల వివరాల కోసం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు శనివారం ఆరా తీశారు. నిషేధిత పార్టీ నేతలు అజ్ఞాత కార్యకలాపాలు, సిద్ధాంతాల విస్తరణ, పునరుద్ధరించడం కోసం ప్రచారం చేయడానికి ప్రజా సంఘాలను ఏర్పాటు చేసినట్లుగా ఎన్ఐఏ గుర్తించింది. జార్ఖండ్‌లోని మజ్దూరు సంఘటన్ సమితి (ఎంఎస్ఎస్), విస్తాపన్ వ్యతిరేకి జన్ వికాష్ ఆందోళన్ (వీవీఐవీఏ) కార్యకర్తలతో పాటు పలువురు మద్దతు కూడగట్టినట్లుగా గుర్తించింది. ఈ నేపథ్యంలో ఎనిమిది ప్రదేశాల్లో మావోయిస్టు పార్టీ అభిమానులు, మద్దతుదారుల ఇళ్లల్లో సోదాలు చేసిన ఎన్ఐఏ పలు కీలక ఆధారాలు సేకరించింది. తెలంగాణకు చెందిన మావోయిస్టు అగ్రనేతలు ముప్పాల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి, మల్లోజుల వేణుగోపాల్, కటకం సుదర్శన్, గాజర్ల రవి, మోడెం బాలకృష్ణలతో పాటు 11 మందిపై కేసు నమోదు చేసింది. మూడు నెలల కిందట హనుమకొండలో అనుబంధసంఘాల సభ్యులన్న అనుమానంతో ఈ సోదాలు చేసిన ఎన్ఐఏ..బిహార్, జార్ఖండ్ రాష్ట్రాలకు సంబంధించిన కేసుల్లో చేర్చడంతోపాటు మావోయిస్టు అగ్రనేతల వివరాలపై ఆరా తీయడం ఉమ్మడి వరంగల్‌లో చర్చనీయాంశంగా మారింది.



'అకాల' మొలకలు

యాసంగి సీజన్ ముగింపులో ఈ పంట సాగేమిటి?.. అనిపిస్తోంది కదూ. కానీ ఇది రైతు సాగు చేసిన పంట కాదు. పది రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో మొలకెత్తిన పంట ఇది. తాంసి మండలం పొన్నారి గ్రామానికి చెందిన ప్రశాంత్ రెడ్డి అనే రైతు తన చేనులో యాసంగి సీజన్‌లో శనగపంట సాగు చేశాడు. చేతికందిన పంటను ఈ జనవరి నెలలో హార్వెస్టర్ ద్వారా నూర్పిడి చేయించాడు. నూర్పిడి సమయంలో పంట చేల్లో పడిన శనగ గింజలు అకాల వర్షాలకు ఇలా మొలకెత్తడంతో అచ్చం పంట సాగు చేసినట్లు కనిపిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్.

తడిసిన ధాన్యం కొంటలేరు!

- క్షేత్రస్థాయిలో అమలుకాని ముఖ్యమంత్రి, పౌరసరఫరాల మంత్రి హామీలు
- 17 శాతంలోపు తేమ ఉంటేనే తీసుకుంటామని తేల్చిచెబుతున్న మిల్లర్లు



సాక్షి, హైదరాబాద్: అకాల వర్షాలతో తడిసి ముద్దయిన ధాన్యాన్ని సైతం మామూలు ధాన్యం ధరకే కొంటామని... రైతులు ఆందోళన చెందొద్దని సీఎం కేసీఆర్, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ హామీ ఇచ్చినా క్షేత్రస్థాయిలో రైతులకు పూర్తిస్థాయిలో భరోసా లభించట్లేదని తెలుస్తోంది. కొనుగోలు కేంద్రాలతోపాటు మిల్లర్లు తడిసిన ధాన్యాన్ని తీసుకోవడానికి సుముఖత చూపడం లేదు. తడిసిన ధాన్యాన్ని 17 శాతంలోపు తేమ ఉండేలా ఆరబెట్టి తీసుకొస్తేనే కాంటా వేస్తామని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తేల్చి చెబుతున్నారు. ఒకవేళ అటువంటి ధాన్యాన్ని ఎక్కడైనా సేకరించినా మిల్లర్లు మాత్రం ఆ ధాన్యాన్ని తీసుకొనేందుకు ససేమిరా అంటున్నారు.

నిబంధనల పేరుతో మిల్లర్లు ససేమిరా

తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టాక మిల్లింగ్ చేస్తే వచ్చే ముడి బియ్యం రంగు మారడమేగాక, నూకల శాతం ఎక్కువగా ఉంటుంది. అందుకే తడిసిన బియ్యాన్ని బాయిల్డ్ చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యంలోంచి తొలి విడతగా 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ కింద ఆయా జిల్లాలకు కేటాయించింది. మంత్రి గంగుల అధికారులు, మిల్లర్లతో సమావేశమై ఆదేశాలు జారీ చేశారు. అయితే బాయిల్డ్ రైస్ కింద కూడా తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని రైస్ మిల్లులు సేకరించడం లేదు. తడిసిన ధాన్యాన్ని కూడా 17 శాతంలోపు తేమ ఉండేలా ఆరబెట్టాకే పంపాలని చెబుతున్నారు. లేకపోతే ఎఫ్‌సీఐ ఆ బియ్యం తీసుకోదంటున్నారు.

11.72 ఎల్ఎంటీ మాత్రమే కొనుగోలు

రాష్ట్రంలో ఇప్పటివరకు 5,716 కొనుగోలు కేంద్రాలను తెరవగా తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడం, ఆరబెట్టిన ధాన్యం మళ్లీ తడవడం వంటి పరిణామాల నేపథ్యంలో కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటివరకు 1.58 లక్షల మంది రైతుల నుంచి కేవలం 11.72 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్నే కొనుగోలు చేశారు. అకాల వర్షాల నేపథ్యంలో పౌరసరఫరాల సంస్థ ఈ యాసంగిలో కొనుగోలు అంచనాను 1.02 కోట్ల మెట్రిక్ టన్నుల నుంచి 80.46 లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గించగా అంత మొత్తంలో ధాన్యం సేకరించడం కూడా అనుమానమేనని అధికారులు చెబుతున్నారు.

అన్నిచోట్లా అదే తీరు

ఖమ్మం జిల్లా వైరా మండలంలోని దాచాపురం గ్రామానికి చెందిన కొందరు రైతులు గత నెల 30న ధాన్యాన్ని గరికపాడు సొసైటీ పరిధిలోని కొనుగోలు కేంద్రంలో 738 బస్తాలను విక్రయించారు. నిర్వాహకులు ఈ ధాన్యాన్ని ఈ నెల ఒకటిన నేరెడలోని ఓ రైస్‌మిల్లుకు పంపగా ధాన్యం తడిచిందనే సాకుతో 3 రోజుల తరువాత ఆ బస్తాలను వెనక్కు పంపారు. రైతులు గొడవకు దిగడంతో ఆరబెట్టి తీసుకురావాలన్నాడు. కామారెడ్డి జిల్లా భిక్నూర్ మండలం పెద్ద మల్లారెడ్డి గ్రామంలో ఓ రైస్‌మిల్లు తనిఖీకి వెళ్లిన ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అక్కడ జరుగుతున్న జాప్యాన్ని తప్పుబట్టారు.

సైనిక లాంఛనాలతో జవాన్ అనిల్ అంత్యక్రియలు



భర్త మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య సౌజన్య



తండ్రి అనిల్ కాడె మోస్తున్న కొడుకు అయాన్

- హాజరైన మంత్రి గంగుల, ఎంపీ సంజయ్, వినోద్‌కుమార్
- పాల్గొన్న ఆర్మీ ఉన్నతాధికారులు, కలెక్టర్, ఎస్పీ

బోయినపల్లి(చొప్పదండి): జమ్మూకశ్మీర్‌లో హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయిన జవాన్ పబ్బాల అనిల్ అంత్యక్రియలు స్వగ్రామమైన మల్కాపూర్‌లో సైనిక లాంఛనాలతో శనివారం పూర్తయ్యాయి. అనిల్ మృతదేహాన్ని కరీంనగర్ జిల్లా గంగాధర నుంచి ఆర్మీ వాహనంలో ఊరేగింపుగా ఇంటికి తీసుకొచ్చారు. అనిల్ భౌతిక కాయాన్ని చూసిన తల్లి లక్ష్మి, భార్య సౌజన్య, కుమారులు అయాన్, అరయ్‌లు కన్నీరు మున్నీరయ్యారు. సైనిక వందనం అనంతరం అనిల్‌కు ఆర్మీ అధికారులు మేజర్ పరష్, స్క్రామట్ నివాళులర్పించారు. మంత్రి గంగుల కమలాకర్, ఎంపీ బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఏఎస్పీ చంద్రయ్య, రాష్ట్ర నాయకులు జోగినపల్లి రవీందర్‌రావు నివాళులర్పించారు. అంతిమయాత్రలో 'జై జవాన్, అనిల్ అమర్ రహే'అంటూ జాతీయ జెండాలు చేబూనిన యువకుల నినాదాలతో ఆ ప్రాంతం మారుమోగింది. సైనికులు చివరిసారి వందన సమర్పణ చేసి, గాల్లోకి కాల్పులు జరిపారు. పెద్ద కుమారుడు అయాన్ తండ్రి చితికి నిప్పంటించాడు. కార్యక్రమంలో హైదరాబాద్ గోల్కొండ ఆర్మీ సెంటర్ అధికారులు, పలువురు సైనికులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లు గుమాస్తాపై చేయిచేసుకున్న ప్రభుత్వ విప్

- ధాన్యం దించుకోకుండా పొంతనలేని జవాబులు చెప్పాడని గంప గోవర్ధన్ ఆగ్రహం
- జిల్లావ్యాప్తంగా మిల్లర్ల నిరసన



గుమాస్తాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

సాక్షి, కామారెడ్డి/భిక్కనూరు: తేమ పేరుతో ధాన్యం బస్తాలు దించుకోని రైస్‌మిల్లు గుమాస్తాపై ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ చేయి చేసుకోవడం వివాదాస్పదమైంది. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామ శివారులోని పూర్ణిమ రైస్ మిల్లుకు రైతులు ట్రాక్టర్లపై ధాన్యం శుక్రవారం తీసుకెళ్లారు. అక్కడి గుమాస్తా ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉందంటూ బస్తాలను దించుకోలేదు. దీంతో రైతులు పెద్దమల్లారెడ్డి పర్యటనలో ఉన్న గంప గోవర్ధన్ దృష్టికి ఫోన్లో తీసుకెళ్లారు. ఆయన వెంటనే అధికారులతో కలసి రైస్ మిల్లు వద్దకు చేరుకున్నారు. ధాన్యం ఎందుకు తీసుకోలేదని మిల్లు యజమానిని అడగ్గా తాను ఆ సమయంలో లేనని చెప్పాడు. దీంతో గుమాస్తాను ప్రశ్నించగా ధాన్యంలో తేమ 18–20 శాతం వరకు ఉందని ఓసారి, 16 శాతం వచ్చిందని మరోసారి చెప్పాడు. దీంతో ఆగ్రహించిన గోవర్ధన్ గుమాస్తా చెంప చెళ్లుమనిపించాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియా వైరల్ కావడంతో శనివారం ఉదయం నుంచి జిల్లాలోని రైస్ మిల్లర్లు అన్‌లోడింగ్ నిలిపివేశారు. అయితే జిల్లా కలెక్టర్ జితేశ్ వి. పాటిల్ శనివారం మధ్యాహ్నం వారితో సమావేశమై రైతులను ఇబ్బంది పెట్టొద్దని సూచించడంతో సాయంత్రం 4 గంటల నుంచి తిరిగి అన్‌లోడింగ్ మొదలుపెట్టారు. ఈ ఉదంతంపై గంప గోవర్ధన్ స్పందిస్తూ తేమ శాతం ఎంత వచ్చిందని ప్రశ్నిస్తే పొంతనలేని సమాధానం చెప్పడంతోపాటు మిస్‌గైడ్ చేయడంతోనే గుమాస్తాపై కోపగించానన్నారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బంది పడుతుంటే కొర్రీలు పెట్టడం సరికాదని హెచ్చరించారు.

రైతుల ఘోష వినపడదా?



కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న శ్రీనివాసరెడ్డి, నాయకులు, రైతులు

- ధాన్యం, మక్క రైతుల బాధలు చూస్తూ నిద్రపోతున్న పాలకులు
- రైతు భరోసా ర్యాలీలో మాజీ ఎంపీ పొంగులేటి ధ్వజం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ధాన్యం, మొక్కజొన్న రైతుల కళ్లల్లోని ఆనందం ప్రభుత్వ నిర్వాకంతో ఆవిరై పోయిందని, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రైతుల ఘోష వినపడకపోవడం బాధాకరమని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయాలనే డిమాండ్‌తో ఖమ్మంలో శనివారం రైతుభరోసా ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు వినతిపత్రాన్ని కలెక్టర్ వీపీ గౌతమ్‌కు అందజేశారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 80 లక్షల టన్నుల ధాన్యం, సుమారు 32 లక్షల టన్నుల మక్కలు పండితే ఇప్పటివరకు 10 లక్షల టన్నుల ధాన్యమే కొనుగోలు చేశారన్నారు. మొక్కజొన్నను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామని చెప్పినా ఆచరణకు నోచుకోలేదని ఆరోపించారు. వర్షానికి పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇస్తామని ప్రకటించిన సీఎం కేసీఆర్ హామీ నెరవేరలేదన్నారు.

పొంగులేటి పోరుబాట

మాజీ ఎంపీ పొంగులేటి రాజకీయంగా దూకుడు పెంచారు. ఇకపై ప్రతీ సోమవారం ప్రజాసమస్యలపై ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాయాలని కూడా పొంగులేటి నిర్ణయించి, తొలిలేఖ వచ్చే సోమవారం రాయనున్నారు. ఈ నెల 14న ఖమ్మం నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనాన్ని భారీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. తర్వాత ఉమ్మడి జిల్లాలో పొంగులేటి పాదయాత్రకు కార్యాచరణ రూపొందించు కుంటున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో మాజీమంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి పలు మండలాల్లో పాదయాత్ర చేస్తారని తెలిసింది. కాగా, నల్లగొండ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ మాజీనేత చకిలం అనిల్‌కుమార్ పొంగులేటితో రెండు గంటలపాటు భేటీ అయ్యారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలకు చెందిన నేతలు కూడా ఆయనను కలిసిన వారిలో ఉన్నారు.

ఎటు చూసినా పచ్చదనమే

- రాష్ట్ర పర్యటనలో కర్ణాటక అదనపు చీఫ్ సెక్రటరీ జావేద్ అక్తర్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం చేపట్టిన హరితహారం ఫలితాలు రాష్ట్రవ్యాప్తంగా కనిపిస్తున్నాయని, తాను పర్యటించిన ప్రాంతాల్లో ఎటు చూసినా పచ్చదనమే కనిపించిందని కర్ణాటక అటవీ శాఖ అదనపు చీఫ్ సెక్రటరీ జావేద్ అక్తర్ చెప్పారు. తమ ప్రభుత్వం కూడా పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం పెంపునకు ప్రణాళికలు రూపొందిస్తోందని, ఆ అధ్యయనం కోసమే తెలంగాణలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. రెండ్రోజుల పర్యటనలో భాగంగా హరితహారం, పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం పెంపుపై అధ్యయనం చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లాల్లోని నర్సరీలు, పార్కులు, ఓఆర్ఆర్ వెంట పచ్చదనం, హైదరాబాద్‌లో రహదారి వనాలు, మీడియన్ ప్లాంటేషన్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పచ్చదనం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు బాగున్నాయని ప్రశంసించారు. సీఎం ఓఎస్డీ (హరితహారం) ప్రియాంక వర్గీస్ హరితహారం గురించి వివరించారు. అనంతరం అరణ్యభవన్‌లో పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్, పీసీసీఎఫ్ లోకేశ్ జైశ్వాల్(కంపా), పీసీసీఎఫ్ ఏలూసింగ్ మేరు (విజిలెన్స్)తో జావేద్ సమావేశమయ్యారు.

క్లుప్తంగా

బైడెన్ ప్రభుత్వంలో మరో భారతీయురాలు

ప్రభుత్వ విధానాల సలహాదారుగా నీరా టాండన్ నియామకం



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఇండియన్ అమెరికన్‌కు మరోసారి తన ప్రభుత్వంలో కీలక బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వ విధానాల్లో నిపుణురాలైన భారత సంతతికి చెందిన నీరా టాండన్‌ను తన దగ్గర దేశీయ విధాన సలహాదారుగా నియమించారు. బైడెన్ ప్రభుత్వ విధానాలు రచించడం, వాటిని అమలు పరిచే బాధ్యతల్ని ఆమెకు అప్పగించారు. శ్వేత సౌధం విధాన మండలిలో ఒక ఆసియన్ అమెరికన్‌కు చోటు లభించడం అమెరికా చరిత్రలో ఇదే మొదటి సారి. ''ఆర్థిక విధానాల దగ్గర్నుంచి జాతి సమానత్వం వరకు ప్రభుత్వానికి సంబంధించిన అత్యంత కీలకమైన ఆరోగ్యం, విద్య, వలస విధానాలను రూపొందించడం, వాటిని పక్కాగా అమలు జరిగేలా చూడడానికి టాండన్‌ను డొమెస్టిక్ పాలసీ అడ్వైజర్‌గా నియమిస్తున్నాను'' అని బైడెన్ ప్రకటించారు. టాండన్ ప్రస్తుతం అధ్యక్షుడికి సీనియర్ సలహాదారుగా ఉన్నారు. గతంలో ఒబామా, క్లింటన్ ప్రభుత్వాల్లో కూడా ఆమె పని చేశారు.

ఎయిరిండియా విమానంలో ప్రయాణికురాలిని తేలు కుట్టింది!

న్యూఢిల్లీ: ఎయిరిండియా విమానంలో అరుదైన ఘటన చోటుచేసుకుంది. ఓ ప్రయాణికురాలిని తేలు కుట్టింది. గత నెల 23వ తేదీన నాగ్‌పూర్–ముంబై విమానంలో ఈ దురదృష్టకర ఘటన జరిగినట్లు తాజాగా ఎయిరిండియా తెలిపింది. విమానం ల్యాండయిన వెంటనే బాధిత ప్రయాణికురాలిని ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయించినట్లు తెలిపింది. ఆమె అనంతరం డిశ్చార్జి అయ్యారని పేర్కొంది. సదరు విమానంలో పూర్తి స్థాయి తనిఖీలు జరిపి, ఒక తేలును పట్టుకున్నారు. క్షుణ్నంగా పరిశీలించాకే విమానంలోకి వస్తు, సామగ్రిని తీసుకురావాలని క్యాటరింగ్ విభాగాన్ని ఆదేశించినట్లు తెలిపింది. గత ఏడాది డిసెంబర్‌లో కాలికట్ నుంచి బయలుదేరి దుబాయ్ ఎయిర్‌పోర్టులో ల్యాండయిన ఎయిరిండియా కార్గో విమానంలో పాము కనిపించింది.

స్మార్ట్‌గా ఫోబియా

- నలుగురు భారతీయుల్లో ముగ్గురికి నోమో ఫోబియా
- ఫోన్ లేకుండా క్షణం కూడా ఉండలేని వారు 75%

న్యూఢిల్లీ: స్మార్ట్ ఫోనే మీ ప్రపంచమా ? అది లేకుండా ఒక్క క్షణం కూడా ఉండలేకపోతున్నారా ? ఫోన్ కనిపించకపోయినా, బ్యాటరీ అయిపోయినా వెంటనే మీలో టెన్షన్ పెరిగిపోతోందా ? అయితే మీరు ఒక రకమైన ఫోబియాతో బాధపడుతున్నట్టు లెక్క. మీరు ఒక్కరే కాదు భారత్‌లో స్మార్ట్ ఫోన్ వాడుతున్నవారిలో 75 శాతం మందికి ఇదే ఫోబియా పట్టుకుందని ఒప్పొ, కౌంటర్‌పాయింట్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఈ ఫోబియాని నోమో ఫోబియా అని పిలుస్తారు. అంటే నో మొబైల్ ఫోబియా అని అర్థం . స్మార్ట్ ఫోన్ పని చేయకపోయినా, సిగ్నల్స్ లేకపోయినా, కనిపించకపోయినా, బ్యాటరీ అయిపోయినా విపరీతమైన ఆందోళనకి గురికావడం, ఏదో కోల్పోయినట్టుగా ఉండడం, నిస్సహాయంగా మారిపోవడం, అభద్రతా భావానికి లోనవడం వంటివి దీని లక్షణాలు. భారతీయులు ప్రతీ నలుగురిలో ముగ్గురికి ఈ ఫోబియా ఉందని ఆ అధ్యయనం తేల్చింది. దేశంలోని టైర్ 1, టైర్ 2 నగరాల్లో 1,500 మంది స్మార్ట్ ఫోన్ వినియోగదారులపై ఒప్పొ ఈ అధ్యయనం నిర్వహించింది. బ్యాటరీ లైఫ్ కోసం స్మార్ట్ ఫోన్లని మార్చే వారు చాలా మంది ఉన్నారని, ఒకరకంగా ఈ సర్వే తమ ఉత్పత్తులకి కూడా కీలకంగా మారిందని ఒప్పొ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ దమయంత్ సింగ్ ఖనోరియా చెప్పారు.





- బ్యాటరీ సరిగా పనిచేయడం లేదని 60% మంది ఏకంగా తమ స్మార్ట్ ఫోన్లు మార్చుకున్నారు
- ఫోన్ దగ్గర లేకపోతే మహిళల్లో 74 శాతం మంది ఆందోళనకు లోనవుతారు. పురుషులు మరింత అధికంగా 82% మంది ఒత్తిడికి లోనవుతారు
- బ్యాటరీ ఎక్కడ అయిపోతుందోనని 92% మంది వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. పవర్ సేవింగ్ మోడ్‌ని వినియోగిస్తున్నారు
- చార్జింగ్‌లో ఉండగా కూడా ఫోన్ వాడే వారు 87% మంది ఉన్నారు
- వినోద కార్యక్రమాలు చూడడానికే 42% స్మార్ట్ ఫోన్‌లను వినియోగిస్తున్నారు. అందులో సోషల్ మీడియాదే అగ్రస్థానం.
- స్మార్ట్ ఫోన్ మన జీవితాలు మార్చేసిందనడంలో ఎలాంటి సందేహం లేకపోయినప్పటికీ దాని వల్ల ఏర్పడుతున్న దుష్ప్రభావాల నుంచి బయట పడడానికి అందరూ ప్రయత్నించాలని నిపుణులు సూచిస్తున్నారు.

కన్నడ పోరు

బీజేపీ కోటలో కాంగ్రెస్ పాగా వేసేనా?

కరావళి కర్ణాటకలో హోరాహోరీ పోరు | కుల, మత రాజకీయాలే అధికం | హిజాబ్, హలాల్ అంశాలే కీలకం





సాక్షి బెంగళూరు: ఎంతో వైవిధ్యం, సాంస్కృతిక, సామాజిక, వారసత్వ సంపద కలిగిన ప్రాంతం కరావళి కర్ణాటక. సుదీర్ఘ తీరప్రాంతం, అటవీ భూభాగం కలిగిన ఈ ప్రాంతాన్ని బీజేపీ తన అడ్డాగా మార్చుకుంది. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతంలో బీజేపీ ఆధిక్యతను ప్రదర్శిస్తోంది. కరావళి కర్ణాటక పరిధిలోకి వచ్చే దక్షిణ కన్నడ, ఉడుపి జిల్లాల్లో గత ఎన్నికల్లో బీజేపీ తిరుగులేని పార్టీగా అవతరించింది. గతంలో ఉత్తర కన్నడ జిల్లా కరావళి కర్ణాటక పరిధిలో ఉన్నప్పటికీ ఆ తర్వాత దాన్ని కిత్తూరు కర్ణాటకలో కలిపేశారు. అలాగే కొడుగు జిల్లా దక్షిణ కర్ణాటక ప్రాంతంలో కలిసిపోయింది. ప్రస్తుతం ఉడుపి, దక్షిణ కన్నడ జిల్లాలను కరావళి కర్ణాటకగా పిలుస్తున్నారు. ఈ ప్రాంతంలో నియోజకవర్గాల అభివృద్ధి కంటే వ్యక్తిగత కీర్తి, కుల ఆధారిత రాజకీయాలు కీలకంగా ఉన్నాయి. ఈ రెండు జిల్లాల్లో మొత్తం 13 నియోజకవర్గాలు ఉన్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ 13 స్థానాల్లో బీజేపీ 12 చోట్ల గెలుపొందింది. బీజేపీకి కంచుకోటలో పాగా వేయాలని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోంది. జేడీఎస్ ఈ ప్రాంతంలో ఖాతా కూడా తెరవలేకపోయింది.

హిజాబ్ ప్రభావం చూపిస్తుందా?

కుల, మత ప్రాతిపదికన అంశాలు ఇక్కడ రాజకీయాలను శాసిస్తున్నాయి. హిజాబ్, హలాల్ వివాదాలు ఈ ఎన్నికలను ప్రభావితం చేసే అవకాశం ఉంది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే కరావళి కర్ణాటకలో అత్యధికంగా ఆరుగురు సీనియర్ సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఈసారి బీజేపీ టికెట్ ఇవ్వలేదు. కోస్తా కర్ణాటకలో పార్టీ బలాన్ని చూసుకుని టికెట్ల పంపిణీలో సాహసోపేత నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాంతంలో సరస్వత్ బ్రాహ్మిణ్‌లు, మత్స్యకార సామాజికవర్గం మొగవీరలు ఎక్కువగా ఉన్నారు. వీరంతా ప్రస్తుతం బీజేపీకే మద్దతుగా నిలుస్తున్నారు. ఈ ప్రాంతంలోని ఉడుపి జిల్లా కార్కళ నియోజకవర్గం నుంచి శ్రీరామ సేన అధ్యక్షుడు ప్రమోద్ ముతాలిక్ ఈ సారి ప్రత్యక్ష ఎన్నికల్లో నిలవడం గమనార్హం. దీంతో కార్కళలో హిందూ సామాజికవర్గ ఓట్లు బీజేపీకి, ముతాలిక్ మధ్య చీలిక తెచ్చే అవకాశం ఉంది. విద్యా సంస్థల్లో హిజాబ్ నిషేధం, హలాల్ మాంసం నిషేధించి జట్కా మాంసంపై బీజేపీ ప్రచారం చేస్తుండడంతో ముస్లింలలో ఆగ్రహం పెరిగిపోతోంది. ఈ ప్రాంతంలో బలంగా ఉన్న పీఎఫ్ఐ సంస్థను నిషేధించడంతో ఆ ప్రతినిధులు బీజేపీ సర్కారుకు వ్యతిరేకంగా పని చేస్తున్నారు. మరోవైపు పోటాపోటీ హత్యలు, హింసాత్మక ప్రేరేపణలు, దాడుల నేపథ్యంలో కూడా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొన్ని వర్గాలు ప్రచారం చేస్తున్నాయి. ఇవన్నీ తనకు అనుకూలంగా మార్చుకోవడానికి కాంగ్రెస్ పన్నుతున్న వ్యూహాలు ఫలిస్తాయో లేదో వేచి చూడాలి.

2 ఫ్లాట్స్, 80 ఏళ్లు

- ఎట్టకేలకు ఫలించిన పోరాటం
- 93 ఏళ్ల బామ్మకు ఆమె ఆస్తి అప్పగించాలని బాంబే హైకోర్టు ఆదేశం



ముంబై: బ్రిటన్ పాలకుల నాటి ఒక ఆస్తి వివాదం ఎట్టకేలకు బాంబే హైకోర్టులో పరిష్కారమైంది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 80 ఏళ్ల పాటు బాధిత కుటుంబం చేసిన పోరాటం ఫలించింది. 93 ఏళ్ల వృద్ధురాలికి వారసత్వంగా వచ్చే ఆస్తిని అప్పగించాలంటూ మహారాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దక్షిణ ముంబైలోని రుబీ మాన్షన్ భవనంలో ఉన్న రెండు ఫ్లాట్స్ (ఒకటి 500 చదరపు అడుగులు, మరొకటి 600 చదరపు అడుగులు) 93 ఏళ్ల బామ్మ అలిస్ డిసౌజాకు అప్పగించాలంటూ జస్టిస్ ఆర్ డి ధనూకా, ఎం ఎం సతాయేలతో కూడిన హైకోర్టు బెంచ్ ఆదేశాలు జారీ చేసింది.

అసలేం జరిగిందంటే..?

దక్షిణ ముంబైలోని రుబీ మాన్షన్ భవనాన్ని 1942 మార్చి 28న నాటి బ్రిటన్ పాలకులు ప్రైవేటు ఆస్తుల్ని స్వాధీనం చేసుకునే హక్కుని కల్పించే ఆ నాటి డిఫెన్స్ ఆఫ్ ఇండియా చట్టం కింద స్వాధీనం చేసుకున్నారు. దీంతో డిసౌజా తండ్రి మొదటి అంతస్తులో తనకున్న రెండు ఫ్లాట్స్‌ను కోల్పోయారు. సివిల్ సర్వీసెస్‌లో పని చేసే డి.ఎస్. లాడ్ అనే ప్రభుత్వ అధికారికి తెల్లదొరలు ఆ ఫ్లాట్స్ కేటాయించారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత 1946 జులైలో ప్రైవేటు ఆస్తుల్ని స్వాధీనం చేసుకునే ఆదేశాలను భారత ప్రభుత్వం ఎత్తివేసింది. రుబీ మాన్షన్‌లో ఉన్న ఫ్లాట్‌లను ఆయా యజమానులకు అప్పగించే ప్రక్రియ చేపట్టింది. అప్పటికే డిసౌజాకు చెందిన ఫ్లాట్‌లో నివాసం ఉంటున్న లాడ్ కుటుంబం దానిని ఖాళీ చేయలేదు. డిసౌజా తండ్రి కలెక్టర్‌ని అభ్యర్థించినా ప్రయోజనం లేకుండా పోయింది. అప్పుడు మొదలైన వివాదం ఆ తర్వాత పిల్లల మధ్య కూడా కొనసాగింది. 2010లో కంట్రోలర్ ఆఫ్ అకామడేషన్ ఆ ఫ్లాట్స్‌లో ఉంటున్న లాడ్ కుమారుడు, కుమార్తెల్ని వెంటనే ఖాళీ చేయాలని ఆదేశించారు. అయినా వాటిని ఖాళీ చేయకుండా లాడ్ పిల్లలు 2012లో హైకోర్టుని ఆశ్రయించారు. ఆ ఫ్లాట్స్‌ను వెంటనే యజమాని డిసౌజాకు అప్పగించాలని హైకోర్టు కూడా ఆదేశించింది. అయినా ఆ తీర్పుని వారు లెక్కచేయలేదు. మళ్లీ డిసౌజా కోర్టుకెక్కితే ఆ ఫ్లాట్స్ ఖాళీ చేయించి ఇచ్చే బాధ్యతని మహారాష్ట్ర ప్రభుత్వానికి అప్పగిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

టీటీఈలకు బాడీ కెమెరాలు

ముంబైలో పైలట్ ప్రాజెక్టు

న్యూఢిల్లీ: టికెట్ల తనిఖీలో పారదర్శకత, రైలు ప్రయాణికుల అనుచిత ప్రవర్తనను అరికట్టేందుకు టికెట్ తనిఖీ అధికారుల(టీటీఈ)లకు బాడీ కెమెరాలు అమర్చేందుకు రైల్వే శాఖ నిర్ణయించింది. పైలట్ ప్రాజెక్టులో భాగంగా సెంట్రల్ రైల్వే పరిధిలోని ముంబై డివిజన్‌కు చెందిన 50 మంది టీటీలకు బాడీ కెమెరాలను సిద్ధం చేసింది. ఒక్కో కెమెరా ఖరీదు రూ.9 వేలు. ఇవి 20 గంటల ఫుటేజీని రికార్డు చేయగలుగుతాయి. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే దేశమంతటా అమలు చేస్తామని అధికారులు తెలిపారు. ఇటీవల సెంట్రల్ రైల్వేలో ఓ టీటీఈ మహిళా ప్రయాణికురాలి పట్ల అనుచితంగా ప్రవర్తించడంతో అధికారులు సస్పెండ్ చేశారు. ఇటువంటి ఘటనలను నివారించి, సిబ్బందిలో బాధ్యత పెంచేందుకు కూడా ఇవి సాయపడతాయని సెంట్రల్ రైల్వే పేర్కొంది.

'గరీబీ హఠావో' అతిపెద్ద కుంభకోణం

కాంగ్రెస్ హామీలపై ప్రధాని మోదీ నిప్పులు • బెంగళూరు నగరంలో భారీ రోడ్ షో



బెంగళూరులో రోడ్‌షోలో ప్రజలకు మోదీ అభివాదం

శివాజీనగర: కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న హామీలపై అప్రమత్తంగా ఉండాలని ప్రధాని మోదీ ప్రజలను హెచ్చరించారు. శనివారం కర్ణాటకలోని బెంగళూరు, బాగల్‌కోటె, బాదామిల్లో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మాట్లాడారు. 50 ఏళ్ల క్రితం కాంగ్రెస్ ఇచ్చిన గరీబీ హఠావో హామీ చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణమని పేర్కొన్నారు. ఈ ఒక్క పథకంతోనే కాంగ్రెస్ దేశవ్యాప్త ఎన్నికల్లో ప్రచారం చేసింది. ఈ కుంభకోణం నేటికీ కొనసాగుతూనే ఉందన్నారు. 'కాంగ్రెస్ అబద్ధాలు, వేధింపులపై కర్ణాటకలోని అన్ని వర్గాల ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. కాంగ్రెస్ నిషేధ విధానాలు, బుజ్జగింపు రాజకీయాలు అందరికీ తెలిసిపోయాయి. బీజేపీ ఉప్పెనలో కాంగ్రెస్ అబద్ధాలన్నీ కొట్టుకుపోతాయి. భారీ మెజారిటీతో బీజేపీకే మళ్లీ పట్టం కట్టాలని ప్రజలు నిశ్చయానికి వచ్చారు. లభిస్తున్న భారీ స్పందనను చూస్తే.. కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున పోరాడుతున్నది ప్రజలే అని నాకు నమ్మకం కలుగుతోంది'అని ప్రధాని అన్నారు. బీజేపీ హయాంలో బీఎస్ యడియూరప్ప, ప్రస్తుతం సీఎం బొమ్మైల డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు తక్కువ కాలమే అయినా రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధించిందని తెలిపారు. ప్రధాని మోదీ అంతకుముందు బెంగళూరు నగరంలో భారీ రోడ్‌షోలో పాల్గొన్నారు. రోడ్డుకు రెండు వైపులా నిలబడిన ప్రజలకు చేతులు ఊపుతూ ఆయన ముందుకు కదిలారు. దక్షిణ బెంగళూరులోని సోమేశ్వర్ భవన్ ఆర్‌బీఐ గ్రౌండ్ నుంచి మల్లేశ్వరంలోని సాంకే ట్యాంక్ వరకు 26 కిలోమీటర్ల మేర, 17 నియోజకవర్గాల మీదుగా చేపట్టిన ఈ రోడ్‌షో దాదాపు మూడు గంటలపాటు సాగింది.

85% కమీషన్లు కాంగ్రెస్‌కు అలవాటే

'కర్ణాటకలో కాంగ్రెస్ పాలన దశాబ్దాలపాటు సాగింది. కానీ, అభివృద్ధే జరగలేదు. కాంగ్రెస్ అంటే.. పూర్తి అవినీతి, కుంభకోణం, 85% కమిషన్, ఉగ్రవాదులకు దాసోహం, బుజ్జగింపు వ్యవహారాలు, విభజన రాజకీయాలు'అని ప్రధాని పేర్కొన్నారు. ఢిల్లీ నుంచి రూ.1 విడుదలైతే ప్రజలకు 15 పైసలు అందుతుందని అప్పట్లో కాంగ్రెస్ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ చెబుతుండేవారని గుర్తు చేశారు. అప్పటి నుంచే 85 శాతం కమీషన్ కాంగ్రెస్‌కు అలవాటైందని ఎద్దేవా చేశారు. తప్పుడు హామీలివ్వడం అధికారంలోకి వచ్చాక వాటిని మర్చిపోవడం కాంగ్రెస్‌కు అలవాటేనన్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లో మాదిరిగానే కర్ణాటకలోనూ అధికారంలోకి వస్తే ప్రజలకిచ్చిన వాగ్దానాలను కాంగ్రెస్ బుట్టదాఖలు చేస్తుంది'అని చెప్పారు. మాజీ సీఎం, బాదామి బరిలో ఉన్న కాంగ్రెస్ నేత సిద్దరామయ్యపైనా ప్రధాని విమర్శలు గుప్పించారు. 'గాలి ఎటువీస్తోందో సిద్దరామయ్య ఇప్పటికి గ్రహించే ఉంటారు. ఆయన ఇక్కడికి వస్తే.. గతంలో కనీస మౌలిక వసతులను ప్రజలకు ఎందుకు కల్పించలేకపోయారని నిలదీయండని పిలుపునిచ్చారు. 'బీజేపీకి వస్తున్న ప్రజల ఆదరణ చూసి కాంగ్రెస్‌కు భయం మొదలైంది. అందుకే నిరంతరం ఆరోపణలు చేస్తున్నారు'అని అన్నారు. పేదల కష్టాలను అర్థం చేసుకోలేని కాంగ్రెస్‌వి నీచమైన విధానాలని ఆరోపించారు.

ఖర్గే హత్యకు బీజేపీ కుట్ర

- కాంగ్రెస్ ఆరోపణలు
- ఆడియో క్లిప్పు విడుదల
- విచారణ జరిపిస్తామన్న సీఎం బసవరాజ్ బొమ్మై

సాక్షి బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రాజకీయాలు వాడీవేడిగా మారుతున్నాయి. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆయన భార్యాపిల్లల్ని హత్య చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తోందంటూ కాంగ్రెస్ విడుదల చేసిన ఒక ఆడియో క్లిప్పు సంచలనం సృష్టించింది. చిత్తాపుర నియోజకవర్గం బరిలో ఉన్న బీజేపీ అభ్యర్థి మణికంఠ రాథోడ్ మాట్లాడినట్టుగా చెబుతున్న ఒక ఆడియో క్లిప్‌ను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణదీప్ సింగ్ సుర్జేవాలా శనివారం విడుదల చేశారు. మణికంఠకి, ఒక బీజేపీ కార్యకర్తకి మధ్య కన్నడంలో జరిగిన సంభాషణలో ఖర్గే కుటుంబాన్ని అంతం చేస్తానంటూ మణికంఠ మాట్లాడారు. ఎన్నికల్లో ఓటమి భయంతో బీజేపీ నేతలు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని సుర్జేవాలా మండిపడ్డారు. మణికంఠ నేరప్రవృత్తి అందరికీ తెలిసిందేనని, అలాంటి వ్యక్తికి టిక్కెట్ ఇచ్చారని ధ్వజమెత్తారు. మరోవైపు కాంగ్రెస్ చెబుతున్నవన్నీ అబద్ధాలేనని ఆ ఆడియోలో ఉన్న వాయిస్ తనది కాదని మణికంఠ చెబుతున్నారు. ఆడియో ప్రామాణికతపై విచారణ జరిపిస్తామని సీఎం బొమ్మై చెప్పారు. ఆడియోపై దర్యాప్తు జరిపిస్తామని బొమ్మై తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మణికంఠ రాథోడ్‌పై 40 క్రిమినల్ కేసులున్నాయి. చిత్తాపురలో ఖర్గే కుమారుడు ప్రియాంక్‌పై మణికంఠ పోటీచేస్తున్నాడు.

ఆడియోలో ఏముందంటే..!

- బీజేపీ కార్యకర్త: ఎన్ని కేసులు ఉన్నాయి?
- మణికంఠ: ఎవడ్రా అడిగింది ? 44 కేసులు ఉన్నాయి. మణికంఠ చెప్పాడని చెప్పు..
- కార్యకర్త: ఖర్గే వైపు వారు అడుగుతున్నారు? మనవాళ్లెవరూ అడగడం లేదు?
- మణికంఠ: ఖర్గే సంబంధీకులకే చెప్పు
- కార్యకర్త: ఖర్గే ఫోన్ నంబర్ ఇవ్వు అన్న.. నేను నీ అభిమానిని. ఈ విధంగా ఎందుకు మాట్లాడుతున్నారని అడుగుతాను.
- మణికంఠ: నా వద్ద ఫోన్ నంబర్ ఉంటే వాళ్ల ఇంట్లో ఆడవాళ్లను, పిల్లలను ముగించే వాడిని.. నా దగ్గర వారి నంబర్ లేదు.
- కార్యకర్త: ఎవరి ఆడపిల్లలు అన్నా
- మణికంఠ: నీవు ఎవరి పేరు తీసుకొచ్చావ్?
- కార్యకర్త: ఖర్గే పేరు అన్నా
- మణికంఠ: నా దగ్గర వారి నంబర్ ఉంటే ఇప్పటికే వారి ఇంట్లోని ఆడవారు, పిల్లలను చంపేసేవాడిని. నా దగ్గర వారి నంబర్ లేదు.

లాహోర్‌లో ఖలిస్తానీ ఉగ్రవాది కాల్చివేత

లాహోర్: వాంటెడ్ ఖలిస్తానీ ఉగ్రవాది పరంజిత్ సింగ్ పంజ్‌వార్(63) పాకిస్తాన్‌లో గుర్తు తెలియని వ్యక్తి కాల్పుల్లో హతమయ్యాడు. పంజాబ్ ప్రావిన్స్ లాహోర్‌లోని తన నివాసానికి సమీపంలో శనివారం ఉదయం మార్నింగ్ వాక్‌కు వెళ్లిన అతడిపై గుర్తు తెలియని దుండగులు దగ్గర్నుంచి కాల్పులకు దిగారు. ఈ ఘటనలో అతడితోపాటు గార్డు కూడా చనిపోయాడు. ఖలిస్తానీ కమాండో ఫోర్స్–పంజ్‌వార్ గ్రూపునకు ఇతడే నాయకుడు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం–2020 ప్రకారం భారత ప్రభుత్వం అతడిని ఉగ్రవాదిగా ప్రకటించింది. పంజ్‌వార్ హత్యాఘటనపై వ్యాఖ్యానించేందుకు లాహోర్ పోలీసులు నిరాకరించారు. 1986లో ఖలిస్తానీ కమాండో ఫోర్స్‌లో చేరిన పంజ్‌వార్ అనంతరం సొంత కుంపటి పెట్టుకుని పాక్‌కు పరారయ్యాడు. పంజాబ్, హరియాణా, చండీగఢ్‌ల్లో జరిగిన పలు పేలుడు ఘటనలకు ఇతడి ప్రమేయం ఉంది.

● క్రూర జీవి కాదు.. కూర జీవి



తమిళనాడులోని నీలగిరి జిల్లా కోటగిరిలో వార్షిక వేసవికాలపు కూరగాయల ప్రదర్శనలో భాగంగా బంగాళాదుంపలు, కాకరకాయలతో మొసలి ఆకృతిని రూపొందించిన దృశ్యం.

బీజేపీది చీకటి పాలన: సోనియా



హుబ్బళ్లి: అధికార బీజేపీని గద్దె దించకుండా దేశం అభివృద్ధి చెందదని కాంగ్రెస్ అగ్ర నేత సోనియాగాంధీ పేర్కొన్నారు. బీజేపీ పాలన లూటీ, మోసం, అహంకారం, విద్వేషాలతో నిండిఉందని ఆమె తూర్పారబట్టారు. సోనియా గాంధీ శనివారం మొట్టమొదటి సారిగా కర్ణాటకలో ని హుబ్బళ్లి ఎన్నికల ప్రచారసభలో పాల్గొన్నారు. హుబ్బళ్లి సభలో ఆమె మాట్లాడారు. బీజేపీ దోపిడీ పాలన, చీకటి పాలనకు వ్యతిరేకంగా గొంతు కలపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందని తెలిపారు. బీజేపీ అణచివేతలతో ప్రజలు వణికిపోతున్నారని ఆమె అన్నారు. 'లూటీ వ్యాపారంగా మారిం 2018లో మీరు వారికి అధికారం ఇవ్వలేదు కానీ, వారు బలవంతంగా చేజిక్కించుకున్నారు. ఆ తర్వాత వారి 40 శాతం కమీషన్ ప్రభుత్వం దోపిడీలో భాగంగా మారిపోయింది'అని సోనియా అన్నారు. ఇలా ఉండగా.. '40 శాతం కమీషన్ సర్కార్, భరించలేనంతగా పెరుగుతున్న ధరలు, పెచ్చరిల్లుతున్న నిరుద్యోగం, ఎప్పటికీ పూర్తికాని నిర్మాణాలతో బెంగళూరులో గుంతలు..వాస్తవమైన ఈ సమస్యలపై ప్రధాని ఏమాత్రం మాట్లాడరు'అని కాంగ్రెస్ పేర్కొంది.

ఇంఫాల్ లోయ ప్రశాంతం

- మణిపూర్‌లో నెలకొంటున్న సాధారణ పరిస్థితులు
- హింసాత్మక ఘటనల్లో 54కు చేరిన మరణాలు

ఇంఫాల్: మణిపూర్‌లో ప్రశాంతత నెలకొంటోంది. బుధవారం నుంచి మొదలైన హింసాత్మక ఘటనలు శుక్రవారం రాత్రి కూడా కొనసాగాయి. అయితే, శనివారం ఉదయం ఇంఫాల్ లోయలో దుకాణాలు, మార్కెట్లు తిరిగి తెరుచుకున్నాయి. రోడ్లపై వాహనాల రాకపోకలు మొదలయ్యాయని అధికారులు తెలిపారు. మైతి వర్గం ప్రజలకు ఎస్టీ హోదా ఇవ్వరాదంటూ బుధవారం చేపట్టిన ర్యాలీ సందర్భంగా మొదలైన హింసాత్మక ఘటనలు రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలకూ వేగంగా వ్యాపించాయి. హింసాత్మక ఘటనల్లో చనిపోయిన వారి సంఖ్య శనివారానికి 54కు చేరుకోగా, క్షతగాత్రులు 200కు పైనేనని అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి మరణాలు వందకు పైగానే ఉంటాయని అనధికార వర్గాల సమాచారం. ప్రభుత్వం, ఆర్మీ ఏర్పాటు చేసిన తాత్కాలిక షెల్టర్లలో సుమారు 13 వేల మంది తలదాచుకోగా కొందరు పొరుగునే ఉన్న మిజోరం, మేఘాలయ, నాగాలాండ్‌లకు తరలివెళ్లారు. రాష్ట్రంలోని ప్రధాన రహదారులు, కీలక ప్రాంతాల వద్ద పెద్ద సంఖ్యలో ఆర్మీ జవాన్లు, కేంద్ర బలగాల గస్తీ కొనసాగుతోంది.

తెరపైకి 'ప్రాజెక్ట్ సంజయ్'

- సమీకృత యుద్ధ క్షేత్ర నిఘాల కేంద్రాలకు రూపకల్పన
- చైనా, పాక్ సరిహద్దుల్లో ఏర్పాటుకు ఆర్మీ ప్రణాళికలు

న్యూఢిల్లీ: అగ్రరాజ్యాలు సైనికపరంగా అనేక నూతన అస్త్రాలను సమకూర్చుకుంటున్న వేళ..భారత్ కూడా ఆ దిశగా అడుగులు వేస్తోంది. అత్యాధునిక డిజిటల్ యుద్ధ క్షేత్రాల్లో పోరాటంలో సైతం పైచేయి సాధించేందుకు ఆర్మీ ప్రణాళికలు సిద్ధం చేసింది. 'ప్రాజెక్ట్ సంజయ్'పేరుతో యుద్ధ క్షేత్రంలోని వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు కచ్చితంగా బేరీజు వేసేందుకు సమీకృత రణక్షేత్ర నిఘా కేంద్రాల (ఇంటిగ్రేటెడ్ బ్యాటిల్‌ఫీల్డ్ సర్వైలెన్స్ అండ్ ఇంటెలిజెన్స్ సెంటర్ల)కు రూపకల్పన చేస్తోంది. ఇందులో ఏర్పాటు చేసే సెన్సర్లు రాడార్లు, శాటిలైట్లు, డ్రోన్ల నుంచి వచ్చే సమాచారాన్ని క్షేత్రస్థాయిలోని బలగాలకు అందజేస్తాయి. దీని సాయంతో ప్రత్యర్థి బలగాల ఆనుపానులను నిక్కచ్చిగా తెలుసుకునేందుకు వీలుంటుంది. 2025 డిసెంబర్ నాటికి సరిహద్దుల్లో ఇంటిగ్రేటెడ్ బ్యాటిల్‌ఫీల్డ్ సర్వైలెన్స్ అండ్ ఇంటెలిజెన్స్ సెంటర్లను డజన్ల కొద్దీ ఏర్పాటు చేయనుంది. తాజాగా వ్యూహం అమల్లోకి వస్తే యుద్ధ క్షేత్రంలో కార్యకలాపాలను, నిఘాను విస్తృతం చేసేందుకు వీలవుతుంది. ఫలితంగా ఆర్మీ కమాండర్లు ఫ్రంట్‌లైన్ బలగాల మోహరింపు, యుద్ధ సామగ్రి తరలింపు వంటి విషయాల్లో వెంటవెంటనే మెరుగైన నిర్ణయాలు తీసుకునే వీలుకల్పించడమే దీని లక్ష్యమని ఆర్మీ వర్గాలు తెలిపాయి. ఇందులోభాగంగా, పర్వత ప్రాంతాలు, ఎడారులు, మైదాన ప్రాంతాల్లో ఇప్పటికే ట్రయల్స్ పూర్తయ్యాయని పేర్కొన్నాయి. పొరుగుదేశం చైనా చాలా రోజుల నుంచి ఇదే రకమైన వ్యవస్థల ఏర్పాటులో నిమగ్నమై ఉంది. భారత్ ఎలక్ట్రానిక్స్ ఈ వ్యవస్థలను సమకూరుస్తోంది. దేశం 12 లక్షల పటిష్ట ఆర్మీ 'ఆటోమేషన్, డిజిటైజేషన్, నెట్‌వర్కింగ్'కోసం ఇప్పటికే పలు పథకాలు అమలవుతున్నాయి. ప్రాజెక్ట్ శక్తి పేరుతో ఇప్పటికే ఏసీసీసీఎస్(ఆర్టిలరీ కంబాట్, కంట్రోల్, కమ్యూనికేషన్ సిస్టం) కింద వ్యవస్థల అప్‌గ్రేడ్ చేపట్టారు. దీనిని కూడా కొత్తగా ఏర్పాటయ్యే ప్రాజెక్ట్ సంజయ్‌తో అనుసంధానిస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

కర్ణాటకలో ఐటీ దాడులు.. రూ.22 కోట్ల సొత్తు స్వాధీనం

బెంగళూరు: కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ ఆదాయ పన్ను శాఖ అధికారులు వివిధ ప్రాంతాల్లో జరిపిన సోదాల్లో భారీగా సొత్తు బయటపడింది. రూ.15.3 కోట్ల నగదుతోపాటు రూ.7.08 కోట్ల విలువైన 10.14 కిలోల బంగారాన్ని పట్టుకున్నట్లు ఐటీ సీఈవో కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో, రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన మార్చి 29 నుంచి ఇప్పటి వరకు మొత్తం రూ.365 కోట్ల సొత్తు స్వాధీనం చేసుకున్నట్లయిందని పేర్కొంది.

సాక్షి
హైదరాబాద్
ఆదివారం । 7 । మే । 2023

రేపు జైళ్ల శాఖలో పాసింగ్ పరేడ్

చంచల్‌గూడ: చంచల్‌గూడలోని జైళ్ల శాఖ పరేడ్ మైదానంలో సోమవారం 2వ పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమం నిర్వహించనున్నారు. హోంమంత్రి మహమూద్ అలీ ఈ పరేడ్‌కు ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలంగాణ జైళ్ల శాఖ డీజీ జితేందర్ శనివారం విలేకరులకు తెలిపారు. ఢిల్లీ జైళ్లకు చెందిన వార్డర్లు, మాట్రాన్స్ ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా పాసింగ్ ఔట్ పరేడ్ నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.



ప్రపంచ సాంకేతికతలో భారత్ ముందుంది

ప్రపంచ సాంకేతికతలో భారత్ ముందుందని రక్షణ మంత్రిత్వ శాఖ సలహాదారు డా.జి.సతీష్ రెడ్డి అన్నారు. శనివారం ఘట్‌కేసర్ మండలంలోని ఏసీఈ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. -8లో

21న జావేద్‌అలీ మ్యూజికల్ నైట్



బంజారాహిల్స్: ప్రముఖ బాలీవుడ్ గాయకుడు జావేద్ అలీ ఆధ్వర్యంలో ఈ నెల 21న ప్రత్యేక మ్యూజికల్ ఈవెంట్ నిర్వహించనున్నట్లు రుద్రాక్ష కమ్యూనికేషన్స్ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని శిల్పకళావేదికలో 'దిలోం కో దిలోం సే జోడ్‌నే కా' పేరిట జాజ్‌బా సంగీత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



సైక్లింగ్ చేద్దాం రండి..

నేడు పరేడ్ గ్రౌండ్‌లో ప్రత్యేక కార్యక్రమం

సాక్షి, సిటీబ్యూరో: షాప్‌కు వెళుతున్నారా..అయితే నడిచి వెళ్లండి ఆరోగ్యానికి మంచిది. 5 కిలో మీటర్ల ప్రయాణం అయితే సైకిల్ వాడండి. ఆఫీస్ వెళ్లడానికి వాహనాలను కాకుండా బస్సు, మెట్రో సేవలను వినియోగించుకోండి. కాలుష్యం తగ్గి పర్యావరణానికి మేలు జరుగుతుంది అంటూ.. యాక్టివ్ మొబిలిటీపైన అవగాహన పెంచడానికి పరేడ్ గ్రౌండ్ వేదికగా ఆదివారం 'హైదరాబాద్ సైక్లింగ్ రివల్యూషన్ 3.0' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నగరంలోని సైక్లింగ్ క్లబ్‌లకు చెందిన దాదాపు ఐదు వేల మంది సైక్లిస్టులు ఈ వినూత్న కార్యక్రమంలో పాల్గొని యాక్టివ్ మొబిలిటీపై ప్రతిజ్ఞ చేయనున్నారు. ఈ కార్యక్రమం ఉదయం 6 గంటల నుంచి ప్రారంభం అవుతుంది.



సన్నాహక కార్యక్రమంలో పాల్గొన్న సైక్లిస్టులు..

సైక్లింగ్‌ను ఆస్వాదిస్తున్నారు..



సిటీలో ఈ మధ్య కాలంలో సైక్లింగ్‌పై చాలా అవగాహన పెరిగింది. సాఫ్ట్‌వేర్, ఐటీ, సినిమాలు, ఫ్యాషన్ రంగాలతో పాటు సైక్లింగ్ వంటి ఆరోగ్యకర అలవాట్లను నగరవాసులు ఆహ్వానించడం మంచి పరిణామం. వారాంతాల్లో నగరంలో జనాలు ఎక్కువగా తిరిగే ప్రదేశాల్లో సైక్లిస్టులమంతా అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపడుతున్నాం. సిటీ దాదాపు పదివేల మంది వరకు సైక్లిస్టులు ఉన్నారు.
–రవి, సైక్లిస్టు

'వన్ స్టేషన్..వన్ ప్రొడక్ట్'

రైల్వేస్టేషన్‌లో చిరుధాన్యాల ఉత్పత్తులు



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల ఉత్పత్తుల స్టాల్..

సాక్షి, సిటీబ్యూరో: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'వన్ స్టేషన్..వన్ ప్రొడక్ట్' కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్, నాంపల్లి, బేగంపేట్ రైల్వేస్టేషన్‌లలో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల స్టాళ్లలో అమ్మకాలు పెరిగాయి. నైన్ నట్జ్ అనే ఒక మైక్రో స్టార్టప్ ద్వారా సికింద్రాబాద్ స్టేషన్ ప్లాట్‌ఫారమ్ 10లో ఒక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. చిరుధాన్యాల ఆధారిత స్వీట్లు, స్నాక్స్‌ను విక్రయిస్తున్నారు. ఎం ఫర్ మిల్లెట్స్ అనే మరొక మైక్రో స్టార్టప్ బేగంపేట స్టేషన్ ప్లాట్‌ఫారమ్ నంబర్ –2లో చిరుధాన్యాల చిక్కీలు, ప్రాచీన కాలపు ఆహార పదార్థాలను విక్రయిస్తోంది. నాంపల్లి స్టేషన్‌లో మరొక మైక్రో స్టార్టప్ మిల్లింగ్ ఆధారిత అల్పాహార చిరు పదార్థాలు,స్నాక్స్ విక్రయిస్తోంది. కేంద్రం సూచన మేరకు ఐక్యరాజ్య సమితి 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో మిల్లెట్ల ఉత్పత్తి – వినియోగాన్ని పెంచే లక్ష్యంతో వీటిపై ఈ స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్...సికింద్రాబాద్ డివిజన్ అధికారులను అభినందించారు.

ఔరా..ఓటరా!

ఒకే చిరునామాలో వందల సంఖ్యలో ఓటర్లు
- నగరంలోని చాలా ప్రాంతాల్లో ఇదే తంతు
- క్షేత్రస్థాయి పరిశీలనలో అధికారులు
- ఒకే ఇంట్లో 6 కంటే ఎక్కువ ఓట్లుంటే విచారణ
- తొలగించిన ఓట్లు మరోమారు పరిశీలన
- నగరంలో మొదలైన ఎన్నికల సన్నాహాలు

సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్‌లోని అడ్డగుట్టలో ఇంటినెంబరు 10–4–55/బి చిరునామాలో ఐదు కాదు..పది కాదు ఏకంగా వంద ఓట్లున్నాయి. మీ దగ్గర వందేనా మేమింకా ఎక్కువే అన్నట్లు అదే నియోజకవర్గం మైలార్‌గడ్డలో 11–1–748గా ఉన్న ఇంటి నెంబరుతో 146 ఓట్లున్నాయి. ఓటరు జాబితాలో ఒకే ఇంట్లో ఉన్న ఈ ఓటర్ల సంఖ్యను చూసి హతాశులైన అధికారులు నిజానిజాలు తెలుసుకునేందుకు క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లారు.

- ఇలా ఒకే చిరునామాలో 50 నుంచి 100, అంతకంటే ఎక్కువే ఓటర్లున్న ప్రాంతాలు ఒక్క సికింద్రాబాద్ నియోజకవర్గానికే పరిమితం కాలేదు. హైదరాబాద్ జిల్లాలోని చార్మినార్, చాంద్రాయణగుట్ట, ముషీరాబాద్, మలక్‌పేట తదితర నియోజకవర్గాల్లోనూ ఇలా ఒకే ఇంటి చిరునామాలో భారీసంఖ్యలో ఓటర్లున్నట్లు తెలిసింది. దీంతో సంబంధిత అధికారులు వాటి పరిశీలనను చేపడుతున్నారు. బోగస్‌లుంటే సరిదిద్దే చర్యలు చేపట్టనున్నారు.



మైలార్‌గడ్డలో 146.. అడ్డగుట్టలో 100

ఇది ఎన్నికల సంవత్సరం కావడంతో ఓటర్ల నమోదు.. తీసివేతలు..కూడికలు కీలకంగా మారనున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు ఓటర్ల జాబితాపై ముమ్మర కసరత్తులు చేస్తున్నారు. ఇందులో భాగంగా పరిశీలన జరుపుతుండగా...ఒకే అడ్రస్‌పై ఎక్కువ మంది ఓటర్లు నమోదైనట్లు గుర్తిస్తున్నారు. సికింద్రాబాద్ ప్రాంతంలో ఒకే చిరునామాపై 146 మందికి ఓటరు కార్డులు ఉండడాన్ని గుర్తించారు. దీనిపై సమీక్ష జరుపుతున్నారు.

మొదలైన ఎన్నికల కసరత్తు..

రాష్ట్రంలో ఆరేడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఇప్పటికే ఎన్నికల కసరత్తును ప్రారంభించింది. జిల్లా, అసెంబ్లీ ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లు, తదితరమైన వాటితో చేపట్టాల్సిన చర్యలపై అప్రమత్తం చేస్తోంది. జాబితా నుంచి ఓటర్లను తొలగించే పక్షంలో ఎలాంటి విమర్శలు రాకుండా ఉండేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడంతోపాటు నిబంధనల కనుగుణంగా తొలగించాలని సూచించింది. అంతేకాదు..ఇప్పటికే తొలగించిన ఓటర్లను మరోమారు పునఃపరిశీలించాలని కూడా ఆదేశించడంతో అందుకనుగుణంగా సంబంధిత ఎన్నికల అధికారులు ఆయా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తొలగించిన ఓటర్లతోపాటు ఒకే ఇంట్లో ఎక్కువ ఓటర్లున్న వారివిసైతం క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించడమే కాకుండా అలాంటి ఇళ్లకు ఫిజికల్ ఫైళ్లను కూడా నిర్వహించాలని సూచించడంతో ఆ దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఒకే ఇంట్లో ఆరుగురికి మించితే..

ఇందులో భాగంగా ఎన్నికల అధికారులు ఒకే ఇంట్లో ఆరు కంటే ఎక్కువ ఓట్లున్నా కూడా పరిశీలిస్తూ ఫిజికల్ ఫైళ్లను నిర్వహించే చర్యలు చేపట్టారు.

ఎవరి పనిలో వారు..

రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఓవైపు రాజకీయ పార్టీలు ఒకదానిపై మరొకటి విమర్శలు గుప్పిస్తూ బహిరంగ ప్రదర్శనలు చేస్తుండగా.. మరోవైపు ఎన్నికల యంత్రాంగం గుంభనంగా దాని పనులు అది చేసుకుంటూపోతోంది. ఆధార్‌తో లింకేజీ చేసుకోవాలని సూచిస్తుండటంతోపాటు అర్హులైన వారు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాల్సిందిగా సూచించడం తదితర పనులు చేస్తోంది. మరోవైపు స్థానిక ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాలకు అనువైన ప్రభుత్వ భవనాలను జీఐఎస్‌తో గుర్తించే పనులు చేపట్టారు.

అందుబాటులో ఈవీఎంలు..

ప్రజలు ఓట్లు వేసేందుకు పోలింగ్ సందర్భంగా వినియోగించే ఈవీఎంలు, వీవీప్యాట్‌లు, కంట్రోల్ యూనిట్లను ఇప్పటికే చుడీబజార్ కేంద్రానికి తెప్పించారు. దాదాపు 6 వేల బ్యాలెట్ యూనిట్లు, 5 వేల పైచిలుకు వీవీప్యాట్‌లు, 4 వేల కంట్రోల్‌యూనిట్లు ఉన్నట్లు తెలిసింది. బూత్ స్థాయి అధికారుల వివరాలు ఎప్పటికప్పుడు సంబంధిత యాప్‌లో నమోదు చేస్తున్నారు.

బస్తీ మొత్తం ఒకే చిరునామాతో..



ఒకే చిరునామాలో ఎక్కువ మంది ఓటర్లుండటంతో క్షేత్రస్థాయి పరిశీలన చేయగా.. బస్తీ వారందరి ఓట్లు ఒకే చిరునామాలో ఉన్నట్లు గుర్తించాం. ప్రస్తుతం వాటిని సరిదిద్దే చర్యలు చేపట్టాం. తెలిసో, తెలియకో బై నెంబర్లు కూడా ఒకే విధంగా ఉండటంతో ఒకే ఇంట్లో ఉన్నారా? అనే అనుమానంతో పరిశీలించగా ఈ విషయం తెలిసింది. ఎక్కడ ఎక్కువ ఓటర్లున్నా పరిశీలన చేస్తాం. రాజకీయపార్టీలకు సైతం ఈ విషయంలో అవగాహన కల్పిస్తాం. ఇప్పటికే పార్టీల నేతలతో వారం వారం సమావేశాలు నిర్వహిస్తూ క్లెయిమ్స్, అభ్యంతరాల గురించి తెలియజేస్తున్నాం. జాబితాలో కొత్తగా చేరినవారి వివరాలు, తొలగించిన వారి వివరాలు తెలియజేస్తున్నాం. ఓటరుజాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా ఉండేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం.
– దశరథ్, సికింద్రాబాద్ నియోజకవర్గ ఈఆర్ఓ



యువర్ అటెన్షన్ ప్లీజ్

- మీ సేవలో పదో నెంబర్ ప్లాట్‌ఫామ్
- సికింద్రాబాద్ స్టేషన్‌లో అత్యవసర వైద్య సేవల కేంద్రం

సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్ స్టేషన్‌లో అత్యవసర వైద్య సేవల కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్.సి.వెంకటేశ్వర్లు, సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ అభయ్ కుమార్ గుప్తా, సికింద్రాబాద్ డివిజన్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిర్మలా రాజారామ్, అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ ప్రదీప్ కుమార్ సింగ్ రాథోడ్, శ్రీ శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ వీఎస్ రామచంద్ర, డాక్టర్ తుషారా రామచంద్ర, లయన్ వేణుగోపాల్, 108 సర్వీసెస్ మాజీ సీఈఓ వెంకట్ రావు తదితరులు పాల్గొన్నారు. శ్రీ శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్స్ ఈ అత్యవసర వైద్య కేంద్రాన్ని రెండేళ్లపాటు ఉచితంగా నిర్వహించనుంది. 10వ నెంబర్ ప్లాట్‌ఫామ్ ఎమర్జెన్సీ మెడికల్ రూమ్ బుకింగ్ ఆఫీస్ దగ్గర దీనిని ఏర్పాటు చేశారు. ప్రయాణికులు తమ టిక్కెట్ పీఎన్ఆర్ నంబర్‌తో అత్యవసర వైద్య సహాయం పొందవచ్చు. ఈ సేవలు పూర్తిగా ఉచితం. 24 గంటల పాటు అందుబాటులో ఉంటాయి. ఈ సందర్భంగా సికింద్రాబాద్ డీఆర్ఎం అభయ్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారిని ఆదుకొనేందుకు ఈ ఎమర్జెన్సీ మెడికల్ సౌకర్యం తోడ్పడుతుందని తెలిపారు.

ఓయూలో ముగిసిన సింపోజియాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో రెండు రోజులు జరిగిన జాతీయ టెక్నికల్ సింపోజియాలు శనివారం ముగిశాయి. ఏడు ఇంజినీరింగ్ విభాగాల్లో జరిగిన వివిధ కార్యక్రమాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా కొనసాగినందుకు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్‌ను అధ్యాపకులు ఘనంగా సన్మానించారు.

మొబైల్ షీ టాయిలెట్లపై పర్యవేక్షణ

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ అంతటా మొబైల్ షీ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని, అలాగే ఆయా వాహనాలు ఉన్న స్థానం, నిర్వహణ సేవల పర్యవేక్షణ కోసం వాటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించాలని సేఫ్ సిటీ ప్రాజెక్ట్ బృందం నిర్ణయించింది. సేఫ్ సిటీ ప్రాజెక్ట్ నోడల్ అధికారి, హైదరాబాద్ సిటీ కమిషనర్ సీవీ ఆనంద్ అధ్యక్షతన శనివారం టీఎస్ పీఐసీసీసీలో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఉమెన్ సేఫ్టీ అదనపు డీజీ శిఖా గోయల్, రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్, సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, జీహెచ్ఎంసీ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. ట్రై కమిషనర్లలో కొత్త భరోసా కేంద్రాల ఏర్పాటుపై సమీక్షించారు. అలాగే సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ (సీడీఈడబ్ల్యూ), పెలికాన్ సిగ్నల్లు, సీసీటీవీ కెమెరాలతో సహా సేఫ్టీ సిటీ ప్రాజెక్ట్‌లోని పలు అంశాలపై చర్చించారు.



సమావేశంలో పాల్గొన్న సీవీ ఆనంద్ తదితరులు

ఇంతింతై..ఇండస్ట్రీలై!

- మాదారంలో పూర్తయిన 229 ఎకరాల భూసేకరణ
- సత్వరమే పనుల పూర్తికి యంత్రాంగం కసరత్తు
- పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న మేడ్చల్ జిల్లా

సాక్షి, మేడ్చల్ జిల్లా: పారిశ్రామిక కేంద్రంగా మేడ్చల్ జిల్లా అభివృద్ధి చెందుతోంది. వందలాది పరిశ్రమలతో వేలాది మందికి ప్రత్యక్షంగా లక్షలాది మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలను కల్పిస్తున్న నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఐటీ విస్తరణ కూడా వేగవంతమవుతోంది. గ్రిడ్ పాలసీలో భాగంగా హైదరాబాద్ నగరానికి తూర్పు దిశగా ఘట్‌కేసర్ మండలం మాదారంలో పారిశ్రామికవాడ స్థాపనకు తొలి అడుగు పడింది. రైతుల అంగీకారంతో 229 ఎకరాల భూసేకరణ కార్యక్రమాన్ని పూర్తి చేసిన జిల్లా రెవెన్యూ యంత్రాంగం టీఎస్ ఐఐసీకు అప్పగించింది. త్వరలో మాదారంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కోసం జిల్లా పరిశ్రమల శాఖ టీఎస్ ఐపాస్ ద్వారా అన్ని అనుమతులు ఇప్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది.



కొత్త ఉద్యోగావకాశాలు

- మాదారంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటులో దాదాపు ఐదు వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నట్లు తెలుస్తోంది. కుషాయిగూడ, ఉప్పల్, చర్లపల్లి ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో కొనసాగుతున్న పరిశ్రమలు కూడా ఇక్కడికి తరలివచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతాలు జనసముద్దర కేంద్రాలుగా మారడం వల్ల అక్కడ ఉన్న కొన్ని పరిశ్రమలకు తోడు అనుబంధంగా కొత్త పరిశ్రమలు ఏర్పడనున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.
- ఉప్పల్‌లో జెన్‌ప్యాక్ వద్ద 20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐటీ పార్కు ఏర్పాటుకు పునాది రాయి పడగా, హైదరాబాద్ నగరానికి ఉత్తరం వైపు కండ్లకోయలో ఆరు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో గేట్ వే ఐటీ పార్కుకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే.. నగరానికి తూర్పు, ఉత్తరం దిశలో రెండు పార్కుల ఏర్పాటు నేపథ్యంలో ఇప్పటి వరకూ 150 కంపెనీలు స్థాపనకు ముందుకొచ్చినట్లు జిల్లా అధికార వర్గాలు వివరిస్తున్నాయి.

8,461 కొత్త పరిశ్రమలు

నగర శివారు మేడ్చల్ జిల్లాలో కొత్త పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన పరిస్థితులు ఉండటంతో పారిశ్రామిక అధిపతులు కూడా కొత్త పరిశ్రమలను నెలకొల్పేందుకు టీఎస్ఎస్ఐపాస్ ద్వారా అనుమతులు పొందడానికి ముందుకొస్తున్నారు. జిల్లాలో 2016 అక్టోబర్ నుంచి 2023 ఏప్రిల్ వరకు రూ.15,509.31 కోట్ల పెట్టుబడులతో 9,297 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమలను పారిశ్రామిక వేత్తలు స్థాపించగా, ఇందులో 2,22,330 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి.

భూనిధి ఎక్కువే..

మేడ్చల్ జిల్లాలో నూతన పరిశ్రమల ఏర్పాటుకు తగిన భూనిధి కూడా ఉంది. జిల్లా పరిధిలో 66.8 కిలోమీటర్ల జాతీయ రహదారులు, 65 కిలోమీటర్ల రాష్ట్రీయ రహదారులు ఉన్నాయి. వీటికి తోడు ఔటర్ రింగ్ రోడ్డు ఉండటంతో పరిశ్రమల స్థాపనకు అనువైన ప్రాంతంగా ఉంది. జిల్లాలో 12 మండలాల పరిధిలో 5,195 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు రెవెన్యూ శాఖ లెక్క తేల్చినప్పటికీ ఇందులో ఎన్ని భూములు కబ్జాకు గురయ్యాయి? సంరక్షణలో ఎన్ని ఉన్నాయని తెలుసుకునేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు మరోసారి సమగ్ర సర్వేకు రెవెన్యూ శాఖ చర్యలు తీసుకుంటోంది. అలాగే అసైన్డ్ భూములు కూడా ఉన్నట్లు ప్రభుత్వానికి నివేదించింది.

సైరన్ బిగిస్తే కేసులే

సాక్షి, సిటీబ్యూరో: అనధికారికంగా వాహనాలకు సైరన్లు, మల్టీ టోన్డ్ హారన్‌లు బిగించకూడదని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. కార్ డెకర్ షాపు యజమానులు, మెకానిక్‌లు అక్రమంగా వాహనాలకు మల్టీటోన్డ్ హారన్‌లు, సైరన్‌లను అమర్చుతున్నట్లు గుర్తించిన పోలీసుల.. వారిపై చర్యలకు ఉపక్రమించారు. ఇప్పటివరకు 134 మంది కార్ డెకార్, మెకానిక్‌లకు నోటీసులు అందించారు. నోటీసులోని అంశాలను ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. రానున్న రోజుల్లో కార్ డెకార్ షాపు యజమానులతో సమావేశం నిర్వహించనున్నట్లు సిటీ ట్రాఫిక్ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. గత 12 రోజుల్లో సైరన్లు అమర్చిన 1,557 మంది వాహనదారులపై కేసులు నమోదు చేయడంతో పాటు ఆయా సైరన్లను తొలగించారు.

8 నుంచి అవధాన శిక్షణ శిబిరం

నాంపల్లి : తెలుగు భాషకు మాత్రమే సొంతమైన అవధాన ప్రక్రియ మరుగున పడకుండా రాబోయే తరాలకు అందించాలనే ఉద్దేశ్యంతో అవధాన విద్యా వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో రెండో అవధాన శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకు పద్మారావు నగర్‌లోని శివానంద ఆశ్రమంలో శిక్షణ ఉంటుంది. ఈ మేరకు.. శనివారం మాసబ్ ట్యాంక్ నఫీజ్ రెసిడెన్సీలోని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచార్య క్యాంపు కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కె.వి.రమణాచారి మాతృ భాషపై మమకారం కల్పించకపోతే చాలా నష్టపోతామని తెలిపారు. శిబిరంలో పాల్గొనే వారికి ఉచిత వసతి భోజనం సదుపాయం ఉంటుందని తెలిపారు. వివరాలకు 9441039146 నెంబరుకు ఫోన్ చేయవచ్చు.

మణికొండలో రోడ్ వార్

- ఔటర్ నుంచి లింకురోడ్ల నిర్మాణం చేపట్టిన హెచ్‌ఎండీఏ
- అది తమ స్థలమంటూ ఐఏఎస్ అధికారుల అభ్యంతరం

మణికొండ: ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి లాంకోహిల్స్ వరకు హెచ్‌ఎండీఏ చేపట్టిన లింకు రోడ్డు నిర్మాణం ఇరు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఔటర్ నుంచి లాంకోహిల్ వరకు గత మాస్టర్ ప్లాన్‌లో భాగంగా ప్రతిపాదించిన సుమారు 2.35 లింకు రోడ్ల నిర్మాణం చేపట్టారు. శనివారం ఒకవైపు హెచ్‌ఎండీఏ అధికారులు పనులు కొనసాగిస్తుండగానే మరోవైపు ఐఏఎస్,ఐపీఎస్ అధికారులు ఈ రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకోవడం వివాదాస్పదంగా మారింది.ఆ రోడ్డు తమ సొసైటీకి చెందిన భూమిలో నిర్మించడం వల్ల తాము నష్టపోతామని, పనులను వెంటనే నిలిపివేయాలని ఉన్నతాధికారులు కోరారు. దీంతో ఈ వివాదం ఇరు వర్గాల ఉన్నతాధికారుల మధ్య మణికొండలో రోడ్డు వార్‌గా మారింది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ల్యాంకోహిల్స్ జీ సర్కిల్ నుంచి ఔటర్ రింగ్ రోడ్డును కలుపుతూ వంద అడుగుల వెడల్పుతో రోడ్డును ఏర్పాటు చేసేందుకు గతంలోనే హెచ్‌ఎండీఏ ప్రణాళికలను రూపొందించింది. అందుకు అనుగుణంగానే పనులను చేపట్టారు. ఐఏఎస్, ఐపీఎస్‌లు సొసైటీగా ఏర్పడి పుప్పాలగూడ రెవెన్యూ సర్వేనెంబర్ 454లో 57 ఎకరాలను ఆదర్శనగర్ మ్యూచ్యువల్ ఎయిడెడ్ కో- ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పేరుతో కాలనీ ఏర్పాటు చేసుకున్నారు. అప్పట్లో ప్రభుత్వం నుంచి ఈ భూమిని కొనుగోలు చేశారు.ప్రస్తుతం హెచ్‌ఎండీఏ అధికారులు వేస్తున్న రోడ్డు కొంతమేరకు సొసైటీకి చెందిన స్థలంలోంచి వేయవలసి వస్తుందని సమాచారం. దానికి అంగీకరించబోమని గతంలోనే ఐఏఎస్,ఐపీఎస్ అధికారులు హైకోర్టును ఆశ్రయించి స్టే పొందారు. ఇది చాలాకాలంగా పెండింగ్‌లోనే ఉంది.

తాజాగా వివాదం...

మణికొండలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరిగిపోతుండటంతో రోడ్డు పనులను పూర్తి చేయాలనే లక్ష్యంతో హెచ్‌ఎండీఏ అధికారులు శనివారం రంగంలోకి దిగి పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న సొసైటీ సభ్యులు వారితో పనులను ఆపాలని వాగ్వాదానికి దిగారు. హెచ్‌ఎండీఏ అధికారులు పనులు కొనసాగుతుండగానే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సైతం తమకు ప్రభుత్వం కేటాయించిన ప్రభుత్వ వాహనాల్లోనే తమ సిబ్బందితో సహా అక్కడకు వచ్చి పనులను అడ్డుకొనేందుకు ప్రయత్నించారు.దీంతో ఇరు వర్గాల మధ్య ఎప్పుడు ఏం జరుగుతుందోననే ఉత్కంఠ నెలకొంది. ఆదివారం కూడా రోడ్డు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టేందుకు హెచ్‌ఎండీఏ అధికారులు అక్కడే తిష్ట వేసుకుని పనులను కొనసాగించడం గమనార్హం.

సైబర్ వల... రూ.1.40 లక్షలకు టోకరా

జీడిమెట్ల: హెల్ప్‌లైన్ కోసం గూగుల్ నెంబర్‌కి డయల్ చేసిన వ్యక్తి సైబర్ నేరగాడి చేతిలో చిక్కి రూ.1.40లక్షలు పొగొట్టుకున్నాడు. ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ పవన్ తెలిపిన మేరకు.. సుభాష్‌నగర్ డివిజన్ ఎస్.ఆర్.నాయక్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి శనివారం రైల్వే టికెట్‌కోసం ఐఆర్‌సీటీసీ ఖాతాను ఓపెన్ చేశాడు. ఎన్నిసార్లు ప్రయత్నించినా ఖాతా ఓపెన్ కాకపోగా పాస్‌వర్డ్ మార్చుకోవాలని వెబ్ సైట్ సూచించింది. వినియోగదారుల హెల్ప్‌లైన్ కోసం గూగుల్‌లో వెతకగా ఓ నెంబర్ దొరికింది. సదరు నెంబర్‌కు కాల్ చేయగా ఓ వ్యక్తి మాట్లాడుతూ ఓ వ్యక్తి హెల్ప్‌లైన్ నెంబర్ అంటూ మాటలు కలిపాడు. పాస్ వర్డ్ మార్చేందుకు ముందుగా రూ.10 చెల్లించాలని కోరగా మోసపోయిన వ్యక్తి అంగీకరించడంతో ఓ నెంబర్ చెప్పి డయల్ చేస్తే పాస్‌వర్డ్ మార్పు చేసుకునేందుకు ఆప్షన్ వస్తుందని తెలిపారు. సదరు నెంబర్‌కు డయల్ చేసి వారు చెప్పినట్లు చేశాడు. దీంతో తన ఖాతా నుండి రూ.1.40లక్షలు విత్‌డ్రా అయినట్లు మేసేజ్ వచ్చింది. మోసపోయినట్లు గ్రహించిన సదరు వ్యక్తి జీడిమెట్ల పోలీసులకు పిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆ పట్టాభిషేకం... చారిత్రాత్మకం..



సాక్షి, సిటీబ్యూరో: యునైటెడ్ కింగ్‌డమ్‌లో శనివారం నిర్వహించిన పట్టాభిషేక వేడుక నేపథ్యంలో నగరంలోని బ్రిటీష్ డిప్యూటీ హైకమిషన్ తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రత్యేక అనుబంధ ఈవెంట్‌ను నిర్వహించింది. కింగ్ చార్లెస్ ఐఐఐ పట్టాభి షేక ప్రదర్శనను వీక్షిస్తూ సాగిన ఈ హై-టీ ఈవెంట్‌కు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాల ప్రముఖులు, దౌత్య ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ "అద్భుతమైన చారిత్రాత్మక కార్యక్రమం గురించి విశేషాలను అతిథులకు వివరించారు.

ప్రపంచ సాంకేతికతలో భారత్ ముందుంది

ఘట్‌కేసర్: ప్రపంచ సాంకేతికతలో భారత్ ముందుందని రక్షణ మంత్రిత్వ శాఖ సలహాదారు డా.జి.సతీష్‌రెడ్డి అన్నారు. శనివారం ఘట్‌కేసర్ మండలంలోని ఏసీఈ ఇంజనీరింగ్ కళాశాలలో కలామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇన్‌స్పైర్ హైదరాబాద్ ప్రోగ్రాంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కలాం ఆలోచనల్లో భారత్‌ను చూడాలన్నారు. మేకిన్ ఇండియా నంబర్ వన్ ఫలితాలను ఇస్తోందన్నారు. 2016లో భారత్‌లో 460 స్టార్టప్ కంపెనీలుంటే ప్రస్తుతం 90 వేల స్టార్టప్‌లు ఉన్నాయన్నారు. గ్లోబల్ థింకింగ్ పెరిగిందని, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇస్రో చైర్మన్ డా.సోమనాథ్, ఏసీఈ గ్రూప్స్ అధినేత గోపాలకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ బీఎల్ రాజు, కేబవైఈ ఫౌండర్ నరేష్, ఐబిటీ డైరెక్టర్ డా.బీఎస్ మూర్తి, బీడీఎల్ చైర్మన్ డా.పి.రాధాకృష్ణ, బ్రహ్మోస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డా.రాజాసింగ్ పాల్గొన్నారు.

PUBLIC NOTICE

The General Public are hereby informed that my client Mr. SYED ABDUL WAHAB S/o. Late Syed Abdul Ghani R/o 6-1-341, Padmarao Nagar, Secunderabad, T.S.-500025 has entered into an agreement of sale with Sri Palagiri Rama Prasad S/o Palagiri Chennakesavulu Naidu, Aged:72 years, Occ: Business, R/o H.No.8-3-167/D/123, Flat No.402, Kalyan Nagar Phase-1, behind J.J. Hospital, S.R.Nagar, Hyderabad, T.S-500038 for purchase of House bearing No. 1-8-450/1/A-33 on Plot No. A-33, in Sy. No.194/Part, admeasuring 290.63 Sq. Yards or 243.15 Sq. Meters with a plinth area of 47' 7.00 Sq. Feets situated at Indian Air lines Employees Housing Colony, Secunderabad, Telangana State- 500016. Bounded by, North: H.No. A-24, 1-8-450/1/A-24, South: 30 Wide Road, East: H.No. A-32, 1-8-450/1/A-32, West: H.No.A-22, 1-8-450/1/A-22 and paid part of sale consideration amount towards an advance.

If any persons having any objections, claims, rights, or interest with respect to the above said property and the transaction, may contact the undersigned within **Fifteen (15) days** from the date of publication of the Notice with all the relevant documents, claiming their right, failing which my client will be constrained to proceed with the said transaction and thereafter no claim shall be entertained.

Sd/-
M/s. K.S. J.BABU RAO,
J. NARSING RAO Advocates
Off: #: 1-10-98/20, 2nd Floor, Near Vatsalya Guest House, Care Plus Clinic, Dwarakadas Colony, Begumpet, Hyderabad, Telangana State -500016.
Cell: 9848531963

IN THE COURT OF THE HON'BLE II SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT HYDERABAD
O.S. NO. 973 OF 2018

Between :
M/s. ICICI BANK LIMITED having one of its office at ICICI Bank Ltd., Regional Processing Center, Sriram Towers, 3rd Floor, Opp. Shadan College, Khairatabad, Hyderabad- 500004 **...Plaintiff**

And
Avinash Gowtham Gorla **...Defendant**

To,
Avinash Gowtham Gorla .V.N.N S/o Satyanarayana G, Age 26 years, R/o Plot No. 992, Pragathi Nagar, Opp JNTU Kukatpally, Hyderabad. Pin 500090

Take Notice that the above suit is filed against you for recovery of money. Take notice that the matter is posted on **08-06-2023** for your appearance. You are hereby informed to appear in the Court at **10:30 AM** on that day either in person or through your counsel. Failing which the matter would be decided in your absence and will be heard ex-parte.

By order of the Court
C. V. Srinath
Advocate
Office No. 403 & 404, LEGEND COMMERCIAL COMPLEX, BARKATPURA, HYD- 27.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Education

FREE HR TRAINING

PRAISE THE LORD: పేద అమ్మాయిలకు HYD కూకట్‌పల్లిలో ఫ్రీ-వసతితో HR+ మీడియా+ డిజి॥ మా॥+అకౌంట్స్+కం॥120 డేస్ ట్రైనింగ్, తర్వాత వర్క్‌ఫ్రమ్ హోమ్ ఆదాయం, డిగ్రీ, స్మార్ట్ ఫోన్ మస్ట్.9032944447 [HA-5738]

MUSIC & DANCE

Piano, Singing, Guitar, Violin, Flute, Harmonium, Keyflute, Keyboard, Veena, Sitar, Drums Kit, Saxophone. Ph : 9246341990, (WhatsApp) [H-781587]

Real Estate

Chance to Invest HMDA, YTDA, DTCP approved Farm Plots @ N-H Way, ORR & RRR Near upcoming IT, Pharma, Tourism, Textile & Manufacturing Zones EMI Bank Loan & Free regn available. Ph: 7799195959 [H-797620]

BUILDING & CONSTRUCTION

40సం॥ అనుభవంగల Govt. సివిల్ కాంట్రాక్టర్, మెటీరియల్‌తో వాస్తు ప్రకారం & ఆర్కిటెక్ట్ ప్లానింగ్‌తో మీ బడ్జెట్‌లో వాస్తు. క్వాలిటీతో కట్టించి ఇవ్వబడును. సంప్ర: 9000896874. [H-781201]

ఇల్లు కట్టి ఇవ్వబడును. 100% వాస్తు క్వాలిటీ మెటీరియల్‌తో 20 సం॥ అనుభవం గల ఇంజనీర్లు, మేస్త్రీలు మీ బడ్జెట్‌లో కట్టి ఇవ్వబడును. Ph: 7386082969 [H-781601]

ఇల్లు కట్టి ఇవ్వబడును. అతితక్కువ SFT రేట్లలో(1500+1800) గుడ్ క్వాలిటీ మెటీరియల్స్, వాస్తు ప్రకారంగా వర్కింగ్ ప్లాన్స్‌తో & GHMC పర్మిషన్‌తో అతితక్కువ సమయంలో కన్‌స్ట్రక్షన్ చేయబడును. ఫోన్: 9676804219 [G-6734]

Construct ur Dream House with Good Quality Material at Reasonable Price as per Vastu in and Around Hyd. Call for Best Price@9666009005 [H-793414]

FLAT FOR SALE

Castle Hills, Behind NMDC Masabtank 3BHK Converted to 2BHK fully Renovated with AC, Chimney etc., 24 Hrs. water Facility, decent calm Locality. Ph:9866173703, 9866109703. [HA-10771]

Hubsiguda Street No-8, Hema Mansion 1240 SFT, North Face SBI Bank Building 2BHK Flat For Sale Call : 6300138100 [H-797467]

Premium Project Near Habsiguda. Last 5 3BHK Flats For Sale. Gated Community, Club House, Swimmingpool. Fully Completed. Must See Call : 9492427519 [H-797585]

On Warangal Hwy, Opp : To D Mart Pocharam, Near Infosys, EAST Hyd. 2&3BHK Flats - 1437 SFT To 1962 SFT Club House, Swimmingpool Gated Community Call : 9873816525 [H-797584]

Flat 3BHK 56 Lakhs (Fixed) 15 yrs Old, Sri Lakshmi Residency, Tarnaka, E/F, 1320 Sft. UDS-35 Sq.yds, Near St. Anns School, Ph: 8978974761, 7386734669. [H-793679]

Neredmet, Near Ramakrishna Puram MMTS Rly Stn. 2&3 BHK DLX Flats, occupation 4 Months, Community of 75 Flats. Ph:9849529518, 9440148865 [HA-93162]

Jeedimetla, TSIIC Colony, Shapur Elite County, 2&3 BHK, 1000sft-1550Sft, GYM, Function Hall, Play Area, Ready to Occupy 8790738313, 8008813256. [H-781666]

GAJWEL - JAGADEVPUR
Land for sale 2 Acres 46 Lakhs/Acre Near Now Proposed RRR Vattipally (Village) Jagadevpur (Mandal)
Call: 9505056295

2BHK Flat 1055 Sqft. 1st Floor, E/F, (Fully Furnished), Car Parking Location: PJR Road, Chandanagar, Ph :9573598485, 9573347351. [H-793676]

Uppal Ring Road 2bhk 1000 sft, 1st Floor, East Facing, Lift, 24hrs Water, Close to Metro, Lahari Susheela Apts. Ph : 9246156010 [H-781582]

2&3 BHK North, East and West facing flats for sale in Medchal opposite Boys High school, Railway station Road.call 9866566593, 9849003787 [YA-7803]

HOUSE FOR SALE

బండ్లగూడ జాగీర్ కిస్మత్‌పూర్, యాదాద్రి కాలనీ 140గా॥ల. ఇండి పెండెంట్ ఇల్లు (G+1, E/F 40Ft. Road) Rs. 1.65Cr. అమ్మకమునకు కలదు. గండిపేట (మం), రంగారెడ్డి (జిల్లా), ఫోన్ : 8008843371, 8555918288 [H-792867]

యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహా స్వామి టెంపుల్ కి 500 Mtrs. కి దూరంలో 1BHK, 2BH, Suit Room కి, DTCP & RERA Approved తో 80% SBI Bank Loan కలదు. ఫోన్ : 9010884728 [H-796780]

Balapur, RCI Road, Independent, G+1 & Duplex House for Sale. Bank Loan Available. Ph : 9849356180, 9182493387. [H-781585]

House for Sale Dammaiguda Main Road, A S Rao Nagar, G+2, 127 Sq. Yds. 2700 Sft. N/F. Gated Community. Ph : 9731119800 [H-781616]

Independent House For Sale at Nadargul X Roads G+3, 6 portions 173 squads Near TCS All amenities Ph. 7386756033 / 8985798606 [H-781670]

655 sq yds Huda Plot For Sale in Bhagyanagar Colony phase 2, kukatpally. 7032239023 [HA-93241]

Gandhinagar Triplex House 223S/Yds Fully Furnished Exct Interiors, Home theatre, Internal Lift. 7032239023 [HA-93242]

2BHK Flats & INDP Houses with Furniture HMDA, Near Hayathnagar, Gated Community, Loans, B. Bheem Reddy,Ph:8885060741,9700974808 [HA-10743]

Nadergul Ashok Reddy Colony, G+1, 100Yds, 25Ft Road, 4 Houses, 1St Flr. 1BHK, 2nd Flr. 2BHK, E/W/F For Sale. Rs. 75 Lakhs. Ph : 9652486977 [H-793672]

Dr. AS Rao Nagar, Sainath Puram, G+1 Indp. Duplex House, 111 Sq.yds 2BHK, South Face, 15 years Old House Ready to Occupy. 92Lacs. Fix. Ph : 7901566661, 7901430444. [H-781604]

Dammaiguda Laxminagar Phase -2, Gated Community 167 sqyds E/F indp House For Sale No - Brokers Ph : 9849148945, 9502873050 [H-797462]

GAJWEL- SIDDIPET
LAND FOR SALE
2 ACRES (Agriculture)
Kondapochamma Temple Road
Wattipally (V)
Jagadevpur (M)
9493174151

LAND FOR SALE

మహేశ్వరం రియల్ ఎస్టేట్: మన్‌సాన్ పల్లి, ఆమీర్‌పేట్, నాగారం, కందుకూరు, తుక్కుగూడలో ప్లాట్లు, వ్యవసాయ భూములు & రీసేల్ ప్లాట్లు అమ్మబడును. & కొనబడును. ఫోన్: 9177887748 [H-792876]

Chevella to Shankarpalli Road, Kammeta (V) Very Close to Yenkapalli 'X' Road. Adjacent to ANG Garden. Total Land 9 Acer 21 Guntas. Ph : 9848857707, No Brokers. [HA-10770]

2 Acres - 28 Guntas Land with Boundary Wall Available For Sale At Cheeriyala Service Road, Near Keesara ORR No Brokers, No Middle Man. Ph : 8801057873. [HA-5349]

PLOT FOR SALE

Near ఘట్‌కేసర్ మాదారం IT HUB ను ఆనుకొని 100 Ft. రోడ్డుకు HMDA/RERA అప్రూవ్డ్ ప్లాట్లు గ॥కి॥ 14,999/- ఈరోజు ఆఫర్ 12,456/- మాత్రమే, బ్యాంక్‌లోన్ కలదు. ఫోన్: 8790294996 [H-781618]

ముంబై హైవే సదాశివ పేట్ సమీపంలో @ కొహీర్ 'X' రోడ్ దగ్గర 100 ఎకరాల DTCP ప్రాజెక్ట్, గజం : 2500/- సంప్ర: 7306202389. [HA-1919]

షాద్‌నగర్@రాజాపూర్ దగ్గర, 0% ఇంట్రెస్ట్‌తో 30 నెలల EMI తో అన్ని డెవలప్‌మెంట్స్ 147 గజాలMUDA=(HMDA)లేఔట్‌లో ఓపెన్ Plots కలవు.ఫ్రీ సైట్ విజిట్. ఫోన్: 9949695027. [HA-133]

సదాశివపేట బాంబే హైవేకి అనుకొని అన్ని డెవలప్‌మెంట్‌లతో DTCP అప్రూవ్డ్ విల్లా ప్లాట్స్ అమ్మకానికి కలవు & మార్కెటింగ్ టీమ్ కావలెను. ఫోన్ : 8008005082. [HA-1648]

బెంగుళూరు హైవే షాద్‌నగర్ దగ్గర 104 ఎకరాల మెగా ఫ్రూట్స్ ఫాం ల్యాండ్ అందమైన వెంచర్‌లో పోలెపల్లి SEZ ప్రక్కన 2 మరియు 5 గుంటల ప్లాట్లు కలవు. గజం 6499/- ఫిక్స్‌డ్ బై బ్యాక్ ఆఫర్ కలదు. సంప్ర: 9666695886 [G-3076]

శ్రీశైలం హైవే ఆమనగల్ దగ్గరలో అతి తక్కువ ధరకే Open Plots కేవలం గజం 1799/- ఆఫర్ మూడు రోజులు మాత్రమే. Dhana Real Estate. ఫోన్ : 7799266772, 9963466615. [HA-10744]

VJA, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ. గన్నవరం, బందర్ రోడ్డు, కంచికచర్ల దగ్గర శ్రీగంధం మొక్కలతో ఇళ్ళ ప్లాట్స్ చ॥గ॥ 1,900/- నుండి 17,500. సంప్ర : ✆ 99668 71039 [B-31]

491 Sq.Yds @ Koheda, Nr. Outer Ring Road North East Conrer, Plot No. 890, Survey No. 796. Plot For Sale Rs. 16000/-per Yard. Ph : 9849079921. [H-781306]

1820 Sq.Yds 40Ft. Rd. Cyber City Torrur Village, Turkayamjal, Hayathnagar Suitable for Apartments and Gowdowns 25000 per Sq.yds. Ph : 9885909961. [H-781365]

250 Sq.Yds East 50Ft. Rd. South 30Ft. Rd. Corner P.No. 325, Cyber City Torrur Village, Turkayamjal, Hayathnagar Per Sq.yard. 30000/- Ph : 9885909961. [H-781364]

400 Sq.yard Plot for Sale In Motinagar, Borabanda, Contact : 9581508660. [H-797587]

SRIKRUTHI ELITE
Bongloor Junction (ORR Exit No.12)
ADIBATLA MUNICIPALITY
HMDA PLOTS FOR SALE
On Sagar Road
100 Feet Road Facing
hmda
LP No.000121/LO/PLG/HMDA/2022 P024005164
Registration Free, Bank Loan
SGD 9100446677

HMDA and RERA Approved Villa Plots with all Develoments, R1 Zone Bank Loans, near Adibatla and Shankarpally. Contact : 9652999829. [H-797586]

Jubilee Hills - East Facing, Commercial / Residential Society Plot, 390 Sq.yds. Near Apollo Hospital. Clear Title & Contact : 9703029212. [H-792875]

East-South Facing Corner Commercial /Residential Plot (63 square yards) Located at 2nd Street, Vani Nagar, Malkajgiri. East Face 30ft Road & South Face 30ft Road. 120 metres from main Commercial Centre 8374390599. [HA-1261]

Mallapur Village Saroor Nagar (Mandal) Venkatapur Grampanchayat, Plot No-4, W/F, 33 Ft. Road, 286 Sq. yds RCI Road. Call : 6300138100. [H-797468]

DTCP Open Plot 120 Sq.yards With 10 Sandle wood Trees is 7 Lakhs. After 12 Years You May be Earn 60-70 Lakhs Ph: 9441512442 [H-781581]

HMDA Final Approved Residential Premium Villa & Villa Plots Luxury, Bank Approved Gated Community, Entire Layout Compound Wall, 100 Feet Road Facing with all amenities on Tellapur to Shankarpally Main Road, Near Financial District, Hyderabad, Plot Sizes 183 to 600 Sq. yards. Ph: 9948082907/8, 8886770068 WhatsApp/SMS Only. [HA-29397]

Services

Independent House, Apartments, Flats, పై Private Finance & Personal Business, Housing, Mortgage Loans Banks నుండి ఇప్పించబడును. Ph: 7981878405. [H-797528]

ABDHIKAMULU

పంచాశ్రీ సేవా గృహము, ఆబ్దిక, మాసిక, సంవత్సరీకములు, పూర్వ అపరములు బ్రాహ్మణ వసతి భోజనంతో విడివిడిగా కాంట్రాక్టు పద్ధతిలో శాస్త్రోక్తంగా జరిపించ బడును లేదా మీ బ్రాహ్మణులతో కార్యక్రమము చేయించుకొనుటకు వసతి అతి తక్కువ ధరలో ఇవ్వగలము, పద్మాకాలనీ, నల్లకుంట. ఫోన్: 7386866262, 9515130016. [H-781658]

AGRI BUSINESS

శుభవార్త పంట్లు పామాయిల్ తోటల పెంపకంపై 50-90 శాతం రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై మొక్కలు & వెంచర్లలో తక్కువ ధరలకే అందమైన మొక్కలు నాటబడును. ఫోన్ : 9573943211. [H-792877]

FOR SALE

ఫంక్షన్ హాల్ అమ్మబడును. నాగార్జున సాగర్ హైవే RR Dist మాల్ దగ్గర మంచి రన్నింగ్‌లో ఉన్న ఫంక్షన్ హాల్ అమ్మబడును. 3000గజాలు, 15000Sft. Rs. 2.85Cr. Ph: 6302696895. [HA-10769]

BEAUTY CARE

WANTED

చామ్స్ బ్యూటీ పార్లర్‌లో వర్క్ చేయుటకు (3-4సం॥) Exp. లేడీ బ్యూటీషియన్స్ కావలెను. నారాయణగూడ. ఫోన్ : 9394893909 [H-796847]

BUSINESS SERVICE

మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739 [H-797511]

BUSINESS OFFER

ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషీన్స్ పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు 100% తిరిగి కొనుగోలు ఒప్పందం, ఫోన్: 9810515624, 8800496710 [DA-36266]

Cafe Rosca is up for Sale a Cafe with a Lovely Ambience, Equipped with Perfect Kitchen Equipment & the Perfect Menu to Complement it. Ph:8074030934, 9705482292 [HA-13762]

We Give Business / Income Ways in Education & Entertainment Fields Earn with us & Grow with us Call : 6371797847 [H-797465]

INSURANCE

కోటి రూ॥లు మొత్తం మెచ్యూరిటీ కొరకు, కోటి రూ॥ల తక్షణమే ఇన్సూరెన్స్ కొరకు ప్రతిరోజు 300/- రూ॥లు చొప్పున పొదుపు చేయండి. పెన్షన్, పిల్లల మనీబ్యాక్ LIC పాలసీల కొరకు, కరోనా రక్షక్ హెల్త్ పాలసీ కొరకు, శ్రీరామ్ చిట్స్ & డిపాజిట్ కొరకు సంప్ర: 9246351657. WWW.LICSAMRAT.COM [HA-10725]

HOME NEEDS

WATER PROOFING

శ్రీసాయి భవానీ వాటర్ ప్రూఫింగ్: మీ ఇంట్లో వాటర్ లీకేజీ ఉందా! సీలింగ్, వాటర్ ట్యాంక్, సంపు, బాత్రూమ్స్, సైడ్‌వాల్స్, టెర్రస్, ఎటువంటి లీకేజీ అయినా కెమికల్స్‌తో బాగు చేయబడును. 9948270898 [H-781480]

PERSONAL CARE

OLD AGE HOME

అరుణోదయ ఓల్డేజ్‌హోమ్ తార్నాక నందు వృద్ధులకు & Paying Guest కు అతి తక్కువ ధరలో Singles Sharing Rooms తో ఇంటి భోజనం కలదు. Ph: 7794030847/ 9703893158 [H-796846]

మీన్స్ వృద్ధుల సేవా సంస్థ నందు వృద్ధులకు, బెడ్ పేషెంట్స్‌కు, దీర్ఘవ్యాధులలో ఉన్నా వారికి, మానసిక, శారీరక వికలాంగులకు 24 గం॥ వైద్య, భోజనం, వసతి. ECIL, Hyd. సంప్ర: 9949520296/7981467036/6281127224. [H-781614]

TOURS & TRAVELS

మా టూర్స్ చార్‌ధామ్ 15రో॥ 12యా॥ మే-10, కాశీ 9రో॥ 12 రో॥, 17 యా॥ జూన్-10, అమర్‌నాథ్ 10రో॥, 12యా॥ జూలై-9, మానససరోవర్ 15రో॥ 27/8 వ+భో॥ తో. ఫోన్: 6304230161, 9493652100 [H-796773]

మహర్షి యాత్రలు: (i) 16రో॥19క్షే॥ చార్ధామ్ 11/5 & 25/5 & 10/6, (IV) 29/6 అమర్నాథ్, వైష్ణో దేవి 17రో॥18క్షే॥, శర్మ. 9492058713, 8019821107 [G-6704]

Wanted

మాదాపూర్ లోని రియల్ కం॥కి **Female** టెలికాలర్స్, P. సెక్రటరీ కావలెను, Qly.: 10th-Degree. Age: 18 to 35yrs. Sal: 12K-25K, Good Communication Required. Ph: 9948453222 [H-796779]

బాల్‌నగర్, కొండాపూర్ ఏరియాలో ప్రముఖ సెక్యూరిటీ కం॥లో పని॥కు లేడీ సెక్యూరిటీ గార్డ్స్ & జెంట్స్ సె॥గార్డ్స్ కావలెను. 12గం॥ జీ. 14k - 16K. సంప్ర: 9392834840, 7989563904 [H-781613]

హోటల్,రెస్టారెంట్‌లో పని॥కు గర్ల్స్/బాయ్స్ వెయిటర్స్, టిఫిన్ మాస్టర్స్, మీల్స్ మాస్టర్స్, టీ మాస్టర్, స్టాల్‌బాయ్, రుబ్బింగ్ మాస్టర్ కావలెను. హైద్రాబాద్, సిద్ధిపేట్, విజయవాడ. ఫోన్: 9704731479 [H-781617]

బేబీకేర్, పేషెంట్‌కేర్, ఇంటిపని, వంటపని చేయుటకు అర్జెంట్‌గా కావలెను. జీతం: 15-25వేలు, రూం+మీల్స్ ఫ్రీ. 24/7, 4, 8, 12 Hrs. ఫోన్ : 6303684676, 8019315552 [HA-29609]

కొత్తపేట్ ఇండియన్ పీస్ టెక్స్‌టైల్ షోరూంలో పనిచేయుటకు సేల్స్‌గర్ల్స్ కావలెను. అనుభవం ఉన్నా/ లేకున్నా, జీతం: 8000-10,000/-+ సేల్స్ కమీషన్. ఈ ఏరియా వారికి ప్రాధాన్యత. ఫోన్: 9440113497. [H-797470]

మల్లాపూర్, తార్నాక, Hydలో ఇంట్లో ఉండి ఇంటిపని, వంటపని చేయుటకు ఆడమనిషి కావలెను, మంచి జీతం, భోజనం+వసతి, కొంచెం శారీరక వైకల్యం ఉన్న పర్వాలేదు. ఫోన్: 9849837483 [H-781305]

CM హోమ్‌కేర్ సర్వీస్: బేబీకేర్, ఇంటి, వంట, పేషెంట్స్ చూసుకోవడానికి కేర్ టేకర్స్, ఇంటికి పంపబడును. 20-50y స్త్రీ/పు, 24/7 మా వద్దనే ఉండి లాంగ్ టైమ్ డైవర్ వర్కర్స్ కావలెను. జీ: 16-20K. 6309807798, 9121099519 [H-797531]

లేడీస్ దుస్తులు కుట్టుటకు టైలర్ మాస్టర్ కావలెను @ శ్రీనగర్ కాలనీ, అమీర్‌పేట్. సంప్ర.: 9391012307 [H-781586]

శ్రీ సాయి హోం కేర్ 24/7 మా వద్ద వుండి మంచం మీద ఉన్న వృద్ధులకు సేవ చేయటానికి, పిల్లలను చూడటానికి పని వారు కావలెను. ఫోన్ : 9533909627, 9494071023 [H-793681]

గూగుల్ పే బిజినెస్ On Board చేయుటకు మార్కెటింగ్, ఎగ్జిక్యూటివ్స్ కావలెను. Q:10th-Degree, Sal:25Kto35K. (మదీనాగూడ, మియాపూర్, కూకట్‌పల్లి, KPHB), ఫోన్: 7989746407. [H-797530]

ఉప్పల్ పరిసరాల నుంచి మా ఫార్మా కి టూర్ చేయగల సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ అనుభవం/ట్రైనీ, B.Sc లేడీ ట్రైనీ, సూపర్‌వైజర్ (40Yrs.) హెల్పర్ బాయ్స్, ప్యాకింగ్ గర్ల్స్ కావలెను. ఫోన్ : 9515906315. [H-781671]

టెలికాలర్స్, రిసెప్షనిస్ట్: 10th, ITI, BE, BTK, MBA, MCA, వీడియో ఎడిటింగ్, కలెక్షన్ MKTG స్టాఫ్, డ్రైవర్లు, హెల్పర్లు, సూ॥వైజర్స్, ఆయాలు, జీ. 10-20K+ ఫ్రీ హాస్టల్. ఫోన్ : 9505261777 [H-797625]

అర్జెంట్‌గా సెక్యూరిటీ గార్డ్స్ కావలెను: ఏరియా ఉప్పల్, సికింద్రాబాద్, ప్యారడైజ్, అమీర్‌పేట్ లలో, సంప్రదించండి: స్వామి 9392143108, 9652520827 [HA-10762]

అమీర్‌పేట్ లో సెక్యూరిటీ సూ॥వైజర్స్ కా॥ 12గం॥ డ్యూటీ. జీ: 14వేలు. బేగంపేట్, అమీర్‌పేట్ లో సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12గం॥ డ్యూటీ, జీ: 13వేలు. సంప్ర: 7032086797, 9949830907 [H-797582]

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. అత్తాపూర్ పిల్లర్ నెం. 150 దగ్గర ప్రముఖ హాస్పిటల్‌లో (M/F) 12 డ్యూటీ కోసం గార్డ్స్ కావలెను. జీతం: 13-15వేలు & లక్డీకాపూల్, హౌస్ కీపింగ్ కూడా కావలెను. సంప్ర: 8978907070 [H-797581]

విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, దోస్త్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ: 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 90300 44646. [B-1165937]

జీవితాంతం ఎక్కువ సంపాదన ఏ పెట్టుబడి లేకుండా కావాలంటే LIC ఏజెంట్‌గా చేరండి. 10th పాస్ అయి ఆడ/మగ పార్ట్/ఫుల్ టైం పనిచేయుటకు సంప్ర: 9246351657 [HA-10726]

సికింద్రాబాద్ లోని ఆఫీస్‌లో వర్క్ చేయుటకు M/F టీంలీడర్స్, టెలికాలర్స్, ఎగ్జిక్యూటివ్స్ కావలెను. **Sal: 10K to 15K.** ఫోన్: 9030660487. [H-796848]

ప్రముఖ క్లినిక్‌లో పనిచేయుటకు కాంపౌండర్లు, నర్సులు కావలెను & ఇంట్లోనే ఉండి వంటపని, ఇంటిపని చేయుటకు "ఆడమనిషి" కావలెను. ఫోన్: 9849063056, 9059372310 [H-781579]

పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-797573]

ప్రముఖ మ్యారేజ్ బ్యూరోలో పనిచేయుటకు లేడీ టెలికాలర్స్+కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. మంచి జీతము +ఇన్సెంటివ్స్. Q:10th-Degree, రామాంతపూర్ పరిసర ప్రాంతాల వారికి ప్రాధాన్యత: ఫోన్ : 9581566072. [HA-13757]

అజీజ్ నగర్ సమీపాన ఉన్న ప్రముఖ ఇంటర్‌నేషనల్ స్కూల్‌కి సెక్యూరిటీ గార్డులు -30 కావలెను. మంచి జీతం ఇవ్వబడును. ఫోన్ : 9849079995, 7386173670 [HA-10766]

పర్మినెంట్ జాబ్స్, ప్రముఖ సంస్థ నందు డేటా ఎంట్రీ ఆపరేటర్స్, సూపర్‌వైజర్, క్లర్క్, ఆఫీస్ బాయ్స్ కావలెను. Qul: 5 to డిగ్రీ, జీతం: 15000 to 35000 ఫోన్ : 9440828190 [HA-6164]

జీడిమెట్ల IDA ఇండస్ట్రీ ఏరియా ఇంటర్‌టెక్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో పని చేయుటకు అనుభవజ్ఞులైన ఎలక్ట్రీషియన్లు కావలెను. 8గం॥లు డ్యూటీ. ఫోన్ : 9849079995. [HA-10767]

వంట మనిషి కావలెను, ప్రముఖ కాలేజీలో పనిచేయుటకు, జీతం : 15వేలు-30వేలు, నిజాంపేట్ రోడ్డు, జేఎన్టీయూ దగ్గర, ఫోన్ : 9502937699, 9100094699 [HA-29488]

NGO ఆర్గనైజేషన్ దిల్‌సుఖ్ నగర్, లేడీ టెలికాలర్స్ కావలెను. వయస్సు: 35సం॥ లోపు, జీతం: 15,000/- + ఇన్సెంటివ్స్, ఫోన్ : 9666536627, 8121456580 [H-796900]

హైదరాబాద్‌లో పనిచేయుటకు ఉత్సాహవంతమైన యువతీ యువకులు కావలెను. POS : టెలీకాలర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, ఫీల్డ్ స్టాఫ్, Qul : Inter / Degree, P/F, Food, Accomidation Free ✆ 88971 70985 [B-786305]

మా కంపెనీ నందు వర్క్ ఫ్రమ్ హోమ్ ద్వారా పార్ట్ టైమ్/ఫుల్ టైమ్‌తో మెటీరియల్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం: 15000 + ఇన్సెంటివ్స్. 8341371684 [G-786222]

సెక్యూరిటీ గార్డ్స్, సె॥సూపర్‌వైజర్, కా॥ L.B. నగర్, ఘట్‌కేసర్, బాచుపల్లి, కొల్లూర్, జీడిమెట్ల, కాజగూడ & ఆఫీస్ బాయ్స్, హౌస్ కీపింగ్ కా॥ మంచి జీతం. మెట్రో మేనేజ్‌మెంట్. ఫోన్ : 9885657755, 9963077722. [H-781417]

రెసిడెన్షియల్ స్కూల్ హాస్టల్‌లో ఉంటూ పని చేయుటకు అర్హులైన యువ టీచర్స్ & ట్యూటర్స్ కమ్ వార్డెన్స్ కావలెను. జీతం: 15000-18000, హయత్‌నగర్, Hyd. ఫోన్ : 8790998430 [H-797464]

A Reputed Insurance Company లో Part Time / Full Time గా పనిచేయుటకు Advisors కావలెను. Salary+Incentives. Contact ఫోన్ : 9704089932. [HA-147]

Need MF Who Are Good At ENG Speaking, as PRI & HS Spoken ENG Trainers. Experience, not a must. Free Training by CFEL. Sal 20 - 30K. Ph : 8919641609 [H-781477]

Computer Operator, Car Driver/ Diploma/ ITI Civil for Valuer's Off Dr. A S Rao Nagar, ECIL, Hyd. Ph:9849267445. tnsvaluer@gmail.com [H-781363]

Wanted Telecallers and Sales Managers for Reputed Construction Company, Salary + Incentives. Cont: RainBow Children Hospital, Nanakramguda. Ph:6300407796, 9885468071 [H-781422]

Computer Hardware Engineers (Field work) having experience in Printer Installation and Networking. Cont.: 9246475192, 9032041574. Mail: klcps2@gmail.com [B-080]

Wanted A Godly Person to Pastor A Church. A Committed Person to lead 98 Yr's Old Baptist Church, South Lallaguda. Age: 45+, Qual: BD, Exp. 10-15Yr's of Church Pastoral Services. Should Possess a Marriage License By Government AP/Telangana. Should Assit Church Commitee in Counselling, Organizing Coordinating, Evaluating all Church Programs, Ministries. Ph : 8978411217, 9885672482. [H-781619]

Wanted Computer Operator, Female Tele Callers. Salary: 10000/- to 15000/-. Qualification: Any Degree. Job Location: Ameerpet, Hyd. Contact: 8008556087, 9248733346 [G-4221]

FACULTY TEACHERS

శ్రీ కాకతీయ జూ॥ కళాశాల గోదావరిఖని, జి.పెద్దపల్లి నందు కెమిస్ట్రీ, ఫిజిక్స్, జువాలజీ, మాథ్స్, మెయిన్స్/నీట్ ఫ్యాకల్టీ (ఉచిత వసతి) & హాస్టల్ వార్డెన్స్ కావలెను. ఫోన్: 8008688976, 9010418680. [H-793682]

Sri Vidya Degree College- Chintal. Wanted: Principal & Lecturers Commerce, Computer Science, English, Sanskrit, Arabic Faculty Min. 5 years Experience& 55% in Concerned Subject. Send Your Resume To Mail Id: srividyadegreecollege.hyd@gmail.com on or Before 07-05-2023 Contact : 8125200423. [HA-2494]

Wanted Qualified Experienced Teachers for primary and High School for English, Science and Computer on 08-05-2023 come along with your Resume and Certificates, SFS HIGH SCHOOL, Medipally, Hyd. Ph : 9032887795, 040-29880005. [HA-93066]

Wanted Teachers, Incharges Front office, PET ' S at Vidya Jyothi High School. ChengiCherla. Contact :9110571077/9989393501 [H-781609]

Urgently Required H.M. & Teachers for All Subjects I to VII at Vanasthalipuram. Contact: 9000977413, 9000405997 [H-781408]

Wanted Pre-Primary, Primary to High School Teachers Joy High School, Opp: TKR Engg. College Meerpet, Send your Resumes through WhatsApp : 7680803231, 9052720023 [H-781413]

Wanted Computer Operater, Marketing Incharges, Vice Principals, Marketing Team Leaders, Female Hostel Incharges, Female Hostel Wardens. Salary 10,000 to 25,000/- Job Location: Dilsukhnagar, Hyd. Qualification: Any Degree / B.Tech. Contact: 8978180857, 9100069079 [G-4224]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా...

సామాజికవేత్త పెండ్యాలకు జీవన సాఫల్య పురస్కారం


పురస్కారాన్ని అందజేస్తున్న తనికెళ్ల భరణి

బంజారాహిల్స్: సంగమం ఫౌండేషన్ రజతోత్సవ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమం శనివారం బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని రావినారాయణ రెడ్డి ఆడిటోరియంలో జరిగింది. ఇందులో భాగంగా ప్రముఖ వ్యాపారవేత్త, సామాజికవేత్త పెండ్యాల హరినాథ్ బాబుకు జీవన సాఫల్య పురస్కారాన్ని రచయిత, నటుడు తనికెళ్ల భరణి, నటి శ్రీలక్ష్మి, ఎస్.పి. శైలజ, రోజారమణి, సంజయ్ తదితరులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 11, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 19, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 35, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 13, క్యారెట్ 28, దొండ 18, గుండుబీన్స్ 97, గింజ చిక్కుడు 50, గోకరకాయ 45, కీర 13, దోసకాయ 23, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 10, ఆలుగడ్డ 20, చామగడ్డ 33, మొరంగడ్డ 19, కందగడ్డ 53, సొరకాయ 7, పొట్లకాయ 18 అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-6 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

విద్యాసంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలి

లిబర్టీ: విద్యా సంస్థలు ప్రారంభం కాకముందే కార్పొరేట్ విద్యా సంస్థలు అడ్మిషన్లు ప్రారంభించి పేద విద్యార్థుల నుంచి వేలాది రూపాయలను ఫీజుల రూపంలో దండుకుంటున్నాయని.. వాటిని నియంత్రించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్రు కుమారస్వామి పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలనే ఆశను బలహీనతగా చేకొని ప్రైవేటు, కార్పొరేటు విద్యా సంస్థలు అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించాయన్నారు. శనివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అనుమతి లేకుండానే నిబంధనలకు విరుద్ధంగా ముందస్తుగా ప్రైవేటు కార్పొరేట్ విద్యా సంస్థలు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు.

పార్కుల అభివృద్ధికి చర్యలు

సనత్‌నగర్: పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ పార్కుతో పాటు మరో 10 పార్కుల్లో రూ.9.88 లక్షల వ్యయంతో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు పనులను శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. పార్కుల్లో లైట్లు లేకపోవడంతో సాయంత్రం వాకర్స్‌కు ఇబ్బందికరంగా ఉందని పలువురు తన దృష్టికి తీసుకురాగా ఈ విషయాన్ని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు చెప్పడం జరిగింది. ఆయన వెంటనే స్పందించి ఎక్కడెక్కడ లైట్లు ఏర్పాటు చేయాలో గుర్తించి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. మంత్రి చొరవతో డివిజన్ పరిధిలోని అన్ని పార్కుల్లో లైట్ల ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇంకా పార్కుల్లో ఎలాంటి సమస్య ఉన్నా దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. కార్పొరేటర్ వెంట డీఈ కిరణ్మయి, నాయకులు కొలను బాల్‌రెడ్డి, వరప్రసాద్, విష్ణు, నందకిషోర్, శరత్‌బాబు, వెంకటాద్రి, భూషణ్, పురుషోత్తం, సురేందర్ ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు భరోసా

బన్సీలాల్‌పేట్: సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజల వైద్య ఆరోగ్య చికిత్సల కోసం కొండంత అండగా ఉంటుందని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం బన్సీలాల్‌పేట్ డివిజన్ రామస్వామి కంపౌండ్‌కు చెందిన చిన్నారి అభిగల్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోవడంతో ప్రభుత్వం నుంచి మంజూరైన ఎల్‌ఓసీ పత్రాన్ని శనివారం మంత్రి కుటుంబ సభ్యులకు అందజేసిన అనంతరం మాట్లాడారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో ఎంతో మంది పేదలకు వైద్య చికిత్సల కోసం లక్షలాది రూపాయలను మంజూరు చేయించడం జరిగిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు పేదల వైద్య ఆరోగ్యం మెరుగు కోసం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేషన్, వెంకట్ ముదిరాజ్, కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ నిరసన సభను విజయవంతం చేయాలి

సికింద్రాబాద్: నగరంలో ఈ నెల 8న నిర్వహించనున్న నిరుద్యోగ నిరసన సభకు సికింద్రాబాద్ ప్రాంతం నుంచి పెద్దసంఖ్యలో నిరుద్యోగులు తరలివచ్చి విజయవంతం చేయాలని టీపీసీసీ సీనియర్ నాయకుడు ఆదం సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. నగరంలో జరుగనున్న నిరుద్యోగ నిరసన సభకు ఏఐసీసీ అగ్రనాయకురాలు హాజరవుతున్న నేపథ్యంలో పీసీసీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నట్టు సంతోష్‌కుమార్ తెలిపారు.

డివిజన్‌కో వార్డు కార్యాలయం

- పౌరులకు మెరుగైన సేవలే లక్ష్యం
- ప్రజలకు మరింత చేరువ చేసేలా ప్రభుత్వం నిర్ణయం
- కార్యాలయాలను ఎంపిక చేస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

జీహెచ్‌ఎంసీ పరిధిలోని పౌరులకు మెరుగైన సేవలే లక్ష్యంగా వివిధ సేవలను మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దూర ప్రాంతాల్లో ఉన్న సర్కిల్ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ప్రతి డివిజన్‌లో వార్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేసి అక్కడి నుంచి సేవలు అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు, జోనల్ కమిషనర్లు, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్లు కసరత్తు ప్రారంభించారు.

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో వెంకటేశ్వరకాలనీ, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, సోమాజిగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్లు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లోని ప్రతి డివిజన్‌లో వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు.

- బంజారాహిల్స్ డివిజన్ వార్డు కార్యాలయాన్ని బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని సీఎంటీసీలో, జూబ్లీహిల్స్ డివిజన్ వార్డు కార్యాలయాన్ని జూబ్లీహిల్స్ క్లబ్ ఎదురుగా ఉన్న జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో, వెంకటేశ్వరకాలనీ డివిజన్ వార్డు కార్యాలయాన్ని బంజారాహిల్స్ రోడ్‌నెం. 7లోని మీసేవా కార్యాలయం ఆవరణలో ఉన్న జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో, ఖైరతాబాద్ వార్డు కార్యాలయాన్ని ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.
- ఇప్పటికే ఆయా కార్యాలయాల్లో ఫర్నీచర్, ఇతర మౌలిక సదుపాయాలపై దృష్టి కేంద్రీకరించారు.
- సోమాజిగూడ వార్డు కార్యాలయాన్ని స్థానికంగా జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసే దిశలో కసరత్తు జరుగుతోంది.
- హిమాయత్‌నగర్ వార్డు కార్యాలయాన్ని కూడా స్థానికంగా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో కొనసాగుతు న్న భవనంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.
- జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, ఎర్రగడ్డ, వెంగళ్‌రావునగర్, బోరబండ డివిజన్ల పరిధిలో దేనికవే ప్రత్యేకంగా ప్రతి డివిజన్‌లో ఒక వార్డు కార్యాలయం చేసేందుకు కసరత్తు జరుగుతున్నది. ఎక్కడెక్కడ భవనాలు అందుబాటులో ఉన్నాయో వాటిని ఎంపిక చేస్తున్నారు.


బంజారాహిల్స్ రోడ్ నెం. 7లోని వెంకటేశ్వరకాలనీ డివిజన్ వార్డు కార్యాలయం


జూబ్లీహిల్స్ డివిజన్ వార్డు కార్యాలయ ఏర్పాట్లు చూస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

ఏఎంసీ స్థాయి అధికారి...

- ప్రస్తుతం డివిజన్లకు కలిపి ఒక సర్కిల్ కార్యాలయం ఉండగా డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ హెడ్‌గా వ్యవహరిస్తున్నారు. కొత్తగా ప్రతి డివిజన్‌కు ఒక వార్డు కార్యాలయం ఏర్పాటు చేయాలని నిర్ణయించగా ఆ వార్డు కార్యాలయాలకు అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ (ఏఎంసీ)ని హెడ్‌గా నియమించనున్నారు.
- ఆ డివిజన్‌కు సంబంధించిన ఏఈ, శానిటేషన్ జవాన్లు, ఎంటమాలజీ సిబ్బంది అందులో ఉండనున్నారు.
- ప్రజలు తమ సమీపంలో ఉన్న వార్డు కార్యాలయాల్లోనే తమ ఫిర్యాదులు అందజేయవచ్చు.
- జీహెచ్‌ఎంసీ సర్కిల్-17 పరిధి కిందకు వచ్చే సోమాజిగూడ, ఖైరతాబాద్ డివిజన్లు, సర్కిల్-18 పరిధి కిందకు వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల పౌరులు తమకు ఏదైనా సమస్య వస్తే, అధికారులను కలవాలన్నా, ఫిర్యాదులు చేయాలన్నా ఖైరతాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది.
- సమయాభావం, దూరాభారం తగ్గించేందుకు ఇక నుంచి తమ సమీపంలో వార్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేసి అందులో అధికారులను అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. ఆయా సేవలు అందుబాటులోకి వస్తే జీహెచ్‌ఎంసీ పౌరులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందనడం నిర్వివాదాంశం.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని మంత్రికి వినతి


మంత్రిని కలిసిన తెలంగాణ ఫిలిం ఫెడరేషన్ నాయకులు

ఫిలింనగర్: తెలంగాణ సినిమా ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం శనివారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు. ఇందులో భాగంగా తెలంగాణ సినీ కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సినీ కార్మికులకు పనుల విషయంలో తెలుగు సినీ ఫెడరేషన్ ఇబ్బందులు కలిగిస్తున్నదని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ఈ సమస్యలకు తగిన పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ సినీ ఇండస్ట్రీ ఫెడరేషన్ అనుబంధ సంఘ ప్రతినిధులు అందరూ మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ మూర్తి, కోశాధికారి ఠాగూర్, తెలుగు డబ్బింగ్ యూనియన్ ప్రెసిడెంట్ కవితారాణి తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి జేహెచ్‌పీఎస్‌లో టెక్ సమ్మర్ క్యాంప్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మురళీముకుంద్, అన్నివయోలెట్ తదితరులు

బంజారాహిల్స్: సీబీఐటీ, అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్(ఏసీఐసీ) సంయుక్తంగా ఈ నెల 11 నుంచి 27వ తేదీ వరకు జూబ్లీహిల్స్‌లోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో టెక్ సమ్మర్ క్యాంప్-2023 నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను జేహెచ్‌పీఎస్ చైర్మన్ మురళీముకుంద్, సీబీఐటీ, ఏసీఐసీ టెక్నాలజీ విభాగం స్ట్రాటజీయం వ్యవస్థాపకురాలు అన్ని వయోలెట్ ఆవిష్కరించారు. రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించనున్న ఈ క్యాంప్‌లో విద్యార్థులతో పాటు తల్లులు కూడా హాజరయ్యేందుకు అవకాశం కల్పించారు. కృత్రిమ మేధస్సుపరంగా విద్యార్థులను మరింత సన్నద్ధం చేసే దిశలో ఈ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు వయోలెట్ తెలిపారు. కేవలం జేహెచ్‌పీఎస్ విద్యార్థులు మాత్రమే కాకుండా ఇతర పాఠశాలల విద్యార్థులు కూడా ఇందులో పాల్గొనవచ్చన్నారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు స్టెమ్ ఆక్టివిటీస్, ఇంజినీరింగ్ ఎట్ స్కూల్, 6 నుంచి 12వ తరగతి విద్యార్థులకు డిజైన్ థింకింగ్, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన లెర్నింగ్, జూనియర్ ఎంబీఏ తదితర అంశాల్లో ఈ సమ్మర్ క్యాంపు ఉంటుందన్నారు. ఏటా ఈ క్యాంపులు నిర్వహిస్తున్నామని గతేడాది సీబీఐటీలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

అలరించిన ఫిఫా వరల్డ్ కప్ చిత్రాలు


ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న బ్రిటిష్ డిప్యూటీ కమిషనర్ గ్యారెత్ విన్ వోవెన్

బంజారాహిల్స్: ఖతర్‌లో గతేడాది జరిగిన ఫిఫా వరల్డ్ కప్ కవరేజీకి సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను శనివారం హోం మంత్రి మహమూద్ అలీ జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ప్రారంభించారు. స్నాప్స్ ఇండియా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైదరాబాద్‌లో బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గ్యారెత్ విన్ వోవెన్ ఈ ప్రదర్శనను విశిష్ట అతిథిగా విచ్చేసి తిలకించారు. డాక్టర్ లయన్ కిరణ్, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి, రాయల్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ అవార్డి, ఫొటో జర్నలిస్టు శ్రీనివాస్‌రెడ్డి, మహ్మద్ షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరల్డ్ ఆద్యంతం చిత్రీకరించిన పలు చిత్రాలు ఈ ఎగ్జిబిషన్‌కు హైలెట్‌గా నిలిచాయి.

నిరసన తెలిపే హక్కును హరిస్తున్న ప్రభుత్వం

తెలంగాణ లేబర్ పార్టీ అధ్యక్షుడు గొర్రె రమేష్


రమేష్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

పంజగుట్ట: రాష్ట్రంలో ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలిపే హక్కు కూడా లేకుండా పోయిందని తెలంగాణ లేబర్ పార్టీ అధ్యక్షుడు గొర్రె రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నెక్లెస్ రోడ్డులోని అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం వద్దకు నిరసన తెలిపేందుకు వచ్చిన తెలంగాణ లేబర్ పార్టీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దళితులకు మూడు ఎకరాల భూమి ఇవ్వాలని, దళితులను ముఖ్యమంత్రిని చేయాలని డిమాండ్ చేస్తూ టీఎల్‌పీ అధ్యక్షుడు గొర్రె రమేష్‌తో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు శనివారం అంబేడ్కర్ భారీ విగ్రహం వద్ద నిరసన తెలిపేందుకు యత్నించారు. అప్పటికే అక్కడ భారీగా మోహరించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని.. అయితే తెలంగాణ రాష్ట్రంలో మాత్రం దుర్మార్గంగా ప్రశ్నించే గొంతుకలను నొక్కేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెక్రటేరియట్‌కు అంబేడ్కర్ పేరు పెట్టి, భారీ విగ్రహం ఏర్పాటు చేసి దళితులను మభ్యపెట్టి తిరిగి అధికారంలోకి రావాలని కేసీఆర్ యత్నిస్తున్నారని దళితులు ఈ సారి మోసపోరనే విషయం సీఎం గ్రహించాలన్నారు. అరెస్టు అయిన వారిలో ప్రధాన కార్యదర్శి పి.మట్టారెడ్డి, కోశాధికారి జి.లక్ష్మి, నాయకులు మురళీధర్, ప్రకాష్, రమేష్, జక్కం కవిత తదితరులు ఉన్నారు.

చర్మ సౌందర్యంపై పెరుగుతున్న ఆసక్తి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సినీ నటి శోభితా ధూళిపాళ్ల, డాక్టర్ జైశ్రీ శరద్, మిహికా దగ్గుబాటి

బంజారాహిల్స్: గతంలో సినీ, గ్లామర్ రంగంలో ఉన్న వారు మాత్రమే స్కిన్‌కేర్‌పై ఎక్కువ శ్రద్ధపెట్టే వారని కానీ ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఆడ, మగ అని తేడా లేకుండా చర్మ సౌందర్యంపై పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారని సినీ నటి శోభిత ధూళిపాళ్ల అన్నారు. శనివారం జూబ్లీహిల్స్‌లో బాలీవుడ్, టాలీవుడ్ సెలబ్రిటీ స్కిన్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ జైశ్రీ శరద్ రచించిన 'ది స్కిన్ కేర్ ఆన్సర్ బుక్'ను సినీ హీరో రాణా దగ్గుబాటి సతీమణి మిహికా దగ్గుబాటితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రస్తుతం సినీ తారలు మాత్రమే కాదని యువత సోషల్ మీడియాలో ఎన్నో వేదికల్లో ఉంటున్నారన్నారు. ప్రతి ఒక్కరూ అందానికి సంబంధించి రకరకాల విషయాల మీద సెర్చ్ చేస్తుంటారని పేర్కొన్నారు. ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వేదికల్లో అందంగా కనిపించేందుకు ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకుంటున్నారని ఇందులో భాగంగా స్కిన్ కేర్‌పై ఎక్కువగా శ్రద్ధ కనబరుస్తున్నారని తెలిపారు. పుస్తక రచయిత డాక్టర్ జైశ్రీ శరద్ మాట్లాడుతూ... బయట ఎంతో మంది రకరకాల విషయాలు చెప్పి తికమకపెడుతున్నారని తాను రాసిన ఈ పుస్తకం ఎంతో మంది ప్రశ్నలకు సరైన సమాధానం చెబుతుందన్నారు. అందానికి సంబంధించి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాలపై ఈ పుస్తకాలు విలువైన సమాచారం ఉంది అని తెలిపారు.

వెంటాడిన చెడు వ్యసనాలు!

- ఆత్మహత్య చేసుకున్న యువకుడు
- అవయవాలు దానం చేసిన కుటుంబ సభ్యులు
- మరికొందరి జీవితాలకు వెలుగునిచ్చిన వైనం


నల్ల పవన్ కుమార్ (ఫైల్)

బంజారాహిల్స్: తాను చనిపోతూ మరొకరికి వెలుగులు నింపడమే కాకుండా తన అవయవాలు మరొకరికి ఉపయోగపడి వారికి జీవనదానం చేసేందుకు మృతుడి తల్లిదండ్రులు ముందుకు వచ్చారు. తన కొడుకు నేత్రాలు మరొకరికి చూపునివ్వాలని, అవయవాలకు ఇంకొకరి ప్రాణాలు నిలపాలని ఆ తల్లిదండ్రులు తీసుకున్న నిర్ణయం సర్వత్రా హర్షామోదాలు పొందుతున్నది. వివరాలివీ... బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని ఉదయ్‌నగర్‌లో నివసించే నల్ల శ్రీనివాస్ కల్పన దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు నల్ల పవన్‌కుమార్(21) జీవితంపై విరక్తి చెంది ఉదయ్‌నగర్‌లోని తన ఇంట్లో శనివారం తెల్లవారుజామున ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నాలుగు నెలల క్రితమే పవన్‌కు పెళ్లి చేసి స్వగ్రామంలో కాపురం పెట్టారు. గత నెల 27వ తేదీన పవన్ తన పుట్టిన రోజును తల్లిదండ్రులు, తమ్ముడి సమక్షంలో నిర్వహించుకోవాలని హైదరాబాద్‌కు వచ్చి జన్మదిన వేడుకలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా జరుపుకొన్నాడు. భార్యతో సరదాగా గడిపాడు. అయితే గత రెండు రోజుల నుంచి పూర్తి నిరాశావాదంలోకి వెళ్లాడు. ఈ నేపథ్యంలో బతుకుపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తమ కొడుకు నేత్రాలతో పాటు లివర్, కిడ్నీలను మరొకరికి బతుకునివ్వాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు నేత్ర, కిడ్నీ, లివర్ దానం చేస్తూ అంగీకార పత్రాన్ని అందజేశారు.

ప్రవర్తన మార్చుకున్నాసరే...

ఆత్మహత్యకు పాల్పడిన పవన్ గతంలో తన స్నేహితులతో కలిసి తిరిగేవాడు. మద్యం తాగడం, అల్లరి చిల్లరగా తిరగడం జరిగేవి. ఈ నేపథ్యంలోనే తల్లిదండ్రులు కొడుకులో మార్పు రావాలని నాలుగు నెలల క్రితం పెళ్లి చేసి స్వగ్రామంలో కాపురం పెట్టే విధంగా చూశారు. ఇటీవల కాలంలో పవన్‌లో పూర్తి మార్పు వచ్చి చక్కగా తన కుటుంబాన్ని పోషించుకుంటూ కాపురం చేసుకుంటున్నాడు. గతంలో పవన్‌తో సన్నిహితంగా ఉన్న వారికి ఇది ఏ మాత్రం నచ్చలేదు. తమతో పాటు గతంలో మాదిరిగానే ఆవారాగా తిరగాలని ఒత్తిడి పెంచినా వినిపించుకోలేదు. ఇక లాభం లేదని ఆయన స్నేహితులు ఇటీవల పవన్ సోదరుడిని బలవంతంగా పక్కకు పిలిచి కొట్టారు. ఇదే విషయాన్ని పవన్ తల్లిదండ్రులు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. తన కొడుకు చెడిపోవడానికి కారకులైన వారంతా ఇప్పుడు తన చిన్న కొడుకును కొడుతూ హింసిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేసింది. పోలీసులు ఓ వైపు దర్యాప్తు చేస్తుండగానే పవన్ తాను మారినా తన కుటుంబాన్ని విడిచిపెట్టడం లేదని మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇదే విషయాన్ని తల్లిదండ్రులు రోదిస్తూ చెప్పుకొచ్చారు.

మహనీయుడు పసులూరి నారాయణ స్వామి

హరియాణ రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ

పంజగుట్ట: సమాజం కోసం అట్టడుగు వర్గాలు, కార్మికుల కోసం తన జీవితాంతం పోరాడిన మహనీయుడు పసులూరి నారాయణ స్వామి అని హరియాణ రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. సోషలిస్టు నాయకులు పసులూరి నారాయణ స్వామి జీవిత చరిత్ర ఆధారంగా సీనియర్ పాత్రికేయులు డాక్టర్ ఫజలుల్లాఖాన్ రచించిన 'ది అన్‌స్పోకెన్ లీడర్' పుస్తకాన్ని దత్తాత్రేయ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ... నీతి, నిజయతీ, నిబద్ధతతో కూడిన నాయకుడు నారాయణస్వామి అన్నారు. ఆయన అసంఘటిత కార్మికుల కోసం ఎన్నో పోరాటాలు చేశారని, చిన్న పిల్లల గుండె సమస్యల విషయం దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తే ఆయన స్పందించి పథకం రూపంలో తీసుకొచ్చారని గుర్తుచేశారు. అంకితభావంతో పనిచేసే వ్యక్తి నారాయణ స్వామి అన్నారు. నారాయణ స్వామి జీవితచరిత్ర ఆధారంగా పుస్తకం తీసుకువచ్చిన ఫజలుల్లాఖాన్‌ను అభినందించి సత్కరించారు. సీనియర్ పాత్రికేయుడు దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ... కార్మికుల కోసం ఎన్నో పోరాటాలు చేసిన నారాయణస్వామి చరిత్ర నేటితరానికి తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎం.డి.ఇలియాజ్, నారాయణ స్వామి కుమారుడు కిరణ్ భార్గవ్, మోపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

సనత్‌నగర్: రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అమీర్‌పేట లాల్‌బంగ్లా రోడ్డులో ఏవీఎస్ వెల్‌నెస్ హాస్పిటల్‌లో ఉద్యోగులు, నర్సింగ్ సిబ్బందికి రోడ్డు భద్రతపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్టాప్‌లైన్, రాంగ్ రూట్, ట్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటి నిబంధలను ఉల్లంఘించడం వల్ల జరిగే ప్రమాదాల గురించి వివరించారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించడం ముఖ్యమని జీబ్రా క్రాసింగ్ వద్దనే రోడ్డు దాటాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు డ్రైవింగ్‌లో సీట్ బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ సురేష్, బేగంపేట టీటీఐ ఎస్‌ఐ జ్యోతి, చక్రధర్, చిరంజీవి, నరేందర్, హాస్పిటల్ ఎండీ అసద్, వివేక్, సుమన్, కార్తీక్ పాల్గొన్నారు.

ఘనంగా సేవకుల ఉజ్జీవ సదస్సు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎమ్మెల్యే కాలనీ షారోన్‌ఫుల్ గాస్పెల్ చర్చిలో మిషన్ ఇండియా తెలంగాణ ఆధ్వర్యంలో సేవకుల ఉజ్జీవ సదస్సు శనివారం ఘనంగా జరిగింది. మిషన్ ఇండియా నాగ్‌పూర్ నేషనల్ డైరెక్టర్ బిషప్ పీడీ జోసెఫ్ ముఖ్య ప్రసంగం చేశారు. అసోసియేట్ కో ఆర్డినేటర్ రెవరెండ్ దయాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భారత్ క్రిస్టియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ బిషప్ భాస్కర్ ముల్కల, రెవరెండ్ ప్రభుదాస్, డేవిడ్ సుదర్శన్, డాక్టర్ కె. స్వామిదాస్, జాన్‌మార్క్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో సేవకులు విచ్చేసి ప్రసంగాలు విన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహించారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్ వినాయకనగర్ బస్తీలో 120 మీటర్ల మేర నిర్మించనున్న సీసీ రోడ్డు పనులు శుక్రవారం రాత్రి ప్రారంభించారు. దీంతో పాటు ఫిలింనగర్‌లోని సాయిబాబా గుడి ఎదురుగా భగత్‌సింగ్ కాలనీకి వెళ్లేదారిలో కూడా సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ రెండు పనులకు రూ. 32 లక్షలు మంజూరయ్యాయి. పనులు వెనువెంటనే ప్రారంభించేలా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగానే వినాయకనగర్ బస్తీలో పనులు ప్రారంభం కావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ రోడ్డు నిర్మాణం పూర్తయితే స్థానికుల రాకపోకలు తేలికగా సాగనున్నాయి.

బంధువునంటూ నమ్మించి.. బంగారు ఆభరణాల చోరీ


పాత నేరస్తుడిని అరెస్టు చేసిన పోలీసులు


నిందితుడు దూదేకుల మస్తాన్‌వలి

బంజారాహిల్స్: బంధువునంటూ నమ్మిస్తూ ఇళ్లల్లోకి వెళ్లి వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకొని దృష్టిమరల్చి బంగారు గొలుసులు తస్కరించి పరారీలో ఉన్న పాత నేరస్తుడిని బంజారాహిల్స్ క్రైం పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బంజారాహిల్స్ డీఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాల జిల్లా నంద్యాల మండలం కానాల గ్రామానికి చెందిన దూదేకుల మస్తాన్‌వలి(31) ఎలక్ట్రికల్ వర్క్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. జల్సాలకు అలవాటుపడ్డ మస్తాన్ డబ్బులు సరిపోక పక్కచూపులకు తెగించాడు. వృద్ధ మహిళలు, బాలికలను లక్ష్యంగా చేసుకొని వారిని మాటల్లో దింపి మెడల్లో ఉన్న గొలుసులు తస్కరిస్తూ పరారవుతున్నాడు. ఇటీవల బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరా నగర్‌లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలి ఇంట్లోకి వెళ్లి నేను దూరపు బంధువును అంటూ పరిచయం చేసుకున్నాడు. నీ మెడలో గొలుసు బాగుంది నా పెళ్లానికి కూడా ఇలాంటిదే చేయించాలని అనుకుంటున్నాననంటూ చూస్తానని తీసుకున్నాడు. ఆమె బెదురుతుండగానే గొలుసుతో ఉడాయించాడు. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన క్రైం పోలీసులు ఇక్కడ సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుడిని గుర్తించారు. విచారించగా గతంలో ఏడు కేసుల్లో మస్తాన్‌వలీ నిందితుడిగా ఉన్నట్లు తేలింది. నిందితుడి నుంచి 15 తులాల బంగారు ఆభరణాలు రికవరీ చేసి రిమాండ్‌కు తరలించారు. బంజారాహిల్స్ క్రైం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దూరం తగ్గింది.. భద్రత చేరువైంది!

- కొత్త ఠాణాల ఏర్పాటుతో తొలగనున్న ఇబ్బందులు
- బోరబండ, రహమత్‌నగర్‌వాసుల్లో హర్షాతిరేకాలు



రహమత్‌నగర్ అవుట్ పోస్టు

రహమత్‌నగర్: దశాబ్దాల కాలంగా ఎదురు చూస్తున్న పోలీస్ స్టేషన్ల ఏర్పాటు కల సాకారం కాబోతోంది. జనాభాకు అనుగుణంగా పోలీస్ స్టేషన్లను పునర్విభజిస్తూ బోరబండ, రహమత్‌నగర్‌లను పోలీస్ స్టేషన్లుగా మార్చుతూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆయా స్టేషన్లలో అధికారులను సైతం నియమించింది. ఈ నేపథ్యంలో కొత్త పోలీస్ స్టేషన్ల ఏర్పాటు పనులు ప్రారంభం అయ్యాయి. దీంతో బోరబండ, రహమత్‌నగర్‌వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ కష్టాలు తొలగిపోనున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దూరంగా ఉన్న పీఎస్‌లకు వెళ్లలేక...

రహమత్‌నగర్, బోరబండ ప్రాంతాల ప్రజలు జూబ్లీహిల్స్, ఎస్‌ఆర్‌నగర్ ప్రాంతాలోని పోలీస్ స్టేషన్లకు వెళ్లలేక నానా ఇబ్బందులు పడుతుండేవారు. దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ రెండు స్టేషన్లకు వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు తప్పేవికాదు. ముఖ్యంగా పేదలు తమ సమస్యలపై ఫిర్యాదు చేయాలంటే దూరంగా ఉన్న స్టేషన్లకు వెళ్లడం పెనుభారంగా మారేది. ఇకపై ప్రజల కష్టాలు త్వరలోనే తొలగనున్నాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అవుట్ పోస్టుల్లోనే కొత్తగా ఏర్పాటయ్యే స్టేషన్లు ప్రారంభం కానున్నాయి. నూతన పోలీస్ స్టేషన్‌లో అధికారులు, అదనపు సిబ్బంది వాహనాలు వస్తుండంతో ఆయా ప్రాంతాల పోలీస్ స్టేషన్ల పరిధిలో క్రైం రేట్ తగ్గే అవకాశం ఉందని బోరబండ, రహమత్‌నగర్ డివిజన్ వాసులు భావిస్తున్నారు.

కొత్త పోలీస్ స్టేషన్లతో ఎంతో సౌలభ్యం



అధిక జనాభా ఉన్న రహమత్ నగర్ డివిజన్‌లో కొత్త పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం అభినందనీయమం. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పోవాలంటే ప్రజలు చాలా ఇబ్బందులు పడుతుండేవారు. కొత్త పీఎస్ ఏర్పాటుతో శాంతిభద్రత పరిస్థితి అదుపులో ఉంటుంది. – ముత్యాల యాదగిరి

క్లుప్తంగా...

ముగిసిన అమ్మవారి వసంతోత్సవాలు

తిరుచ్చిపై తిరువీధుల్లో ఊరేగిన పద్మావతి


అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుచానూరు(తిరుపతి జిల్లా): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారికి ఈ నెల 4వ తేదీన ప్రారంభించిన వార్షిక వసంతోత్సవాలు శనివారం రాత్రి మహాపూర్ణాహుతితో ముగిశాయి. వసంతోత్సవంలో భాగంగా శనివారం అమ్మవారిని వేకువజామునే సుప్రభాతంతో మేల్కొల్పి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారిని సన్నిధి నుంచి వేంచేపుగా ఉద్యానవనం మండపానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. అనంతరం నేత్రపర్వంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి దివ్యాలంకార శోభితురాలైన శ్రీపద్మావతి అమ్మవారు తిరుచ్చిపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. వార్షిక వసంతోత్సవాలు పురస్కరించుకుని 3వ తేదీ నుంచి ఆలయంలో అన్ని ఆర్జిత సేవలను రద్దు చేశారు. వసంతోత్సవాలు ముగియడంతో ఆదివారం నుంచి యథావిధిగా ఆర్జిత సేవలను పునరుద్ధరించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

బీజేపీ నేత విష్ణుకుమార్‌రాజుకు

షోకాజ్ నోటీస్?

- సంబంధం లేని వ్యాఖ్యలు చేసిన ఫలితం!

సాక్షి విశాఖపట్నం: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు ఆ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిసింది. ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూలో విష్ణుకుమార్ రాజు సంబంధం లేని వ్యాఖ్యలు చేసినందుకు ఈ నోటీసు జారీ చేసినట్లు సమాచారం. పార్టీ వర్గాల కథనం ప్రకారం.. విష్ణుకుమార్ రాజు వ్యాఖ్యలపై బీజేపీ అధిష్టానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో క్రమశిక్షణ సంఘం ఆయనకు నోటీసు జారీ చేసింది. వ్యాఖ్యలపై ఆదివారం సాయంత్రంలోగా వివరణ ఇవ్వాలని, లేకుంటే సస్పెన్షన్‌కు గురికావలసి వస్తుందని హెచ్చరించింది. కేంద్ర దర్యాప్తు సంస్థలపై అసత్య ఆరోపణలు, ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశానికి పిలవకపోయినా పిలిచినట్లు ప్రస్తావిస్తూ అబద్ధపు మాటలు ఎలా చెబుతారని ఆగ్రహం వ్యక్తంచేసింది. పొత్తులపై స్థాయిని మరిచి మాట్లాడినందుకు వివరణ ఇవ్వాలని ఆదేశించింది. గతంలో కూడా ఇటువంటి వ్యాఖ్యలు చేయరాదని హెచ్చరించామని ఆ నోటీసులో పేర్కొన్నట్లు తెలిసింది.

సెలవిక.. శత్రుంజయ!

సేవల నుంచి నిష్క్రమించనున్న 'ఐఎన్ఎస్ మగర్' యుద్ధ నౌక

1987 నుంచి 36 ఏళ్ల పాటు భారత నౌకాదళంలో కీలక పాత్ర

- విశాఖ కేంద్రంగా 29 ఏళ్ల పాటు సేవలందించిన నౌక
- 2004 సునామీ సమయంలో అండమాన్‌లో 1300 మందిని రక్షించిన మగర్
- ఎల్‌టీటీఈ ఆపరేషన్, కోవిడ్ కాలంలో ఆపరేషన్ సేతులో ముఖ్యభూమిక
- నేడు కొచ్చిలో ఐఎన్ఎస్ మగర్‌కు ఘన వీడ్కోలు పలకనున్న భారత నౌకాదళం

సాక్షి, విశాఖపట్నం: నీటిలోనే కాదు.. నేలపైనా దాడిచేసే స్వభావం ఉన్న మొసలి (మగర్) లక్షణాల్ని పుణికిపుచ్చుకున్న ఆ యుద్ధ నౌక వస్తుందంటే శత్రువుల వెన్నులో వణుకు పుట్టేది. ఆయుధ సంపత్తిని మోసుకొస్తున్న ఆ నౌక కనిపిస్తే చాలు.. శత్రుసైన్యంతో పోరాడుతున్న బలగాలకు కొండంత ధైర్యం పోగవుతుంది. ఆపదలో ఉన్నవారికి ఆత్మీయత పంచుతూ.. విపత్తులో ఉన్నవారిని ఒడ్డుకు చేర్చుతూ.. 36 ఏళ్లపాటు భారత నౌకాదళానికి సుదీర్ఘ సేవలందించిన ఐఎన్ఎస్ మగర్ ఆదివారంతో విధులకు స్వస్తి పలకనుంది. వార్‌ఫేర్ వెసెల్‌గా అంతర్జాతీయ విన్యాసాల్లో సత్తా చాటిన మగర్‌కు భారత నౌకాదళం ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికేందుకు సిద్ధమవుతోంది.

ఒడ్డుకు వచ్చి మరీ..

భారత నౌకాదళ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించిన ఉభయచర యుద్ధ నౌకల్లో కీలకమైనదిగా ఐఎన్ఎస్ మగర్ ఖ్యాతి ఆర్జించింది. విశాఖలోని హిందుస్తాన్ షిప్‌యార్డు సహకారంతో కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ (జీఆర్ఎస్ఈ)లో మగర్‌ని యాంఫిబియాస్ షిప్‌గా తీర్చిదిద్దారు. అంటే.. సాధారణంగా షిప్‌లు ఒడ్డు వరకూ రాలేవు. కానీ.. మగర్ మాత్రం ఒడ్డు వరకూ వచ్చి.. సైన్యానికి అవసరమైన ఆయుధ సంపత్తిని అందించగల సామర్థ్యాన్ని సొంతం చేసుకుంది. అందుకే.. దీనికి మగర్ (తెలుగులో మొసలి అని అర్థం) అనే పేరుపెట్టారు. 1987 జూలై 15న భారత నౌకాదళంలో ఈ షిప్ ప్రవేశించింది.

విశాఖ నుంచి సుదీర్ఘ సేవలు

తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రమైన విశాఖపట్నానికి ఐఎన్ఎస్ మగర్‌ని కేటాయించారు. ల్యాండింగ్ షిప్ ట్యాంక్(ఎల్ఎస్‌టీ) హోదాలో యుద్ధ ట్యాంకులు, ఆయుధాలు తీసుకెళ్లగల సామర్థ్యం దీని సొంతం. నలుగురు ల్యాండింగ్ క్రాఫ్ట్ వెహికల్ సిబ్బంది, అత్యవసర సమయంలో దళాల్ని మోహరించేందుకు మగర్ యుద్ధ నౌకను వినియోగించేవారు. శ్రీలంకలో ఎల్‌టీటీఈని నిరోధించే సమయంలో నిర్వహించిన ఆపరేషన్ పవన్‌లో మగర్ కీలక పాత్ర పోషించింది. నిరంతర పోరాటం చేసిన ఇండియన్ పీస్ కీపింగ్ ఫోర్స్(ఐపీసీకే)కు అవసరమైన సామగ్రిని అందించింది. వివిధ దేశాల్లో జరిగిన ద్వైపాక్షిక విన్యాసాల్లో మగర్ సత్తా చాటింది. 2006 ఫిబ్రవరి 22న విశాఖ తీరానికి 70 కి.మీ. దూరంలో మగర్ యుద్ధ నౌకలో ఘోర ప్రమాదం సంభవించింది. షిప్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ముగ్గురు నావికులు మృతి చెందారు. మరో 19 మంది గాయాల పాలయ్యారు. 2018వ సంవత్సరం వరకూ విశాఖ కేంద్రంగా సేవలందించిన మగర్‌ను 2018 ఏప్రిల్‌లో కొచ్చికి తరలించి.. మార్పులు చేర్పుల అనంతరం మొదటి స్క్వాడ్రన్ శిక్షణ నౌకగా సేవలు అందించింది.


ఐఎన్ఎస్ మగర్ యుద్ధ నౌక

మగర్ సామర్థ్యమిదీ..

నౌకాదళంలో సేవలు ప్రారంభం: 15 జూలై, 1987
పొడవు: 390 అడుగులు
వెడల్పు: 57 అడుగులు
డ్రాఫ్ట్: 13 అడుగులు
వేగం: గంటకు 28 కి.మీ.
ప్రయాణ సామర్థ్యం: ఏకధాటిగా 3 వేల మైళ్ల ప్రయాణం
ఆయుధ సామర్థ్యం: బీఈఎల్–1245 రాడార్ నావిగేటర్, నాలుగు బోఫోర్స్ 40 ఎంఎం గన్స్, 2 మల్టిపుల్ బ్యారెల్ రాకెట్ లాంచర్స్, ఒక సీ కింగ్ హెలికాప్టర్
వార్ ఫేర్ యూనిట్: 15 యుద్ధ ట్యాంకులు, 13 బీఎంపీ పదాతిదళ పోరాట వాహనాలు, 10 ట్రక్కులు, 8 భారీ మోటార్ వెహికల్స్ తోపాటు 500 మంది సైనికుల్ని ఒకేసారి తీసుకెళ్లగల సామర్థ్యం దీని సొంతం.

సునామీలో విశిష్ట సేవలు

మగర్ అందించిన సేవల్లో ముఖ్యంగా 2004లో వచ్చిన సునామీ సమయమనే చెప్పుకోవాలి. ఎప్పుడు మళ్లీ సముద్రం ఉప్పొంగి.. విలయం వస్తుందో తెలీని సమయంలో ధైర్యంగా సాగర జలాల్లో ప్రయాణించిన మగర్.. అండమాన్ నికోబార్ దీవుల్లో చిక్కుకున్న 1,300 మందిని రక్షించి సురక్షిత ప్రాంతానికి తీసుకొచ్చింది. అంతేకాకుండా.. అక్కడి నుంచి వివిధ విపత్తు ప్రాంతాలకు తరలివెళ్లి నిరాశ్రయులుగా మిగిలిన వారికి సహాయక సామగ్రి అందజేయడంలోనూ కీలకంగా వ్యవహరించిన మగర్‌కు భారత రక్షణ దళం నుంచి అద్భుత ప్రశంసలందాయి. కోవిడ్ సమయంలో నిర్వహించిన ఆపరేషన్ సముద్ర సేతులోనూ మగర్ విశిష్ట పాత్ర పోషించింది. వివిధ ప్రాంతాల్లో ఉన్న భారతీయుల్ని స్వదేశానికి తీసుకురావడం, స్నేహపూర్వక దేశాలకు వైద్యసామగ్రి అందించడం మగర్ ద్వారానే సాధ్యమైంది.

నేడు కొచ్చిలో నిష్క్రమణం

నౌకాదళానికి 36 సంవత్సరాల పాటు సుదీర్ఘ సేవలందించిన మగర్ యుద్ధ నౌకకు కొచ్చి పోర్టులో భారత నౌకాదళం ఘనంగా వీడ్కోలు పలికేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ సందర్భంగా నిర్వహించే డీకమిషన్ కార్యక్రమంలో ఐఎన్ఎస్ మగర్‌లో సేవలందించిన కెప్టెన్‌లు, అధికారులకు ఆత్మీయ సత్కారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 'అవర్ బోల్డ్ అండ్ బ్రేవ్ మగర్' పేరుతో షార్ట్ ఫిల్మ్‌ని ప్రదర్శించి యుద్ధ నౌకకు ఘనంగా వీడ్కోలు పలకనున్నారు.

టెన్త్ ఫలితాల్లో.. తిరుగులేని 'మన్యం'

- ఏపీలో మొత్తం 72.26 శాతం ఉత్తీర్ణత
- 87.47 శాతంతో పార్వతీపురం మన్యం జిల్లా టాప్..
- 60.39 శాతంతో చివరి స్థానంలో నంద్యాల

సాక్షి, అమరావతి: టెన్త్ ఫలితాల్లో ఈ ఏడాది పార్వతీపురం మన్యం జిల్లా తిరుగులేని ఫలితాలు సాధించింది. 87.47 శాతం ఉత్తీర్ణతతో ఈ జిల్లా ఏపీలోనే అగ్రస్థానంలో నిలిచింది. 60.39 శాతం ఫలితాలతో నంద్యాల జిల్లా చివరి స్థానం దక్కించుకుంది. అలాగే, ఈ ఫలితాల్లో బాలుర కంటే బాలికలే పైచేయి సాధించారు. రాష్ట్రం మొత్తం మీద ఈ ఏడాది 6,05,052 మంది పరీక్షలకు హాజరుకాగా.. 4,37,196 మంది అంటే 72.26 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలికల ఉత్తీర్ణత శాతం 75.38 శాతమైతే బాలురది 69.27 శాతం. 933 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించగా, 38 పాఠశాలల్లో 'జీరో' ఉత్తీర్ణత నమోదైంది. ఈ ఫలితాలను విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ శనివారం విజయవాడలోని ఓ హోటల్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత విద్యా సంవత్సరం ఫలితాల్లో 67.26 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఈ ఏడాది ఐదు శాతం అధికంగా ఉత్తీర్ణులయ్యారన్నారు. ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో అత్యధికంగా 95.25 శాతం ఉత్తీర్ణత నమోదైందని చెప్పారు. ఇంగ్లిష్ మీడియంలో సైతం 80.82 శాతం మంది ఉత్తీర్ణత సాధించడం విశేషమని ఆయన తెలిపారు.



పదో తరగతి ఫలితాలను విడుదల చేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, చిత్రంలో అధికారులు

ఆ ఆరుగురూ పాస్..

దృష్టిలోపం విద్యార్థుల కోసం డిజిటల్ విధానంలో నిర్వహించిన పదో తరగతి పరీక్షలకు హాజరైన ఆరుగురు ఉత్తీర్ణులయ్యారు. ఈ తరహాలో పరీక్షలు నిర్వహించడం దేశంలోనే తొలిసారి కావడం విశేషం. అనంతపురం జిల్లా పొలిమెర చైత్రిక, చెంచుగారి పావని, యక్కలూరి దివ్యశ్రీ, మేకా శ్రీధాత్రి, యేకుల సౌమ్య, ఉప్పర నాగరత్నమ్మల కోసం డిజిటల్ రూపంలో ఈ పరీక్షలు నిర్వహించారు.

2 నెలల్లో 2 వేల ఐటీ ఉద్యోగాలు

నైపుణ్యం కలిగిన మానవ వనరుల అన్వేషణలో విశాఖ ఐటీ కంపెనీలు

సాక్షి, అమరావతి: ఐటీ దిగ్గజ కంపెనీలు తమ కార్యకలాపాలను విశాఖపట్నానికి విస్తరిస్తుండటంతో నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. త్వరలో కార్యకలాపాలు ప్రారంభించనున్న ఇన్ఫోసిస్‌తో పాటు ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించిన కేంద్ర రక్షణ శాఖకు చెందిన భారత్ ఎలక్ట్రానిక్స్ (బీఈఎల్) సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్, అమెజాన్ డెవలప్‌మెంట్ సెంటర్, రాండ్‌శాండ్, టెక్నోటాస్క్, భారీగా విస్తరిస్తున్న టెక్ మహీంద్రా, డబ్ల్యుఎఎన్ఎస్ వంటి కంపెనీలు పెద్ద ఎత్తున నైపుణ్యం కలిగిన మానవ వనరుల కోసం ఎదురుచూస్తున్నాయి. విశాఖలో ఉన్న ఐటీ కంపెనీలకు వచ్చే రెండు నెలల్లోకనీసం రెండు వేల మంది ఐటీ నిపుణులు అవసరమవుతారని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(ఐటాప్) అంచనా వేసింది. విశాఖలోని ఐటీ కంపెనీలకు అవసరమైన మానవ వనరులను ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ద్వారా శిక్షణ ఇచ్చి, శిక్షణ పూర్తికాగానే ఉపాధి కల్పించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి కోన శశిధర్ 'సాక్షి'కి తెలిపారు. ఇందు కోసం రెండు నెలల్లో కనీసం రెండు వేల మందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు.

గుండ్ల కోనలో అరుదైన శాసనం

కడప కోటిరెడ్డిసర్కిల్: అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు సమీపంలోని శేషాచలం అడవి పరిధిలో ఉన్న గుండ్ల కోనలో అరుదైన శాసనం వెలుగుచూసింది. తిరుపతికి చెందిన చారిత్రక పరిశోధకులు భూమన సుబ్రహ్మణ్యం దీనిని గుర్తించి భారత పురావస్తుశాఖ అధికారి మునిరత్నంరెడ్డికి పంపారు. ఆయన పరిశీలించి వివరాలు వెల్లడించారు. ఇది తాళ్లపాక పెద తిరుమలయ్య వేయించిన శాసనమని తెలిపారు. పూర్వం శ్రీతిరుమలేశుడు అయిన వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు కొన్ని ప్రాంతాల వారు రాజంపేట (తాళ్లపాక) ద్వారా కాలికడకన తిరుమలకు వెళ్లే సంప్రదాయం ఉండేదన్నారు. ఈ శాసనం ఓ రాతిపై చెక్కబడి ఉందని.. 1537 జూన్, 15న శుక్రవారం తాళ్లపాక అన్నమయ్య కుమారుడు తాళ్లపాక పెద్ద తిరుమలయ్య ద్వారా హనుమంతుని ప్రతిమను ప్రతిష్ఠించిన సందర్భంగా ఈ శాసనాన్ని వేయించినట్లు వివరించారు.


గుండ్లకోనలో వెలుగు చూసిన శాసనం

నగర వార్తలు

అక్రమ కట్టడాల కూల్చివేత



సాక్షి, సిటీబ్యూరో: ఔటర్ రింగ్ రోడ్డు భవిష్యత్తు అవసరాల కోసం సేకరించిన 3 ఎకరాల స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను హెచ్ఎండీఏ శనివారం కూల్చివేసింది. విజయవాడ జాతీయ రహదారి సమీపంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్దఅంబర్‌పేట్‌లో ఆర్‌అండ్‌ఆర్ కింద సేకరించిన ఈ భూమిపైన హెచ్ఎండీఏకు యాజమాన్య హక్కులు ఉన్నాయి. 2010 డిసెంబర్ 31న అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ పంచనామా చేసి ఈ భూమిని హెచ్ఎండీఏకు అప్పగించారు. ఔటర్ రింగురోడ్డులో భూములు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయంగా భూమి ఇచ్చేందుకు వీలుగా ప్రభుత్వం ఈ భూమిని హెచ్ఎండీఏకు కేటాయించింది. ఈ భూమిలో స్థానికులు కొందరు ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో స్థానిక తహసీల్దార్, పోలీసుల సహకారంతో హెచ్ఎండీఏ, ఓఆర్ఆర్ భూసేకరణ అధికారి వి.విక్టర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ (ఇన్‌చార్జి) వెంకటేష్ తమ సిబ్బందితో దాడులు చేసి అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. నిర్మాణ దశలో ఉన్న 5 ఇళ్లు, ప్రహరీలు, గేట్లను అధికారులు ధ్వంసం చేశారు. ఆక్రమణలకు పాల్పడిన ఐదుగురిని గుర్తించి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. హెచ్ఎండీఏకు చెందిన భూముల ఆక్రమణకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

కేబుల్ బ్రిడ్జి పై నుంచి దూకిన మహిళ

మాదాపూర్: ఓ మహిళ దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జిపై నుండి దూకింది. ఈ సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు.. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో కేబుల్‌బ్రిడ్జిపై నుంచి దూకింది. అక్కడ దాదపు 45 నుండి 50 అడుగుల లోతుఉండడంతో ఒక్కసారిగా మునిగిపోయినట్టు తెలిపారు. స్పీడ్ బోట్ సహాయంతో దూకిన భాగంలో రమేష్, మనోహర్‌లు రక్షించడానికి ప్రయత్నం చేసినప్పటికీ ఫలితంన లేకుండా పోయింది. షూ తేలడంతో అది మహిళ షూగా గుర్తించారు. పోలీసులు మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో డ్రగ్స్ ముఠా

- రూ.కోటిన్నర విలువ చేసే డ్రగ్స్ స్వాధీనం
- ఐదేళ్లుగా దందా చేస్తూ తప్పించుకు తిరుగుతున్న నిందితులు
- చాకచక్యంగా పట్టుకున్న సైబరాబాద్ పోలీసులు
- నైజీరియన్ సహా నలుగురు నిందితులు అరెస్టు
- సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: గత ఐదేళ్లుగా పోలీసులకు చిక్కకుండా వ్యవస్థీకృతంగా డ్రగ్స్ దందా చేస్తున్న నైజీరియన్ సహా నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి 303 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆయా వివరాలను సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర శనివారం మీడియాకు వివరాలను వెల్లడించారు.

- ఫిల్మ్‌నగర్‌లో ఉంటున్న గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన చింతా రాకేష్ రోషన్ ఒకసారి గోవాకు వెళ్లాడు. అక్కడ జరిగిన పార్టీలో నైజీరియాకు చెందిన గాబ్రియేల్ అలియాస్ పెటిట్ ఎబుజెర్‌తో పరిచయం ఏర్పడింది. అతని నుంచి కొకైన్‌ను కొనుగోలు చేసి సేవించాడు. ఈ క్రమంగా డ్రగ్స్‌కు బానిసయ్యాడు. డ్రై ఫ్రూట్స్ వ్యాపారంలో నష్టపోవటంతో డ్రగ్స్ సరఫరా చేసి డబ్బు సంపాదించాలని రాకేష్ నిర్ణయించుకున్నాడు. ఈక్రమంలో గాబ్రియేల్ దగ్గర గ్రాము కొకైన్ రూ.7 వేలకు కొనుగోలు చేసి, హైదరాబాద్‌లో రూ.15–18 వేలకు విక్రయించడం మొదలుపెట్టాడు.
- దందా జోరుగా సాగుతుండటంతో బాచుపల్లిలో ఉంటున్న నెల్లూరుకు చెందిన గజ్జెల శ్రీనివాస్ రెడ్డి, మణికొండలో ఉంటున్న కాకినాడకు చెందిన శ్రీరంగం సూర్యప్రకాశ్ అలియాస్ డేవిడ్‌లను కమీషన్ ఆశ చూపించి డ్రగ్స్ వ్యాపారంలోకి దింపాడు. ఇదే సమయంలో గాబ్రియేల్ భార్య గర్భవతి కావటంతో గోవాలో ఉంటున్న నైజీరియాకు చెందిన విక్టర్ చుక్వాకు కొకైన్ వ్యాపారాన్ని చూసుకోమని చెప్పి అతను నైజీరియాకు వెళ్లిపోయాడు.
- ఈక్రమంలో ఈనెల 2న గోవాకు వెళ్లిన సూర్యప్రకాశ్.. విక్టర్ నుంచి 23 గ్రాముల కొకైన్‌ను కొనుగోలు చేశాడు. దాన్ని తీసుకొని రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు వస్తుండగా సైబరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. రాయదుర్గం ఠాణాలో కేసు నమోదు చేసి, నిందితుడిని విచారించగా ఈ ముఠా లింకు బయటపడింది.
- రాకేశ్ ఆదేశాల మేరకు ఈనెల 4న గోవాకు వెళ్లిన శ్రీనివాస్ రెడ్డి విక్టర్ వద్ద 100 గ్రాముల కొకైన్ కొనుగోలు చేశాడు. డ్రగ్స్‌కు హైదరాబాద్‌లో విపరీతమైన డిమాండ్ ఉందని, తనతో రావాలని సూచించాడు. దీంతో శ్రీనివాస్ రెడ్డి, విక్టర్ ఇద్దరు కలిసి కారులో హైదరాబాద్‌కు వచ్చారు. ఈమేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న మాదాపూర్ ఎస్ఓటీ, రాయదుర్గం పోలీసులు శ్రీనివాస్ రెడ్డి, విక్టర్‌లను అరెస్టు చేశారు. వీరిచ్చిన సమాచారం మేరకు ప్రధాన నిందితుడు రాకేష్‌ను పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ.కోటిన్నర విలువ చేసే కొకైన్, రెండు కార్లు, తూకం, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గాబ్రియేల్ పరారీలో ఉన్నాడు

కస్టమర్లపై సెక్షన్ 27 కింద కేసులు..

ఈ ముఠా డ్రగ్స్‌ను వ్యక్తిగత కస్టమర్లకు విక్రయించడంతో పాటు శివారు ప్రాంతాలలో ప్రైవేట్ పార్టీలు నిర్వహించి కొకైన్ సరఫరా చేస్తున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో గుర్తించారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లను విశ్లేషించిన ఫోరెన్సిక్ నిపుణులు.. కస్టమర్ల కస్టమర్ల కాల్ డేటా, వాట్సాప్ చాట్‌లను గుర్తించారు. దీంతో ఆయా కస్టమర్లపై ఎన్‌డీపీఎస్ చట్టంలోని సెక్షన్ 27 కింద కేసులు పెడతామని సీపీ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. పూర్తి స్థాయిలో డేటాను విశ్లేషించిన అనంతరం కస్టమర్లకు నోటీసులు జారీ చేసి విచారిస్తామని పేర్కొన్నారు.

ఆస్తివివాదం.. తమ్ముడిని హత్య చేసిన అన్న

చాదర్‌ఘాట్: ఆస్తివివాదం నేపథ్యంలో తమ్ముడిని అన్న హత్య చేసిన ఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ పర్వేజ్ తెలిపిన వివరాల ప్రకారం... అంబర్‌పేటలో నివసిస్తున్న అశోక్‌కు ఇద్దరు భార్యలు. పెద్ద భార్య కుమారుడు మల్లేష్(33), చిన్నభార్య కుమారుడు నవీన్(24) ఉన్నారు. తండ్రి, కుమారులు అందరూ అంబర్‌పేటలోని ప్రేమ్‌నగర్ కాలనీలో నివసిస్తున్నారు. తండ్రి అశోక్ మలక్‌పేట మార్కెట్‌లో పిండిగిర్ని నిర్వహిస్తున్నాడు. నవీన్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. అంబర్‌పేటలోని ఇంటి గురించి కొంతకాలంగా అన్నదమ్ముల మధ్య వివాదం జరుగుతోంది. శనివారం ఇద్దరూ తండ్రికి టిఫిన్ ఇవ్వటానికి ఇంటి నుండి ద్విచక్రవాహనంపై మలక్‌పేటకు బయలుదేరారు. నవీన్ వాహనాన్ని నడుపుతుండగా అన్న మల్లేష్ వెనుక కూర్చున్నాడు. వారి వాహనం మార్కెట్ వెనుకవైపునకు రాగానే వెనుక కూర్చున్న మల్లేష్ కట్టర్‌తో నవీన్ గొంతు కోసి హత్య చేసి పారిపోయాడు. తీవ్రగాయాలతో నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న చాదర్‌ఘాట్ పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


హత్యకు గురైన నవీన్

నెంబర్ ప్లేట్‌పై స్టిక్కర్.. కేసు నమోదు

కుషాయిగూడ: నెంబర్ ప్లేట్ కనిపించకుండా స్టిక్కర్ అతికించిన వాహనదారుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటన శనివారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎన్ఎఫ్‌సీ బ్రిడ్జి వద్ద కుషాయిగూడ ట్రాఫిక్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ యువకుడు వెళ్తున్న యాక్టివా ద్విచక్ర వాహనానికి ముందు, వెనక బాగంలో వాహన రిజిస్ట్రేషన్ నెంబరు కనిపించకుండా స్టిక్కర్ అతికించాడు. దీనిని పోలీసులు గుర్తించారు. వాహనదారుడిని నిలిపి ప్రశ్నించగా సరైన సమాధానం రాలేదు. దీంతో పోలీసులు స్టిక్కర్ తొలగించి చూడగా మదన్‌లాల్ అనే వ్యక్తికి చెందిన వాహనంగా గుర్తించారు. మోటారు వాహన చట్టాన్ని ఉల్లంఘించినందుకు గాను అతడిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ కుషాయిగూడ పోలీస్‌ష్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

పట్టాల పంపిణీకి చర్యలు

– మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సాక్షి, సిటీబ్యూరో: జీవో 58 కింద వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి పట్టాలు పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాల్సిందిగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. నూతన సచివాలయంలో మంత్రి మహమూద్‌అలీతో కలిసి తన కాన్ఫరెన్స్‌హాల్‌లో నగరానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జీవో 58, 59లకు సంబంధించి పెండింగ్ లో ఉన్న పట్టాలను వారం రోజుల్లోగా పంపిణీ చేసేలా తగుచర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ ను ఆదేశించారు. పెన్షన్ కు అర్హులైన లబ్ధిదారులందరికీ గుర్తింపుకార్డులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులు దరఖాస్తులలో పేర్కొన్న అడ్రస్‌లలో లేరని అధికారులు పేర్కొనగా, అవసరమైతే ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల సహకారం తీసుకోవాలని చెప్పారు. పెండింగ్ దరఖాస్తుల వివరాలు అందజేస్తే సీఎం దృష్టికి తీసుకువెళ్లి మంజూరుకు కృషి చేస్తానన్నారు. రెండో విడత దళితబంధు అమలుకు సంబంధించిన ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానున్నదని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీలు ప్రభాకర్‌రావు, వాణిదేవి, స్టీఫెన్‌సన్, ఎమ్మెల్యేలు నాగేందర్, గోపీనాథ్, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, బలాల, ముంతాజ్ అహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్

ఏషియన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ విజేతగా రవిసింగ్

సనత్‌నగర్: ఏషియన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో సనత్‌నగర్ వాల్మీకి జిమ్ (జీహెచ్ఎంసీ) రవిసింగ్ బిడ్లాన్ బంగారు పతకాన్ని సాధించారు. కేరళ రాష్ట్రంలో ఈ నెల 1 నుంచి 6 వరకు జరిగిన ఈ చాంపియన్‌షిప్‌లో 105 కిలోల విభాగంలో ఆయన మొదటి స్థానంలో నిలిచారు. 12 దేశాల నుంచి పవర్ లిఫ్టర్స్ ఈ పోటీల్లో పాల్గొనగా రవిసింగ్ బిడ్లాన్ విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏషియన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ప్రథమ స్థానంలో నిలవడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు మరిన్ని పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.


రవిసింగ్ బిడ్లాన్..

దేశం యావత్తు తెలంగాణ వైపు చూస్తోంది


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గజ్జెల కాంతం, చిత్రంలో గంధం రాములు

నాంపల్లి: దేశం యావత్తు తెలంగాణ వైపు చూసే విధంగా డాక్టర్ బీఆర్.అంబేద్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహ ప్రతిష్టాపన సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమైందని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ గజ్జెల కాంతం కొనియాడారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర సచివాలయానికి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పేరును పెట్టడం, తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నంను ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. శనివారం ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 16న చలో ఇందిరాపార్కు పోస్టర్ ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన గజ్జెల కాంతం మాట్లాడుతూ...అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన సందర్భంగా ఈ నెల 16న సీఎం కేసీఆర్‌కు ధన్యవాద సభను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కూడా ఈ సభలు జరుపుతామని ప్రకటించారు. కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ గంధం రాములు, కోలా శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నేటినుంచి బీజేపీ జాతీయ నేతల పర్యటన

సాక్షి, హైదరాబాద్: బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, రాష్ట్ర సంస్థాగత సునీల్ బన్సల్ ఆదివారం నల్లగొండ పార్లమెంట్, సోమవారం చేవెళ్ల, హైదరాబాద్ పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొంటారు. పార్లమెంట్ ప్రవాసీ యోజనలో భాగంగా రాష్ట్రంలోని 14 లోక్‌సభ నియోజకవర్గాల (సికింద్రాబాద్, కరీంనగర్, నిజామాబాద్ మినహా) పరిధిలో పలువురు కేంద్రమంత్రులు, అగ్రనేతలు రెండు దఫాలుగా రెండేసి రోజుల పాటు క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెల 8, 9 తేదీల్లో ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలోని ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్–కొమురం భీం జిల్లాలలో కేంద్ర పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి పురుషోత్తం రూపాల పర్యటిస్తారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్లమెంట్ ప్రవాసీ యోజన ప్రముఖ్ గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

'బీఆర్ఎస్‌తో కాంగ్రెస్ కుమ్మక్కు'



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీతో కాంగ్రెస్ పార్టీ కుమ్మక్కైందని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ గురు ప్రకాశ్ పాశ్వాన్ ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ప్రకాశ్ పాశ్వాన్ మీడియాతో మాట్లాడుతూ..రాష్ట్రంలో దళితుల సంక్షేమాన్ని ప్రభుత్వం పక్కనబెట్టి రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేడ్కర్ పేరిట రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం పెడితే సరిపోదని కేసీఆర్ కేబినెట్‌లో ఎంతమంది దళితులున్నారో, బీఆర్ఎస్‌లో దళిత నేతలు ఎందరున్నారో లెక్క చెప్పాలన్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని అంత పెద్దగా ఎందుకు ఏర్పాటు చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దళితుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన చర్యలేంటో శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. దళితులకు మూడెకరాల భూమి, దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. నగరం నడిబొడ్డునే హత్యకు గురైన నాగరాజు అనే దళితుడి కేసును ప్రభుత్వం ఏమి చేసిందని నిలదీశారు. ప్రీతి నాయక్, సమత, లక్ష్మీ కేసులు ఏమయ్యాయో? వాటిని ఎందుకు మరుగునపెట్టారో సమాధానం చెప్పాలన్నారు.

వడ్లు మొలకెత్తి రైతు రోదిస్తున్నా పట్టదా..

ప్రభుత్వంపై వైఎస్ షర్మిల ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: వడ్లకు మొలకలు వచ్చి రైతన్న రోదిస్తున్నా సీఎం కేసీఆర్‌కు పట్టడం లేదంటూ వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత వైఎస్ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. తడిసిన వడ్లు కొంటామన్న దొర.. కాంటాలు ఎప్పుడు వేస్తారో సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. వడ్లు ఎప్పుడు కొంటారో తెలియక రైతు కటిక చీకట్లోనూ కాపలా కాస్తుంటే కేసీఆర్‌కు సోయి కూడా లేదని మండిపడ్డారు. ఓ పక్క వానలు పడుతున్నా కొనుగోలు సెంటర్లు తెరవకపోవడం దుర్మార్గమన్నారు. ఇదే అదనుగా మిల్లర్లు కోతలు పెట్టి కాంటాలు వేస్తున్నారన్నారు. తడిసిన వడ్లు కొనడంతో పాటు ఎకరాకు రూ.30వేల నష్టపరిహారం కూడా ఇవ్వాలని షర్మిల డిమాండ్ చేశారు.

రూ.18 లక్షల ప్యాకేజీతో ఉద్యోగమా!

పక్క రాష్ట్రంనుంచి బీఆర్ఎస్‌లో చేరిన వ్యక్తికి రూ. 18 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం ఇవ్వడాన్ని వైఎస్ షర్మిల ఆక్షేపించారు. రాష్ట్రంలో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే ఉద్యోగాలు ఇవ్వడం చేతకాలేదని, కానీ పార్టీ కార్యకర్తలకు మాత్రం ప్రభుత్వ ఉద్యోగాలు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఇష్టారాజ్యంగా రాసివ్వడానికి తెలంగాణ కొలువులు ఆయన ఇంట్లో నౌకరు పదవులా అని మండిపడ్డారు. పార్టీ కార్యకర్తలకు పదవుల కోసం ఇచ్చిన జీవోలను వెంటనే రద్దు చేయాలని షర్మిల డిమాండ్ చేశారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలి



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, వెంకటేష్

జియాగూడ (హైదరాబాద్): మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు భారతరత్న పురస్కారం ప్రకటించాలని టీడీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ కోరారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం జియాగూడ ఎస్‌బీపీ గార్డెన్‌లో కార్వాన్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బండారి వెంకటేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటైంది. అంతకుముందు కార్వాన్ రామ్‌సింగ్‌పురా నుండి భారీ ర్యాలీ వేదిక వద్దకు చేరుకుంది. ముఖ్య అతిథిగా కాసాని జ్ఞానేశ్వర్, పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.అరవింద్‌కుమార్ గౌడ్, ఆర్.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడు అలి మస్కతిలు జ్యోతిప్రజ్వలన చేసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటైన సభలో పలు తీర్మానాలు చేశారు.

డబుల్ ఓట్.. ఇక ఔట్!



- ఒక్కరికి ఒకటి కన్నా ఎక్కువ ఓట్లుంటే గుర్తించి తొలగింపు
- ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో పరిశీలన చేపట్టిన ఎన్నికల సంఘం
- ఇప్పటికే రాష్ట్రంలో 14 లక్షలకు పైగా 'మల్టిపుల్ ఓట్లు'రద్దు
- ఇలాంటివి ఇంకా ఉన్నాయన్న ఫిర్యాదులతో మరో దఫా పరిశీలన
- కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లో ప్రత్యేక డ్రైవ్ మొదలు

నోటీసులు ఇచ్చి.. డిక్లరేషన్ తీసుకుని..

ఒకరికి ఒకటి కంటే ఎక్కువ ఓట్లు ఉంటే ప్రత్యేక సాఫ్ట్‌వేర్ సాయంతో గుర్తిస్తున్నారు. అలాంటి వారికి ఎక్కడో ఒకేచోట ఓటును ఎంచుకోవాలంటూ నోటీసులు ఇస్తున్నారు. వారికి కావాల్సిన చోట ఓటుకు సంబంధించి డిక్లరేషన్ తీసుకుంటున్నారు. మిగతా చోట్ల ఉన్న ఓట్లను తొలగిస్తున్నారు. ఇలా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 14 లక్షలకుపైగా ఓట్లను రద్దు చేశారు. అయితే.. ఇప్పటికీ 289 ఇంటి నంబర్లలో ఒక్కో ఇంట్లో వందకు పైగా.. మరో 23,247 ఇంటి నంబర్లలో ఒక్కో ఇంట్లో 20కిపైగా ఓట్లు ఉన్నట్టు గుర్తించారు. తొలగింపు ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. శనివారం నాటికి మొత్తంగా 2,99,77,659 మంది ఓటర్లు ఉన్నట్టు నిర్ధారించారు.

అత్యధికంగా డబుల్ ఓట్లు తొలగించిన జిల్లాలివీ..

జిల్లా	తొలగించిన ఓట్లు	జిల్లాలోని మొత్తం ఓట్లు
హైదరాబాద్	2,82,701	42,15,456
మేడ్చల్ మల్కాజిగిరి	1,76,501	25,24,951
రంగారెడ్డి	1,66,529	31,08,068
నిజామాబాద్	73,924	12,99,484
నల్లగొండ	56,337	13,55,482
కరీంనగర్	36,601	9,96,454
ఖమ్మం	29,292	11,53,987

సొంతూరిలో ఒక ఓటు.. చదువుకున్న చోట మరో ఓటు.. ఉద్యోగం కోసం వలస వెళ్లిన చోట మరో ఓటు.. కొందరికైతే ఒకే నియోజకవర్గంలో వేర్వేరు చోట్ల ఓట్లు.. ఇలా చాలా మందికి ఎక్కువ సంఖ్యలో ఓట్లు ఉన్నాయి. దీనితో ఎన్నికల సమయంలో గందరగోళం, కొన్నిసార్లు అక్రమాలకు ఆస్కారం కలుగుతోంది. ఈ క్రమంలో మల్టిపుల్ ఓట్లను ఏరివేసేందుకు ఎన్నికల సంఘం కసరత్తు మొదలుపెట్టింది. ఇప్పటికే రాష్ట్రంలో 14 లక్షలకుపైగా మల్టిపుల్ ఓట్లను గుర్తించి తొలగించింది. తాజాగా మరోదఫా పరిశీలనకు సిద్ధమైంది.

(సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 మేరకు దేశంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉంటుంది. అయితే దేశంలో ఎక్కడో ఒక్కచోట మాత్రమే ఆ ఓటు నమోదై ఉండాలి. మరోచోటికి మారితే.. మొదట ఉన్నచోట రద్దు చేసుకుని, కొత్త ప్రాంతంలో నమోదు చేసుకోవాలి. కానీ రాష్ట్రంలో కొందరికి ఐదు నుండి పది ఓట్లు ఉండటం, ఒకే ఇంటి నంబర్‌పై నాలుగైదు వందల ఓట్లు నమోదు కావడం వంటివి వెలుగుచూశాయి. హైదరాబాద్‌లో కేవలం 85 ఇంటి నంబర్లపై ఏకంగా 14,037 ఓట్లు ఉన్నట్టు గుర్తించారు. మేడ్చల్–మల్కాజిగిరిలో 28 ఇంటి నంబర్లలో 5,501 ఓట్లు, రంగారెడ్డి జిల్లాలో 33 ఇంటి నంబర్లలో 5,430 ఓట్లు, నల్లగొండలో 74 ఇంటి నంబర్లలో 11,126 ఓట్లు, ఖమ్మంలో 11 ఇంటి నంబర్లలో 2,678 ఓట్లు ఉన్నట్టు గుర్తించారు. ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటివి ఉన్నట్టు తేల్చారు. రాష్ట్రంలోని మొత్తం ముప్పైమూడు జిల్లాల్లో కేవలం 289 ఇంటి నంబర్లలో ఏకంగా 47,325 మంది ఓటర్లుగా నమోదై ఉన్నట్టు తాజా లెక్కలు చెప్తున్నాయి. అంటే ఒక్కో ఇంట్లో సగటున 160 మందికిపైనే ఓటర్లు ఉన్నట్టు అన్నమాట.

ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో పరిశీలన జరిపి..

ఎన్నికల సంఘం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా.. ఒకే పేరు, ఫోటోతో వేర్వేరు ప్రాంతాల్లో ఓట్లు ఉన్న వారిని గుర్తించింది. ఇలా ఇప్పటివరకు 14,09,294 ఓట్లను రద్దు చేసింది. ఇంకా ఇలాంటి ఓట్లు భారీగా ఉన్నట్టు రాజకీయ పక్షాలు ఫిర్యాదులు చేయడంతో ఎన్నికల సంఘం స్పందించింది. ఒక ఇంటి నంబర్‌పై ఆరు కంటే ఎక్కువ ఓట్లు ఉన్నచోట ప్రత్యేక పరిశీలన చేపట్టాలని నిర్ణయించింది. తాజాగా రాష్ట్రంలోనే అత్యధిక ఓటర్లున్న శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో సాధారణ సగటుకు మించి ఓటర్లున్న ప్రాంతాలపై ప్రత్యేక పరిశీలన మొదలుపెట్టింది.



ఎక్కువ నివాసాలు ఉంటే ప్రత్యేక నంబర్లు..

హైదరాబాద్ నగరంలో ఒకే ఇంటి నంబర్‌పై చాలా వ్యక్తిగత నివాసాలున్న ప్రాంతాలను గుర్తించి... ఆయా నివాసాలకు ప్రత్యేక నంబర్లు కేటాయించాలని జీహెచ్ఎంసీ అధికారులను ఎన్నికల సంఘం తాజాగా సూచించింది. ఒకే ఇంటి నంబర్‌తో అపార్ట్‌మెంట్లు ఉంటే.. అందులోని ఫ్లాట్లకు వేర్వేరు నంబర్లు కేటాయించే పనిని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరింది.

ఆత్మహత్యలు లేని తెలంగాణ కాంగ్రెస్ లక్ష్యం

- 51వ రోజు పోచంపల్లిలో కొనసాగిన భట్టి పాదయాత్ర
- యాదాద్రి నుంచి రంగారెడ్డి జిల్లాలో ప్రవేశించిన యాత్ర



ప్రియాంకాగాంధీకి బహుమతిగా ఇచ్చేందుకు పోచంపల్లిలో చేనేత చీరలను కొనుగోలు చేస్తున్న భట్టివిక్రమార్క

సాక్షి, యాదాద్రి/సాక్షి, రంగారెడ్డి జిల్లా: రానున్న తమ ప్రభుత్వంలో చేనేత రంగానికి పెద్దపీట వేస్తామని సీఎల్పీ నేత భట్టివిక్రమార్క అన్నారు. ధనిక రాష్ట్రంలో చేనేత రంగానికి ఇవ్వాల్సిన సబ్సిడీ రాయితీలు ఇవ్వకుండా జియో విధానంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక కొర్రీలు పెడుతోందన్నారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లిలో కొనసాగింది. చేనేత కార్మికులు పోచంపల్లిలో కొన్ని రోజులుగా చేస్తున్న దీక్షకు, సంఘీభావం తెలిపారు. పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు కూడా మద్దతు ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం జియో ట్యాగింగ్ పేరుతో రాష్ట్రంలో 17 లక్షల మంది చేనేత కార్మికులు మాత్రమే ఉన్నారని తక్కువ చూపించే ప్రయత్నం చేస్తోందన్నారు. జిల్లాలో ఆత్మహత్య చేసుకున్న చేనేత కళాకారుల కుటుంబాలకు ఇచ్చే పరిహారం మూడేళ్లు ఇవ్వకుండా ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యంపై మండిపడ్డారు. యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆత్మహత్య చేసుకున్న పదిమంది చేనేత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున ఆర్థికసాయం అందిస్తానని ప్రకటించారు. కాగా, భట్టి విక్రమార్క పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర శనివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కొత్తగూడెంలో అడుగుపెట్టింది.

ప్రియాంకకు బహుమతిగా పోచంపల్లి పట్టుచీరలు

హైదరాబాద్ సరూర్‌నగర్‌లో సోమవారం నిర్వహించే యువ సంఘర్షణ సభకు ముఖ్యఅతిథిగా హాజరవుతున్న ప్రియాంకగాంధీకి బహుమతిగా ఇవ్వడానికి భట్టివిక్రమార్క పోచంపల్లిలోని ఓ చేనేత కార్మికుడి ఇంట్లో మూడు ఇక్కత్ పట్టుచీరలను కొనుగోలు చేశారు. ప్రియాంకకు వాటిని బహూకరించనున్నట్లు భట్టి చెప్పారు.

మోదీది రావణరాజ్యం

సీపీఐ కార్యదర్శి కూనంనేని ధ్వజం



చేవెళ్ల: 'బీజేపీకో హటావో అంటున్నాం.. కేసీఆర్‌నూ హెచ్చరిస్తున్నాం'అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో 'ఇంటింటికి సీపీఐ కార్యక్రమం'ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. మతోన్మాద బీజేపీ పాలనతో దేశం సర్వనాశనమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. 'ప్రధాని మోదీ మాట్లాడితే మాది రామరాజ్యం అంటున్నారు.. వాస్తవానికి ఇది రావణరాజ్యం'మని ధ్వజమెత్తారు. మోదీ ప్రభుత్వం అణువణువూ విషం నింపుకొని పాలన సాగిస్తోందని, ఇది దేశానికి మంచిది కాదన్నారు. దేశ సంపదంతా కార్పొరేట్ సంస్థలకు, బడాబాబులకు దోచి పెడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌తో దోస్తీ ఉండొచ్చు ఉండక పోవచ్చు.. కానీ పేద ప్రజలకు మాత్రం న్యాయం జరగాలని చెప్పారు. లేకుంటే కేసీఆర్‌నూ ఎదిరిస్తామని, అవసరమైతే ప్రజాపోరాటం చేస్తామని కూనంనేని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టాల కోసం ఎదురుచూస్తున్న పేదలకు ఇళ్ల పట్టాలు అందించాలని, సమ్మె చేస్తున్న ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సభలో పార్టీ నేతలు పానుగంటి పర్వతాలు, ఈటి నర్సింహ, పాలమాకుల జంగయ్య, కె.రామస్వామి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు చేవెళ్లలో భారీర్యాలీ నిర్వహించారు.

'మహా' పార్టీలపై బీఆర్ఎస్ కన్ను

ఎన్సీపీ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్న కేసీఆర్.. మూడు రోజులుగా ఎన్సీపీ ముఖ్యనేతలతో భేటీలు

శివసేనలోని రెండు వర్గాల నేతలూ మంతనాలు.. త్వరలో కొందరు ఎన్సీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి..



సాక్షి, హైదరాబాద్: పొరుగు రాష్ట్రంలో విస్తరణ దిశగా బీఆర్ఎస్‌ను పరుగులు పెట్టించేలా ఆ పార్టీ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా మహారాష్ట్రలోని ఇతర పార్టీల నుంచి చేరికలపై దృష్టి సారించారు. ఇప్పటికే మహారాష్ట్రలోని నాందేడ్, ఔరంగాబాద్ జిల్లాల నుంచి వివిధ పార్టీల మాజీ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ నేపథ్యంలో శరద్‌పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ), శివసేన(థాక్రే, షిండే) వర్గాల్లో నెలకొన్న పరిస్థితిని అనువుగా మలుచుకుని చేరికల జోరు పెంచాలని భావిస్తున్నారు. ఇప్పటివరకు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, ఎన్నికల్లో పోటీచేసి ఓటమిపాలైన అభ్యర్థులు బీఆర్ఎస్‌లో చేరారు. ఎన్సీపీకి చెందిన కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు త్వరలో బీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధమైనట్టు విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు ఎన్సీపీ ముఖ్యనేతలు, సిట్టింగ్ ఎమ్మెల్యేలు మూడు రోజుల క్రితం సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. బీఆర్ఎస్‌కు చెందిన ఓ ఎంపీ ఎన్సీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేల చేరిక వ్యవహారంలో క్రియాశీలంగా పని చేస్తున్నారు. ఎన్సీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేల చేరిక ఖాయమైన తర్వాత మహారాష్ట్రలో మరో భారీ బహిరంగ సభ నిర్వహించే యోచనలో కేసీఆర్ ఉన్నారు.

'మహా'పాలిటిక్స్‌పై కేసీఆర్ లెక్కలు

➤ మహారాష్ట్ర రాజకీయాలు బీఆర్ఎస్ విస్తరణకు అనుకూలంగా ఉన్నాయనే నిర్ణయానికి కేసీఆర్ వచ్చారు. ఈ నేపథ్యంలో అక్కడి రాజకీయాలు, పార్టీల సంస్థాగత లోపాలను అనువుగా మలుచుకుని బీఆర్ఎస్ బలోపేతానికి కేసీఆర్ పావులు కదుపుతున్నారు. ఎన్సీపీ, శివసేన(థాక్రే, షిండే) వర్గాల్లో నెలకొన్న పరిస్థితి బీఆర్ఎస్ విస్తరణకు అనుకూలంగా ఉందనే నిర్ణయానికి కేసీఆర్ వచ్చారు. ఈ నేపథ్యంలో ఆయా పార్టీల నుంచి బీఆర్ఎస్‌లోకి వలసలను ప్రోత్సహించేలా కార్యాచరణకు పదును పెడుతున్నారు. ఈ నెల 2న తెలంగాణ భవన్‌లో మహారాష్ట్ర నేతలతో జరిగిన భేటీలో బీఆర్ఎస్ సిద్ధాంతాలు, లక్ష్యాలను వివరించడంతోపాటు చేరికలు, పార్టీ సంస్థాగత నిర్మాణం వంటి అనేక అంశాలపై చర్చించారు. మహారాష్ట్రకు చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యేలు కూడా తనతో టచ్‌లో ఉన్నారనే విషయాన్ని వెల్లడించారు. ఎన్సీపీ అధ్యక్ష పదవికి శరద్‌పవార్ రాజీనామా ప్రకటన, తర్వాత వెనక్కి తీసుకోవడం వంటి పరిణామాలు వేగంగా జరిగిన విషయం తెలిసిందే. అయితే ఎన్సీపీలో మాజీ ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్, ఎంపీ సుప్రియా సూలే మధ్య ఆధిపత్యపోరుతో పార్టీలో చీలిక అనివార్యమనే అంశాన్ని అక్కడి నేతలు కేసీఆర్ దృష్టికి తెచ్చినట్లు తెలిసింది. ఎన్సీపీకి 50కిపైగా మంది శాసనసభ్యులు ఉండగా, ఇందులో మెజారిటీ ఎమ్మెల్యేలు అజిత్‌పవార్ వర్గంలో ఉన్నట్లు సమాచారం. పార్టీలో నెలకొన్న సందిగ్ధ పరిస్థితుల్లో కొందరు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది. శివసేన రెండు వర్గాల నేతలు కూడా కేసీఆర్‌కు టచ్‌లోకి వచ్చినట్లు మహారాష్ట్ర రాజకీయాలను బీఆర్ఎస్ తరఫున పర్యవేక్షిస్తున్న నేత ఒకరు వెల్లడించారు.

ఇప్పటికే పలువురు మాజీల చేరిక

➤ నాందేడ్, ఔరంగాబాద్ జిల్లాలకు చెందిన పలువురు మాజీ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యేలు అన్నాసాహెబ్ మానే, హర్షవర్ధన్ జాదవ్, శంకరన్న దోంగ్డె, రాజు తొడ్సమ్ గులాబీ కండువా కప్పుకున్నారు. వీరితోపాటు ఔరంగాబాద్ జెడ్పీ చైర్మన్, గత ఎన్నికల్లో పోటీ చేసిన సంతోష్ కుమార్ వంటి నేతలు కూడా బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేల రాకతో చేరికల వేగం మరింత పెరుగుతుందని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

తెలంగాణ మోడల్‌పై చర్చకు షిండే హామీ..

➤ తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను మహారాష్ట్రలోనూ అమలు చేయాలని వినాయక్ పాటిల్ అనే మహారాష్ట్రవాసి ఐదురోజులుగా ఆమరణదీక్ష చేస్తున్నారు. వినాయక్ పాటిల్ ఆరోగ్యం విషమించడంతో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఫోన్ చేశారు. మే 9న తెలంగాణలో అమలవుతున్న పథకాలు, తెలంగాణ మోడల్‌పై చర్చిద్దామని సీఎం షిండే హామీ ఇచ్చారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో మాణిక్‌రావ్ ఠాక్రే

ఉద్యోగాల కల్పనలో మోదీ, కేసీఆర్ విఫలం

యువతకు భరోసా కల్పించేందుకే ప్రియాంకా గాంధీ రాక: ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- రేపటి 'యువ సంఘర్షణ సభ'పై సన్నాహక సమావేశం
- ఎల్బీనగర్, మహేశ్వరం, ఇబ్రహీం పట్నం నియోజకవర్గాల నుంచి భారీ జన సమీకరణకు నిర్ణయం

సాక్షి, హైదరాబాద్/ సాక్షి, రంగారెడ్డి జిల్లా: దేశంలో, రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఉద్యోగాలు వస్తాయనే ఆశతో యువత తెలంగాణ పోరాటం చేశారని చెప్పారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న కేసీఆర్.. కనీసం ఊరికో ఉద్యోగం ఇవ్వలేదని మండిపడ్డారు. గతంలో 25 లక్షల నిరుద్యోగులు ఉంటే.. ఇప్పుడా సంఖ్య 40 లక్షలకు చేరిందని పేర్కొన్నారు. నిరుద్యోగులకు అండగా కాంగ్రెస్ ఉంటుందన్న భరోసా ఇవ్వడానికే ప్రియాంకా గాంధీ హైదరాబాద్‌కు వస్తున్నారని చెప్పారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు.

అసమర్థత, అవినీతి వల్లే పేపర్ల లీకేజీ

సీఎం కేసీఆర్ అసమర్థత, అవినీతి వల్లే పేపర్ల లీకేజీ వ్యవహారం చోటు చేసుకుందని ఉత్తమ్ ఆరోపించారు. పేపర్ల లీక్‌పై కేసీఆర్ ఇప్పటివరకు ఒక్కమాట కూడా మాట్లాడలేదేమని ప్రశ్నించారు. 503 గ్రూప్–1 పోస్టులకు మూడున్నర లక్షల మంది, 17 వేల పోలీస్ ఉద్యోగాలకు 12 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారంటే.. రాష్ట్రంలో నిరుద్యోగం తీవ్రత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలు అధ్యాపకులు, మౌలిక వసతులు లేక అల్లాడుతున్నాయని చెప్పారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న ప్రధాని మోదీ.. ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టారని విమర్శించారు.

నిరుద్యోగుల ఆశలు వమ్ము: ఠాక్రే

రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల ఆశలను వమ్ము చేసిందని ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే ఆరోపించారు. ప్రియాంకా గాంధీ సభ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల కల్పనలో జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తామని.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉద్యోగాల కల్పన కోసం ఏం చేస్తామో చెప్తామని తెలిపారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి, సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సభకు 3 నియోజకవర్గాల నుంచి..

సోమవారం (8న) సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహిస్తున్న 'యువ సంఘర్షణ సభ'కు గ్రేటర్ హైదరాబాద్ పరిధి నుంచే లక్ష మందిని సమీకరించాలని రాష్ట్ర కాంగ్రెస్ నిర్ణయించింది. ఇందులో ఎల్బీనగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల నుంచే 50 వేల మందిని తరలించాలని తీర్మానించింది. ఈ మేరకు సరూర్‌నగర్ సభ నిర్వహణపై టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి నేతృత్వంలో శనివారం సన్నాహక సమావేశం జరిగింది. ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, అంజన్‌కుమార్ యాదవ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు, గ్రేటర్ పరిధిలోని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాల్గొన్న ఈ సమావేశంలో.. సభ విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. గత ఎన్నికల్లో ఎల్బీనగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీనే గెలిచిందని.. ఎమ్మెల్యేలు పార్టీ మారినా కేడర్ మాత్రం చెక్కు చెదరలేదని ఈ సందర్భంగా పీసీసీ నేతలు పేర్కొన్నారు. ఈ నియోజకవర్గాల్లో పోటీకి సిద్ధపడుతున్న అభ్యర్థులు స్థానికంగా పట్టు పెంచుకోవాలని, సభకు భారీగా జనాన్ని తరలించి బలం చాటాలని సూచించినట్లు తెలిసింది.

నేడు బీఎస్పీ 'తెలంగాణ భరోసా సభ'

- హాజరుకానున్న మాయావతి.. శనివారం సాయంత్రమే హైదరాబాద్‌కు రాక..
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ఇతర నేతలతో సమావేశం
- నేడు సరూర్‌నగర్ స్టేడియంలో బహిరంగ సభ
- సభా స్థలికి విద్యార్థి అమరుల ప్రాంగణంగా నామకరణం



బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో మాయావతికి స్వాగతం పలుకుతున్న ప్రవీణ్‌కుమార్ తదితరులు

సాక్షి, హైదరాబాద్/సాక్షి, రంగారెడ్డి జిల్లా/సనత్‌నగర్: తెలంగాణ భరోసా సభతో రాష్ట్రంలో మరో బలమైన రాజకీయశక్తిగా ఎదగాలని బహుజన్ సమాజ్ పార్టీ భావిస్తోంది. ఆదివారం సాయంత్రం సరూర్‌నగర్ స్టేడియంలో జరగనున్న ఈ సభకు బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి హాజరవుతున్న నేపథ్యంలో పార్టీ రాష్ట్ర శాఖ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సభాస్థలికి 'విద్యార్థి అమరుల ప్రాంగణం'గా నామకరణం చేశారు. సభలో పాల్గొనేందుకు మాయావతి శనివారం సాయంత్రం ప్రత్యేక హెలికాప్టర్‌లో బేగంపేట విమానాశ్రయానికి చేరుకోగా, ఆమెకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎంపీ రాంజీగౌతమ్ తదితరులు ఘనస్వాగతం పలికారు. విమానాశ్ర యం నుంచి ఆమె బస చేయనున్న పార్కు హయత్ హోటల్ వరకు బీఎస్పీ సికింద్రాబాద్ జిల్లా శ్రేణులు కాన్వాయ్ వెంట ర్యాలీగా వెళ్లారు. అనంతరం ఆమె ప్రవీణ్‌కుమార్ తదితరులతో భేటీ అయ్యారు. మరోవైపు సభకు నిర్వాహకులు భారీగా ఏర్పాట్లు చేశారు. సరూర్‌నగర్ స్టేడియానికి దారితీసే ప్రాంతాల్లో మాయావతి కటౌట్లను పెట్టారు.

దొరల పాలన నుంచి విముక్తి కోసం..

'అసమానతలు, అణచివేతల దొరల గడీల పాలన నుంచి విముక్తి కోసం'అనే నినాదంతో 'తెలంగాణ భరోసా సభ'నిర్వహిస్తున్నట్లు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ఈ తెలంగాణ పేదల జీవితాలను దొరల చేతికి అప్పగించకూడదని ప్రజలకు వివరిస్తూ 210 రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించానన్నారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతూ ప్రశ్నపత్రాలను అమ్ముకునే దుస్థితికి దిగజారిన ప్రభుత్వ పెద్దల తీరును ఎండగట్టిన బీఎస్పీ.. ఇప్పటికే యువతరానికి భరోసా ఇచ్చిందన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ స్కాం, లీకేజీ స్కాం, లిక్కర్ స్కాంల ద్వారా సీఎం కుటుంబం ఆస్తులను పెంచుకుంటూ ప్రజల జీవితాలను అస్తవ్యస్తం చేసిందన్నారు. 50 శాతం ఉన్న బీసీలకు బడ్జెట్‌లో 3 శాతం నిధులు, 10 శాతం ఉన్న మైనారిటీలకు ఒక్క శాతం నిధులు కేటాయించి అన్యాయం చేశారని అన్నారు. తెలంగాణ ప్రజల ఆవేదన, ఆక్రందనను బహిరంగ సభ ద్వారా పార్టీ అధినేత్రి మాయావతి ప్రజలకు వివరిస్తారని ప్రవీణ్‌కుమార్ చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు తన వంతు సహకారం అందించిన మాయావతి.. తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై ఆవేదన చెందుతున్నారన్నారు. 1,300 మంది పేద బహుజన విద్యార్థుల త్యాగాలతో, బీఎస్పీ వంటి పలు పార్టీల మద్దతుతో ఏర్పాటైన తెలంగాణకు దొరల పాలన నుంచి విముక్తి కల్పించడమే లక్ష్యంగా బీఎస్పీ పనిచేసేలా మాయావతి పార్టీ యంత్రాంగానికి, ప్రజలకు దిశానిర్దేశం చేస్తారని ఆయన తెలిపారు.

మరోసారి రాష్ట్రానికి మోదీ!

▶ మొదటి పేజీ తరువాయి

పొందే ఏ అవకాశాన్నీ వదులుకోరాదనే వ్యూహం మేరకే సరిహద్దుల్లో సభ నిర్వహించే యోచన ఉందని పార్టీ నేతలు చెప్తున్నారు. కర్ణాటక ఎన్నికల కోడ్‌తో ఇబ్బందిలేకుండా.. జహీరాబాద్, నారాయణపేట్ లేదా మరోచోట సభ నిర్వహించే అవకాశం ఉందని అంటున్నారు.

త్వరలో ఎన్నికలు ఉండటంతో..

తెలంగాణలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో వివిధ వర్గాల ప్రజలకు చేరువయ్యేలా రాజకీయ వ్యూహాలకు బీజేపీ అగ్రనేతలు పదును పెడుతున్నారు. కేసీఆర్ సర్కార్‌పై విమర్శల దాడిని కొనసాగించడంతోపాటు కేంద్ర మంత్రులు, ముఖ్య నేతల పర్యటనల ద్వారా పార్టీ కేడర్‌లో ఉత్సాహం నింపాలని భావిస్తున్నారు. కేంద్ర పథకాల ద్వారా వివిధ రంగాల్లో రాష్ట్రానికి కేటాయించిన నిధులు, ప్రజలకు కలిగిన లబ్ధిని క్షేత్రస్థాయిలో వివరించాలని నిర్ణయించారు.

వరంగల్ టెక్స్‌టైల్ పార్క్ ప్రారంభం కోసం..

గత నెల 8న హైదరాబాద్‌లో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రధాని మోదీ.. ఈ నెలలో వరంగల్‌లో టెక్స్‌టైల్ పార్కు ప్రారంభోత్సవానికి రానున్నారు. తెలంగాణలో పట్టు పెంచుకునే వ్యూహాల్లో భాగంగా.. వచ్చే ఆరు నెలల్లో మోదీ నెలకోసారి, అమిత్‌షా ఒకట్రెండు సార్లు, నడ్డా కనీసం నెలకు రెండుసార్లు పర్యటించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ క్రమంలోనే మోదీ పర్యటన జరగనుంది. ఈ నెలలోనే రాష్ట్రంలోని రెండు ఎంపీ సీట్ల పరిధిలో జేపీ నడ్డా పర్యటించనున్నారని.. ఈ నెలాఖరులో లేదా వచ్చేనెల మొదట్లో అమిత్‌షా పర్యటన ఉంటుందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

స్పోర్ట్స్



మరింత మెరుగైన ప్రదర్శన కనబరుస్తా: నీరజ్ చోప్రా

డైమండ్ లీగ్ తొలి రౌండ్‌లో విజేతగా నిలిచిన భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఈ సీజన్‌లోని రాబోయే రౌండ్‌లో మరింత మెరుగైన ప్రదర్శన కనబరుస్తానని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశాడు. లీగ్‌లో డిఫెండింగ్ చాంపియన్ అయిన నీరజ్ ఇదే తరహా నిలకడ కొనసాగిస్తానని అన్నాడు. 'శుక్రవారం తొలి రౌండ్‌లో గెలుపు కోసం ఎంతో శ్రమించాను. అయితే ఫలితం ఆనందాన్నిచ్చింది. దీనిని శుభారంభంగా భావిస్తున్నా. గాలి వేగంలో మార్పు వల్ల పోటీ సవాల్‌గా మారింది. పైగా అత్యుత్తమ ఆటగాళ్లంతా బరిలో నిలిచారు. ఈ సీజన్ మొత్తం ఫిట్‌నెస్‌తో ఉండి నిలకడగా రాణించడం ముఖ్యం. తర్వాతి రౌండ్‌లోనూ అగ్రస్థానంలో నిలిచేందుకు ప్రయత్నిస్తా. నాపై నమ్మకముంచి ఎంతో మంది భారత అభిమానులు ఇక్కడకు వచ్చారు. దానిని నిలబెట్టుకోగలిగినందుకు సంతోషం' అని నీరజ్ వ్యాఖ్యానించాడు.

చెన్నై 'డబుల్' ధమాకా

ఐపీఎల్ తాజా సీజన్‌లో ఇంటాబయటా ముంబై ఇండియన్స్‌పై చెన్నై సూపర్‌కింగ్స్ ఆధిపత్యం కొనసాగించింది. నెల రోజుల క్రితం ముంబైని మరాఠా వేదికపై ఓడించిన ధోని సేన, ఇప్పుడు దాదాపు అదే ప్రదర్శనను పునరావృతం చేసింది. పైగా వరుసగా గత ఆరు సార్లు చెపాక్ మైదానంలో ముంబై చేతిలో ఎదురైన పరాజయాలకు ఈ గెలుపుతో బ్రేక్ వేసింది.

- 6 వికెట్లతో ముంబైపై గెలుపు
- రాణించిన పతిరణ, కాన్వే



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' పతిరణ

చెన్నై: ఐపీఎల్‌లో హేమాహేమీ జట్లు ముంబై, చెన్నై మధ్య వరుసగా మరో మ్యాచ్ ఏకపక్షంగా ముగిసింది. శనివారం జరిగిన పోరులో చెన్నై 6 వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్‌పై ఘన విజయం సాధించింది. మొదట రోహిత్ సేన 20 ఓవర్లలో 8 వికెట్లకు 139 పరుగులు చేసింది. నేహాల్ వధేరా (51 బంతుల్లో 64; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ చేయగా...'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మతీశ పతిరణ (3/15) దెబ్బ తీశాడు. సూపర్‌కింగ్స్ 17.4 ఓవర్లలో 4 వికెట్లే కోల్పోయి 140 పరుగులు చేసింది. డెవాన్ కాన్వే (42 బంతుల్లో 44; 4 ఫోర్లు), రుతురాజ్ గైక్వాడ్ (16 బంతుల్లో 30, 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు.

రోహిత్ మళ్లీ విఫలం

ముంబై బ్యాటింగ్‌కు దిగడంతోనే కష్టాల్లో కూరుకుపోయింది. గ్రీన్ (6), ఇషాన్ (7), రోహిత్ (0)లు 14 పరుగుల స్కోరుకే పెవిలియన్‌లో కూర్చున్నారు. హైదరాబాద్ కుర్రాడు తిలక్‌వర్మ స్వల్ప గాయంతో బరిలోకి దిగలేకపోవడంతో మూడో స్థానంలో వచ్చిన కెప్టెన్ మళ్లీ డకౌటయ్యాడు. సూర్యకుమార్ (22 బంతుల్లో 26; 3 ఫోర్లు) తర్వాత స్టబ్స్ (21 బంతుల్లో 20; 2 ఫోర్లు)తో నేహాల్ వధేరా ఇన్నింగ్స్‌ను కుదుటపరిచాడు. 123/4 స్కోరు దాకా బాగానే ఉన్నా... 14 పరుగుల వ్యవధిలోనే 4 వికెట్లను కోల్పోయింది.



చెన్నై సులువుగా...

చెన్నై ముందున్న లక్ష్యం 140 పరుగులు. ఇందులో సగంకంటే ఎక్కువ పరుగుల్ని ఓపెనర్లు రుతురాజ్, కాన్వే చేసేయడంతో ఛేదనలో సూపర్‌కింగ్స్ సాఫీగా సాగిపోయింది. కాన్వే నింపాదిగా ఆడుకుంటే... రుతురాజ్ ధాటిని ప్రదర్శించాడు. తర్వాత రహానె (17 బంతుల్లో 21; 1 ఫోర్, 1 సిక్స్), రాయుడు (12) తక్కువ స్కోర్లే చేసినా చెన్నైపై ఇదేమంత ప్రభావం చూపలేదు.

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: గ్రీన్ (బి) తుషార్ 6; (బి) ఇషాన్ (సి) తీక్షణ (బి) చహర్ 7; రోహిత్ (సి) జడేజా (బి) చహర్ 0; నేహల్ (బి) పతిరణ 64; సూర్యకుమార్ (బి) జడేజా 26; స్టబ్స్ (సి) జడేజా (బి) పతిరణ 20; డేవిడ్ (సి) రుతురాజ్ (బి) తుషార్ 2; అర్షద్ (సి) రుతురాజ్ (బి) పతిరణ 1; ఆర్చర్ నాటౌట్ 3; చావ్లా నాటౌట్ 2; **ఎక్స్‌ట్రాలు** 8; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 139. వికెట్ల పతనం:** 1-13, 2-13, 3-14, 4-69, 5-123, 6-127, 7-134, 8-137. **బౌలింగ్:** దీపక్ చహర్ 3-0-18-2, తుషార్ 4-0-26-2, జడేజా 4-0-37-1, అలీ 1-0-10-0, తీక్షణ 4-0-28-0, పతిరణ 4-0-15-3. **చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్:** రుతురాజ్ (సి) ఇషాన్ (బి) చావ్లా 30; కాన్వే (ఎల్బీ) (బి) ఆకాశ్ 44; రహానె (ఎల్బీ) (బి) చావ్లా 21; రాయుడు (సి) గోయల్ (బి) స్టబ్స్ 12; దూబే నాటౌట్ 26; ధోని నాటౌట్ 2; ఎక్స్‌ట్రాలు 5; మొత్తం (17.4 ఓవర్లలో 4 వికెట్లకు) 140. **వికెట్ల పతనం:** 1-46, 2-81, 3-105, 4-130. **బౌలింగ్:** గ్రీన్ 1-0-10-0, ఆర్చర్ 4-0-24-0, అర్షద్ 1.4-0-28-0, చావ్లా 4-0-25-2, రాఘవ్ 4-0-33-0, స్టబ్స్ 2-0-14-1, ఆకాశ్ 1-0-4-1.

16 ఐపీఎల్‌లో రోహిత్ డకౌట్లు. ఎక్కువ సార్లు 'సున్నా' చేసిన ఆటగాడిగా అతను నిలిచాడు.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	10	7	3	0	14	0.752
చెన్నై	11	6	4	1	13	0.409
లక్నో	10	5	4	1	11	0.639
రాజస్తాన్	10	5	5	0	10	0.448
బెంగళూరు	10	5	5	0	10	-0.209
ముంబై	10	5	5	0	10	-0.454
పంజాబ్	10	5	5	0	10	-0.472
కోల్‌కతా	10	4	6	0	8	-0.103
ఢిల్లీ	10	4	6	0	8	-0.529
హైదరాబాద్	9	3	6	0	6	-0.540

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

గుజరాత్ × లక్నో (మధ్యాహ్నం గం. 3:30 నుంచి)
రాజస్తాన్ × హైదరాబాద్ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

బింద్యారాణికి రజతం



జింజు (దక్షిణ కొరియా): మహిళల ఆసియా వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన బింద్యారాణి దేవి పతకంతో మెరిసింది. శనివారం జరిగిన 55 కేజీల విభాగం పోటీల్లో రెండో స్థానంలో నిలిచిన ఆమె రజతపతకాన్ని సొంతం చేసుకుంది. గత ఏడాది కామన్వెల్త్ క్రీడల్లో కూడా రజతం నెగ్గిన మణిపూర్ లిఫ్టర్ బింద్యా ఈ పోరులో క్లీన్ అండ్ జర్క్, స్నాచ్‌లలో కలిపి మొత్తం 194 కేజీల (83 కేజీలు + 111 కేజీ) బరువెత్తింది. చెన్ గ్వాన్ లింగ్ (చైనీస్ తైపీ -204 కేజీలు) స్వర్ణం గెలుచుకోగా, వో తి క్యూ ను (వియత్నాం - 192 కేజీలు) కాంస్యం గెలుచుకుంది.

ప్రిక్వార్టర్స్‌లో ఆకాశ్, నిశాంత్

తాష్కెంట్: పురుషుల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు ఆకాశ్ సాంగ్వాన్, నిశాంత్ దేవ్ ముందంజ వేశారు. 67 కేజీల విభాగంలో ఆకాశ్ 5-0తో పు మింగ్కే (చైనా)పై... 71 కేజీల విభాగంలో నిశాంత్ 5-0తో లీ సంగ్‌మిన్ (కొరియా)పై ఘన విజయాలు సాధించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు. తర్వాతి మ్యాచ్‌లలో దులాత్ బెక్‌బావ్ (కజకిస్తాన్)తో ఆకాశ్... ఫొఖాహా నిదాల్ (పాలస్తీనా)తో తలపడతారు.

రన్నరప్‌గా బోపన్న జోడి



మాడ్రిడ్: ఏటీపీ మాస్టర్స్ 1000 టెన్నిస్ టోర్నీ మాడ్రిడ్ ఓపెన్‌లో టైటిల్ సాధించేందుకు బరిలోకి దిగిన భారత ఆటగాడు రోహన్ బోపన్నకు నిరాశే ఎదురైంది. శనివారం జరిగిన ఫైనల్లో ఏడో సీడ్ బోపన్న – మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడి ఓటమిపాలైంది. డబుల్స్‌లో జత కట్టిన సింగిల్స్ స్పెషలిస్టులు, రష్యాకు చెందిన కరెన్ ఖచనోవ్ – ఆంద్రీ రుబ్లెవ్ 6-3, 3-6, 10-3 స్కోరుతో బోపన్న – ఎబ్డెన్‌పై విజయం సాధించారు. 69 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో బోపన్న – ఎబ్డెన్ ద్వయం 4 ఏస్‌లు సంధించగా, రష్యా జంట 3 ఏస్‌లు కొట్టింది.

ఢిల్లీ ధనాధన్



- 183 పరుగుల లక్ష్యం 16.4 ఓవర్లలోనే ఉఫ్
- 7 వికెట్లతో బెంగళూరుపై జయభేరి
- చెలరేగిన సాల్ట్

న్యూఢిల్లీ: ఢిల్లీ క్యాపిటల్స్ ఆట ఈ మ్యాచ్ ముందు వరకు తీసికట్టుగానే ఉంది. గెలిచిన మ్యాచ్‌లలో కూడా అంతంతమాత్రం పడుతూ లేస్తూ సాగిన ఆటతో పట్టికలో చివరి స్థానంలో ఉంది. అయితే శనివారం కానీ బెంగళూరుపై దంచిన తీరు, లక్ష్యఛేదనలో దూకుడు మాత్రం ఈ సీజన్‌లో మేటి మ్యాచ్‌లలో ఒకటిగా నిలిపింది. మెరుపుల విందు పంచిన ఈ మ్యాచ్‌లో ఓపెనర్ ఫిల్ సాల్ట్ (45 బంతుల్లో 87; 8 ఫోర్లు, 6 సిక్స్‌లు) విధ్వంస రచనతో ఢిల్లీ 7 వికెట్ల తేడాతో బెంగళూరుపై జయభేరి మోగించింది. మొదట బెంగళూరు 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. ఓపెనర్లు కోహ్లి (46 బంతుల్లో 55; 5 ఫోర్లు), డుప్లెసిస్ (32 బంతుల్లో 45; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. మ్యాక్స్‌వెల్ (0) డకౌటైనా... మహిపాల్ (29 బంతుల్లో 54 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) దంచేయడంతో బెంగళూరు భారీ స్కోరు చేసింది. తర్వాత ఢిల్లీ 16.4 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి 187 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఫిల్ సాల్ట్ ఉప్పెనకు వార్నర్ (14 బంతుల్లో 22; 3 ఫోర్లు, 1 సిక్స్), మార్ష్ (17 బంతుల్లో 26; 3 ఫోర్లు, 1 సిక్స్), రోసో (22 బంతుల్లో 35 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు) కలిసి క్యాపిటల్స్‌ను గెలిపించారు.

7000 ఐపీఎల్‌లో 7 వేల పరుగులు పూర్తి చేసుకున్న తొలి ఆటగాడిగా కోహ్లి నిలిచాడు.

సిరాజ్ వర్సెస్ సాల్ట్

బెంగళూరు గత మ్యాచ్‌లో కోహ్లి-గంభీర్-నవీన్ ఘటన వివాదం రేపగా...ఇప్పుడు సిరాజ్ కూడా మైదానంలో ప్రత్యర్థి ఆటగాడిపై దూషణలకు దిగాడు. సిరాజ్ ఓవర్లో సాల్ట్ వరుసగా 6, 6, 4 కొట్టగా తర్వాతి షార్ట్ పిచ్ బంతిని అంపైర్ వైడ్‌గా ప్రకటించాడు. దాంతో సిరాజ్ దూసుకుపోయి సాల్ట్‌ను ఏదో అన్నాడు. వార్నర్ వారించే ప్రయత్నం చేసినా అతను ఆగలేదు. కెప్టెన్ డుప్లెసిస్ పరిస్థితిని చక్కదిద్దాల్సి వచ్చింది.

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (సి) ఖలీల్ (బి) ముకేశ్ 55; డుప్లెసిస్ (సి) అక్షర్ (బి) మార్ష్ 45; మ్యాక్స్‌వెల్ (సి) సాల్ట్ (బి) మార్ష్ 0; మహిపాల్ నాటౌట్ 54; దినేశ్ కార్తీక్ (సి) వార్నర్ (బి) ఖలీల్ 11; రావత్ నాటౌట్ 8; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 181. వికెట్ల పతనం:** 1-82, 2-82, 3-137, 4-172. **బౌలింగ్:** ఖలీల్ 4-0-45-1, అక్షర్ 3-0-17-0, ఇషాంత్ 3-0-29-0, ముకేశ్ 3-0-30-1, మార్ష్ 3-0-21-2, కుల్దీప్ 4-0-37-0.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: వార్నర్ (సి) డుప్లెసిస్ (బి) హాజల్‌వుడ్ 22; సాల్ట్ (బి) కరణ్ శర్మ 87; మార్ష్ (సి) మహిపాల్ (బి) హర్షల్ 26; రోసో నాటౌట్ 35; అక్షర్ నాటౌట్ 8; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (16.4 ఓవర్లలో 3 వికెట్లకు) 187. వికెట్ల పతనం:** 1-60, 2-119, 3-171. **బౌలింగ్:** సిరాజ్ 2-0-28-0, మ్యాక్స్‌వెల్ 1.4-0-14-0, హాజల్‌వుడ్ 3-0-29-1, హసరంగ 4-0-32-0, కరణ్ శర్మ 3-0-33-1, మహిపాల్ 1-0-13-0, హర్షల్ 2-0-32-1.

సినిమా

ఆలస్యంగా వస్తున్న జవాన్



● షారుక్ ఖాన్

షారుక్ ఖాన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'జవాన్'. ఈ చిత్రంలో నయనతార హీరోయిన్‌గా నటించగా, ప్రధాన పాత్రలో విజయ్ సేతుపతి, కీలక పాత్రల్లో సంజయ్ దత్, దీపికా పదుకోన్ నటించారు. తమిళ దర్శకుడు అట్లీ తెరకెక్కించిన ఈ 'జవాన్' సినిమాను షారుక్ భార్య గౌరీ ఖాన్ నిర్మించారు. కాగా ఈ సినిమాను తొలుత జూన్ 2న విడుదల చేయాలనుకున్నారు. కానీ సెప్టెంబరు 7న రిలీజ్ చేస్తున్నట్లు శనివారం ప్రకటించారు. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ పెండింగ్ ఉండటం 'జవాన్' రిలీజ్ వాయిదా పడటానికి ముఖ్య కారణమని బాలీవుడ్ సమాచారం.

ట్రైలర్ రెడీ



● ప్రభాస్

రామాయణం ఆధారంగా రూపొందిన తాజా చిత్రం 'ఆది పురుష్'. ఈ చిత్రంలో రాముడిగా ప్రభాస్, సీతగా కృతీసనన్, లక్ష్మణుడిగా సన్నీ సింగ్, హనుమంతుడిగా దేవదత్త, రావణుడిగా సైఫ్ అలీఖాన్ నటించారు. ఓం రౌత్ దర్శకత్వం వహించారు. భూషణ్ కుమార్, క్రిషణ్‌కుమార్, ఓం రౌత్, ప్రసాద్ సుతారియా, రాజేష్ నాయర్, వంశీ, ప్రమోద్‌లు నిర్మించిన ఈ చిత్రం జూన్ 16న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్ ఈ నెల 9న విడుదల కానుంది. 70 దేశాల్లో 'ఆది పురుష్' ట్రైలర్‌ను లాంచ్ చేసేలా చిత్ర యూనిట్ ఏర్పాట్లు చేస్తోంది. ఈ చిత్రానికి సంగీతం: అజయ్–అతుల్, కెమెరా: కార్తీక్ పల్నాని.

పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహించాలి

– తెలంగాణ రాష్ట్ర మంత్రి కేటీఆర్



● పాపారావు, కేటీఆర్, ఇళయరాజా, శ్రియ, షాన్, 'దిల్' రాజు

''దాదాపు 16 ఏళ్లుగా పాపారావుగారితో నాకు పరిచయం ఉంది. తెలంగాణ ప్రభుత్వ సలహాదారునిగా చేశారాయన. పాపారావుగారు 'మ్యూజిక్ స్కూల్' సినిమా తీస్తున్నారని న్యూస్‌పేపర్స్‌లో చూసి తెలుసుకున్నాను. మంచిగా సినిమా చేయాలని కోరుకున్నాను. మ్యూజిక్ స్కూల్ ట్రైలర్, సాంగ్స్ బాగున్నాయి. ఈ సినిమా టైటిల్ 'మ్యూజిక్ స్కూల్'. కానీ నాకు ఇప్పుడు మ్యూజిక్ యూనివర్సిటీ (ఇళయరాజాని ఉద్దేశించి) పక్కన నిలబడే అవకాశం కలిగింది'' అని తెలంగాణ రాష్ట్ర మంత్రి కేటీఆర్ అన్నారు. శ్రియా శరన్, శర్మాన్ జోషి, షాన్ ప్రధాన పాత్రల్లో నటించిన ద్విభాషా (తెలుగు, హిందీ) చిత్రం 'మ్యూజిక్ స్కూల్'. ఇళయరాజా సంగీత సారథ్యంలో పాపారావు బియ్యాల స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న రిలీజ్ కానుంది. తెలుగురాష్ట్రాల్లో 'దిల్' రాజు, హిందీలో 'పీవీఆర్' ద్వారా ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో 'మ్యూజిక్ స్కూల్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ వేడుకలో తెలంగాణ మంత్రి కేటీఆర్, ఇళయరాజా సంయుక్తంగా 'మ్యూజిక్ స్కూల్' ఆడియోను విడుదల చేశారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ – ''అయితే ఇంజనీర్ కావాలి.. లేకపోతే డాక్టర్ కావాలి అంటూ పిల్లల్లో ఆర్ట్స్ పట్ల ఉండే సృజనాత్మకను చంపేస్తున్నాం. అలా చేయకూడదు' అనే అంశంతో 'మ్యూజిక్ స్కూల్' సినిమా తీశామని పాపారావుగారు చెప్పారు. నా కొడుకుకి 17 ఏళ్లు. ఒక పాట పాడానని, రిలీజ్ చేస్తున్నానని మూడు నెలల క్రితం 'గోల్డెన్ అవర్' అనే ఆల్బమ్ కవర్ చూపించాడు. మ్యూజిక్‌లో శిక్షణ తీసుకోనప్పటికీ తన స్కిల్స్, వాయిస్ చూసి చాలా సర్‌ప్రైజ్ అయ్యాను. ఇలా చాలా మంది పిల్లల్లో ప్రతిభ దాగి ఉంటుంది. ఆ ప్రతిభను మనం తొక్కేయకుండా వారి (పిల్లలు) మనసుకు నచ్చింది చేసేలా ప్రోత్సహించాలంటూ ఈ 'మ్యూజిక్ స్కూల్' తీసినందుకు పాపారావుగారికి అభినందనలు'' అన్నారు. ''ఇరవయ్యేళ్ల క్రితం ఓ డాక్యుమెంటరీ తీశాను. అది చూసి రమేష్ ప్రసాద్‌గారు నాకు జాతీయ అవార్డు వస్తుందన్నారు. ఆయన చెప్పినట్లే ఆరు నెలల తర్వాత ఆ డాక్యుమెంటరీ ఫిల్మ్‌కి అవార్డు వచ్చింది. ఇళయరాజాగారి వద్దకు 'మ్యూజిక్ స్కూల్' స్క్రిప్ట్ తీసుకుని వెళ్లి, 'ఈ సినిమాలో 11 పాటలు ఉన్నాయి సార్' అనగానే.. పది నిమిషాల్లో ఓకే అన్నారు. ఇళయరాజాగారు ఈ ప్రాజెక్ట్‌లోకి రాకపోయి ఉంటే నేను రాసిన కొన్ని స్క్రిప్ట్స్‌లాగే ఈ కథని కూడా పక్కన పెట్టేవాడిని'' అన్నారు పాపారావు. ''ఓ సినిమాకు, ఓ ఐఏఎస్ ఆఫీసర్‌కు సంబంధం లేదు. ఎంతో ప్యాషన్ ఉండబట్టి పాపారావుగారు ఈ సినిమాను నిర్మించి, దర్శకత్వం వహించారు. పిల్లలకు, తల్లిదండ్రులకు ఈ సినిమా ఓ మంచి సందేశంలాంటిది. 'మ్యూజిక్ స్కూల్'ను స్కూల్స్‌లోనూ ప్రదర్శించాలనుకుంటున్నాం'' అన్నారు 'దిల్' రాజు.

అది మా అదృష్టం

– నిర్మాతలు ప్రియాంకా దత్, స్వప్నా దత్

● ప్రియాంక, స్వప్న



''ఏ సినిమానీ చిన్న సినిమా, పెద్ద సినిమా అనలేం. ఆ తేడాలు మాకు లేవు. మంచి కథ చేయడం ముఖ్యం. 'ప్రాజెక్ట్ కె' (ఇందులో ప్రభాస్ హీరో) చాలా పెద్ద ప్రాజెక్ట్. కానీ మేము 'ఎవడే సుబ్రహ్మణ్యం' సినిమాతో మొదలయ్యాం. మా జీవితం ఓ మలుపు తీసుకుంది ఆ చిత్రంతోనే. సో.. మా వరకు అది బిగ్ ఫిల్మ్. ఓ మంచి కథ చెప్పాలనే ఉద్దేశంతో 'అన్నీ మంచి శకునములే' సినిమా తీశాం'' అన్నారు నిర్మాత స్వప్నా దత్. సంతోష్ శోభన్, మాళవికా నాయర్ జంటగా నందినీ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అన్నీ మంచి శకునములే'. మిత్ర విందా మూవీస్‌తో కలిసి ప్రియాంకా దత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో నిర్మాతలు స్వప్నా దత్, ప్రియాంకా దత్ చెప్పిన విశేషాలు.

● 'అన్నీ మంచి శకునములే' రెండు కుటుంబాల మధ్య జరిగే కథ. మంచి ఎమోషనల్ మూవీ. ఆడియన్స్ కంటతడి పెడతారు. దర్శకురాలు నందిని ఈ కథ చెప్పినప్పుడు అది కున్నూర్ బ్యాక్‌డ్రాప్‌లో లేదు. కథ రీత్యా ఆ లొకేషన్స్ అవసరం కాబట్టి అక్కడ తీశాం. హిల్‌స్టేషన్ బ్యాక్‌డ్రాప్‌లో ఓ ఫ్యామిలీ కథ తీయాలనే ఆశ 'అన్నీ మంచి శకునములే..'తో నెరవేరింది. ఈ సినిమా కోసం నందినీ విక్టోరియా అనే చిన్న ప్రదేశాన్ని సెట్ చేశారు. ఆడియన్స్‌ని మరో లోకంలోకి తీసుకెళ్లే సినిమా ఇది. ఇక ఈ సినిమాతో సంతోష్ శోభన్‌కు కొత్త ఇమేజ్ వస్తుందని నమ్ముతున్నాం. తన కెరీర్ మారుతుంది. నందినీ రెడ్డిగారి 'అలా.. మొదలైంది' చిత్రం యూత్‌ఫుల్ ట్రెండ్ సెట్టర్. 'కళ్యాణ వైభోగమే' కొత్తగా పెళ్లి చేసుకున్న జంట కథ. 'ఓ బేబీ' డిఫరెంట్ స్టోరీ. ఈ కోవలో 'అన్నీ మంచి శకునములే' చిత్రం ఓ డిఫరెంట్ ఫ్యామిలీ స్టోరీ. ఆడియన్స్‌కు ఈ సినిమా నచ్చుతుంది. ● దుల్కర్ పరభాష హీరో, ఖరీదైన లొకేషన్స్, మార్కెట్ ఎదురీత .. 'సీతారామం' సినిమా విషయంలో ఇలా ప్రతి అడుగూ ఓ సవాలే. కానీ నమ్మి చేశాం. విజయం సాధించింది. మనం నమ్మింది జరిగిందనే తృప్తి కలిగింది. ● ప్రతి సినిమాపై మాకు ఒత్తిడి ఉంటుంది. మా మనసుకు నచ్చిన కథలనే సినిమాలుగా తీస్తున్నాం. అయితే మేం ఇష్టపడి చేసిన చిత్రాలు ప్రేక్షకుల అభిరుచికి దాదాపుగా మ్యాచ్ కావడం అనేది మా అదృష్టంగా భావిస్తున్నాం.

● సినిమా ఇండస్ట్రీలో నాన్నగారు (నిర్మాత అశ్వినీదత్) 50 ఏళ్లుగా నిలబడ్డారు. ఇప్పుడు ఆయన పిల్లలు సినిమాలు తీస్తున్నారు. ఆయన ఏ రోజూ లెక్కలు వేసుకుని సినిమాలు తీయలేదు. ఈ దారిలో మేం కూడా వెళ్తున్నాం. సినిమాల్లోకి వచ్చామంటే ప్యాషన్‌తోనే. లెక్కలు వేసుకుంటే సినిమాలు తీయలేం. ● అందరం చర్చించుకునే ఓ జడ్జిమెంట్‌కు వస్తాం. 'జాతిరత్నాలు' సినిమాను నేను (స్వప్న) ఓటీటీకి అమ్మేద్దాం అన్నాను. కానీ నాగీ ('మహానటి' ఫేమ్ దర్శకుడు నాగ్ అశ్విన్), ప్రియాంక ఆ సినిమాను నమ్మారు. 'ఈ సినిమా అయితే బ్లాక్ బస్టర్ అవుతుంది. పోతే మొత్తం పోతుంది. థియేటర్స్‌లో రిలీజ్ చేద్దాం' అన్నాడు నాగీ. సినిమా మంచి హిట్ అయింది. 'మహానటి'ని నేనెక్కువగా నమ్మాను. చాలా బాధ్యతతో ఆ సినిమా చేశాం. నాగీ నిర్ణయాలు మా బ్యానర్‌కు బలం. ● నిర్మాతలుగా మీరు కష్టపడుతున్నారు. నేను కూడా ఎందుకని మా చెల్లి (స్రవంతి) అన్నారు. ఇంట్లో పిల్లలు సేఫ్‌గా ఉన్నారు, అమ్మా, చెల్లి చూసుకుంటున్నారనే ధైర్యం ఉండబట్టే మేం సినిమాలు తీస్తున్నాం.

ఆ రెసిపీ ఎవరికీ తెలియదు

– కృతీ శెట్టి

''నాకు షూటింగ్ లొకేషన్ హాలిడే స్పాట్‌లాంటిది. షూటింగ్ చేస్తుంటే ఆనందంగా ఉంటుంది. ఏ రోజైనా షూటింగ్ లేదంటే నాకు బోర్ అనిపిస్తుంది. అంతగా ప్రొఫెషన్ అంటే నాకు ప్రేమ'' అన్నారు కృతీ శెట్టి. నాగచైతన్య సరసన కృతీ నటించిన 'కస్టడీ' ఈ నెల 12న విడుదల కానుంది. పవన్ కుమార్ సమర్పణలో వెంకట్ ప్రభు దర్శకత్వంలో శ్రీనివాసా చిట్టూరి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం విడుదల సందర్భంగా కృతీ శెట్టి చెప్పిన విశేషాలు.

● **ముందుగా 'కస్టడీ' స్టోరీ లైన్ గురించి..**

సాధారణంగా ఏ సినిమాలో అయినా విలన్‌ని చంపడం, ఓడించడం... కథ ఇలా ఉంటుంది. అయితే 'కస్టడీ'లో మాత్రం విలన్‌ను కాపాడటానికి హీరో ప్రయత్నిస్తుంటాడు. కొత్త స్టోరీ. చాలా ఆసక్తికరంగా ఉంటుంది.

● **స్టోరీ లైన్ కొత్తగా ఉంది... మీ పాత్ర?**

ఇందులో నటనకు మంచి స్కోప్ ఉన్న క్యారెక్టర్ చేశాను. సీరియస్‌గా నడుస్తున్న కథను నా పాత్ర బ్యాలెన్స్ చేయడమే కాకుండా స్క్రీన్‌ప్లేతో పాటు ప్రయాణం చేస్తుంది. నేనిప్పటివరకూ చేసిన సినిమాలన్నింట్లోకీ ఈ సినిమాలో చేసిన పాత్ర నిడివి ఎక్కువ.

● **కానీ యాక్షన్ సినిమాల్లో హీరోయిన్‌కు తక్కువ ప్రాధాన్యత ఉంటుంది కదా?**

అది కొంత నిజమే. అయితే 'కస్టడీ' యాక్షన్ సినిమా అయినప్పటికీ హీరోయిన్ క్యారెక్టర్ లెంగ్త్ ఎక్కువ. ఈ సినిమాలో నాకు నచ్చిన అంశం కూడా అదే. ఇంకో విషయం ఏంటంటే.. వేరే సినిమాలకు డ్యాన్స్ ప్రాక్టీస్ చేశాను. కానీ ఈ సినిమా కోసం జిమ్నాస్టిక్స్ ప్రాక్టీస్ చేశాను. అందుకే డైరెక్టర్ వెంకట్ ప్రభుగారితో ఈ సినిమా చూశాక హాలీవుడ్ నుంచి నాకు మార్వెల్ ఫిలింస్‌కి, డిస్నీ సంస్థ నుంచి ఫోన్ వస్తుందేమో అని సరదాగా అన్నాను.

● **'కస్టడీ'లో అండర్ వాటర్ యాక్షన్ సీన్స్ కూడా ఉన్నాయి. ఆ చిత్రీకరణ ఎలాంటి అనుభూతిని మిగిల్చింది?**

ఈ యాక్షన్ సీన్స్ తీయడానికి 15 రోజులు పట్టింది. ఇందులో 5 రోజులు పూర్తిగా 20 ఫీట్ల వాటర్ పూల్‌లో షూటింగ్ చేశాం. తీసే ముందు రెండు రోజులు ప్రాక్టీస్ చేశాం. కొన్నిసార్లు 40 సెకండ్ల నుంచి ఒక నిమిషం వరకు ఊపిరి తీసుకోకుండా చేయాల్సి వచ్చింది. ఈ సీన్లలో చైతూ, సంపత్‌గారు, అరవింద్ స్వామిగారు, నేను ఉంటాం. అందుకే భయం వేసింది. ఎందుకంటే ఎవరికి 'అన్ ఈజీ'గా అనిపించినా మళ్లీ సీన్ తీయాల్సి ఉంటుంది. నా కారణంగా అలాంటి ఇబ్బంది ఎదురు కాకూడదని కోరుకున్నాను.

● **'బంగార్రాజు' తర్వాత నాగచైతన్యతో 'కస్టడీ' సినిమా చేశారు.. మీ కెమిస్ట్రీ గురించి?**

చైతన్య నా ఫేవరెట్ కో–స్టార్, అలాగే తన వ్యక్తిత్వం అంటే నాకు చాలా ఇష్టం. జనరల్‌గా ఆఫ్ స్క్రీన్‌లో కో–స్టార్స్ మధ్య మంచి రిలేషన్ ఉంటే అది ఆన్ స్క్రీన్ మీద రిఫ్లెక్ట్ అవుతుంది. ఆఫ్ స్క్రీన్ చైతూ, నా రిలేషన్ బాగుంటుంది. తనతో ఉన్న సాన్నిహిత్యం మా కెమిస్ట్రీని మరింత అందంగా పండించింది. కొన్నిసార్లయితే ప్రాక్టీస్ చేయకుండానే సహజంగానే నటించాం. చైతూతో ఆ కంఫర్ట్ ఉంటుంది.



● **'ఉప్పెన' తర్వాత మీరు చేసిన సినిమాలు పెద్దగా ఆశించిన ఫలితం సాధించలేదు. తప్పు ఎక్కడ జరిగిందో విశ్లేషించుకున్నారా?**

'ఉప్పెన' తర్వాత 'శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు' వంటి మంచి సినిమాలు చేశాను. ఆ విషయం పక్కన పెట్టి ఫలితం గురించి చెప్పాలంటే.. పరిశ్రమలో ఎంతో అనుభవం ఉన్న నటులు ఉన్నారు. అయితే వారితో పాటు సక్సెస్ రెసిపీ ఎవరికీ తెలియదు. అది తెలిస్తే అన్నీ హిట్లే వస్తాయి. మా వంతుగా మేం చేయగలిగింది కష్టపడి పని చేయడమే. నేను చేసిన సినిమా ఫ్లాప్ అయినా పశ్చాత్తాపపడను. ఎందుకంటే ఆ సినిమా కూడా ఎంతో కొంత అనుభవాన్ని మిగుల్చుతుంది కదా. ఆ అనుభవం నా భవిష్యత్ సినిమాల ఎంపికకు పనికొస్తుంది. ప్రస్తుతం స్క్రిప్ట్ సెలక్షన్ విషయంలో ఇంకా జాగ్రత్తలు తీసుకుంటున్నాను.

● **నటన కాకుండా మీకున్న వ్యాపకాలు?**

దర్శకత్వం చేయాలనుంది. షూటింగ్ జరుగుతున్నప్పుడు డైరెక్షన్‌కి సంబంధించిన విషయాల మీద ఆసక్తి చూపిస్తుంటాను. సెట్స్‌లో అందరూ ఆటపట్టిస్తుంటారు.. అయితే పదేళ్ల తర్వాతే డైరెక్షన్ చేస్తాను.

● **తదుపరి సినిమాల గురించి...**

మలయాళంలో ఒక సినిమా, శర్వానంద్‌తో తెలుగులో ఒక సినిమా చేస్తున్నాను. మరికొన్ని ఉన్నాయి. వాటి వివరాలు త్వరలో చెబుతాను.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

ఇంగ్లండ్ ఎన్నికల్లో ఖమ్మం వాసి విజయం

హోకింగ్ హోం టౌన్ కౌన్సిల్ ఎన్నికల్లో గెలుపు



నాగెండ్ల నాగేంద్ర

ఖమ్మం మయూరి సెంటర్: ఇంగ్లండ్ దేశంలోని హోకింగ్ హోం టౌన్ కౌన్సిల్‌కు జరిగిన ఎన్నికల్లో ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన నాగెండ్ల నాగేంద్ర సత్తాచాటారు. ఖమ్మం జర్నలిస్టు కాలనీకి చెందిన నాగెండ్ల శివానంద కుమారుడు నాగెండ్ల నాగేంద్ర ఇంగ్లండ్‌లో నివసిస్తున్నారు. అక్కడ ఈనెల 4న జరిగిన హోకింగ్ హోం టౌన్ కౌన్సిల్ ఎన్నికల్లో ఆయన లేబర్ పార్టీ నుంచి పోటీ చేశారు. ఈ సందర్భంగా నాగేంద్ర తన వార్డులో అత్యధిక ఓట్లు సాధించగా.. కన్జర్వేటివ్ పార్టీ అభ్యర్థి ఓటమి పాలయ్యారు. తనకు సహకరించిన లేబర్ పార్టీ నాయకురాలు అండ్లీ క్లోయ్, పార్టీ అధినేతలకు కృతజ్ఞతలు తెలిపిన నాగేంద్ర.. వచ్చే వారం తాను విధుల్లో చేరడానికి ఆసక్తిగా ఉన్నట్లు శనివారం ఫోన్‌లో వెల్లడించారు.

జర్నలిస్టుల అనుభవాలు పుస్తకంగా రావాలి

వంజగుట్ట: జర్నలిజంలో దశాబ్దాలపాటు పని చేసిన జర్నలిస్టులు తమ అనుభవాలను పుస్తక రూపంలో తీసుకురావాలని వక్తలు అభిప్రాయ పడ్డారు. జర్నలిజంతో పాటు ప్రజా ఉద్యమాల్లో ఉన్న వారి చరిత్ర భవిష్యత్ తరాలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. సీనియర్ పాత్రికేయులు రాధా మల్లన్నగౌడ్ స్వీయ చరిత్ర 'కనకమ్మ మనమడు', 'అనుభవాల నుంచి ఆణిముత్యాలు' పుస్తకాల ఆవిష్కరణ సభ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగింది.



పుస్తకాల్ని ఆవిష్కరిస్తున్న జర్నలిస్టు ప్రముఖులు

కార్యక్రమానికి తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, తెలంగాణ గ్రంథాలయాల సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, ఐజేయూ అధ్యక్షుడు కె.శ్రీనివాస రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జాతీయ మీడియా అంతర్రాష్ట్రాల వ్యవహారాల సలహాదారులు దేవులపల్లి అమర్, రిటైర్డ్ అధ్యాపకుడు కట్టా భగవంతరెడ్డి హాజరై పుస్తకాలను ఆవిష్కరించారు. అల్లం నారాయణ మాట్లాడుతూ తాను, సాక్షి ఎడిటర్ వర్ధెల్లి మురళి కలిసి మల్లన్న గ్రామానికి వెళ్లామని, ఆ ఊరిలో ప్రతి ఇంటికీ ఒక చరిత్ర ఉందన్నారు. జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ.. బహుజనుల జీవితాల నుంచి మరిన్ని ఆత్మకథలు రావాలన్నారు. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ..'కనకమ్మ మనమడు' చదువుతుంటే తన అమ్మమ్మ గుర్తుకు వస్తోందన్నారు. దేవులపల్లి అమర్ మాట్లాడుతూ.. రాయగలిగిన వారు తమ అనుభవాలు తప్పక రాయాలన్నారు. శ్రీధర్ మాట్లాడుతూ.. పుస్తకం తనను 30 ఏళ్ల వెనక్కి తీసుకువెళ్లిందన్నారు. పుస్తకాన్ని సీనియర్ జర్నలిస్టు బుచ్చన్న పరిచయం చేశారు. ఐజేయూ కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి, విజ్ఞానదర్శిని వ్యవస్థాపక అధ్యక్షుడు తాటి రమేష్, వయోధిక పాత్రికేయ సంఘం ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

తీహార్ జైలు వార్డర్లకు తెలంగాణలో శిక్షణ

- 'సికా'లో ఏడు నెలలుగా 130 మందికి తరగతులు
- తొలిసారిగా ఇతర రాష్ట్ర సిబ్బందికి అవకాశం
- శిక్షణకు అయ్యే ఖర్చు బాధ్యత ఆ జైలు అధికారులదే..



సాక్షి, హైదరాబాద్: దేశ రాజధాని ఢిల్లీలోని తీహార్ సెంట్రల్ జైలు పేరు చాలామందికి తెలిసే ఉంటుంది. దేశవ్యాప్తంగా ఎన్నో సంచలన కేసులలోని నిందితులను ఇక్కడే ఖైదీలుగా ఉంచుతున్నారు. అంత పేరుగాంచిన తీహార్ జైలు సిబ్బందికి శిక్షణ తెలంగాణ జైళ్ల శాఖ పర్యవేక్షణలో కొనసాగుతోంది. తొలిసారిగా బయటి రాష్ట్రం జైలు సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. తీహార్ జైలు వార్డర్లుగా ఎంపికైన 130 మందికి చంచల్‌గూడలో ఉన్న సికా(స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్)లో 2022 అక్టోబర్ 10 నుంచి శిక్షణ కొనసాగుతోంది. ఒక్కో ట్రైనీ నిమిత్తం ఏడు నెలల శిక్షణకు అయ్యే ఖర్చును తీహార్ జైలు అధికారులే భరిస్తున్నారు.

తెలంగాణ జైళ్ల శాఖ సంస్కరణలకు మెచ్చి...

ఢిల్లీ నుంచి బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్(బీపీఆర్అండ్‌డీ) ఆధ్వర్యంలో ఇతర రాష్ట్రాల జైళ్ల శాఖ డీజీపీలు, ఇతర ఉన్నతాధికారులు తరచూ సికా శిబిరాలకు హాజరవుతుంటారు. తెలంగాణ జైళ్లలో ఖైదీల సంక్షేమం, సంస్కరణలు, నిర్వహణ తదితర అంశాలపై అధ్యయనం చేస్తుంటారు. ఈ క్రమంలో తీహార్ జైలు డీజీపీ తెలంగాణ జైళ్లను సందర్శించి ఇక్కడి శిక్షణ, విధానాలు తెలుసుకొని సంతృప్తి చెందారు. ఆ తర్వాత తీహార్ జైలు సిబ్బందికి సైతం తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వాలని ప్రతిపాదన పెట్టారు. దీనిపై జైళ్లశాఖ ఇన్‌చార్జి డీజీపీ జితేందర్ చొరవ తీసుకోవడంతో ప్రస్తుత బ్యాచ్ శిక్షణ ప్రారంభమైనట్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం 122 మంది పురుషులు, 8 మంది మహిళా వార్డర్లు గత ఏడు నెలలుగా ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. వీరికి సీఆర్‌పీసీ, ఐపీసీ, ఎవిడెన్స్ యాక్ట్, ప్రిజన్ అడ్మినిస్ట్రేషన్ వంటి ఇండోర్ శిక్షణతోపాటు ఆయుధాలు పేల్చడం, లాఠీ వాడకంలో మెళకువలు, శారీరక దృఢత్వాన్ని పెంచడం, డ్రిల్ వంటి ఔట్‌డోర్ శిక్షణ ఇస్తున్నారు. వీరంతా మే 8న పాసింగ్ ఔట్ పరేడ్‌తో శిక్షణ పూర్తి చేసుకోనున్నారు. ఆ తర్వాత రెండు నెలల ప్రాక్టికల్ ట్రైనింగ్ కోసం తీహార్ జైలుకు వెళ్లనున్నట్టు అధికారులు వివరించారు.

శిక్షణలో ఎన్నో నేర్చుకున్నా



తెలంగాణ జైళ్ల శాఖ ఇచ్చిన ఇండోర్, ఔట్‌డోర్ శిక్షణలో ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. ఢిల్లీ బయట శిక్షణ తీసుకుంటున్న ఫస్ట్ బ్యాచ్ మాదే. మా దగ్గర ఈ స్థాయిలో వసతులు లేకపోవడం, ఇక్కడ శిక్షణ బాగుండటంతో మా అధికారులు మమ్మల్ని ఇక్కడకు పంపారు.

– పుష్పేంద్రకుమార్, తీహార్ జైలు వార్డర్

ఆత్మస్థైర్యం పెరిగింది



నేను ఇక్కడికి ట్రైనింగ్‌కు వచ్చిన కొత్తలో చాలా భయంగా ఉండేది. ఈ ఏడు నెలల్లో ఇండోర్, ఔట్‌డోర్ ట్రైనింగ్ అనంతరం నాపై నాకు నమ్మకం పెరిగింది. తెలంగాణ అకాడమీలో వసతులు, ఇక్కడి అధికారుల శిక్షణ ఎంతో బాగుంది. ఎన్నో విషయాలు మేం ఇక్కడ నేర్చుకోగలిగాం.

– స్వీటీదేవి, తీహార్ జైలు వార్డర్

క్లుప్తంగా...

కోవిడ్ మందుపై ఐఐసీటీ, 101 థెరప్యూటిక్స్‌ల మధ్య ఒప్పందం



సాక్షి, హైదరాబాద్: కోవిడ్-19 చికిత్సకు ఉపయోగపడే ఓ రసాయనంపై ప్రయోగాలు చేపట్టేందుకు సీఎస్ఐఆర్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ), ఇజ్రాయెల్‌కు చెందిన '101 థెరప్యూటిక్స్' ఒక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంపై ఐఐసీటీ ప్రధాన శాస్త్రవేత్త, బిజినెస్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ విభాగం అధ్యక్షురాలు డాక్టర్ డి.శైలజ, '101 థెరప్యూటిక్స్ లిమిటెడ్' తరఫున డాక్టర్ అలెక్ గోల్డ్‌బెర్గ్ సంతకాలు చేశారు. సీఎస్ఐఆర్, ఇజ్రాయెల్ సంస్థ డైరెక్టరేట్ ఆఫ్ డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ మధ్య ఇటీవలే కుదిరిన ఒక ఒప్పందంలో భాగంగా ఈ తాజా అవగాహన ఒప్పందం చేసుకున్నట్లు ఐఐసీటీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. కోవిడ్ చికిత్స ఔషధంపై నిర్వహించే క్లినికల్ ట్రయల్స్‌కు ఐఐసీటీ మార్గదర్శనం చేయనుంది. పర్యవేక్షణ, ప్రయోగాల నిర్వహణ బాధ్యతలూ చేపట్టనుంది. మూడేళ్లపాటు ఈ క్లినికల్ ట్రయల్స్ నడుస్తాయి. ఈ మందు సమర్థంగా పనిచేస్తుందని తేలితే భవిష్యత్‌లో కోవిడ్‌ను ఎదుర్కోవడం మరింత సులువు కానుంది.

కార్పొరేట్ శాలరీ ఖాతాతో భారీగా బీమా

సింగరేణి ఉద్యోగులకు యాజమాన్యం సూచన



సాక్షి, హైదరాబాద్: సింగరేణి కార్మికులు, అధికారులందరూ తమ బ్యాంకు ఖాతాలను 'కార్పొరేట్ శాలరీ ఖాతా'గా వెంటనే మార్చుకోవాలని, తద్వారా రూ.40 లక్షల నుంచి రూ.62 లక్షల 'ప్రమాద బీమా పథకం' ప్రయోజనాలు పొందవచ్చని సింగరేణి బొగ్గు గనుల సంస్థ డైరెక్టర్ ఎస్.బలరామ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి సంస్థ 44వేల మంది ఉద్యోగులకు ప్రతి నెలా జీతాల రూపేణా ఎస్‌బీఐ, యూబీఐ తదితర బ్యాంకుల ద్వారా రూ.300 కోట్లు చెల్లిస్తోందని వివరించారు. ఉచిత ప్రమాద బీమా అర్హత కోసం తమ బ్యాంకు పొదుపు ఖాతాలను 'కార్పొరేట్ శాలరీ అకౌంట్'గా మార్చుకోవలసి ఉంటుందని వివరించారు. ఎస్‌బీఐ రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షలు, యూబీఐ రూ.40 లక్షల నుండి రూ.62 లక్షల ప్రమాద బీమా అందిస్తాయని తెలిపారు. జీరో బ్యాలెన్స్ సౌకర్యం, ఇల్లు, వాహన రుణం, పర్సనల్ లోన్ తీసుకున్నప్పుడు ప్రాసెసింగ్ రుసుములో రాయితీలు, ఉచిత చెక్కు బుక్కు, తాత్కాలిక ఓవర్ డ్రాఫ్టు, లాకర్స్ చార్జీలు, విదేశీ విద్య రుణంలో రాయితీ తదితర అనేక సౌకర్యాలుంటాయని వెల్లడించారు.

రాయచూర్‌లో తెలంగాణ కాంగ్రెస్ నేతల ప్రచారం



సాక్షి, హైదరాబాద్: కర్ణాటక ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తరఫున ఆ పార్టీకి చెందిన తెలంగాణ నేతలు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఏఐసీసీ ఇన్‌చార్జి కర్ణాటక కార్యదర్శి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శనివారం ఏఐసీసీ కార్యదర్శి బోసురాజు తనయుడు రవి బోసురాజు, కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్‌షాలం తదితరులతో కలిసి రాయచూర్ పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

రూ.28 వేల కోట్లకుపైగా.. బ్యాంకులకు బురిడీ

2021–22లో పీఎన్‌బీలో రూ.7,111 కోట్ల అతిపెద్ద మోసం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచి తప్పుడు మార్గాల్లో రూ.28వేల కోట్లకు పైగా రుణాలు పొంది బురిడీ కొట్టించారని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్లు పైబడిన 79 మోసాల కేసుల్లో మొత్తం రూ.28,797.03 కోట్ల మేర మోసాలకు గురైనట్లు తెలిపింది. ఇందులో అత్యధికంగా పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో రూ.7,111.52 కోట్ల మేర మోసం జరిగింది. నిధుల మళ్లింపు, ఖాతా పుస్తకాల్లో వివరాలు తప్పుగా సూచించడం, తారుమారు చేయడం, రుణగ్రహీతలు తప్పుడు ఆర్థిక నివేదికలు సమర్పించడం, నిర్దేశించిన ప్రామాణిక ఆపరేటింగ్ విధానాన్ని పాటించకపోవడమే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మోసాలకు ప్రధాన కారణంగా తేలిందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొంది. రుణగ్రహీతలు మూడో పార్టీ ఏజెన్సీలు, న్యాయవాదులు, చార్టర్డ్ అకౌంటెంట్లు కుమ్మక్కు కావడం కూడా ప్రధాన కారణమని తెలిపింది. ఈ నేపథ్యంలో.. బ్యాంకు మోసాలను నివారించేందుకు ఆన్‌లైన్‌లో శోధించదగిన డేటాబేస్, సెంట్రల్ ఫ్రాడ్ రిజిస్ట్రీ రూపంలో గుర్తించనున్నట్లు పేర్కొంది. మోసాలను నియంత్రించడం క్రెడిట్ మంజూరు ప్రక్రియలో శ్రద్ధ వహించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటుచేసినట్లు వివరించింది. బ్యాంకుల్లో జరిగిన మోసాల కేసులను లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, పోలీసుస్టేషన్లు, సీబీఐ ద్వారా విచారణకు ఆదేశిస్తున్నట్లు ఆ శాఖ తెలిపింది.

అన్నీ ఉన్నా.. వలస తప్పక..!

రాయచూరు నుంచి మేకల కల్యాణ్ చక్రవర్తి


అభివృద్ధికి దూరంగా 'కల్యాణ కర్ణాటక'

- రాజ్యాంగ సవరణలు అమల్లోకి రావు.. ప్రాంతీయ అభివృద్ధి బోర్డులూ పనికిరావు
- ఉద్యోగాలన్నీ ఇతర ప్రాంతాల వారికే.. స్థానిక యువత వలస బాట
- కృష్ణా, తుంగభద్రలతో వ్యవసాయానికి కాస్త ఊరట
- ఎన్నికల వేళ చర్చనీయాంశమైన స్థానిక రిజర్వేషన్లు
- రాజకీయ అంశాల కన్నా అభ్యర్థులు, స్థానిక నేతలే ప్రభావశీలం

కల్యాణ కర్ణాటక.. వివరంగా చెప్పాలంటే తొలుత హైదరాబాద్ స్టేట్‌లో భాగంగా ఉండి తర్వాత కర్ణాటకలోకి వెళ్లిన 'హైదరాబాద్ కర్ణాటక'. రాయచూర్, బళ్లారి, యాద్గిర్, కొప్పళ, గుల్బర్గా, బీదర్, బీజాపూర్ జిల్లాలతో కూడిన ఈ ప్రాంతానికి గొప్ప పోరాట వారసత్వ చరిత్ర కూడా ఉంది. కృష్ణా, తుంగభద్ర నదులు.. నారాయణపేట, హోస్పేట రిజర్వాయర్లతో సాగునీటికి సమస్య పెద్దగా లేదు. తగినంత సాగుభూమి ఉంది. వరి, పత్తి, మిర్చి లాంటి పంటలూ పండుతాయి. విద్యుత్ ప్లాంట్లు ఉన్నాయి. టెక్స్‌టైల్ పరిశ్రమ ఉంది.. ఇన్ని ఉన్నా ఈ ప్రాంత ప్రజలు.. ఉద్యోగాలు, కూలి పనుల కోసం బెంగళూరు, పుణె, గోవా, హైదరాబాద్‌లకు వలస వెళ్లాల్సిన పరిస్థితి. స్థానికంగా ఉద్యోగాలన్నీ ఇతర ప్రాంతాల వారితోనే నిండిపోవడంతో వలసపోక తప్పడం లేదన్నది యువత ఆవేదన.

రిజర్వేషన్లు అమలుగాక..

కల్యాణ కర్ణాటక నుంచి వలసలకు, ముఖ్యంగా రాయచూర్, యాద్గిర్ జిల్లాలు అభివృద్ధిలో వెనుకబడటానికి ప్రధాన కారణం రాజకీయ నిర్లక్ష్యమేనన్న విమర్శలు ఉన్నాయి. ఇక్కడి ప్రజలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తూ చేసిన రాజ్యాంగ సవరణలు కూడా పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదని.. విద్య, వైద్య రంగాల్లో స్థానికులకు 75 శాతం, ఇతర కన్నడిగులకు 25 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్టికల్ 371 (జె) ఉన్నా ప్రయోజనం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ప్రాంత అభివృద్ధి కోసం కల్యాణ కర్ణాటక రీజనల్ డెవలప్‌మెంట్ బోర్డు (కేకేఆర్‌డీబీ) వంటివి ఏర్పాటు చేసినా ఫలితం లేదు. కేకేఆర్‌డీబీకి ఏటా రూ.1,500 కోట్లు నిధులు ఇవ్వాలన్న నిబంధన కూడా అమల్లోకి రాలేదు. ఎయిమ్స్ వంటి సంస్థలు ఇస్తామన్న కేంద్ర ప్రభుత్వ హామీలూ నెరవేరలేదు. రాయచూర్ థర్మల్ పవర్ స్టేషన్ (ఆర్‌టీపీఎస్), యెర్మరస్ థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) వంటివి ఉన్నా పారిశ్రామికాభివృద్ధి అరకొరే.



'ఉపాధి'పైనే ఎన్నికల పోరు

ఎన్నికల వేళ కల్యాణ కర్ణాటకలో స్థానికులకు ఉపాధి అంశం కీలకంగా మారింది. తమకు ఉపాధి కల్పించే వారికే జై కొడతామని స్థానిక యువత కుండబద్దలు కొడుతోంది. ఇక ఇక్కడి ప్రజలు రాజకీయ అంశాలను పెద్దగా పట్టించుకోబోరని.. అభ్యర్థుల గుణగణాలకు ప్రాధాన్యమిస్తారని స్థానికులు చెప్తున్నారు. ఆ తర్వాతే కులం, డబ్బు, పార్టీలు, ఇతర అంశాలను పట్టించుకుంటారని అంటున్నారు.

ఇక్కడ తెలుగువారూ ఎక్కువే..


కల్యాణ కర్ణాటక ప్రాంతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సరిహద్దుగా ఉంది. ఈ ప్రాంతంలో 30–35 శాతం మంది తెలుగు ప్రజలు ఉన్నట్టు అంచనా. ముఖ్యంగా రాయచూరు జిల్లాలోని మాన్వి, సింధనూరు, లింగసుగూర్, దేవదుర్గం.. యాద్గిర్ జిల్లాలోని గుర్మిటికల్, యాద్గిర్ నియోజకవర్గాల్లో ఎక్కువ. కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాల నుంచి వలస వచ్చిన వీరంతా వ్యవసాయమే జీవనాధారంగా పనిచేస్తారు.

- రాయచూర్ జిల్లా లింగసుగూర్‌లో సుబ్బారావు అనే ఓ తెలుగు వ్యక్తిని 'సాక్షి' పలకరించగా.. ఇక్కడి ప్రజలు అభ్యర్థులను చూస్తారని, ప్రభుత్వం చేసే పనులు, అభివృద్ధి వంటి పెద్దగా పట్టించుకోరని చెప్పారు. పార్టీలు ఇచ్చే ఉచిత హామీలు కూడా పెద్దగా ప్రభావం చూపబోవని వ్యాఖ్యానించారు.
- రాయచూర్ పక్కనే ఉన్న జానకీపురం క్యాంపునకు చెందిన శ్రీనివాస్ అనే డ్రైవర్ మాట్లాడుతూ.. ''మాకు అభ్యర్థితో పని లేదు. మాకు మా హరిబాబు (స్థానిక నేత) ఉన్నాడు. ఆయన మాకు సాయం చేస్తాడు. మేం హరిబాబు మద్దతిచ్చిన కాంగ్రెస్ పార్టీకే ఈసారి ఓటేస్తాం'' అని చెప్పారు.
- మారెమ్మ క్యాంపులో నివాసముండే వీరభద్రం అనే అమలాపురానికి చెందిన తెలుగు రైతును పలకరిస్తే.. తాము వ్యవసాయంపైనే దృష్టి పెడతామని, రాజకీయాల జోలికి వెళ్లబోమని, పోలింగ్ రోజున వెళ్లి ఓటేస్తామని చెప్పారు. అయితే తెలుగువాడైన బోసురాజు అనే నేత మాటను ఇక్కడి ప్రజలు వింటారని చెప్పారు.

టుడేస్ గ్రాఫిక్

నిన్న మనం 10 కోట్ల యూజర్లు సంపాదించడానికి పట్టిన సమయం గురించి చూశాం.. ఇప్పుడు 5 కోట్ల యూజర్లు సంపాదించడానికి వీటికి ఎన్నేళ్ల సమయం పట్టిందో చూద్దాం.

– సాక్షి సెంట్రల్ డెస్క్



కొసమెరుపు చూశారుగా.. కొన్నిటికి చాలా ఏళ్ల సమయం పడితే.. కొన్నిటికి ఇంకొంచెం తక్కువ సమయమే పట్టింది. అయితే.. 5 కోట్ల యూజర్లు సంపాదించడానికి అత్యంత తక్కువ సమయం తీసుకున్నదేంటో తెలుసా? పోర్న్ హబ్!! ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్‌లాంటి వెబ్‌సైట్లకూ సాధ్యం కాని ఫీట్‌ను ఇది సాధించింది. కేవలం 18 రోజుల్లోనే 5 కోట్ల మంది యూజర్లను సంపాదించింది. **అట్లుంటది మనతోని..**

నేడు యూజీ నీట్–2023 అర్హత పరీక్ష

- రాష్ట్రంలోని 20 జిల్లాల్లో పరీక్షా కేంద్రాలు
- హాజరు కానున్న 80వేల మంది విద్యార్థులు



సాక్షి, హైదరాబాద్: వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు ఆదివారం జరగనున్న నీట్–2023 అర్హత పరీక్షకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఏర్పాట్లు పూర్తి చేసింది. దేశవ్యాప్తంగా 499 నగరాల్లో, తెలుగుతో పాటు 13 భాషల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5.20 వరకు పరీక్ష జరగనుంది. రాష్ట్రంలోని 20 జిల్లాల్లో పరీక్ష కేంద్రాలను ఎన్‌టీఏ ఎంపిక చేసింది. రాష్ట్రంలో 80వేల మంది అభ్యర్థులు నీట్ పరీక్షకు హాజరు కానున్నారు. పరీక్షను పెన్ను, పేపర్ విధానంలో నిర్వహిస్తుండగా, అభ్యర్థులు ఓఎంఆర్ షీట్‌లో ఆప్షన్లను నింపాల్సి ఉంటుంది.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

- యూజీ నీట్–2023 అర్హత పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు అడ్మిట్‌కార్డుతో పాటు ఒక ఫొటో ఐడెంటిటీ కార్డు సెంటర్‌కు తీసుకెళ్లాలి. అడ్మిట్‌కార్డులో పేర్కొన్న విధంగా నిర్దేశించిన చోట పోస్ట్‌కార్డు సైజ్ ఫొటోను అతికించి సంతకం చేయాలి.
- ఎన్‌టీఏ నిర్దేశాల మేరకు విద్యార్థులు డ్రెస్ కోడ్ తప్పకుండా పాటించాలి. పొడవు చేతులున్న డ్రెస్సులు, బూట్లు, నగలు, మెటల్ వస్తువులను పరీక్షహాలులోకి అనుమతించరు. స్లిప్పర్లు, తక్కువ ఎత్తున్న శాండిల్స్ మాత్రమే ధరించాలి.
- విద్యార్థి వెంట ఇతరత్రా పేపర్లు, జామెట్రీ, పెన్సిల్ బాక్సులు, ప్లాస్టిక్ పౌచ్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, స్కేళ్లు, రైటింగ్ ప్యాడ్స్, పెన్నులు తదితరాలను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు.
- చేతి గడియారాలు, వాలెట్లు, హ్యాండ్‌బ్యాగులు, బెల్టు, టోపీలను కూడా అనుమతించరు.
- అభ్యర్థులకు పరీక్ష రాసేందుకు హాలులోనే బాల్‌పాయింట్ పెన్నును అందిస్తారు.

డాక్టర్ కావాలని..

నీట్ పరీక్ష రాయనున్న తండ్రి,కుమార్తె



నీట్ రాయనున్న తండ్రి,కుమార్తె సతీష్‌బాబు, జోషిక స్వప్నిక

ఖమ్మం సహకారనగర్: వైద్య విద్యనభ్యసించడమే లక్ష్యంగా తండ్రి,కుమార్తె నీట్ పరీక్షకు హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు ఆదివారం నీట్ జరగనుంది. ఈ పరీక్షకు ఖమ్మంలోని డాక్టర్స్ మెడికల్ అకాడమీ డైరెక్టర్ రాయల సతీష్‌బాబుతో పాటు ఆయన కుమార్తె రాయల జోషిక స్వప్నిక హాజరవుతున్నారు. సతీష్‌కు ఖమ్మం హార్వెస్ట్ స్కూల్‌లో, కుమార్తెకు బ్లూమింగ్ మైండ్స్ స్కూల్‌లో పరీక్ష కేంద్రం కేటాయించారు. ఈసందర్భంగా సతీష్‌బాబు మాట్లాడుతూ ఎంబీబీఎస్ చేయాలనే లక్ష్యంతో ఉన్న తాను పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. 49 ఏళ్ల వయసున్న తండ్రి.. 17 ఏళ్ల కుమార్తెతో కలిసి పరీక్ష రాయనుండడం విశేషం. నీట్‌కు హాజరయ్యేందుకు 17 ఏళ్ల కనీస వయసుంటే చాలని, గరిష్ఠ పరిమితి లేదని సమాచారం.

మణిపూర్ నుంచి తెలంగాణకు విద్యార్థులు

- ప్రత్యేక విమానంలో నేడు తరలింపు
- 250 మంది తెలంగాణ విద్యార్థులున్నట్టు సమాచారం
- మణిపూర్ సీఎస్‌తో మాట్లాడిన తెలంగాణ సీఎస్ శాంతి కుమారి



సాక్షి, హైదరాబాద్: మణిపూర్ రాష్ట్రంలో నెలకొన్న శాంతిభద్రతల సమస్యల నేపథ్యంలో అక్కడున్న తెలంగాణ విద్యార్థులు, పౌరుల భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. రాష్ట్రానికి చెందిన సుమారు 250 మంది విద్యార్థులు ఇంఫాల్ పరిసర ప్రాంతాల్లోని వివిధ విద్యాసంస్థల్లో చదువుతున్నారు. తక్షణమే వారిని ఇంఫాల్ నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఆదివారం ఉదయం ఇంఫాల్ నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక విమానం ఏర్పాటు చేసింది. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, మణిపూర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని శనివారం సంప్రదించారు.

మణిపూర్‌లో తెలంగాణ ప్రజల కోసం హెల్ప్‌లైన్

కాగా, మణిపూర్‌లో ఉంటున్న తెలంగాణ పౌరులను సొంత రాష్ట్రానికి రప్పించేందుకు ప్రత్యేకంగా హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసినట్టు డీజీపీ అంజనీ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఐజీ బి.సుమతిని ఇన్‌చార్జిగా నియమించామన్నారు. మణిపూర్‌లోని తెలంగాణ ప్రజలు సహాయం కోసం 7901643283 నంబర్‌లో లేదా dgp@tspolice.gov.in మెయిల్‌లో సంప్రదించాలని సూచించారు. పరస్పర సహకారం కోసం మణిపూర్ రాష్ట్ర పోలీసులతో తెలంగాణ పోలీసులు సమన్వయం చేస్తున్నారని డీజీపీ వెల్లడించారు.

తెలంగాణలో మ్యూజిక్ వర్సిటీ ఏర్పాటు: కేటీఆర్

'మ్యూజిక్ స్కూల్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఇళయరాజా, కేటీఆర్ మధ్య ఆసక్తికర సంభాషణ



సాక్షి, హైదరాబాద్: 'ఇళయరాజాగారు అంగీకరిస్తే.. తెలంగాణలో మ్యూజిక్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం' అని మంత్రి కేటీఆర్ అన్నారు. ఇళయరాజా సంగీత సారథ్యంలో పాపారావు బియ్యాల స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'మ్యూజిక్ స్కూల్' ఈ నెల 12న విడుదల కానుంది. శనివారం సాయంత్రం హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇళయరాజా ముందు 'మ్యూజిక్ యూనివర్సిటీ' ప్రతిపాదనను కేటీఆర్ ఉంచారు. 'పాపారావుగారు పిలిచారని మాత్రమే నేను ఈ ఈవెంట్‌కు రాలేదు. నాకో ఎజెండా ఉంది. ఇళయరాజాగారు అంగీకరిస్తే తెలంగాణలో ఆయన సారథ్యంలో 'మ్యూజిక్ యూనివర్సిటీ' ఏర్పాటు చేస్తాం. సార్.. (ఇళయరాజాని ఉద్దేశించి) మీరు దీనికి అంగీకరిస్తే మేం గౌరవంగా భావిస్తాం. ఓకే అంటారని ఆశిస్తున్నా' అని కేటీఆర్ అన్నారు. ఇళయరాజా మాట్లాడుతూ ''తెలంగాణలో కేటీఆర్‌గారు ఏమేం చేస్తున్నారో మీ అందరికీ తెలుసు. ఆ రోజుల్లో ప్రజలు రాజు దగ్గరికి వెళ్లి ఏం కావాలో తీసుకునేవారు. ఇప్పుడు ప్రజల్లో ఒకడిగా ఉన్న రాజాను.. అది కూడా మంత్రిగారు వచ్చి అడిగితే... రాజా పేరు మాత్రమే..' అని ఇళయరాజా అంటుండగా.. కేటీఆర్ కల్పించుకుని 'సార్.. మీరు ఇళయరాజు' అన్నారు. 'నేను ఇళయరాజుని అయినప్పటికీ మీలో ఒకడ్నే. అలాంటి నన్ను అడిగితే.. ఏమంటాను. చేసి పెడతాననే అంటాను. మ్యూజిక్ ఉన్నచోట హింస, మోసాలు ఉండవు. ప్రజలకు ఏది కావాలో అది మాత్రమే ఉంటుంది. సంగీతం ఉంటే కుటుంబ బంధాలు ఉంటాయి. స్నేహం ఉంటుంది. మ్యూజిక్ ఉంటే లక్ష్మీ, సరస్వతీ అన్నీ వచ్చేస్తాయి. కేటీఆర్‌గారు అడిగిన యూనివర్సిటీ ఇక్కడ వస్తే... మీ (ప్రజలు) నుంచే 200 మంది ఇళయరాజాలను తీసుకొస్తాను. ఇండియా నుంచి అన్ని దేశాలకు వెళ్లి.. 'మేము ఇదీ' అని నిరూపించుకునేలా పెర్ఫార్మ్ చేయాలి.. చేసి నిరూపించుకుంటారు' అని ఇళయరాజా అన్నారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. మ్యూజిక్ యూనివర్సిటీకి సమ్మతించిన ఇళయరాజాకు ధన్యవాదాలు తెలిపారు.

అర్హత లేకున్నా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు

సహకార సంఘం రిజిస్ట్రార్‌కు జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ సభ్యుల ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ హౌసింగ్ కో–ఆపరేటివ్ సొసైటీకి 2021 మార్చిలో ఎన్నికలు జరగగా, అధ్యక్షుడిగా బి.రవీంద్రనాథ్ విజయం సాధించారు. ఇటీవల కొందరు రికార్డులు పరిశీలించగా రవీంద్రనాథ్ 2011లో న్యూ జెన్ హెర్బల్ పేరిట సొసైటీలో ప్లాట్ నెం.92ను కొనుగోలు చేసి, ఆ ప్లాట్ పేరిట సొసైటీలో సభ్యత్వం పొందారు. కంపెనీ పేరుతో కొనుగోలు చేస్తే వ్యక్తులకు సభ్యత్వం ఇవ్వడం కుదరదు. ఈ విషయం మరుగున పెట్టిన ఆయన వ్యక్తిగతంగా ప్లాట్‌ను కొనుగోలు చేసినట్లు నామినేషన్ దాఖలు చేశారు. 2019లో రవీంద్రనాథ్ అదే ప్లాట్‌ను తన తండ్రి బీఆర్ నాయుడు చైర్మన్‌గా ఉన్న శ్రియా బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీకి విక్రయించారు. ఈ సమాచారాన్ని సొసైటీకి ఇవ్వలేదు. ప్లాట్ అమ్మిన విషయంపక్కన పెట్టి తప్పుడు వాగ్మూలంతో 2021లో జరిగిన సొసైటీ ఎన్నికల్లో పోటీ చేసినట్లు ఆరోపిస్తున్నారు.

తక్షణమే తొలగించండి..

ఆయన 2011 నుంచి సభ్యుడిగా అక్రమంగా కొనసాగుతున్నారని సొసైటీ సభ్యుడు ఎం.ప్రభాకర్‌తో పాటు కొందరు సభ్యులు సహకార సంఘం రిజిస్ట్రార్, కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. తక్షణమే ఆయనను అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని రిజిస్ట్రార్‌ను కోరారు. అర్హత లేకుండా తీసుకున్న నిర్ణయాలన్నీ చెల్లుబాటు కా కుండా చూడాలని, వాటిపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. సొసైటీకి సంబంధించిన ఫైల్ కార్యాలయం నుంచి బయటకి తరలించినట్లు సమాచారం అందించినా రిజిస్ట్రార్ తగిన చర్య తీసుకోలేదని, ఇప్పటికైనా ఆ ఫైళ్లను తమ అధీనంలోకి తీసుకోవాలని కోరారు. అర్హత లేని అధ్యక్షుడు రెండేళ్లుగా ఖాళీ స్థలాలు, ప్రభుత్వ భూములను అమ్ముతూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు.

'గో ఫస్ట్' విమానాల రద్దుతో చార్జీలు డబుల్

సాక్షి, హైదరాబాద్: 'గో ఫస్ట్' విమానాల సర్వీసులు ఆకస్మికంగా రద్దవడంతో గత మూడ్రోజులుగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గో ఫస్ట్ విమానాల సేవలు రద్దు కావడంతో అందులో టికెట్లు బుక్ చేసుకున్న ప్ర యాణికులు ఇతర ఎయిర్‌లైన్స్‌కు మళ్లడంతో ఆయా విమానయాన సంస్థలు వివిధ మార్గా ల్లో చార్జీలను రెట్టింపు చేశాయి. వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకొని చాలామంది నగరవాసులు శ్రీనగర్, ఢిల్లీ, సిమ్లా, మేఘాలయ, అసోం, మణిపూర్, చార్‌ధామ్ ప్రాంతాల్లో పర్యటనలకు వెళ్లారు. తిరుగు ప్రయాణానికి ఫ్లైట్లు రద్దు కావడంతో ఢిల్లీమీదుగా తిరిగి హైదరాబాద్‌కు చేరుకునేందుకు చాలామంది ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఉత్తరాది నుంచి హైదరాబాద్‌కు వచ్చిన పర్యాటకులు, సందర్శకులు సైతం విమానాల రద్దుతో నష్టపోయారు. మరోపక్క వేసవి సెలవుల రీత్యా వివిధ మార్గాల్లో నడిచే రైళ్లలో సైతం టికెట్లు దొరకని పరిస్థితి నెలకొంది.


మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 9 వరకు

మృత్యు ఘంటికలు!

ఆ సమయంలోనే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు

- జనసంచారం ఎక్కువుండటమే కారణమంటున్న అధికారులు
- 2022లో ప్రతిరోజు సరాసరి 59 ప్రమాదాలు, 21 మంది మృత్యువాత

తెలంగాణ పోలీసు గణాంకాల ప్రకారం 2022లో ప్రమాదాలపై విశ్లేషణ ఇలా..



సాక్షి, హైదరాబాద్: 'మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 9 గంటల వరకు''... ఇదేదో ఒకరోజులోని దుర్ముహూర్తం కాదు. ఆ ఆరు గంటలే వాహనచోదకుల పాలిట మృత్యుఘంటికలు మోగిస్తున్నాయి. ఆ కొన్ని గంటల్లో జరిగే ప్రమాదాల్లోనే ఎక్కువమంది మృత్యువాతపడుతున్నారు. 2022లో ఏడాది పొడవునా జరిగిన రోడ్డు ప్రమాదాలను విశ్లేషిస్తే తేలిన విషయం ఇది. రాష్ట్ర పోలీస్ శాఖలోని రైల్వే, రోడ్డు భద్రత విభాగం అధికారులు 2022లో నమోదైన రోడ్డు ప్రమాదాలు, ప్రమాదాలు నమోదైన సమయం, ప్రమాద మృతులసంఖ్యను గణాంకాలవారీగా విశ్లేషించారు. దీనిలో మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 9 గంటల సమయంలోనే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరగడమే కాక ఎక్కువమంది మృత్యువాత పడుతున్నట్టు గుర్తించామని రోడ్డు భద్రతా విభాగం అడిషనల్ డీజీ శివధర్‌రెడ్డి తెలిపారు. ఆ సమయంలోనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరగడానికి కారణాలు ఏమిటని విశ్లేషిస్తే, అది ఉద్యోగులు విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లే సమయం కావడం, ద్వారులు తిరిగి ఇళ్లకు వెళ్లే వేళ కావడం, ఇతర పనులపై జనం రోడ్లపైకి ఎక్కువగా వచ్చే సమయం కావడంతోనే ఈ ప్రమాదాల సంఖ్య పెరుగుతోందని తెలిపారు. ప్రమాదాలు తగ్గించడంతోపాటు క్షతగాత్రుల ప్రాణాలు కాపాడేందుకు, రోడ్డు భద్రత నియమాలపై ప్రజల్లో అవగాహన పెంచడంతోపాటు ప్రమాదాలు జరిగితే వెంటనే అందించే ప్రాథమిక చికిత్సపైనా అవగాహన పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన వెల్లడించారు.

నేడు 'ఫాస్' సినీ అవార్డుల ప్రదానం

సినీ ప్రముఖులకు సిల్వర్ నంది పురస్కారాలు



సాక్షి, హైదరాబాద్: తెలుగు సినీ రంగంలో ప్రతిభావంతులతోపాటుగా విశేష సేవలందించిన సీనియర్లను గుర్తించి అభినందించే 'ఫిల్మ్ ఎనలిటికల్ అండ్ అప్రీసియేషన్ సొసైటీ'(ఫాస్) తాజాగా ఆ సంస్థ రజతోత్సవాల సందర్భంగా పలువురు సినీ ప్రముఖులకు అవార్డులు ప్రకటించింది. హైదరాబాద్, బంజారాహిల్స్‌లోని ఎల్వీ ప్రసాద్ ల్యాబ్‌లో మే 7న, ఆదివారం సాయంత్రం 6 గంటలకు జరిగే అవార్డుల ప్రదానోత్సవం జరగనుందని, ఈ వేడుకకు అందరూ ఆహ్వానితులేనని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, సెన్సార్ బోర్డు మాజీ సభ్యుడు కె.ధర్మారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్కినేని- ఫాస్ సిల్వర్ జూబ్లీ, మహిళా సిల్వర్ పీకాక్ సినీ అవార్డులు, దాసరి –ఫాస్ సిల్వర్ జూబ్లీ, సిల్వర్ నంది సినీ అవార్డులు, ఫాస్–ఎన్టీఆర్ సెంటినరీ సిల్వర్ క్రౌన్ అవార్డు, జీవన సాఫల్య పురస్కారాలను అందజేయనున్నారు. 30 ఏళ్లుగా తెలుగు చలనచిత్ర రంగానికి సేవలందిస్తున్న వారికి అవార్డులతో పాటు రజత కిరీటాలను ఇచ్చి సత్కరించనున్నారు. సీనియర్ నటి రోజారమణి, రచయితలు పరుచూరి బ్రదర్స్, నిర్మాత సి.కల్యాణ్, దర్శకుడు రేలంగి నరసింహారావుతోపాటు మరికొంతమంది ప్రముఖులు సాఫల్య పురస్కారాలను అందుకోనున్నారు. అదేవిధంగా ఉత్తమ సినీ జర్నలిస్టు అవార్డుకు మూడున్నర దశాబ్దాలుగా పత్రికారంగంలో కృషి చేస్తున్న డాక్టర్ రెంటాల జయదేవ ఎంపికయ్యారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.